
'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 295

గురువారం 16-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత మహిళలు 435 కొట్టారు

వన్డేల్లో భారత మహిళల జట్టు తమ అత్యధిక స్కోరు నమోదు చేసింది. ఐర్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో టీమిండియా 50 ఓవర్లలో 5 వికెట్లకు 435 పరుగులు సాధించింది. కెప్టెన్ స్మృతి మంధాన, ప్రతీక రావల్ సెంచరీలు చేశారు. ఐర్లాండ్ 131 పరుగులకే ఆలౌటైంది. ఫలితంగా భారత్ 304 పరుగుల తేడాతో నెగ్గింది. పరుగుల తేడా పరంగా భారత్‌కిదే అతిపెద్ద విజయం. ఈ గెలుపుతో భారత్ సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. - వివరాలు 14లో



కేజ్రీవాల్‌పై ఈడీ విచారణకు ఓకే

ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఆ రాష్ట్ర మాజీ సీఎం కేజ్రీవాల్‌ను విచారించేందుకు ఈడీకి కేంద్ర హోంశాఖ అనుమతి ఇచ్చింది.

- వివరాలు 6లో▶



భారత్‌కు మెటా క్షమాపణలు

మన దేశంలో ఎన్నికలపై ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ చేసిన వ్యాఖ్యల పట్ల భారత్‌కు మెటా సంస్థ క్షమాపణలు చెప్పింది.

- వివరాలు 6లో▶



దక్షిణ కొరియా అధ్యక్షుడి అరెస్ట్

ప్రజాపాలనకు వ్యతిరేకంగా మార్షల్ లా విధించిన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను అరెస్ట్ చేశారు.

- వివరాలు 6లో▶



గాజాలో కాల్పుల విరమణ

యుద్ధంతో 15 నెలలుగా అట్టుడుకుతున్న గాజాలో తాత్కాలికంగా కాల్పుల విరమణకు ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించాయి.

- వివరాలు 6లో▶

మార్చిలోగా పూర్తి చేయాలి

స్థానిక ఎన్నికలపై కాంగ్రెస్ ముఖ్య నేతలకు ఏఐసీసీ దిశానిర్దేశం

- ఎన్నికల్లో సత్తా చాటేలా ఇప్పట్నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలి
- అన్ని స్థాయిల నేతలను అప్రమత్తం చేయాలి
- కనీసం 80 శాతం విజయాలు నమోదయ్యేలా చూడాలి
- మంత్రులు ఏమాత్రం ఉదాసీనంగా వ్యవహరించొద్దన్న కేసీ వేణుగోపాల్
- కేబినెట్ పనితీరుపై హైకమాండ్‌కు ఎప్పటికప్పుడు నివేదికలు అందుతున్నాయని వెల్లడి
- సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్, మంత్రులతో ఢిల్లీలో కీలక భేటీ
- వివిధ అంశాలపై రెండున్నర గంటలపాటు చర్చ
- ఫిబ్రవరిలో రాష్ట్రంలో రాహుల్‌గాంధీ సభ ఉంటుందన్న పీసీసీ చీఫ్
- నెలాఖరుకల్లా నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని వెల్లడి



ఢిల్లీలో కేసీ వేణుగోపాల్‌తో జరిగిన భేటీలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, దీపాదాస్ మున్షీ

సాక్షి, న్యూఢిల్లీ: 'మార్చిలోగా జీహెచ్‌ఎంసీ సహా అన్ని స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలి. ఆ ఎన్నికల్లో సత్తా చాటేలా ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నేతలను అప్రమత్తం చేయాలి. పార్టీ గుర్తులపై జరిగే ఎన్నికలను తొలుత నిర్వహించాలి. తర్వాత మిగతా ఎన్నికలను నిర్వహించేలా కార్యాచరణ తీసుకోవాలి. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్న దృష్ట్యా కనీసం 80 శాతం విజయాలు నమోదు చేయాలి. రాష్ట్ర మంత్రులు ఎంతమాత్రం ఉదాసీనంగా ఉండొద్దు. జిల్లాల్లో విస్తృతంగా పర్యటించాలి. ముఖ్య నేతలు కూడా స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి..' అని రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఎన్నికల్లో ఫలితాల ఆధారంగానే రాబోయే రోజుల్లో నేతలకు పదవుల పంపకాలు ఉంటాయని స్పష్టం చేసింది.

'స్థానిక' సంసిద్ధతపై ఆరా

రాష్ట్రంలో సర్పంచ్‌ల పదవీకాలం గత ఏడాది ఫిబ్రవరితోనే ముగిసింది. మండల, జిల్లా పరిషత్‌ల పదవీకాలం గత జూలైతో పూర్తయ్యింది. ఇక ఈ నెల 26వ తేదీకి ఒకటి రెండు మినహా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీ కాలం కూడా ముగియనున్న దృష్ట్యా ఏఐసీసీ వాటి ఎన్నికలపై దృష్టి సారించింది. రాష్ట్రంలో పార్టీ సంసిద్ధతపై ఆరా తీసింది. ఈ నేపథ్యంలోనే పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలతో ఢిల్లీలోని తన నివాసంలో సమావేశమయ్యారు. ఇటీవల మిగతా 2వ పేజీలో ▶

బలమైన వాదనలు వినిపించాలి

- నీటి కేటాయింపులపై కృష్ణా ట్రిబ్యునల్‌లో పోరాడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- గోదావరి–బనకచర్లపై అభ్యంతరాలతో కేంద్రం, ఏపీ సీఎంకు లేఖలు రాయాలని సూచన

2 లో

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా

జస్టిస్ సుజోయ్‌పాల్

బాంబే హైకోర్టుకు జస్టిస్ అలోక్ అరాధే బదిలీ

సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదం

బదిలీతో 26కు తగ్గిన హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలను జస్టిస్ సుజోయ్‌పాల్‌కు అప్పగిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం చీఫ్ జస్టిస్‌గా విధులు నిర్వర్తిస్తున్న జస్టిస్ అలోక్ అరాధే బాంబే హైకోర్టు చీఫ్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులకు ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేశారు. సీజే బదిలీతో ఏర్పడనున్న ఖాళీని హైకోర్టులో రెండవ సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుజోయ్‌పాల్‌తో భర్తీ చేశారు. రాజ్యాంగంలోని అధికరణ 223 ద్వారా వచ్చిన అధికారాల మేరకు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజోయ్‌పాల్‌ను రాష్ట్రపతి నియమించినట్టు న్యాయశాఖ పేర్కొంది. రాష్ట్రపతి తదుపరి ఉత్తర్వులు వెలువరించే వరకు ఆయన సీజేగా కొనసాగుతారు.

2024 మార్చిలో తెలంగాణకు..

మధ్యప్రదేశ్‌లో 1964, జూన్ 21న జస్టిస్ సుజోయ్‌పాల్ మిగతా 12వ పేజీలో ▶



రేణుక యార | నర్సింగ్‌రావు | తిరుమలాదేవి | మధుసూదన్‌రావు

హైకోర్టుకు నలుగురు కొత్త జడ్జీలు

12 లో

న్యాయాధికారుల కోటాలో సిఫార్సు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం

న్యూస్‌రీల్

ఏప్రిల్ 29 నుంచి ఈఏపీసెట్



రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహణ తేదీలను ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి వెల్లడించారు. ఏప్రిల్ 29 నుంచి మే 5 వరకు జరుగుతాయని తెలిపారు.

- వివరాలు 3లో▶

నేటి నుంచి సాగు యోగ్యం కాని భూముల సర్వే



'రైతుభరోసా' పథకం నుంచి మినహాయించే సాగుయోగ్యం కాని భూములను క్షేత్రస్థాయిలో నిర్ధారించే ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి ప్రారంభం కానుంది.

- వివరాలు 2లో▶

సైద్ధాంతిక బలమా? ప్రజల్లో గుర్తింపా?



నెలాఖరులోగా రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడి నియామకం ఉంటుందన్న నేపథ్యంలో.. పదవి కోసం పాత, కొత్త నేతల మధ్య పోటాపోటీ నెలకొంది. జాతీయ నాయకత్వం ఎటు మొగ్గుచూపుతుందోననే చర్చ జరుగుతోంది.

- వివరాలు 3లో▶

10 కిలోమీటర్లు.. 32 నిమిషాలు



రద్దీ వేళల్లో హైదరాబాద్ రోడ్లపై ఓ వాహనం 10 కిలోమీటర్లు వెళ్లాలంటే సగటున 32 నిమిషాలు పడుతోందని టామ్‌టామ్ సంస్థ విడుదల చేసిన 'స్లో మూవింగ్ ట్రాఫిక్ ఇండెక్స్' పేర్కొంది. ఇందులో అంతర్జాతీయ స్థాయిలో 18వ ప్లేస్‌లో, దేశంలో నాలుగో ప్లేస్‌లో భాగ్యనగరం నిలిచింది.

- వివరాలు 5లో▶

ఇదండీ సంగతి



కూటమి జాతీయస్థాయి మాత్రం కోల్పోకుండా కాపాడుకోవాలి సార్!

ఈడీ విచారణకు వెళ్తున్నా

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటన

- ఫార్ములా–ఈ కారు రేసు వ్యవహారంలో... మనీలాండరింగ్‌పై దర్యాప్తు జరుపుతున్న ఈడీ
- 9న ఏసీబీ విచారణకు హాజరైన కేటీఆర్
- మరోసారి విచారణకు ఏసీబీ నోటీసులిచ్చే అవకాశం



సాక్షి, హైదరాబాద్: ఫార్ములా ఈ–కార్ రేసు కేసులో గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరు కానున్నట్టు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం ప్రకటించారు. ఈ రేసు కోసం విదేశీ సంస్థకు నిధుల చెల్లింపుల్లో ఫెమా ఉల్లంఘనలు జరిగాయనే కోణంలో ఈడీ దర్యాప్తు జరుపుతోంది. గురువారం ఉదయం 10.30 గంటలకు ఈడీ కార్యాలయానికి వెళ్లనున్నట్లు కేటీఆర్ తెలిపారు. గతంలో విచారణకు పిలిచినప్పుడు కొంత సమయం కావాలని కేటీఆర్ కోరిన మిగతా 2వ పేజీలో ▶

సుప్రీంకోర్టులో పిటిషన్ వెనక్కి తీసుకున్న కేటీఆర్

ఫార్ములా–ఈ కేసులో జోక్యం చేసుకోలేమన్న సుప్రీం

- వివరాలు 2లో

వాళ్లు.. విందులు, వినోదాల్లో..

వీళ్లు.. వీధుల్లో, విధుల్లో..

- పండుగ రోజుల్లోనూ కుటుంబాలకు దూరంగా అత్యవసర సర్వీసుల సిబ్బంది..
- తమవాళ్లతో గడపాలని ఉన్నా ప్రజాసేవలో సంతృప్తి దక్కుతోంది అంటున్న 'అలుపెరుగని వీరులు'
- 'సంక్రాంతి' రోజున డ్యూటీలో ఉన్నవారిని పలకరించిన 'సాక్షి'



- వివరాలు 12లో

క్యాసినోలా కోళ్ల పందేలు

ఏపీలో ఊరూ వాడా యథేచ్ఛగా పందేల జోరు.. జూద క్రీడలు

- మూడు రోజుల్లో రూ.5 వేల కోట్లకుపైగా దందా
- బరి తెగించి ఆడించిన కూటమి ఎమ్మెల్యేలు
- కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి యథేచ్ఛగా నిర్వహిస్తున్నా పోలీసుల ప్రేక్షకపాత్ర

12 లో



హైటెక్ బోధన.. ఆన్‌లైన్ సాధన

అమెరికా మాధ్యమిక విద్యలో అంతటా టెక్నాలజీయే

- వర్చువల్‌గా పాఠాలు.. క్రోమ్‌లో మూల్యాంకనం... 9వ తరగతి నుంచే విద్యార్థి కెరీర్ ప్రణాళికలు
- ఆక్యులస్, మెటాక్వెస్ట్ డివైజెస్ తప్పనిసరి... పాఠశాల స్థాయిలోనే ఏఐ
- అమెరికాలో విద్య అధ్యయనానికి ఫుల్ బ్రైట్ టీచింగ్ ఎక్సలెన్స్ అచీవ్‌మెంట్ ప్రోగ్రాం
- అందులో తెలంగాణ నుంచి పాల్గొన్న టీచర్ రవికుమార్.. మనదేశం నుంచి ఎంపికైన ఏడుగురిలో ఈయన ఒకరు



సాక్షి, హైదరాబాద్: అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్‌లాంటి అత్యాధునిక సాంకేతిక కోర్సుల బోధన తొమ్మిదవ తరగతి నుంచే మొదలు పెడుతున్నారు. ఈ కోర్సుల డిజైన్, బోధన ప్రణాళిక విషయంలోనూ విద్యా కమిటీలదే పూర్తి అజమాయిషీ. గూగుల్ క్రోమ్‌లో వర్క్ షీట్లు, అందులోనే మూల్యాంకన విధానం విద్యార్థులను సాంకేతిక పురోగతి వైపు మిగతా 16వ పేజీలో ▶

పసుపు రైతు కల సాకారం

- పసుపు ఉత్పత్తులు భారీగా పెరుగుతాయని ఆశాభావం
- ప్రధాని మాట ఇస్తే తప్పరు... కేంద్ర మంత్రి బండి సంజయ్
- మోదీని తెలంగాణ ప్రజలు గుర్తుపెట్టుకుంటారు: ఎంపీ అర్వింద్

నూతన వంగడాలు.. సాగులో మెళకువలు

పసుపు బోర్డుతో విస్తృత లాభాలు ఎన్నో.. 'సాక్షి'తో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి

5 లో

జాతీయ పసుపు బోర్డును ప్రారంభించిన కేంద్రమంత్రి పీయూష్ గోయల్



పసుపుబోర్డు ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, బండి సంజయ్, ఎంపీ అర్వింద్

నిజామాబాద్ సిటీ: దేశంలోని పసుపు రైతులకు కేంద్ర ప్రభుత్వం సంక్రాంతి కానుక అందించింది. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంగా జాతీయ బోర్డును ఎంపీ అర్వింద్‌తో కలిసి ఢిల్లీలో కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ వర్చువల్‌గా ప్రారంభించారు. పసుపు బోర్డు తొలి చైర్మన్‌గా నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌కు చెందిన బీజేపీ సీనియర్ నేత పల్లె గంగారెడ్డిని నియమించారు. బోర్డును ఏర్పాటు చేసినందుకు మిగతా 5వ పేజీలో ▶

ద్విగుణీకృతమైన 'సాగర' పాటవం



రెండు యుద్ధ నౌకలు ఐఎన్‌ఎస్ సూరత్, ఐఎన్‌ఎస్ నీలగిరితో పాటు జలాంతర్గామి ఐఎన్‌ఎస్ వాఘ్‌షీర్‌ను బుధవారం ముంబై నావల్ డాక్ యార్డులో ప్రధాని నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు. భారత్ తిరుగులేని సాగరశక్తిగా ఆవిర్భవిస్తోందని, అంతర్జాతీయంగా అత్యంత విశ్వసనీయ భాగస్వామిగా మారిందని ఆయన పేర్కొన్నారు.

6 లో

కాంగ్రెస్ కొత్త ఆఫీసు.. ఇందిరాగాంధీ భవన్



కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ఇందిరాగాంధీ భవన్ బుధవారం ప్రారంభమైంది. ఢిల్లీలోని 9 ఏ, కోట్లా రోడ్‌లో నిర్మించిన ఈ కార్యాలయాన్ని పార్టీ అగ్రనేత సోనియా గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో.. దేశంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌తోపాటు భారత రాజ్యంతోనూ పోరాడుతున్నామని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

6 లో

మూడు రోజుల్లోనే ఆరు కోట్లు..



మహా కుంభమేళాకు భక్తుల వరద అంచనాలను మించుతోంది. పవిత్ర స్నానాలు చేసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు పోటెత్తుతున్నారు. తొలి మూడు రోజుల్లోనే ఏకంగా ఆరు కోట్ల మంది భక్తులు వచ్చినట్టు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. మంగళవారం ఒక్క రోజే 3.5 కోట్ల మందికి పైగా వచ్చినట్టు వెల్లడించారు.

6 లో

క్లుప్తంగా...

జనాభా ప్రాతిపదికన ఓబీసీ రిజర్వేషన్లు

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ గోవా చీఫ్ అడ్వైజర్‌గా నియామకం



శ్రీనివాస్‌గౌడ్‌కు నియామక పత్రం అందిస్తున్న ఓబీసీ మహాసంఘ్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన చేసి జనాభా ప్రాతిపదికన ఓబీసీ రిజర్వేషన్లను కల్పించాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. గోవాలో రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ తరహాలో గోవాలోనూ ఓబీసీల సంక్షేమ పథకాల అమలుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఓబీసీల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కులవృత్తులపై ఆధారపడి పనిచేస్తున్న వెనుకబడిన కులాల అభివృద్ధికి గోవా ప్రభుత్వం ఆర్థికంగా సహకారాన్ని అందించాలని, వారికి ఆత్మగౌరవ భవనాలు నిర్మించాలన్నారు. వివిధ కులాలకు వృత్తులలో ఆర్థిక సహాయ సహకారాలను అందించాలని ఈ భేటీలో తీర్మానించాలన్నారు. సమావేశంలో రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ గోవా చీఫ్ అడ్వైజర్‌గా శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించారు.

కేటీఆర్‌ది బరితెగింపు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: కేటీఆర్‌కి ఒకవైపు గోడ దెబ్బ, ఇంకో వైపు చెంప దెబ్బ పడిందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రజల సొమ్ము దోచుకొని 'కుంభకోణం లేదు.. లంభకోణం లేదు'అని అనడం ఆయన బరితెగింపునకు నిదర్శనమన్నారు. ప్రజాధనం దుర్వినియోగం చేసిన వాళ్లపై చర్యలు తీసుకుంటే అక్రమ కేసులు అంటున్నారని, తాము బీఆర్‌ఎస్ ప్రభుత్వం లోలాగా తలుపులు విరగ్గొట్టి అరెస్టు చేయడం లేదని వ్యాఖ్యానించారు. స్కాములపై కేటీఆర్ ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కేసీఆర్ చేస్తున్న పనులకు కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మాపై దాడులు చేస్తే ప్రతిదాడులు చేస్తాం

జగిత్యాల ఎమ్మెల్యేను అనర్హుడిగా ప్రకటించాలి: పాడి కౌశిక్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తమపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేస్తే ప్రతిదాడులు చేస్తామని హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మరో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌తో కలసి మీడియాతో మాట్లాడారు. 'జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పైసలకు అమ్ముడుపోయిన బ్రోకర్, దొంగ.. ఆయనను అనర్హుడిగా ప్రకటించాలి'అని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా సమీక్ష సమావేశంలో సంజయ్‌కుమార్ తనపై దాడి చేశారని, కానీ సంజయ్‌పైనే తాను దాడి చేసినట్లు మీడియాలో ప్రచారం చేశారని ఆరోపించారు. తనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించాలని సంజయ్.. స్పీకర్‌కు ఫిర్యాదు చేశారని, కానీ డిస్‌క్వాలిఫై చేయడానికి తాను నామినేటెడ్ పోస్టులో లేనని చెప్పారు. రేవంత్‌రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదని, చుమ్మా మినిస్టర్ అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రశ్నిస్తుంటే రేవంత్‌రెడ్డి తనపై 28 కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు.

నేటి నుంచి సాగు యోగ్యం కాని భూముల సర్వే

క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించనున్న వ్యవసాయ, రెవెన్యూ అధికారులు

ఈ నెల 21, 22 తేదీల్లో గ్రామసభల్లో వివరాల వెల్లడి

తర్వాత భూభారతి పోర్టల్‌లోకి అప్‌లోడ్



సాక్షి, హైదరాబాద్: ఈనెల 26వ తేదీ నుంచి అమలు కానున్న 'రైతుభరోసా' పథకంలో కీలకమైన వ్యవసాయ యోగ్యం కాని భూముల నిర్ధారణ ప్రక్రియ గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కాబోతుంది. ఈ మేరకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. భూభారతి పోర్టల్‌లో పొందుపరిచిన రెవెన్యూ గ్రామాల వారీ 'వ్యవసాయ యోగ్యం కాని భూముల'ను ఆయా గ్రామాల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఏఈవో సందర్శిస్తారు. వ్యవసాయ యోగ్యత లేని భూముల ప్రింట్ అవుట్‌లు తీసుకొని విలేజ్ మ్యాప్, గూగుల్ మ్యాప్, గ్రామ పంచాయతీ లే అవుట్, డీటీసీపీ లే అవుట్, భూసేకరణ రికార్డులు, రెవెన్యూ రికార్డులు వంటి వాటితో సరిపోల్చుకొని జాబితాను సిద్ధం చేస్తారు. వీరిచ్చిన జాబితా ఆధారంగా తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి ఆయా భూములను సందర్శించి తుది జాబితాను రూపొందిస్తారు. తర్వాత ఈ జాబితాను ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే గ్రామసభల్లో ప్రదర్శించి, చదివి వినిపించిన తరువాత ఆమోదం తీసుకుంటారు. తరువాత గ్రామాల వారీగా వ్యవసాయ యోగ్యం కాని భూముల పట్టికను భూభారతి పోర్టల్‌లోకి సంబంధిత అధికారి డిజిటల్ సంతకంతో అప్‌లోడ్ చేస్తారు. ఇలా అప్‌లోడ్ చేసిన భూములకు 'రైతుభరోసా'కోత విధించి, మిగతా భూములకు ఈనెల 26 నుంచి పెట్టుబడి సాయం అందజేస్తారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్లతో జరిగిన టెలి కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

సాగు యోగ్యం కాని భూముల రకాలు..

- ఇళ్లు లేదా కాలనీలుగా మారిన అన్ని రకాల భూములు
- రియల్ ఎస్టేట్ వెంచర్లు, రోడ్లుగా మారిన భూములు
- పరిశ్రమలకు, గోదాములకు, మైనింగ్‌కు వినియోగిస్తున్న భూములు
- ప్రభుత్వం సేకరించిన అన్ని రకాల భూములు
- రాళ్లు రప్పలు, గుట్టలతో నిండిన భూములు

దేశం కోసం కాంగ్రెస్ నిస్వార్థ సేవ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

140 ఏళ్ల తర్వాత సొంత భవనంలో కాంగ్రెస్ కార్యాలయం



బుధవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ఎలాంటి స్వార్థం లేకుండా దేశం కోసం పని చేసిందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనార్టీలు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటు పడిందని చెప్పారు. ఇన్నేళ్లు దేశాన్ని నడిపించిన, ఎంతో ఘన చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ.. 140 ఏళ్ల తర్వాత సొంత భవనంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుందని తెలిపారు. బీజేపీతో పాటు నిన్న, మొన్న వచ్చిన ప్రాంతీయ పార్టీలు కూడా ఎప్పుడో సొంతంగా పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయని గుర్తు చేశారు. 140 ఏళ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ, 40 ఏళ్ల సీనియారిటీ ఉన్న బీజేపీ ఆర్థిక స్థితి గతులు ఏవిధంగా ఉన్నాయో చూడాలన్నారు. అలాగే ప్రాంతీయ పార్టీల ఆర్థిక స్థితిగతులు ఏ విధంగా ఉన్నాయో కూడా పరిశీలించాలన్నారు. ఢిల్లీలోని కోట్లా రోడ్డులో కొత్తగా నిర్మించిన భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఎంపీలు మల్లు రవి, సురేష్ షెట్కార్, కుందూరు రఘువీర్‌రెడ్డి, ఏఐసీసీ కో ఆర్డినేటర్ కొప్పుల రాజు తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం కార్యక్రమం తర్వాత ముఖ్యమంత్రి విలేకరులతో మాట్లాడారు. రామమందిరం నిర్మాణం తర్వాతే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందంటూ భగవత్ చేసిన వ్యాఖ్యలపై ఈ సందర్భంగా రేవంత్ స్పందించారు.

భగవత్‌పై చర్యలు తీసుకుంటారో లేదో ప్రధాని చెప్పాలి

'దేశ స్వాతంత్ర్యానికి విరుద్ధంగా ఎవరైనా మాట్లాడితే వారిపై చట్టపరమైన విచారణ జరపాలి. అది తప్పనిసరి. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ఆయనపై చర్యలు తీసుకుంటారా? లేదంటే ఆ ఐడియాలజీలో భాగస్వాములౌతారా? మోహన్ భగవత్‌తో ఉన్నారా? దేశ స్వాతంత్ర్యం కోసం అమరులైన లక్షల మంది వెంట ఉన్నారా? అనేది ప్రధాని మోదీ స్పష్టం చేయాలి. కాంగ్రెస్‌పై ఆరోపణలు చేయడం ద్వారా భగవత్ విషయాన్ని తక్కువ చేసే ప్రయత్నం చేస్తున్నారు..' అని సీఎం ధ్వజమెత్తారు. 'స్వాతంత్ర్యం కోసం ఆర్‌ఎస్‌ఎస్ ఎలాంటి పోరాటం చేయ లేదు. వాళ్లు ఎవరూ త్యాగాలు చేయలేదు. అందుకే దేశానికి లభించిన స్వాతంత్ర్యాన్ని గుర్తించే విషయంలో వాళ్లు రాజీపడటం లేదు. అందుకే స్వాతంత్ర్యంతో వాళ్లకు ఎలాంటి సంబంధం లేదని రాహుల్ చెప్పారు..' అని రేవంత్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ను బీ.. 'ఆర్‌ఎస్‌ఎస్'గా సీఎం అభివర్ణించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఐడియాలజీలో వెళ్లేందుకు బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఏఐసీసీ కార్యాలయం కొత్త భవనంలోకి మారడం చరిత్రాత్మక ఘట్టమని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ప్రజలందరికీ సామాజిక న్యాయం, సమీకృత అభివృద్ధి, రాజ్యాంగ పరిరక్షణ అనే మూల సూత్రాలతో కాంగ్రెస్ పనిచేస్తుందని చెప్పారు.

మార్చిలోగా పూర్తి చేయాలి

▶ మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లో నిర్వహించిన రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో కేసీ పలు అంశాలపై రాష్ట్ర నేతలకు దిశానిర్దేశం చేసిన విషయం తెలిసిందే. ఆ సమావేశానికి కొనసాగింపుగా ఢిల్లీ వేదికగా ఈ కీలక భేటీని నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాలన, పార్టీ పనితీరు, స్థానిక ఎన్నికలు, సంస్థాగత నిర్మాణం, రాహుల్‌గాంధీ సభ తదితర అంశాలపై సుమారు రెండున్నర గంటలపాటు సుదీర్ఘంగా చర్చించారు. బీసీ కుల గణనపై కూడా చర్చించినట్లు తెలిసింది.

ప్రభుత్వ పథకాలు వివరించిన నేతలు

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను కేసీ వేణుగోపాల్‌కు రాష్ట్ర నేతలు వివరించారు. రైతు కూలీలకు కూడా ఏడాదికి రూ.12 వేలు ఆర్థికసాయం అందజేయనుండటం, కొత్త రేషన్ కార్డుల జారీ, నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం తదితరాలపై తాజా వివరాలు అందజేశారు. ఈ నేపథ్యంలో కేసీ మాట్లాడారు.

కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపాలన్న కేసీ

మంత్రుల పనితీరుపై ఎప్పటికప్పుడు అధిష్టానానికి నివేదికలు అందుతున్నాయని, ఇన్‌చార్జి మంత్రులు తమ తమ జిల్లాల కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపేలా బాధ్యత తీసుకోవాలని కేసీ వేణుగోపాల్ సూచించారు. జీహెచ్‌ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, ఆయా ఎన్నికల్లో విజయ ఢంకా మోగించడంపై దిశానిర్దేశం చేశారు. పీసీసీకి సంబంధించి సంస్థాగత పునర్నిర్మాణంతో పాటు జిల్లాల్లో ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మిగిలిపోయిన నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్ చైర్మన్ల నియామకం తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. త్వరలో రాష్ట్రంలో నిర్వహించనున్న రాహుల్‌గాంధీ సభ విజయవంతం చేసేలా రూపొందించిన ప్రణాళికలపై చర్చించారు.

కష్టపడి పనిచేస్తున్న వారికే పదవులు: మహేశ్‌గౌడ్

ఈ నెలాఖరుకల్లా నామినేటెడ్ పదవులు, పెండింగ్ కార్పొరేషన్ చైర్మన్ల పదవులు భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తూ ప్రజల్లో ఉన్న వారికే పదవులు దక్కుతాయని చెప్పారు. కేసీ వేణుగోపాల్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక ఎన్నికలు, పీసీసీ కూర్పు ఇతర అంశాలపై చర్చించామని తెలిపారు. ఫిబ్రవరి మొదటి లేదా రెండో వారంలో సూర్యాపేట లేదా ఖమ్మంలో రాహుల్‌గాంధీ సభ నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం, పార్టీ పనితీరు భేషుగ్గా ఉందని కేసీ వేణుగోపాల్ ప్రశంసించారన్నారు. కేబినెట్ విస్తరణపై సీఎం, అధిష్టానం పెద్దలు కలిసి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

'ఆత్మీయ భరోసా'లో కోతలు వద్దు

రైతు కూలీలను పక్కాగా గుర్తించాలి: హరీశ్‌రావు



సిద్దిపేటజోన్: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కోతలు విధించకుండా అమలు చేయాలని, రైతు కూలీలందరికీ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం వర్చువల్‌గా నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద కోటీ రెండు లక్షల మంది ఉపాధి కూలీలుగా ఉన్నారని చెప్పారు. గుంట భూమి ఉన్న రైతును ఉపాధి హామీ కూలీగా గుర్తించాలని ప్రభుత్వం చెప్పడం దురదృష్టకరమన్నారు. ఈ నిబంధనల వల్ల కూలీలుగా ఉన్నవారు నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఇందిరమ్మ విధివిధానాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని సూచించారు. అసలైన లబ్ధిదారులకు న్యాయం జరగాలంటే గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇల్లు మంజూరు అయిన వారు కొంత భాగం నిర్మించుకున్నారని, ఇలాంటి ఇళ్లను పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఈడీ విచారణకు వెళ్తున్నా

▶ మొదటి పేజీ తరువాయి

విషయం తెలిసిందే. ఆర్‌బీఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు రూపాయల్లో కాకుండా బ్రిటన్ పౌండ్స్ రూపంలో నిధులు చెల్లించడంపై ఈడీ అధికారులు దృష్టి పెట్టారు. ఈ కేసులో ఇప్పటికే ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌ను, హుడా మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ ఎన్ రెడ్డిలను ప్రశ్నించారు. నిధుల బదలాయింపునకు తానే ఆదేశించినట్లు కేటీఆర్ ఏసీబీ ముందు, బహిరంగంగా కూడా ప్రకటించారు. అయితే చెల్లింపులు ఏ విధంగా జరగాలి అనేది అధికారులు చూసుకుంటారని చెప్పిన సంగతి తెలిసిందే. కాగా, ఆర్థిక శాఖ నుంచి కానీ కేబినెట్ ఆమోదం కానీ లేకుండా విదేశీ సంస్థకు నిధుల చెల్లింపు మనీ లాండరింగ్ కిందకు వస్తుందన్నది ఈడీ వాదన.

విచారణకు హాజరుకాక తప్పని పరిస్థితి

ఈడీ అధికారుల ముందు ఎలాంటి వాదన వినిపించాలన్నది కేటీఆర్ తన న్యాయవాదులతో చర్చించినట్లు సమాచారం. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడానికి ప్రత్నించడం తప్ప.. తాను ఇందులో ఎలాంటి అవినీతికి పాల్పడలేదని ఆయన వాదిస్తున్నారు. మంత్రిగా ఆదేశాలిచ్చింది తానే అయినా.. నియమ నిబంధనల మేరకు నిధుల బదలాయింపు ఎలా చేయాలన్న బాధ్యత అధికారులదేనని ఈడీ ముందు చెబుతారా? అనే ఆసక్తి నెలకొంది. ఏసీబీ కేసులో సుప్రీంకోర్టులో వేసిన క్వాష్ పిటిషన్‌ను కూడా వెనక్కు తీసుకోవాల్సి రావటంతో ఇక ఆయన విచారణకు హాజరు కాక తప్పని పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. దీంతో ఈడీ విచారణపై బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.

మరోసారి ఏసీబీ నోటీసులు..

కేటీఆర్ గురువారం ఈడీ ముందు హాజరైన తరువాత.. పరిణామాలను ఏసీబీ అధికారులు పరిశీలించనున్నారు. అవసరమైతే మరోసారి విచారణకు పిలుస్తామని ముందుగానే కేటీఆర్‌కు ఏసీబీ చెప్పిన నేపథ్యంలో.. విచారణకు రావాలని నోటీసులు జారీచేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. రెండోసారి విచారణకు వస్తే ఆయనను అదుపులోకి తీసుకునే అవకాశం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

ఘనంగా పాతపంటల జాతర

న్యాల్‌కల్ (జహీరాబాద్): సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం వడ్డి గ్రామంలో 25వ పాత పంటల జాతర ఘనంగా ప్రారంభమైంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ప్రసాద్‌రావు, శాస్త్రవేత్త విజయ్ కుమార్, 'సాక్షి' సీనియర్ జర్నలిస్ట్ పంతంగి రాంబాబు, హైకోర్టు న్యాయవాది రవికుమార్, ఆయా శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. ఇంటిల్లిపాదీ ఆరోగ్యంగా ఉండాలంటే ఎన్నో పోషకాలు కలిగిన పాత పంటలను ఆహారంగా తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. మన ఆరోగ్యంతోపాటు పశువులు, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అంతకుముందు పాత పంటల ధాన్యంతో కూడిన ఎడ్ల బండ్లను వీధుల్లో ఊరేగించారు. మహిళలు కోలాటం ఆడారు. పురుషులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పాత పంటల సాగులో ప్రత్యేక చొరవ చూపిన మహిళలు వడ్డి గ్రామానికి చెందిన శోభమ్మ, ఎల్గోయి గ్రామానికి చెందిన నర్సమ్మ, అనుషమ్మ, కాశీంపూర్‌కు చెందిన లచ్చమ్మ, పాట్‌పల్లికి చెందిన రత్నమ్మలను ఘనంగా సత్కరించారు.



వడ్డి గ్రామంలో పాత పంటలతో ఉన్న ఎడ్ల బండ్ల ఊరేగింపు

పరిశ్రమ అభివృద్ధికి మద్దతివ్వండి

రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి సహకరించండి

- కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, షెకావత్‌కు మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి
- సరస్వతి పుష్కరాల ఏర్పాట్ల పర్యవేక్షణకు అధికారులతో కమిటీ!



సాక్షి, న్యూఢిల్లీ/ హైదరాబాద్/కాళేశ్వరం: సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, కేంద్రం కూడా అందుకు సహకరించాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం ఆయన అశ్వినీ వైష్ణవ్‌తోపాటు పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర షెకావత్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందని తెలిపారు. వచ్చే నెల 24న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బయో ఏషియా సదస్సుకు రావాలని ఆహ్వానించారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించండి

రాష్ట్రంలో పేరుగాంచిన దేవాలయాల అభివృద్ధికి సహకరించాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర షెకావత్‌కు మంత్రి శ్రీధర్ బాబు వినతిపత్రం అందించారు. కాళేశ్వరం – మంథని – రామగిరిని ఆధ్యాత్మిక, వారసత్వ పర్యాటక సర్క్యూట్‌గా గుర్తించి అభివృద్ధి చేయాలని కోరారు. కాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించే సరస్వతీ నది పుష్కరాలపై ఆరుగురు ఉన్నతాధికారులతో ప్రభుత్వం కమిటీ వేసినట్లు తెలిసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా ఎస్పీ, దేవాదాయశాఖ ఆర్జేసీ, యాదగిరిగుట్ట వేద పాఠశాల ప్రిన్సిపాల్, ఇరిగేషన్, పంచాయతీరాజ్‌శాఖల ఎస్‌ఈలు ఉండనున్నారు. పుష్కరాలకు రూ.25 కోట్ల పనులు చేపడుతున్నారు.

దండయాత్ర మాదిరిగా రాహుల్ భాష

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్: విదేశీయులు భారత్ మీద దండయాత్ర చేసిన మాదిరిగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భాష ఉందని బీజేపీ మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు మండిపడ్డారు. భారత్ మీద ఎవరితో కలిసి ఆయన కొట్లాడతారని ప్రశ్నించారు. 'రాహుల్ వ్యాఖ్యలు విడ్డూరం. ఆయన ఎవరితో కొట్లాడతారు. ప్రజాస్వామ్యంపై ఆయనకు నమ్మకం ఉందా? రాహుల్‌కు జ్ఞానోదయం కాలేదు. విదేశాల్లో భారత్ వ్యతిరేక వ్యాఖ్యలు ఆయనకు పరిపాటిగా మారాయి'అని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ కొత్త కార్యాలయం ప్రారంభం సందర్భంగా రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. బుధవారం రఘునందన్ మీడియాతో మాట్లాడుతూ చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ లేదా మీ అమ్మగారి దేశంతో కలిసి భారత్ మీద పోరాటం చేస్తావా అని నిలదీశారు. 'దేశం కోసం, జాతీయతా వాదం కోసం పనిచేసే బీజేపీని దేశ ప్రజలు ఎన్నుకున్న విషయం మీరు జీర్ణించుకోలేక పోతున్నారు'అని విమర్శించారు.

సుప్రీంలో పిటిషన్ వెనక్కు తీసుకున్న కేటీఆర్

ఈ-కారు రేసుపై ఏసీబీ కేసులో క్వాష్ పిటిషన్ దాఖలు



సాక్షి, న్యూఢిల్లీ: ఫార్ములా ఈ-కారు రేస్ కేసులో ఏసీబీ దాఖలు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టేయాలని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెనక్కి తీసుకున్నారు. తెలంగాణ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ ప్రసన్న బి. వరాలే ధర్మాసనం విచారించింది. ఏసీబీ కేసు దర్యాప్తు ప్రాథమిక దశలోనే ఉన్నందున హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకోబోమని, పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని ప్రకటించింది. దీంతో తామే పిటిషన్‌ను వెనక్కు తీసుకుంటామని, అందుకు అనుమతి ఇవ్వాలని కేటీఆర్ తరఫు న్యాయవాది సిద్ధార్థ్ దవే కోరారు. అందుకు ధర్మాసనం అంగీకరించటంతో పిటిషన్‌ను వెనక్కు తీసుకున్నారు.

రాజకీయ ప్రతీకార కేసు.. కాదు అవినీతిపై ఆధారాలున్నాయి

పిటిషన్ విచారణ సందర్భంగా వాడీవేడిగా వాదనలు జరిగాయి. ఈ కేసులో హెచ్‌ఎండీఏను, ఇతరులను నిందితులుగా పేర్కొనలేదని.. ఇద్దరు అధికారులను, కేటీఆర్‌ను మాత్రమే నిందితులుగా చేర్చారని సిద్ధార్థ్ దవే తెలిపారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు కేసు అని వాదించారు. కేటీఆర్ లంచం తీసుకున్నారని ఎవరూ చెప్పడంలేదని పేర్కొన్నారు. రాజకీయ కారణాలతోనే కేసు నమోదు చేశారని అన్నారు. కేటీఆర్ ప్రతిపక్ష నేతగా ఉండటం వల్లనే రాజకీయ కక్షలో భాగంగా కేసులు పెడుతున్నారని వాదించారు. అయితే ప్రతిపక్ష నేతగా ఉంటే కేసులు ఎదుర్కోవాలి కదా? అని జస్టిస్ బేలా ఎం త్రివేది ప్రశ్నించారు. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో అవినీతి జరిగిందని, అందుకు ఆధారాలు ఏసీబీ వద్ద ఉన్నాయని తెలిపారు. పూర్తి స్థాయి విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వాదించారు. ఇప్పటికే కేటీఆర్ విచారణకు హాజరయ్యారని.. కేసు విచారణ దశలో ఉన్న నేపథ్యంలో కేసు కొట్టివేయటం సరైన నిర్ణయం కాదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. కేసు విచారణ ప్రాథమిక దశలోనే ఉన్నందున, ప్రత్యామ్నాయ మార్గాలు మీకు ఉన్నాయి కదా? అని సిద్ధార్థ్ దవేను ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషన్‌ను విత్ డ్రా చేసుకునే అవకాశం కల్పించిన ధర్మాసనం.. మళ్లీ హైకోర్టుకు వెళ్లే స్వేచ్ఛను మాత్రం ఇవ్వలేమని స్పష్టం చేసింది.

బలమైన వాదనలు వినిపించాలి

నీటి కేటాయింపులపై సీఎం రేవంత్‌రెడ్డి

- ఐఎస్‌ఆర్‌డబ్ల్యూడీఏ–1956 సెక్షన్ 3ని పరిగణనలోకి తీసుకోవాలి
- గోదావరి–బనకచర్లపై అభ్యంతరాలతో జల్‌శక్తి మంత్రి, ఏపీ ముఖ్యమంత్రికి లేఖలు
- నీటిపారుదల శాఖతో సీఎం సమీక్ష



బుధవారం ఢిల్లీలో నీటిపారుదల శాఖపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: అంతర్రాష్ట్ర నదీజలాల వివాద చట్టం (ఐఎస్‌ఆర్‌డబ్ల్యూడీఏ)–1956 సెక్షన్ 3 ప్రకారం తెలంగాణకు నీటి కేటాయింపులు చేపట్టాలనే విషయంపై కృష్ణా ట్రిబ్యునల్ ఎదుట బలమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఏపీ పునర్విభజన చట్టం (ఏపీఆర్‌ఏ)–2014లోని సెక్షన్ 89 ప్రకారం ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఏపీఆర్‌ఏ ప్రకారం ఏర్పాటైన అపెక్స్ కౌన్సిల్ సైతం సెక్షన్–3 ఆధారంగా రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలు చేపట్టాలని సూచించిందని సీఎం తెలిపారు. కృష్ణా ట్రిబ్యునల్ విధివిధానాలపై ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించినా, అత్యున్నత న్యాయస్థానం ఎటువంటి స్టే ఇవ్వని విషయాన్ని సీఎం గుర్తు చేశారు. రాష్ట్ర నీటి పారుదలశాఖపై సీఎం రేవంత్ ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో బుధవారం సాయంత్రం సమీక్షించారు. ఈ సమీక్షలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలుపుతూ లేఖలు రాయండి

ఏ అనుమతులు లేకుండా ఏపీ ప్రభుత్వం గోదావరి – బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు చేపట్టడంపై కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్.పాటిల్, ఏపీ సీఎం చంద్రబాబుతోపాటు గోదావరి, కృష్ణా నది యాజమాన్య బోర్డులకు (జీఆర్‌ఎంబీ, కేఆర్‌ఎంబీ) తెలంగాణ తరఫున అభ్యంతరాలు తెలుపుతూ లేఖలు రాయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టుతో భద్రాచలం ముంపు విషయంపై హైదరాబాద్ ఐఐటీతో అధ్యయనం చేయించే అంశాన్ని నిర్దేశిత సమయంలో పూర్తి చేయించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమ్మక్క – సారక్క బరాజ్, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలకు అనుమతులు సాధించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.

తెలంగాణకు న్యాయం జరిగేలా ముందుకు: ఉత్తమ్

కృష్ణా జలాలపై విచారణ తొందరగా ముగించి తెలంగాణకు న్యాయం జరిగే విధంగా తాము ట్రిబ్యునల్ ముందుకు వెళుతున్నట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. కృష్ణా ట్రిబ్యునల్ విచారణ నేపథ్యంలో బుధవారం ఉదయం తెలంగాణభవన్‌లోని శబరి బ్లాక్‌లో అడ్వొకేట్ జనరల్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌తో సమావేశమయ్యారు. అనంతరం ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు. గురు, శుక్రవారం నీటి పంపకాలపై ట్రిబ్యునల్‌లో వాదనలు జరుగుతాయన్నారు. ఉమ్మడి ఏపీలో 811 టీఎంసీల నీటి కేటాయింపులు జరిగాయని, అయితే తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీల ప్రతిపాదనకు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సూచనప్రాయంగా ఒప్పుకున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. ఆ వాదనను ఇప్పుడు తాము ఏకీభవించడం లేదని, అందులో మెజారిటీ టీఎంసీలు తెలంగాణకు కేటాయించాలన్నారు.

నేటి నుంచి సీఎం రేవంత్ విదేశీ పర్యటన

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేటి నుంచి విదేశాల్లో పర్యటించనున్నారు. గురువారం రాత్రి 9.30 గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం 6 గంటలకు సింగపూర్‌లోని చాంగికి చేరుకుంటారు. సింగపూర్‌లో పర్యాటకాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను పరిశీలించనున్నారు. అనంతరం 20న రాత్రి 12.30 గంటలకు సింగపూర్ నుంచి బయలుదేరి ఉదయం 6.10 గంటలకు స్విట్జర్లాండ్‌లోని జూరిచ్‌కు చేరుకుంటారు. అక్కడ జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొని రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు తెచ్చేందుకు వ్యాపారవేత్తలతో చర్చలు జరపడంతో పాటు ఎంఓయూలు చేసుకోనున్నారు. అనంతరం 23న మధ్యాహ్నం 2.35 గంటలకు జూరిచ్ నుంచి బయలుదేరి రాత్రి 11.45కి దుబాయ్‌కి చేరుకుంటారు. అనంతరం 24న తెల్లవారుజామున 3.30 గంటలకు దుబాయ్ నుంచి బయలుదేరి ఉదయం 8.25కు హైదరాబాద్‌కు చేరుకుంటారు.

సైద్ధాంతిక బలమా? ప్రజల్లో గుర్తింపా..?

రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవి కోసం పాత, కొత్త నేతల పోటాపోటీ

జాతీయ నాయకత్వం ఎటువైపు మొగ్గుచూపుతుందోననే చర్చ

ఈ నెలాఖరులోగా కొత్త చీఫ్ ఎంపిక ఉంటుందంటున్న పార్టీవర్గాలు

బీసీ వర్గానికి అవకాశం దక్కుతుందనే అంచనాల్లో ముఖ్య నేతలు

బరిలో ఈటల రాజేందర్, అర్వింద్ ధర్మపురి, రఘునందన్‌రావు, రామచందర్‌రావు!



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరు నియమితులౌతారనేది ఆ పార్టీ నేతల్లో ఉత్కంఠ రేపుతోంది. ఈ పదవి కోసం ఆ పార్టీ పాత, కొత్త నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. జాతీయ నాయకత్వం ఈ నెలాఖరులోగా రాష్ట్ర బీజేపీకి కొత్త అధ్యక్షుడిని నియమించనున్నట్టు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ప్రస్తుతం చివరి దశకు చేరుకుంది. పోలింగ్ బూత్‌ల ఎన్నికలు, మండల పార్టీ అధ్యక్షుల ఎంపికను రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే పూర్తి చేసింది. జిల్లా అధ్యక్షుల నియామకం కోసం ఐదుగురు చొప్పున నాయకుల పేర్లతో జాబితాను సిద్ధం చేసి జాతీయ నాయకత్వానికి పంపించింది. వారంలోగానే వీరిని ప్రకటించే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే రాష్ట్ర అధ్యక్షుడిని కూడా నియమిస్తారని సమాచారం.

మొగ్గు ఎటువైపో..!

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం పలువురు ముఖ్య నేతలు పోటీ పడుతున్నారు. గత రెండు, మూడేళ్లలో ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన నాయకులు కూడా పదవిని ఆశిస్తున్నారు. పార్టీలో చేరాక గత ఎన్ని కల్లో కొందరు ఎంపీలుగా గెలిచారు. మరికొందరు ఇతర పదవుల్లో కొనసా గుతున్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తు న్న కార్యకలాపాల్లో చురు గ్గా పాల్గొంటూ పార్టీ అగ్రనేతలకు చేరువైన వారు న్నారు. అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికల (2028) కల్లా పార్టీని పూర్తిగా క్రియాశీలం చేసి ప్రజల మద్ద తు కూడగట్టడంతో పాటు..రాష్ట్రంలో బీజేపీని అధి కారంలోకి తీసుకు వచ్చే సత్తా గల నేతకు పార్టీ పగ్గా లు అప్పగించాలని జాతీయ నాయకత్వం భావిస్తోం ది. మరోవైపు పార్టీ కార్యకలాపాల్లో సై ద్ధాంతిక అం శాలకు ప్రాధాన్యత ఉన్నందున.. ఏళ్ల పాటు పార్టీ లోనే ఉంటూ, సిద్ధాంతాలకు విలువ నిచ్చే పాత నాయకులకే అధ్యక్ష పగ్గాలు అప్పగించా లని ఓ వర్గం బలంగా వాదిస్తోంది. దీంతో రాష్ట్ర అధ్యక్షుడిగా సైద్ధాంతిక నేపథ్యం ఉన్న పార్టీ పాత నే తకు అవకాశం వస్తుందా? లేక రాష్ట్రంలో రాజకీ యంగా పట్టు, ప్రజల్లో గుర్తింపు ఉన్న కొత్త నేతకు అవకాశం లభిస్తుందా? అనే చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది.

ముఖ్యనేతల మధ్య తీవ్ర పోటీ

ఎంపీలు ఈటల రాజేందర్, అర్వింద్ ధర్మపురి, రఘునందన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు ఈ పదవి కోసం ప్రధానంగా పోటీపడుతు న్నారు. తాను పోటీలో లేనని కేంద్ర హోంశాఖ సహా య మంత్రి బండి సంజయ్ ఇప్పటికే వివరణ ఇచ్చి నప్పటికీ.. మళ్లీ ఆయన్నే రాష్ట్ర అధ్యక్షుడిగా నియ మించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అం టున్నారు. కీలక నేత కిషన్‌రెడ్డికి కేంద్రమంత్రిగా, మరో నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి బీజేఎల్పీనేతగా అవకాశం కల్పించినందున. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి ఎంపిక మాత్రం బీసీ వర్గాల నుంచే ఉంటుందనే వాదన పార్టీ ముఖ్య నాయకుల్లో బలంగా వినిపి స్తోంది. మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్‌కు కేంద్ర మంత్రి పదవి ఇచ్చినందు న.. రాష్ట్ర బీసీ జనాభాలో గణనీయమైన సంఖ్యలో ఉన్న ముదిరాజ్ సామాజికవర్గ నేత ఈటలకు ఈ పదవి దక్కవచ్చనే ప్రచారం జరుగుతోంది. మరోవై పు ఎంపీ రఘునందన్‌రావు పార్టీలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఎప్పుడు అవకాశం వచ్చినా.. బీఆర్ ఎస్, కాంగ్రెస్‌లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడు తున్నారు. దీంతో పాటు ఆర్ఎస్ఎస్ నేపథ్యం కూ డా ఉండటం కలిసొచ్చే అంశంగా పేర్కొంటున్నారు. ఆయనతో పాటు నిజామాబాద్ ఎంపీ అర్వింద్ కూ డా ఆ రెండు పార్టీలపై ఘాటుగా విమర్శలు చేస్తార న్న అభిప్రాయం ఉంది. ఇక మాజీ ఎమ్మెల్సీ రామ చందర్‌రావు.. ఏబీవీపీ నుంచి మొదలుపెట్టి ఎప్ప ట్నుంచో పార్టీని అంటిపెట్టుకుని ఉన్నారని, సౌమ్యు డు, అందరితోనూ సఖ్యత ఉన్న నాయకుడని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఏప్రిల్ 29 నుంచి ఈఏపీసెట్

- మరో ఏడు సెట్స్ తేదీల వెల్లడి
- త్వరలో నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 29 నుంచి మే 5 వరకు నిర్వహిస్తున్నట్టు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి వెల్లడించారు. దీంతో పాటు ఈ ఏడాది నిర్వహించే మరో ఏడు ఉమ్మడి ప్రవేశ పరీక్షల తేదీలను బుధవారం ప్రకటించారు. సెట్ కన్వీనర్లు, సెట్లను నిర్వహించే యూనివర్సిటీల వివరాలను ఇదివరకే ప్రకటించారు. కంప్యూటర్ బేస్డ్ పద్ధతిలో జరిగే ఈ పరీక్షలకు సంబంధించిన పూర్తి నోటిఫికేషన్ త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూల్..

ప్రవేశ పరీక్ష	కోర్సులు	నిర్వహించే వర్సిటీ	తేదీ
టీజీ ఈఏపీ	అగ్రి, ఫార్మసీ	జేఎన్‌టీయూహెచ్	ఏప్రిల్ 29, 30
	బీఈ, బీటెక్,	జేఎన్‌టీయూహెచ్	మే 2 నుంచి 5 వరకు
టీజీ ఈసెట్	బీఈ, బీటెక్ (రెండో సం.లో)	ఉస్మానియా	12 మే 2025
టీజీ ఎడ్‌సెట్	బీఈడీ	కాకతీయ	1 జూన్ 2025
టీజీ లాసెట్	ఎల్ఎల్‌బీ	ఉస్మానియా	6 జూన్ 2025
టీజీ పీజీ లాసెట్	ఎల్ఎల్ఎం	ఉస్మానియా	6 జూన్ 2025
టీజీ ఐసెట్	ఎంబీఏ, ఎంసీఏ	మహాత్మాగాంధీ	8– 9 జూన్ 2025
టీజీ పీజీఈసెట్	ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ	జేఎన్‌టీయూహెచ్	16 నుంచి 19 జూన్ 2025
టీజీ పీఈసెట్	ఫిజికల్ ఎడ్యుకేషన్	పాలమూరు	11 నుంచి 14 జూన్ 2025

తెలంగాణ ఇన్ సర్వీస్ వైద్యులకు 'సుప్రీం'లో ఊరట

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం వెలుపల ఎంబీబీఎస్ పూర్తిచేసిన తెలంగాణ స్థానికత కలిగిన ఇన్ సర్వీస్ వైద్యులకు పీజీ వైద్య విద్య అడ్మిషన్లలో అవకాశం కల్పించాలని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ స్థానికులకు మాత్రమే పీజీ అడ్మిషన్లు కల్పించేలా ప్రభుత్వం గత అక్టోబర్‌లో జీవోలు 148, 149 జారీ చేసింది. ఈ జీవోలపై విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించగా, తెలంగాణలో ఎంబీబీఎస్ చేసిన వారంతా పీజీ అడ్మిషన్లకు అర్హులేనని తీర్పు చెప్పింది. తద్వారా ఇతర రాష్ట్రాల స్థానికులైనప్పటికీ, తెలంగాణలో ఎంబీబీఎస్ చదివిన విద్యార్థులకు పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు అర్హత లభించింది. అయితే తెలంగాణ వెలుపల ఎంబీబీఎస్ చేసిన, రాష్ట్రానికి చెందిన ఇన్‌సర్వీస్ వైద్యుల అంశాన్ని హైకోర్టు ప్రస్తావించలేదు. దీంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించగా, తెలంగాణ వెలుపల ఎంబీబీఎస్ చదివిన రాష్ట్రానికి చెందిన స్థానికులకు కూడా పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు అర్హత కల్పించాలని ఆదేశిస్తూ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఇన్‌సర్వీస్ వైద్యులకు మిగిలిపోయిన సీట్లలో అవకాశం లభించనుంది.



ప్రార్థన యొక్క పని దేవుడిని ప్రభావితం చేయటం కాదు. ప్రార్థన చేసే వ్యక్తిలో పరివర్తన తేవటం.
– సొరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి
గురువారం, 16 జనవరి 2025

కచ్చితత్వం దిశగా...

పక్షుల, పాముల, జంతువుల ప్రవర్తనను చూసీ...ఆకాశం తీరుతెన్నులు గమనించీ, గాలివాటు, దాని వేగం గ్రహించీ వాతావరణాన్ని అంచనా కట్టే గతకాలపు రోజుల నుంచి ఇవాళ ఏం జరుగుతుందో, వచ్చే నాలుగైదు రోజుల్లో ఎలాంటి వాతావరణం ఉండబోతున్నదో, రాగల సంవత్సరమంతా ఎలాంటి స్థితిగతులుంటాయో స్పష్టంగా వివరించే సమాచారం అందరికీ అందుబాటులో కొచ్చింది. గత నూట యాభయ్యేళ్లుగా అవిచ్ఛిన్నంగా ఈ పనిలోనే నిమగ్నమై కోట్లాది పౌరులకు చేదోడువాదోడుగా నిలిచిన భారతీయ వాతావరణ విభాగం(ఐఎండీ) తన వార్షికోత్సవాన్ని మంగళవారం ప్రధాని మోదీ సమక్షంలో ఘనంగా నిర్వహించుకుంది. ఒక దేశ విజ్ఞాన శాస్త్ర అవగాహన ఆ దేశంలోని వైజ్ఞానిక సంస్థల ప్రగతిలో ప్రతిఫలిస్తుందని ఈ సందర్భంగా మోదీ చెప్పిన మాట అక్షరసత్యం. ఈ నూటయాభయ్యేళ్లలో ఐఎండీ సాధించిన ప్రగతి ఇందుకు సాక్ష్యం. 'వాన రాకడ... ప్రాణం పోకడ' ఎవరికీ తెలియదనే నానుడి నుంచి మనం చాలా దూరం వచ్చాం. ఇక పోవటం ఖాయమనుకున్న ప్రాణాన్ని నిలబెట్టడానికీ, పునర్జన్మ ఇవ్వడానికీ అధునాతన వైద్య సదుపాయాలు విస్తృతంగా అందుబాటులోకొచ్చాయి. అలాగే వాన ఎక్కడ కురుస్తుందో, దాని తీవ్రత ఏపాటో అంచనా వేయగలుగుతున్నాం. తుపాను ఏర్పడే అవకాశాలు, దాని గమ్యం, గమనం, అది మోసుకు రాగల విపత్తు గురించీ హెచ్చరించటంతో పాటు కరవుకాటకాల ప్రమాదాన్ని తెలియజెప్పటం ఆ రంగంలో సాధించిన ప్రగతికి తార్కాణం. మూడు రోజుల వరకూ వాతావరణం ఎలా ఉండబోతున్నదో చెప్పే స్వల్పకాలిక అంచనాలు, పదిరోజుల వరకూ వాతావరణ పోకడల్ని వివరించగల మధ్య శ్రేణి అంచనాలు, నెల పాటు ఏ వారమెలా వుంటుందో తెలియజేయగల సామర్థ్యం ఇప్పుడు మన సొంతం. ఇంకా స్థానిక వాతావరణాలను అంచనా వేయగలిగే దిశగా ఐఎండీ ముందుకెళ్తోంది.

పేరులో తప్ప జనాభా రీత్యా, సంపద రీత్యా, లేదా విస్తీర్ణం రీత్యా ఏ రకంగానూ 'గ్రేట్' అనే పదానికి అర్హత లేని బ్రిటన్ నుంచి వచ్చిన వలస పాలకులు ఈ దేశంలోని వాతావరణ తీరుతెన్నులు చూసి అయోమయంలో పడ్డారు. వీటిని సక్రమంగా అంచనా వేసే సాధనాలు లేకపోతే సరిగా పాలించటం అసాధ్యమన్న నిర్ణయానికొచ్చిన ఫలితంగానే 1875లో సర్ చార్లెస్ చాంబర్లేన్ నేతృత్వంలో ఐఎండీని నెలకొల్పారు. అంతవరకూ రైతులు సంప్రదాయంగా అనుసరిస్తూ వచ్చిన విధానాలన్నీ క్రమేపీ కనుమరుగై వాతావరణ అధ్యయనం కొత్త పుంతలు తొక్కటం ప్రారంభించింది. కేవలం బ్రిటన్ వాతావరణాన్ని పోలి వుంటుందన్న ఏకైక కారణంతో తమ వెసులుబాటు కోసం సిమ్లాలోని పర్వత ప్రాంతంలో మొదలెట్టిన ఐఎండీ వల్ల పెద్దగా ప్రయోజనం ఉండటం లేదని గ్రహించాక 1928లో పుణేకు తరలిరావటం, ఆ తర్వాత రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ఢిల్లీకి వెళ్లటం తప్పనిసరైంది. ఐఎండీ డైరెక్టర్ జనరల్‌గా వచ్చిన గిల్బర్ట్ వాకర్ 1904–1924 మధ్య రెండు దశాబ్దాల సమయంలో భారత వాతావరణంలో చోటుచేసుకున్న అసాధారణతలపై అధ్యయనం చేయటంతో అనేక అంశాలు బయటపడ్డాయి. ముఖ్యంగా ఉష్ణమండల ప్రాంత పసిఫిక్ మహాసముద్ర జలాలపై ఉండే వాయుపీడనంలో వచ్చే హెచ్చుతగ్గులే ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ స్థితిగతులను ప్రభావితం చేస్తున్నాయని ఆ అధ్యయనం తేల్చాక వాతావరణాన్ని అర్థంచేసుకునే తీరే మారిపోయింది. పసిఫిక్ జలాలపై ఉండాల్సిన సాధారణ ఉష్ణోగ్రతలో మైనస్ 17 డిగ్రీల సెల్సియస్ మేరకు హెచ్చితే లా నినో... ఆ ఉష్ణోగ్రత మైనస్ 17 డిగ్రీల కన్నా తగ్గితే లానినా ఏర్పడు తుందని తేలింది అప్పుడే. ఇదంతా అర్థమయ్యాక రాగల కాలంలో వాతావరణమెలా వుండనున్నదో అంచనా వేయటం సులభమైంది. వాతావరణంలో విడిచిపెట్టే బెలూన్‌లు గాలిలో తేమనూ, ఉష్ణోగ్రతనూ ఇట్టే చెప్పగలుగుతుండగా ఉపగ్రహాలు నేల పరిస్థితుల గురించి సమాచారం ఇస్తున్నాయి.

స్వాతంత్ర్యానంతరం వాతావరణాన్ని కొలవటానికి రాడార్ల వంటి ఉపకరణాలు అందుబాటులోకొచ్చాయి. 1971లో తొలి తుపాను హెచ్చరిక కేంద్రం ఏర్పాటైతే, 1990ల్లో ఇస్రో ఉపగ్రహాలు పంపే డేటాతో వాతావరణ అంచనాల కచ్చితత్వం పెరిగింది. సెకనుకు కొన్ని లక్షల గణనలను చేయగలిగిన అధునాతన సూపర్ కంప్యూటర్ వినియోగం మొదలయ్యాక రుతుపవనాలు, తుపానుల గురించి మాత్రమే కాదు... వడగాల్పులు, వరదల వంటి వైపరీత్యాల గురించి కూడా చెప్పగలుగుతున్నారు. మన దేశంలో సాగుకు యోగ్యమైన భూమిలో 60 శాతం కేవలం వర్షాధారం కావటం, జనాభాలో మూడింట రెండొంతుల మందికి జీవనాధారం వ్యవసాయమే కావటం వల్ల ఐఎండీ చెప్పే అంచనాలు ఎంతో అవసరం. అందుకే వర్షాలు సరిగ్గా ఎక్కడ పడతాయో, ఏ ప్రాంతంలో వడగాడ్పులు వీచవచ్చో, ఎక్కడ పిడుగులు పడే అవకాశం ఉన్నదో కూడా పదేళ్లుగా చెప్పగలుగుతోంది. కృత్రిమ మేధ దీన్ని మరింత పదునెక్కించింది.

ఐఎండీ అంచనాల వల్ల ప్రభుత్వాలు అప్రమత్తమై లక్షలమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించటం, వేలాది ప్రాణాలను కాపాడుకోవటం సాధ్యమవుతోంది. ఇది మున్ముందు ఇంకా విస్తరించి కనీసం అయిదురోజుల ముందు 90 శాతం కచ్చితత్వంతో చెప్పగలిగే విధానాలను అభివృద్ధి చేసుకోవాలనీ, ఆఖరికి భూకంపాల రాకడను సైతం పసిగట్టగలగాలనీ ఐఎండీ 2047 విజన్ డాక్యుమెంటు విడుదల సందర్భంగా మోదీ చేసిన సూచన శిరోధార్యం. ఈ అంచనాలు మన దేశానికి మాత్రమే కాదు...ఆసియా ప్రాంత దేశాలకు సైతం ఎంతో మేలుచేస్తాయి. పంటల దిగుబడిపై, ఆర్థికవ్యవస్థ తీరుతెన్నులపై మరింత మెరుగైన అంచనాలకు తోడ్పడతాయి.

నిశ్శబ్దం వీడకుంటే ముప్పు తప్పదు!

విశ్లేషణ



అశోక్ కె కంథా

టిబెట్‌లోని యార్లుంగ్ త్సాంగ్పో నది దిగువ ప్రాంతాల్లో మునుపెన్నడూ లేనంత అతి పెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి చైనా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దిగువన ఉన్న నదీ తీర దేశమైన భారత్‌కి తెలియజేయకుండా చైనా ప్రభుత్వం ఈ తీర్మానం చేసింది! మనకు ఉత్తరాన ఉన్న పొరుగు దేశంతో సంబంధాలను నెలకొల్పుకోవడంలో ఉన్న సంక్లిష్టతను ఈ పరిణామం మరోసారి గుర్తు చేసినట్లయింది. పర్యావరణపరంగా దుర్బలమైన, భూకంపాలకు గురయ్యే భౌగోళిక ప్రాంతంలో చేపట్టిన ఈ భారీ ప్రాజెక్టుతో విపత్తుల ప్రమాదం అనుక్షణం పొంచి ఉంటుంది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. భారత్ తన నిశ్శబ్ద దౌత్యాన్ని వీడి, చైనాతో అధికారిక మార్గాలలో తన ఆందోళనలను బలంగా నమోదు చేయాలి.

చాలా సంవత్సరాలుగా సన్నాహక దశలో ఉన్న చైనా ప్రతిపాదిత యార్లుంగ్ త్సాంగ్పో ప్రాజెక్టును భారతదేశం నిశితంగా పరిశీలిస్తోంది. ఎందుకంటే ఇది భారత్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావాలను కలిగిస్తుంది. ఎగువ నదీ తీర దేశంగా ఉంటున్న చైనాకు ఇతర దేశాలతో సహకరించడానికి, నదికి దిగువన ఉన్న దేశాల ప్రయోజనాలను కాపాడటానికి ఇష్టపడని దురదృష్టకరమైన చరిత్ర ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటికే చైనాతో సంబంధాలు క్లిష్టంగా ఉన్న భారతదేశానికి ఈ ప్రాజెక్టు ద్వారా మరో ప్రధానమైన చీకాకు తలెత్తుతోంది.

జిన్హువా వార్తా సంస్థ వివరాలను అందించకుండానే ఈ వెంచర్‌ను 'గ్రీన్ ప్రాజెక్ట్'గా ప్రశంసించింది. హాంకాంగ్‌కు చెందిన సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ నివేదిక ప్రకారం, ఈ డ్యామ్ నిర్మాణంలో మొత్తం పెట్టుబడి 1 ట్రిలియన్ యువాన్లు అంటే 137 బిలియన్ డాలర్లను దాటవచ్చు. ప్రతి సంవత్సరం ఈ ప్రాజెక్టు దాదాపు 300 బిలియన్ కిలోవాట్ గంటల విద్యుత్తును ఉత్పత్తి చేస్తుందని అంచనా. ప్రస్తుతం చైనాలో ఉన్న, ప్రపంచంలోనే అతిపెద్ద త్రీ గోర్జెస్ ఆనకట్టలోని 88.2 బిలియన్ కిలోవాట్ గంటల విద్యుత్ తయారీ డిజైన్ సామర్థ్యంతో పోలిస్తే ఇది మూడు రెట్లు ఎక్కువ. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ నివేదిక ప్రకారం ఇది ప్రపంచంలోనే అతి పెద్ద మౌలిక సదుపాయాల ప్రాజెక్టు కానుంది. దీంట్లో భాగంగా నాలుగు నుండి ఆరు వరకు 20 కిలోమీటర్ల సొరంగాలను తవ్వుతారు. నది ప్రవాహంలో సగాన్ని వీటి ద్వారా మళ్లిస్తారు. అయినప్పటికీ, ఇది దిగువ దేశాలైన భారత్, బంగ్లాదేశ్‌లపై ప్రతికూల ప్రభావాన్ని చూపదని ఉవాచ!

ఈ ప్రతిపాదిత ప్రాజెక్ట్ యార్లుంగ్ త్సాంగ్పో నదికి చెందిన పెద్ద మలుపు ప్రాంతంలో నిర్మిస్తున్నట్లు సమాచారం. అక్కడ నది యూటర్న్ తీసుకొని 20 కి.మీ కంటే కొంచెం దిగువన భారతదేశంలో ప్రవేశిస్తుంది. ఈ ప్రాజెక్ట్ తీవ్ర పర్యవసానాలు మనకు అనేక విధాలుగా గ్రహింపునకు వస్తున్నాయి. మన దేశంలోకి ప్రవేశించిన తర్వాత ఈ నది సియాంగ్ పేరుతో చలామణి అవుతుంది. నీటి ప్రవాహానికి ఇది తీవ్ర అంతరాయం కలిగిస్తుంది. ఇది బ్రహ్మపుత్ర నదీ వ్యవస్థకు చెందిన ప్రధాన వాహిక. అస్సాం ప్రభుత్వ వెబ్‌సైట్ ప్రకారం, బ్రహ్మపుత్ర నది పరీవాహక ప్రాంతం టిబెట్‌లో 2,93,000 చదరపు కిలోమీటర్లు. భారతదేశం, భూటాన్‌లలో 2,40,000 చదరపు కిలోమీటర్లు. బంగ్లాదేశ్‌లో 47,000 చదరపు కిలోమీటర్ల మేరకు బ్రహ్మపుత్ర విస్తరించి ఉంది. ఈ నది నీటిలో ఎక్కువ భాగం మన భూభాగంలోనే ప్రవహిస్తుంది. అయితే ఈ భారీ ప్రాజెక్ట్... నదీ ప్రవాహాలను, తత్ఫలితంగా దిగువ నివాసితుల జీవనోపాధిని గణనీయంగా ప్రభావితం చేస్తుంది.

ప్రధాన ప్రాజెక్టుకు అనుసంధానంగా మెకాంగ్ ఎగువ ప్రాంతాలలో చైనా చిన్న జలవిద్యుత్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయడం, కృత్రిమ జలపాతాలను సృష్టిస్తుండటం కూడా క్రమవిరుద్ధమైన హెచ్చుతగ్గులకు దారితీయనుంది. దీంతో కొన్ని ప్రాంతాలు ఎండిపోనున్నాయి. చేపల లభ్యత తగ్గుతుంది. దిగువ మెకాంగ్ బేసిన్‌లో సారవంతమైన ఒండ్రు నిక్షేపాలకు చోటు లేకుండా పోతుంది. ఇది మయన్మార్, థాయిలాండ్, లావోస్, కంబోడియా, వియత్నాంలలోని నదీ తీర ప్రాంత ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. మొత్తంగా – ఈ ప్రతిపాదిత ప్రాజెక్ట్ భారతదేశం, బంగ్లాదేశ్‌లకు అనూహ్య ప్రతికూల పరిణామాలను కలిగించనుంది.



యార్లుంగ్ త్సాంగ్పో నది దిగువ ప్రాంతం. (చైనా ఇక్కడ నిర్మించబోతున్న అతి పెద్ద జల విద్యుత్ ప్రాజెక్టు వల్ల భారత్ ప్రయోజనాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది).

2004లో టిబెట్‌లోని సట్లెజ్ ఉపనది అయిన పరేచు నదిపై ఒక కృత్రిమ సరస్సు ఏర్పడినప్పుడు క్యాబినెట్ కార్యదర్శి నేతృత్వంలోని ఒక బృందం చేసిన అత్యవసర కసరత్తు ఈ వ్యాసకర్తకు గుర్తుంది. ఆ సమయంలో చైనాతో మనకు సాపేక్షంగా మంచి సంబంధాలు ఉన్నందున, మన భౌగోళిక వనరులు, ఇతర మార్గాల ద్వారా పోగుపడిన సమాచారం ద్వారా మనకు ముందస్తు నోటీసు, డేటా లభించాయి. సరస్సు ఘనీభవించే ముందు ఎలాంటి ప్రమాదమూ జరగలేదు. పైగా నివారణ చర్యల కారణంగా తదుపరి సంవత్సరం భారత దేశంలో దిగువన పరిమిత నష్టం మాత్రమే జరిగింది. కానీ, తాజాగా ప్రతిపాదించిన ప్రాజెక్ట్ నుండి పుట్టుకొచ్చే ప్రమాదాలు తీవ్రాతితీవ్రంగా ఉంటాయి.

ఎంతో సహనంతో కూడిన దౌత్యంతోనే మనం బీజింగ్‌తో పరిమిత సహకారాలను ఏర్పాటు చేసుకోగలిగాం. వాటిలో బ్రహ్మపుత్ర నదికి చైనా రుతుపవనాల సీజన్ డేటాను అందించడంపై మూడు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం, సట్లెజ్ నదికి రుతుపవనాల సీజన్ డేటా పంచుకోవడం, 'ట్రాన్స్–బోర్డర్ నదులపై సహకారాన్ని బలోపేతం చేయడం' ఉన్నాయి. మొదటి రెండు ఎంఓయూలను ప్రతి ఐదేళ్లకు ఒకసారి పునరుద్ధరించడం జరుగుతుంది. వీటికి ఇప్పుడు గడువు ముగిసిపోయింది.

అంతర్జాతీయ జలమార్గాల నౌకాయానేతర ఉపయోగాల చట్టం – 1997 నాటి ఐక్యరాజ్యసమితి సమావేశం తీర్మానాలపై చైనా కానీ, భారత్ కానీ సంతకం చేయలేదు. అయితే, ఈ సమావేశం చేపట్టిన రెండు కీలక సూత్రాలు... భాగస్వామ్య జలాల 'సమాన మైన, సహేతుకమైన వినియోగం', దిగువ రాష్ట్రాలకు 'హాని కలిగించకూడదనే బాధ్యత' అనేవాటికి పూర్తి ఔచిత్యం ఉంది. భారత్ బాధ్యతాయుతమైన ఎగువ నదీ తీర దేశంగా ఉంది. పాక్‌తో ద్వైపాక్షిక సంబంధాలు సమస్యాత్మకంగా ఉన్నప్పటికీ సింధు జలాల ఒప్పందం ప్రకారం పాకిస్తాన్‌కు ఉదారమైన ప్రయోజనాలను కూడా భారత్ అందిస్తోంది. దురదృష్టవశాత్తూ, చైనా గురించి అలా చెప్పలేం.

జనవరి 3న భారత విదేశాంగ ప్రతినిధి మాట్లాడుతూ : ''నదీ జలాలపై స్థిరమైన వినియోగదారు హక్కులు భారత్‌కు ఉన్నాయి. దిగువ నదీ తీర దేశంగా, నిపుణుల స్థాయి, దౌత్య మార్గాల ద్వారా, చైనా భూభాగంలోని నదులపై నిర్మిస్తున్న మెగా ప్రాజెక్టులపై మా అభిప్రాయాలను, ఆందోళనలను వ్యక్తం చేశాం. తాజా నివేదిక తర్వాత దిగువ ప్రాంతాల దేశాలతో సంప్రదింపుల అవసరంతో పాటు వీటిని కూడా మళ్లీ పునరుద్ఘాటించాం'' అన్నారు.

భారతదేశం ఇప్పటివరకు నిశ్శబ్ద దౌత్యాన్ని ఎంచుకుంది. అయితే, టిబెట్‌లో ప్రస్తుతం ఉన్న నదీ ప్రవాహ ప్రాజెక్టుల మాదిరిగా కాకుండా, భారీ నీటి మళ్లింపు, నిల్వను కలిగి ఉన్న ప్రతిపాదిత ప్రాజెక్ట్ భారీ పరిమాణం, దానిలోని చిక్కుల దృష్ట్యా, మనం ఇప్పుడు కొత్త ఆందోళనలో ఉన్నాం. ప్రాజెక్టుకు చెందిన సాంకేతిక పరామితులు, పర్యావరణ ప్రభావ అధ్యయనాలపై మనం వివరణలు కోరాలి. దిగువ ప్రాంతాలకు, 'సమానమైన, సహేతుకమైన వినియోగం', 'గణనీయమైన హాని కలిగించకూడదనే బాధ్యత' వంటి సూత్రాలను గౌరవించాలని చైనాను కోరాలి. వాస్తవానికి, ప్రాజెక్ట్‌పై పూర్తి సంప్రదింపులు, పరస్పర అవగాహన వచ్చే వరకు తదుపరి పనులను నిలిపివేయాలని మనం అధికారికంగా అడగాలి.

నిశ్శబ్ద దౌత్యానికి కూడా తనదైన పరిమితులు ఉంటాయి. చైనాతో అధికారిక మార్గాలలో, ప్రజాక్షేత్రంలో కూడా మన ఆందోళనలను బలంగా చెప్పాలి. పర్యావరణ నిబంధనలు, స్థానిక జనాభా ప్రయోజనాలపై రాజీ పడకుండా, జలవిద్యుత్, ఇతర ప్రాజెక్టులను మరింత అత్యవసరంగా అమలు చేయాలి. తద్వారా బ్రహ్మపుత్ర జలాలపై భారతదేశ ప్రస్తుత వినియోగదారు హక్కులను పెంచుకోవాలి. నిజానికి, భారీ నీటి నిల్వ ప్రాజెక్టులపై అత్యంత జాగరూకతతో ముందుకు సాగడంపై గతంలో పంచుకున్న ఆలోచనలకు ఈ మెగా ప్రాజెక్ట్ విరుద్ధంగా ఉంది.

వ్యాసకర్త చైనాలో భారత మాజీ రాయబారి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

దాల్ మఖానీ రూ. 750



భారత్‌లోని హోటళ్లు, రెస్టారెంట్‌ల ఆహార పదార్థాలు నాణ్యతలో అంతర్జాతీయ ప్రమాణాలతో సరిపోలకుండానే విపరీతమైన ధరలను కలిగి ఉంటున్నాయి! మన పర్యాటకులు విదేశాలకు వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారంటే చూపరా మరి?! (సిమ్లా నుండి 2 గంటల దూరంలో ఉన్న నరకందలోని ఒక హోటల్‌లో పదార్థాలకు, వాటి ధరలకు ఏమాత్రం పొంతన లేని విధంగా ఉన్న మెనూను జతపరుస్తూ). – ఉదిత్ భండారీ, టూరిస్ట్

పుణ్యం, పురుషార్థం



మహా కుంభమేళాకు ప్రభుత్వ వ్యయం రూ. 6,100 కోట్లు. మొత్తం రాబడి అంచనా రూ. 2,50,000 కోట్లు. అందులో ప్రభుత్వ ఆదాయం రూ. 31,000 కోట్లు. ఉపాధి పొందుతున్నవారు 15 లక్షలు. (ఆతిథ్య రంగంలో 5 లక్షల మంది. ఎయిర్‌లైన్స్, విమానాశ్రయాలలో 1 లక్ష 50 వేల మంది. టూర్ ఆపరేటర్లు 2,50,000 మంది. టూరిజంలో 6 లక్షల మంది). – రిపీ బాగ్రీ, ఇంటర్నెట్ పర్సనాలిటీ

ముందు చూపు



నాకు పీజీలో సీటు వచ్చిన రోజు నేరుగా లాసిక్ క్లినిక్‌కి వెళ్లిపోయాను. మసక అద్దాల్లేవు. ప్రతి రెండు నిమిషాలకొకసారి కళ్లజోడును తుడుచుకోవటం లేదు. ఫ్రేమ్ లేదు. మచ్చలు, గీతలు లేకుండా ప్రపంచం స్పష్టంగా కనిపిస్తోంది. ఇంకా... "నా అద్దాలు ఎక్కడుంచాను?" అని టెన్షన్‌తో వెతుక్కోవటం అన్నది ఇకపై ఉండదు!
– రాజశ్రీ ఆర్, మెడికల్ స్టూడెంట్

అంత టైమ్ ఎక్కడిది?!



అయినా, జీవిత భాగస్వామి ముఖం చూస్తూ ఎవరు కూర్చుంటారు! మాకు పెళ్లయి 22 ఏళ్లు అవుతోంది. మేము టీవీ లేదా మొబైల్ ఫోన్‌ల వైపు చూస్తూ ఉంటాం. (వారానికి 90 గంటలు పని చేయాలని చెబుతూ, "ఇంట్లో ఎంతసేపని భార్య ముఖం చూస్తూ ఉండిపోతారు?" అని 'ఎల్ అండ్ టి' చైర్మన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యపై...).
– అమిత్ టాండన్, స్టాండప్ కమెడియన్

రెండు దేశాలూ కలిసి పనిచేయాలి!

ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా – చైనాల ఉమ్మడి ప్రయోజనాలు పెరుగుతున్నాయి. ఇరుదేశాల వాణిజ్యం, వ్యవసాయం, మాదక ద్రవ్యాల నిరోధకం, ప్రజారోగ్యం, చట్టాల అమలు, పర్యావరణ మార్పులు, సాంకేతిక మేధ, దేశాల మధ్య ఘర్షణలు, యుద్ధాలు వంటి సమస్యల పరిష్కారానికి ఈ అగ్రదేశాల పరస్పర సహకారం, మద్దతు అత్యవసరాలు. 'అమెరికా ఘనతను తిరిగి సాధిద్దాం' నినాదం ప్రపంచాధిపత్య బాధ్యతలను గుర్తుచేయాలని అత్యధిక అమెరికన్ల కోరిక. మానసిక పారదర్శకత, విశాల దృక్పథం, బాధ్యతాయుత వ్యవహార శైలులతోనే దేశపు ప్రపంచ స్థాయి పరిగణించబడుతుందని చైనీయుల అభిప్రాయం. ప్రపంచ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలే కాక ఐక్యరాజ్యసమితి శాశ్వత సభ్యత్వమూ గల అమెరికా–చైనాలు... మానవత్వ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోవాలి. ప్రపంచ శాంతి సాధనలో తమ తమ బాధ్యతలను గుర్తించాలి. ప్రపంచ ప్రజల శ్రేయస్సుకు, అంతర్జాతీయ సవాళ్ళ పరిష్కారానికి సంఘీభావ కార్యక్రమాలతో కృషిచేయాలి.

అమెరికా, చైనాలు గతంలో జీ20 సభ్య దేశాలతో కలిసి ఆర్థిక మాంద్యం నుండి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కాపాడడానికీ, భూతాపాన్ని నియంత్రించడానికీ, పర్యావరణ మార్పులతో పోరాడడానికి ప్యారిస్ ఒప్పందంతో ప్రయత్నాలు చేశాయి. ఆశలు చిగురింపజేశాయి. ఆర్థిక మాంద్యం నుంచి ప్రపంచం ఇంకా పూర్తిగా కోలుకోలేదు. దేశాల మధ్య ఏళ్ల తరబడి ఘర్షణలు, యుద్ధాలు జరుగుతున్నాయి. ఎన్నో కొత్త సమస్యలు, సవాళ్ళు తలెత్తాయి. ఈ నేపథ్యంలో అగ్రదేశాలయిన అమెరికా–చైనాలు ప్రపంచ దేశాలకు దారిచూపాలి. సమస్యల పరిష్కారంలో, బాధ్యతల నిర్వహణలో, స్థిరాభివృద్ధిలో కలిసి పనిచేయాలి. అంతేకాని తామే రెండు పోటీ ప్రపంచాలుగా మారి... ఇతర దేశాలను ఏదో ఒక వైపునకు బలవంతంగా లాగరాదు. ఆధునిక ప్రపంచంలో పెద్ద దేశాలు 'చిన్న క్షేత్రం, పెద్ద కంచె' సూత్రాన్ని అమలు చెయ్యరాదు. ఉపకరణాలను, సాంకేతికతలను, సౌకర్యాలను పారదర్శకతతో పంచుకోవడంతోనే మానవ శ్రేయస్సును సాధించగలం. శాంతి కిరణాలు ప్రపంచం మారుమూలలకు ప్రసరించాలి. అభివృద్ధి మొత్తం ప్రపంచ మానవాళికి న్యాయబద్ధంగా చెందాలి, పంచాలి. అమెరికా–చైనాల సహకారం ప్రపంచ సమస్యలన్నిటినీ పరిష్కరించలేకపోవచ్చు. కానీ కొన్ని పరిష్కరించబడతాయనేది మాత్రం వాస్తవం. సమస్యల పరిష్కారానికి ఒకరితోనొకరు మాట్లాడాలి, చర్చించాలి. విభేదాలను శాస్త్రీయంగా, తర్కబద్ధంగా తగ్గించుకోవాలి. ఘర్షణలకు, యుద్ధాలకు దిగరాదు. చరిత్రనుండి గుణపాఠాలు నేర్వాలి. భవిష్యత్తుకు బాటలు పరవాలి.

– సంగిరెడ్డి హనుమంత రెడ్డి,
ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి

చిన్న నీటి వనరులను రక్షించాలి!

అభిప్రాయం




డా॥ బి. కేశవులు

భూగర్భ జలాల సంరక్షణతో పాటు సాగునీటి వసతి కల్పించి రైతాంగాన్ని ఆదుకోవడంలో చిన్న నీటి వనరులదే కీలక పాత్ర. భారీ, మధ్యతరహా ప్రాజెక్టులపై ప్రచార ఆర్భాటం చేస్తున్న ప్రభుత్వం చిన్ననీటి వనరుల పట్ల నిర్లక్ష్యం చేస్తోందనే భావనను తొలగించుకోవాలని తెలంగాణ సమాజం ఆశిస్తుంది. కాకతీయుల కాలంలోనే చిన్ననీటి వనరులు ఎంత కీలకమో గుర్తించి, అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. అనేక చోట్ల గొలుసు కట్టు చెరువులను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఉన్న చెరువుల సంరక్షణను తర్వాతి పాలకులు గాలి కొదిలేశారు. ఫలితంగా పూడికతో నిండిపోయాయి. వాటి పరిధిలోని సాగు సగానికి పడిపోయింది. పలు చోట్ల కట్టలు బలహీనపడ్డాయి. తూములు దెబ్బ తిన్నాయి. కాల్వలూ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. కేసీఆర్ ప్రభుత్వం 'మిషన్ కాకతీయ' పేరిట వేలాది కోట్లు ఖర్చు చేసినా చాలా వరకూ సమస్య పరిష్కారం కాలేదు.

ఇంకో ప్రధాన సమస్య చెరువుల అన్యాక్రాంతం. అత్యధిక చెరువులను పలువురు ఆక్రమించి సాగుభూమిగా, నివాస ప్రాంతాలుగా మార్చుకున్నారు. అందులోనూ అవసరాల కంటే కైంకర్యమే అగ్రభాగంగా ఉంది. శిఖం భూముల్లో కొన్ని చోట్ల షాపింగ్ మాళ్లు, ఫంక్షన్ హాళ్ళు, దుకాణ సముదాయాలు వెలిశాయి. ఇసుక అక్రమ తవ్వకాలు భారీగా పెరిగి పోయాయి. అడవులు అంతరించి పోతున్నాయి. వాతావరణ పరిస్థితుల్లోనూ ఏటికేడాది మార్పులు సంభవిస్తున్నాయి. ఫలితంగా భవిష్యత్తులో ఈ ప్రమాదం మరింత ముంచుకొచ్చే పరిస్థితి నెలకొంది.

అలనాడు దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి భారీ, మధ్య తరహా ప్రాజెక్ట్‌లతో పాటు చిన్న నీటి వనరులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఫలితంగా ఆనాడు రైతాంగం ఎంతో లాభం పొందింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా), చిన్న నీటి వనరుల శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా పనులు జరగడం లేదనేది ఓ విమర్శ. అక్కడక్కడ మరమ్మతులు చేపడుతున్నా తూతూ మంత్రంగా నిర్వహించి సంబంధిత కాంట్రాక్టర్లు నిధులు మేసేస్తున్నారు. కట్టల మరమ్మతుల సమయంలో కేవలం మట్టి చల్లి చేతులు దులుపుకొంటున్నారనేది కాదనలేని నిజం. ఈ పనులపై సరైన పర్యవేక్షణా లేదు. ఫలితంగా ఏటా కోట్లాది రూపాయల నిధులు మంజూరవుతున్నా మట్టిలో కలిసిపోతున్నాయి. మళ్లీ వర్షాకాలం ప్రారంభంలోనే, అదీ చిన్నపాటి వర్షా నికే కట్టలు కొట్టుకుపోతున్నాయి.

హైదరాబాద్ మినహా తెలంగాణ జిల్లాలన్నింటిలో



కలిపి చెరువుల కింద వాస్తవ సాగు లక్ష్యం 25,75,736 ఎకరాలు కాగా పైన పేర్కొన్న వివిధ కారణాల వల్ల అది 14,50,903 ఎకరాలకు పడిపోయింది. తెలంగాణ మొత్తంగా చూస్తే అన్ని జిల్లాల్లో కల్పి దాదాపు 46,531 చెరువులు ఉన్నాయి. వీటి నిర్వహణ, వీటి పరిధిలోని సాగునీటి వినియోగం కోసం ప్రభుత్వం... సాగునీటి సంఘాలను ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ కంటే నీటితీరువా వసూళ్ళ పైనే ఎక్కువ శ్రద్ధ పెట్టింది. ఈ విషయంలో ప్రభుత్వ దృక్కోణం (ప్రాధాన్యతా దృష్టి) మారాల్సిన అవసరం ఉంది. భౌగోళిక పరిస్థితుల రీత్యా తెలంగాణలో ఇది అత్యావశ్యకం. ఎందుకంటే... తెలంగాణ అంతా ఎత్తుపల్లాలతో ఉంది. ఇక్కడ చెరువులతో పాటు, భారీ మధ్యతరహా రిజర్వాయర్లు, బోర్లు కూడా అవసరమే. వర్షాకాలంలో వృథాగా పోయే నీటిని రిజర్వాయర్లలో నిల్వ ఉంచి చెరువులు, కుంటలు నింపొచ్చు. ఎత్తు పల్లాల నుండి వర్షపునీరు గోదావరి, ఇతర నదుల్లోకి చేరుతుంది. అలా చేరిన నీటిని తిరిగి లిఫ్టులు పెట్టి పొలాలకు అందించడం కంటే చెరువులు కట్టడం మేలు. ఏ రీత్యా చూసినా చెరువుల నిర్మాణంపై ప్రభుత్వం తన దృష్టిని కేంద్రీకరించడం అవసరం. చెరువుల నిర్వహణ, దాని పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా పర్యవేక్షణ కమిటీలను వేయాలి.

నిధుల సేకరణ కోసం రైతులపై ఆధారపడకుండా ఆ బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలి. నిధులను నిర్దేశించిన ప్రణాళిక మేరకు సకాలంలో ఖర్చుచేసే బాధ్యతను జిల్లా, నీటియాజమాన్య సంస్థ, చిన్ననీటి పారుదల శాఖ అధికారులు అత్యంత సమన్వయంతో నిర్వహించాలి. ప్రభుత్వం 2005లో తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టం పరిధిలో చేపట్టే పనుల్లో భూగర్భ జలాల సంరక్షణ ఓ ప్రధాన లక్ష్యంగా ఉంది. ఈ నేపథ్యంలో పూడికతీత, కట్టల బలోపేతం వంటి పనులనూ ఉపాధి హామీ చట్టం పరిధిలో చేరిస్తే మేలు జరుగుతుంది. పైగా స్థానిక కూలీలకు ఉపాధి దొరుకుతుంది. భూగర్భ జలాల సంరక్షణలో భాగంగా నీటి యాజమాన్య సంస్థ ఇప్పటికే కుంటల నిర్మాణం చేపడుతోంది. కానీ అది ఏ మాత్రం ఫలప్రదంగా లేదు. ఏటా వీటి కోసం కోట్లు వెచ్చిస్తున్నా ప్రయోజనం నెరవేరడం లేదు. ఈ పనిని మరింత పకడ్బందీగా, ఫలప్రదంగా చేపట్టి, పర్యవేక్షణ పెంచాలి. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాధాన్యాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది. 'ఆ... చిన్ననీటి వనరులే కదా...' అని చిన్నచూపు చూస్తే భావి తరాలకు సాగునీరే కాదు... తాగునీరూ దొరకని ప్రమాదం ఎదురవుతుంది. కొత్త ప్రభుత్వం వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని భవిష్యత్ తరాలను కాపాడవలసిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యాసకర్త నార్త్ తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం, ఫౌండర్ చైర్మన్ I 85010 61659

గమ్యాన్ని చేరాలంటే...

నేను ఇంతగా ధ్యానం చేసినప్పటికీ, ఎందుకు మంచి ఫలితాలు రావటం లేదు? సద్గురువు ఉన్నప్పటికీ నా మనస్సులో చెడు విచారాలు ఎలా కలుగుతున్నాయి?– ఇటువంటి ప్రశ్నలను చాలా మంది సాధకులు లేదా భక్తులు ఎదుర్కొంటూ ఉంటారు. అందువలన వారి మనశ్శాంతి భంగపడుతుంది. ఆ విధమైన ఆలోచనలకు ప్రాధాన్యం ఇవ్వకూడదు. మనస్సును నిర్బంధించవలసిన అవసరం లేదు. అన్నిరకాలైన ఆలోచనలను రేకెత్తించడమే మనసు ప్రకృతి. 'తొందర పడకే మనసా!' అని హెచ్చరిస్తూ ఉండాలి.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

రైలులో ప్రయాణాన్ని ఉదాహరణగా తీసుకొందాం. రైలుబండికి తనయందు ఏవిధమైన ప్రయాణికులు కూర్చొన్నదీ, ఏ యే స్టేషన్లను దాటి వెళుతున్నదీ అనే విషయాలతో సంబంధం లేదు. డ్రైవర్ నడిపినట్లు నడిచి గమ్యస్థానాన్ని చేరుతుంది. రైలు మాదిరిగా నీవు కూడా నీ గమ్యస్థానాన్ని చేరుటయే జీవిత ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలి. నీ ప్రయాణంలో విశ్వాసం కోల్పోకుండా మనస్సు ఆడుకొనే ఆటలతో భంగపాటు చెందకుండా ఉండాలి. దిగవలసిన స్టేషన్ వచ్చేవరకూ రైలులోనే ఓపికగా, నమ్మకంతో కూర్చొని ఉన్నట్లు... జీవిత ప్రయాణంలో సహనంతో, విశ్వాసంతో స్థిమితంగా ఉండాలి. గురువు అనే డ్రైవరు నీ జీవిత ప్రయాణంలో నిన్ను గమ్యస్థానానికి నిక్షేపంగా చేరవేయగలడు. మానవుడు జీవితంలో అనేక సమస్యలు ఎదుర్కొనవలసి ఉంటుంది. మనస్సు సమతాస్థితిలో ఉన్నప్పుడు, వివేకంతో సమస్యలనన్నింటినీ బహిర్గతం చేస్తుంది. మంద బుద్ధికి ఈ సమస్యలకు అంతమే లభించదు. పైపైన తేలికగా కనబడే సమస్యలన్నీ వట్టి భ్రాంతి మాత్రమే. సుఖ, దుఃఖాలు మానవుని స్వాధీనంలో ఉండేవే. తాళం చెవిని కుడివైపునకు తిప్పితే తాళం తెరచుకొంటుంది. కాని ఎడమవైపునకు తిప్పితే తాళం మూసుకొంటుంది. ఎటు తిప్పాలనేది నీ చేతుల్లో ఉండే వ్యవహారమే కదా! నీవు ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకొని, భగవన్నామ సంకీర్తన చేస్తూ... ఆధ్యాత్మిక కార్యక్రమాల పైనే నిమగ్నుడవై ఉన్నట్లయితే సరియైన దృక్పథం వృద్ధి చెందుతుంది. అందువలన ప్రశాంతంగా ఉండగలవు.

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.తదియ తె.4.18 (తెల్లవారితే శుక్రవారం), తదుపరి చవితి, **నక్షత్రం:** ఆశ్లేష ప.12.05 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.12.47 నుండి 2.27 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.21 నుండి 11.09 వరకు, తదుపరి ప.2.49 నుండి 3.37 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.22 నుండి 12.01 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.39, **సూర్యాస్తమయం:** 5.41.

హైదరాబాద్‌లో 'ఫాస్ట్ ట్రాక్ ఇమిగ్రేషన్' సేవలు

- నేడు అహ్మదాబాద్ నుంచి ప్రారంభించనున్న కేంద్ర హోంమంత్రి


సాక్షి, న్యూఢిల్లీ: విదేశాలకు వెళ్లే ప్రయాణికులకు త్వరితగతిన ఇమిగ్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఫాస్ట్ ట్రాక్ ఇమిగ్రేషన్–ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగ్రామ్'(ఎఫ్‌టీఐ–టీటీపీ) సేవలను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ నిర్ణయంతో ప్రయాణికులకు విమానాశ్రయాల్లో ఇమిగ్రేషన్ ప్రక్రియ కోసం బారులుతీరే కష్టాలు తప్పనున్నాయి. దేశవ్యాప్తంగా ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, కొచ్చి, అహ్మదాబాద్‌లతో పాటు హైదరాబాద్‌లోనూ ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయని కేంద్ర హోంశాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. గురువారం ఈసేవలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి ప్రారంభించనున్నారు. 'వికసిత్ భారత్–2047'లో భాగంగా ఎఫ్‌టీఐ–టీటీపీ కార్యక్రమాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు హోంశాఖ పేర్కొంది. దేశవ్యాప్తంగా 21 విమానాశ్రయాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకువస్తుండగా.. మొదటి విడతలో ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, కొచ్చి, అహ్మదాబాద్‌లతో పాటు హైదరాబాద్‌లో ప్రారంభిస్తున్నారు. త్వరితగతిన ఇమిగ్రేషన్ ప్రక్రియను పూర్తి చేయడమే తమ లక్ష్యమని హోంశాఖ తెలిపింది.

పసుపు రైతులకు పనిముట్లు రాయితీపై ఇవ్వాలి

- మంత్రి తుమ్మలకు రైతు కమిషన్ లేఖ

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా పసుపు పండించే రైతులకు పనిముట్లను రాయితీపై అందించాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు బుధవారం లేఖ రాశారు. పసుపు పంట అత్యధికంగా సాగయ్యే నిజామాబాద్ జిల్లాలో పాత పద్ధతుల్లో సాగు చేయడం వల్ల కూలీల కొరత, అధునాతన యంత్రాలులేక రైతులు నష్టపోతున్నారన్నారు. పసుపును భూమిలో నుంచి తీయడానికి, మొక్కనుంచి పసుపు వేరు చేయడానికి, ఆరబోయడానికి కళ్లాలు, పాలిష్ యంత్రాలు లేక తగిన మోతాదులో పసుపును పాలిష్ చేయడం లేదన్నారు. 2007–08లో అప్పటి వై.ఎస్. ప్రభుత్వం 40 ఎకరాలను పసుపు పరిశోధనకు కేటాయించిందని, అప్పుడే నిజామాబాద్ జిల్లాలో పసుపుబోర్డు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. ఈనెల 9న రైతు కమిషన్ నిజామాబాద్‌లో పర్యటించినప్పుడు రైతులు తమ బాధలు తెలిపారని ఆయన చెప్పారు.

10 కిలోమీటర్లు.. 32 నిమిషాలు



- రద్దీ వేళల్లో హైదరాబాద్ రోడ్లపై ప్రయాణానికి పట్టే సమయం ఇది
- లెక్కకట్టిన అంతర్జాతీయ సంస్థ టామ్‌టామ్
- ప్రపంచవ్యాప్తంగా 62 దేశాలో సర్వే
- హైదరాబాద్‌కు వరల్డ్‌లో 18...దేశంలో 4వ ర్యాంక్

సాక్షి, హైదరాబాద్: రద్దీ వేళల్లో హైదరాబాద్ రోడ్లపై ఓ వాహనం 10 కిలోమీటర్లు వెళ్లాలంటే.. సరాసరిన 32 నిమిషాలు పడుతోంది. అంతర్జాతీయ సంస్థ టామ్‌టామ్ ఈ విషయం ప్రకటించింది. ఈ సంస్థ స్లో మూవింగ్ ట్రాఫిక్ ఇండెక్స్ (14వ ఎడిషన్) పేరుతో సోమవారం ఓ జాబితాను విడుదల చేసింది. ఆయా నగరాలకు ర్యాంకింగ్స్ ఇవ్వగా, హైదరాబాద్‌కు జాతీయస్థాయిలో నాలుగో ర్యాంక్, అంతర్జాతీయ స్థాయిలో 18వ ర్యాంక్ దక్కింది.

62 దేశాలో సర్వే

ఆసియా, యూరప్, సౌత్ అమెరికా, నార్త్ అమెరికా, ఆస్ట్రేలియా ఖండాల్లోని 62 దేశాల్లో టామ్‌టామ్ సంస్థ సర్వే చేపట్టింది. వీటిలో ఉన్న నగరాలను 3 కేటగిరీలుగా విభజించింది.

- 80 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న వాటిని మెగా సిటీలు, 80 లక్షల కంటే తక్కువ జనాభా ఉన్న వాటిని లార్జ్ సిటీ, 8 లక్షలు అంత కంటే తక్కువ జనాభా ఉన్న వాటిని స్మాల్ సిటీలుగా విభజించి సర్వే చేపట్టింది.
- ప్రభుత్వ, ప్రైవేట్ విభాగాల నుంచి సమాచారం సేకరించిన టామ్‌టామ్ దాన్ని క్షేత్రస్థాయిలో విశ్లేషించింది. ఆయా నగరాల జనాభా, అక్కడ ఉన్న వాహనాల సంఖ్య, రోడ్ల శాతం, ట్రాఫిక్ సిబ్బంది తదితరాలను పరిగణనలోకి తీసుకుని విశ్లేషించింది.

అప్పుడు.. ఇప్పుడూ అంతే..

టామ్‌టామ్ సంస్థ సర్వే ప్రకారం హైదరాబాద్‌లో రద్దీ వేళల్లో 10 కి.మీ ప్రయాణించడానికి 32 నిమిషాల సమయం పడుతోంది. గత ఏడాది నిర్వహించిన సర్వేలోనూ ఇదే నమోదైంది. ఏ దాది కాలంలో పెరిగిన వాహనాలకు తగ్గట్టు ప్రభుత్వ విభాగాలు అభివృద్ధి చర్యలు తీసుకోని కారణంగానే ఎలాంటి మార్పు లేదని తెలుస్తోంది. ఆసియాలో ఉన్న ఇతర నగరాల్లోనూ ఈ సమయం పెద్దగా తగ్గడం, పెరగడం నమోదు కాలేదు. ట్రాఫిక్ రద్దీ, రోజూ గంటల తరబడి రోడ్లపై గడపటం వల్ల ప్రతి ఒక్కరూ విలువైన పని గంటల్ని నష్టపోతున్నారని టామ్‌టామ్ తేల్చింది.

పసుపు రైతు కల సాకారం

▶ మొదటి పేజీ తరువాయి

పీయూష్ గోయల్‌కు ఎంపీ అర్వింద్ కృతజ్ఞతలు తెలిపి, పసుపు కొమ్ముల దండను బహూకరించారు. నిజామాబాద్‌లోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన వర్చువల్ కార్యక్రమంలో జిల్లాకు బీజేపీ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

పసుపు ఉత్పత్తులు పెరుగుతాయి: గోయల్

సుగంధ ద్రవ్యాల బోర్డు నుంచి పసుపును ప్రత్యేక బోర్డుగా ఏర్పాటు చేయడంతో పసుపు, పసుపు ఉత్పత్తులు బాగా పెరుగుతాయని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. బోర్డును నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేయాలని ఎంపీ అర్వింద్ ప్రధాని మోదీని సైతం ఒప్పించారని అభినందించారు.

ప్రధాని మాట ఇస్తే నెరవేరుస్తారు: బండి సంజయ్

ప్రధాని నరేంద్రమోదీ వాగ్దానం ఇస్తే ఖచ్చితంగా అమలు చేసి తీరుతారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు కోసం ఎంపీ అర్వింద్ కొన్నేళ్లుగా శ్రమించి విజయం సాధించారని ప్రశంసించారు. ఆయన కరీంనగర్ నుంచి ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్నారు.

ప్రజలు రుణపడి ఉంటారు: ఎంపీ అర్వింద్

ఇందూరులో పసుపు బోర్డు ఏర్పాటు జిల్లా రైతుల దశాబ్దాల కల అని ఎంపీ అర్వింద్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చానని తెలిపారు. తెలంగాణ రైతులు ప్రధాని మోదీని జీవితాంతం గుర్తుపెట్టుకుంటారని పేర్కొన్నారు. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన తనను జాతీయ పసుపు బోర్డు తొలి చైర్మన్‌గా నియమించడం తన అదృష్టమని బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. తనకు ఇచ్చిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తానని తెలిపారు. నిజామాబాద్‌లో వర్చువల్ కార్యక్రమంలో పల్లె గంగారెడ్డితో పాటు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు అంతర్జాతీయ ఖ్యాతి: పసుపు బోర్డు ఏర్పాటుతో నిజామాబాద్ జిల్లాకు అంతర్జాతీయ ఖ్యాతి దక్కింది. గుంటూరులో పొగాకు బోర్డు, కేరళలోని కొచ్చిలో స్పైసెస్ బోర్డు ఉంది. ఇప్పుడు పసుపు బోర్డును నిజామాబాద్‌లో ఏర్పాటు చేశారు. ప్రపంచంలో పండించే మొత్తం పసుపులో మన దేశంలోనే 62% పండుతోంది. మహారాష్ట్ర, తమిళనాడు తర్వాత నిజామాబాద్‌లోనే అత్యధికంగా నాణ్యమైన పసుపు పండిస్తున్నారు.

గుర్రంపోడు పీహెచ్‌సీలో ఎనిమిది మందిపై వేటు

- అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు

గుర్రంపోడు: మూకుమ్మడిగా విధులకు గైర్హాజరైన పీహెచ్‌సీ సిబ్బందిపై ఆగ్రహించిన నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వారిపై సస్పెన్షన్ వేటు వేశారు. బుధవారం మధ్యాహ్నం ఆమె గుర్రంపోడు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఓపీ విభాగంలో ఏఎన్‌ఎం శైలజ మాత్రమే ఉన్నారు. మిగతా సిబ్బంది గురించి ఆమెను కలెక్టర్ ప్రశ్నించారు. ఈ కేంద్రంలో వైద్యాధికారి.. డీఎంహెచ్‌ఓ అనుమతితో సెలవులో ఉండగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, మరో వైద్యాధికారి డిప్యుటేషన్లపై మరోచోట విధులు నిర్వహిస్తున్నారు. మిగతా సిబ్బంది అందరూ ఎలాంటి సమాచారం లేకుండా గైర్హాజరయ్యారు. దీంతో ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన కాంట్రాక్టు ఉద్యోగులు.. ఫార్మసిస్టు శ్యామ్, ల్యాబ్ అసిస్టెంట్ సంధ్య, డేటా ఎంట్రీ ఆపరేటర్ మాధవి, అటెండర్లు శ్రీనివాస్, అరుణ జ్యోతి, ఎల్లమ్మ, రెగ్యులర్ ఉద్యోగులైన అటెండర్ లక్ష్మీనారాయణ, ఫార్మసిస్టు భాగ్యమ్మలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

రాష్ట్రానికి సంక్రాంతి కానుక 'పసుపు బోర్డు'

- బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్
- ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపిన ఎంపీ
- చేతనైతే తుమ్మల చెరుకు ఫ్యాక్టరీలు తెరిపించాలని డిమాండ్
- మంత్రికి వయసు పెరిగినా చిలిపి చేష్టలు పోలేదంటూ ఎద్దేవా



సాక్షి, న్యూఢిల్లీ: పసుపు బోర్డు ఏర్పాటుతో రాష్ట్ర ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ సంక్రాంతి కానుక ఇచ్చారని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. పసుపు బోర్డు నిజామాబాద్‌కు రావడంలో ప్రధాని మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ కృషి చాలా ఉందని అన్నారు. పసుపు పంటపై విశేషమైన అవగాహన ఉన్న పల్లె గంగారెడ్డిని బోర్డు చైర్మన్‌గా నియమించడం సంతోషకరమన్నారు. బోర్డు ప్రారంభం అనంతరం మంగళవారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ, పసుపు బోర్డు వల్ల కేవలం పసుపు రైతులకే లాభం కాకుండా పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్లు, పర్యాటకం, ప్యాకేజీ యూనిట్లు కూడా వస్తాయన్నారు. ఇది బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తుందని అలాగే గల్ఫ్ కార్మికులు స్వదేశానికి తిరిగి వచ్చేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పసుపు బోర్డు చుట్టూ అనేక రాజకీయాలు జరిగాయని, ఈ విషయంలో తనను అనేక రకాలుగా టార్గెట్ చేశారని గుర్తుచేశారు. పసుపు రైతుల ముసుగులో తన ఇళ్లు, వాహనాలపైకి గూండాలను పంపించి దాడులు చేయించారని మండిపడ్డారు. కాగా, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై అర్వింద్ ఘాటుగా విమర్శలు చేశారు. తమ ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాయడం వల్లే పసుపు బోర్డు కార్యాలయం తెలంగాణలో ఏర్పాటైందని మంత్రి తుమ్మల చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. చేతనైతే మంత్రి చెరుకు ఫ్యాక్టరీలను తెరిపించాలని డిమాండ్ చేశారు. తుమ్మలకు వయసు పెరిగినా చిలిపి చేష్టలు మాత్రం పోలేదంటూ ఎద్దేవా చేశారు. ఆయన ఏ పార్టీలో ఉన్నారో ఆయనకైనా తెలుసా..? అని ప్రశ్నించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మినీ కేసీఆర్‌లని ధ్వజమెత్తారు. వీళ్లు కేవలం సొంత ఫామ్‌హౌస్‌లలోనే వ్యవసాయం చేస్తారంటూ విమర్శించారు.

అధమ భాష సభ్యత అనిపించుకోదు

- ఎంపీ అర్వింద్‌పై మంత్రి తుమ్మల ఫైర్
- పసుపు బోర్డు కోసం కేంద్రంపై తాను ఒత్తిడి తెచ్చినట్లు వెల్లడి




సాక్షి, హైదరాబాద్: నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సందర్భంగా ఎంపీ ధర్మపురి అర్వింద్ తన రాజకీయ జీవితం గురించి చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. అర్వింద్ అనుచిత వ్యాఖ్యలు తీవ్ర ఆక్షేపణీయమని పేర్కొన్నారు. పసుపు బోర్డు ప్రకటించిన సందర్భంగా ప్రధానమంత్రికి ధన్యవాదాలు తెలిపితే అర్వింద్‌కు ఉన్న అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. వ్యవసాయ శాఖ మంత్రి హోదాలో జాతీయ పసుపు బోర్డు సాధించడం బాధ్యతగా భావించి కేంద్రంపై ఒత్తిడి తెచ్చానని తెలిపారు. రెండు పర్యాయాలు ఎంపీగా ఎన్నికైన అర్వింద్ అధమ భాషను వాడటం సభ్యత అనిపించుకోదంటూ మండిపడ్డారు. పరిపక్వతలేని మాటలు మాట్లాడకుండా, కొద్దిగా సహనంతో, రాజకీయ పరిజ్ఞానంతో మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. ఈ మేరకు అర్వింద్‌కు బుధవారం బహిరంగ లేఖ రాశారు.

ఏనాడూ ఎవరి వద్దా మోకరిల్లలేదు

తాను 1983 నుంచి రాజకీయాల్లో ఉన్నానని, పదవులు, పార్టీ టికెట్ల కోసం ఏనాడూ ఏ రాజకీయ నాయకుడి వద్ద మోకరిల్లలేదని, ఆత్మ గౌరవాన్ని అమ్ముకోలేదని తుమ్మల పేర్కొన్నారు. ఎన్టీఆర్ నుంచి రేవంత్‌రెడ్డి వరకు ఏ సీఎం దగ్గర మంత్రిగా పనిచేసినా రాష్ట్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం తప్ప తనకు మరో ఎజెండా లేదని అన్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఉమ్మడి రాష్ట్రంలోనైనా, తెలంగాణలోనైనా ఏ మూలకు వెళ్లినా అభివృద్ధిలో తన గుర్తులు కనిపిస్తాయన్నారు.

నూతన వంగడాలు, సాగులో మెళకువలు

- పసుపు బోర్డుతో విస్తృత లాభాలు
- ఎగుమతులతో పరిశ్రమలకు ప్రోత్సాహం
- వ్యవసాయ కూలీలకు చేతినిండా పని
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలూ పెరుగుతాయి
- 'సాక్షి'తో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి



మోర్తాడ్: నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు వల్ల రైతులకు విస్తృత సౌకర్యాలు, సేవలు అందుబాటులోకి వస్తాయని జాతీయ పసుపు బోర్డు తొలి చైర్మన్ పల్లె గంగారెడ్డి తెలిపారు. పసుపు బోర్డు ప్రయోజనాల గురించి ఆయన 'సాక్షి'కి వివరించారు.

ప్రశ్న: పసుపుబోర్డుతో ఎలాంటి ప్రయోజనాలు చేకూరనున్నాయి?

జవాబు: పసుపు బోర్డుతో రైతులకు నూతన వంగడాలు, పంటసాగులో కొత్త పద్ధతులు, యాంత్రీకరణ లాంటి ఎన్నో సౌకర్యాలు సమకూరనున్నాయి. గతంలో పసుపును సుగంధ ద్రవ్యాల బోర్డు కిందనే పరిగణించారు. దీని వల్ల పసుపు సాగుచేసే రైతులకు ప్రత్యేక ప్రయోజనాలు దక్కలేవు.

ప్రశ్న: నిజామాబాద్ జిల్లాలోనే బోర్డు ఏర్పాటుకు ప్రాధాన్యత ఏమిటి?

జవాబు: 20 రాష్ట్రాల్లో పసుపు సాగవుతోంది. అయినా దేశం మొత్తం ఉత్పత్తిలో 25 శాతం పసుపు నిజామాబాద్, దాని చుట్టుపక్కల జిల్లాల నుంచే వస్తోంది. అందువల్లే ఇక్కడ పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునేలా ఎంపీ అర్వింద్ ఎంతో కృషి చేశారు. నిజామాబాద్ పసుపునకు విదేశాల్లోనూ డిమాండ్ ఉండడమే ఇక్కడ పసుపుబోర్డు ఏర్పాటు చేయటానికి ప్రత్యేక కారణం.

ప్రశ్న: పసుపుబోర్డుతో ఎగుమతులు పెరుగుతాయా?

జవాబు: పసుపుబోర్డు ఏర్పాటుతో రైతులకు ఎన్నో ప్రోత్సాహకాలు అందుతాయి. దీంతో రైతులు ఎగుమతుల కోసం నాణ్యమైన పసుపు పండిస్తారు. కర్క్యూమిన్ శాతం ఎక్కువ ఉండే పసుపును ఉత్పత్తి చేస్తే ఎగుమతులు పెరిగి రైతులకు మంచి ధర లభిస్తుంది.

ప్రశ్న: పసుపుబోర్డు విధి విధానాలు ఎలా ఉంటాయి?

జవాబు: త్వరలోనే పసుపుబోర్డు విధి విధానాలు ఖరారవుతాయి. వంద శాతం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వాటిని ఖరారు చేస్తాం. రైతు బిడ్డను అయిన నన్ను చైర్మన్‌గా ఎంపిక చేయడంతోనే బోర్డు ద్వారా రైతులకు ఎలాంటి లాభాలు చేకూరుతాయో స్పష్టమవుతోంది. ఈ బోర్డులో ఐఏఎస్ అధికారులు, శాస్త్రవేత్తలు, పసుపు రైతులు, పసుపు కొనుగోలు చేసే వ్యాపారులు, ఇతరులు సభ్యులుగా ఉంటారు. అందరూ కలిసి సముచిత నిర్ణయాలు తీసుకుంటారు. పసుపు బోర్డు ఏర్పాటుచేసినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, ఎంపీ అర్వింద్‌కు కృతజ్ఞతలు.

ప్రశ్న: నిజామాబాద్ జిల్లాకు ఎలాంటి ప్రయోజనాలు కలగనున్నాయి?

జవాబు: పసుపు బోర్డు నిజామాబాద్‌లో ఏర్పాటు చేయటంతో ఎగుమతులు పెరిగి ఈ ప్రాంతంలో పసుపు ఉత్పత్తికి ఎంతో ప్రోత్సాహం లభిస్తుంది. పసుపు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటై ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఎగుమతులతో రవాణా రంగం వృద్ధి చెందుతుంది. వ్యవసాయ కూలీలకు చేతినిండా పని లభిస్తుంది.

మంటల్లో కాలిపోయిన తీర్థయాత్ర బస్సు

- నిర్మల్ జిల్లా వాసి సజీవ దహనం
- మిగతా యాత్రికులు క్షేమం
- యూపీలోని బృందావన్‌లో ఘటన


మంటల్లో కాలుతున్న బస్సు


శిల్యం దుర్పతి

భైంసా/కుభీర్: తీర్థయాత్రవిషాదయాత్రగా మారింది. అగ్నిప్రమాదంలో బస్సు దగ్ధం కావడంతో నిర్మల్ జిల్లా వాసి సజీవ దహనమయ్యారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బృందావన్‌లో మంగళవారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. నిర్మల్ జిల్లాకు చెందిన 54 మంది ఈ నెల ఒకటిన బస్సులో తీర్థయాత్రలకు బయల్దేరి వెళ్లారు. కుభీర్ మండలం పల్సి గ్రామానికి చెందిన శిల్యం దుర్పతి కూడా తన భార్య ఎల్లుబాయితో కలసి ఈ బృందంలో వెళ్లారు. కాగా, మంగళవారం రాత్రి యూపీలోని బృందావన్‌లో యాత్రికులు తమ బస్సు నిలిపి స్థానిక ఆలయాల దర్శనానికి వెళ్లారు. అనారోగ్యం కారణంగా శిల్యం దుర్పతి బస్సులోనే ఉండిపోయారు. అదే సమయంలో బస్సులో మంటలు చెలరేగాయి. నిమిషాల్లోనే బస్సు కాలిపోయింది. దీంతో బస్సులో ఉన్న దుర్పతి (70) సజీవ దహనమయ్యారు. మిగతా యాత్రికులను అక్కడి అధికారులు రెండు బస్సుల్లో భైంసాకు పంపించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి అగ్నిప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు.

హాకర్స్‌ను అసంఘటిత కార్మికులుగా గుర్తించాలి

- ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

కుషాయిగూడ (హైదరాబాద్): న్యూస్‌పేపర్ హాకర్స్‌ను అసంఘటిత కార్మికులుగా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ కలర్స్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం తెలంగాణ ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ 2వ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ మహాసభల్లో ప్రధానంగా హాకర్స్‌ను అసంఘటిత కార్మికులుగా గుర్తించాలని తీర్మానం చేసి లేబర్ కమిషనర్‌కు అందజేయాలని ఆయన సూచించారు. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ సాయం అందేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. చైతన్యవంతంగా పనిచేసినప్పుడే ఫలాలు సొంతమవుతాయని, ఆ దిశగా హాకర్స్ ముందుకు సాగాలని సూచించారు. ఆటో కార్మికులు, జర్నలిస్టులను గత ప్రభుత్వం అసంఘటిత కార్మికులుగా గుర్తించిందని, ప్రస్తుత ప్రభుత్వం దానిని అమలు చేస్తోందన్నారు. అనంతరం అసోసియేషన్ బాధ్యులు తమ సమస్యలపై శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల సత్యం, ప్రధాన కార్యదర్శి కూడలి రాంప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ద.కొరియా అధ్యక్షుడి అరెస్ట్

బారికేడ్లు దాటొచ్చి.. ముళ్ల కంచెలు కత్తిరించి ఎట్టకేలకు అరెస్ట్‌చేసిన అధికారులు

- ఇప్పటికే అభిశంసనకు గురై అధికారాలను కోల్పోయిన యూన్ సుక్ యోల్

సియోల్: ప్రజాపాలనకు వ్యతిరేకంగా డిసెంబర్‌లో అత్యయిక స్థితి(మార్షల్ లా) విధించిన దక్షిణకొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను దర్యాప్తు అధికారులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. దీంతో కొద్దిరోజులుగా యూన్ అరెస్ట్ విషయంలో నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. అధ్యక్ష కార్యాలయం భద్రతా సిబ్బంది నుంచి తొలుత తీవ్రస్థాయిలో ప్రతిఘటన ఎదురైనా సరే దర్యాప్తు అధికారులు చిట్టచివరకు అధ్యక్షభవనం లోపలికి వెళ్లి యూన్‌ను అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. తొలుత బుధవారం తెల్లవారుజామున అవినీతినిరోధక దర్యాప్తు అధికారులు, పోలీసులు, సైన్యం సంయుక్తంగా సెంట్రల్‌సియోల్‌లోని అధ్యక్షుడి నివాస భవనానికి చేరుకున్నారు. వీరి రాకను ముందే పసిగట్టిన అధ్యక్షుడి భద్రతాబలగాలు ముందువైపు బస్సులను, చుట్టూతా బ్యారికేడ్లను, ముళ్ల కంచెలను ఏర్పాటుచేశాయి. తొలుత బస్సులను దర్యాప్తు అధికారులు నిచ్చెనల సాయంతో ఎక్కి వాటిని దాటేశారు. తర్వాత గోడలను ఇలాగే నిచ్చెనల సాయంతో ఎక్కిదిగారు. అడ్డుగా ఉంచిన పెద్ద బ్యారికేడ్లనూ ఇలాగే దాటేశారు. తర్వాత ముళ్ల కంచెలను కత్తిరించి ముందుకుసాగారు. ఇలా దాదాపు 1,000 మందితో కూడిన బృందం ముందుకు దూసుకువచ్చినా భద్రతాబలగాలు అడ్డుపడి ఈ బృందాన్ని ముందుకెళ్లకుండా నిలువరించాయి. దీంతో అధ్యక్షభవన బలగాలకు, దర్యాప్తు బలగాలకు మధ్య కొద్దిసేపు ఘర్షణ జరిగింది. ఎట్టకేలకు దర్యాప్తు బృందం ఎలాగోలా నివాసంలో లోపలికి వెళ్లి అధ్యక్షుడిని అరెస్ట్‌చేసింది.


దక్షిణకొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను అరెస్ట్ చేసి కారులో తీసుకెళ్తున్న దృశ్యం

ముందు జాగ్రత్తగా ఇంకో దర్యాప్తు బృందం అధ్యక్షభవనం వెనుకవైపు ఉన్న ఎత్తయిన ప్రదేశాన్ని ట్రెక్కింగ్‌తరహాలో ఎక్కి వచ్చింది. మార్షల్‌లా కారణంగా దేశంలో అస్థిరతకు కారణమయ్యారంటూ యూన్‌పై విపక్షాలు పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టి నెగ్గించుకోవడం తెల్సిందే. అభిశంసన నేపథ్యంలో ఆయన తన అధికారాలను కోల్పోవాల్సి వచ్చింది. తర్వాత ఎన్నికైన తాత్కాలిక అధ్యక్షుడినీ విపక్షాలు అభిశంసించాయి. మార్షల్ లా విధించడానికి గల కారణాలపై సంజాయిషీ ఇచ్చుకునేందుకు దర్యాప్తు అధికారులు యూన్‌కు అవకాశం ఇవ్వడం ఆయన స్పందించకపోవడంతో అరెస్ట్‌కు కోర్టు నుంచి గతంలోనే అనుమతి తెచ్చుకున్నారు. ఇటీవల అరెస్ట్‌కు ప్రయత్నించి విఫలమైన దర్యాప్తు అధికారులు బుధవారం మరోసారి ప్రయత్నించి సఫలమయ్యారు. ''చట్టబద్ధపాలన దేశంలో కుప్పకూలింది'' అని అరెస్ట్‌కు ముందు రికార్డ్ చేసిన ఒక వీడియో సందేశంలో అధ్యక్షుడు యూన్ వ్యాఖ్యానించారు. పదవిలో ఉండి అరెస్ట్ అయిన తొలి దక్షిణకొరియా అధ్యక్షుడిగా యూన్ చరిత్రలో నిలిచిపోయారు. వచ్చే కొన్ని వారాలపాటు ఆయన కస్టడీలనే ఉండిపోనున్నారు. దేశంలో తిరుగుబాటు తెచ్చేందుకు ప్రయత్నించారన్న అభియోగాలపై ఆయనను అరెస్ట్‌చేయదలిస్తే 48 గంటల్లోపు ఆమేరకు కోర్టు నుంచి అనుమతి తెచ్చుకోవాలి. లేదంటే ఆయనను మళ్లీ విడుదలచేయాల్సి ఉంటుంది. ఒకవేళ సాధారణ అరెస్ట్‌గా ఆయనను అదుపులోకి తీసుకుని ఉంటే నేరాభియోగాలు మోపేలోపు మరో 20 రోజులపాటు ఆయనను తమ కస్టడీలోనే ఉంచుకోవచ్చు. ఆయన అరెస్ట్‌ను ఆయన తరఫు లాయర్లు తప్పుబట్టారు. దేశద్రోహం సెక్షన్ల కింద నమోదైన కేసులను అవినీతినిరోధక శాఖ అధికారులు దర్యాప్తు చేయలేరని, అరెస్ట్ అన్యాయమని వాదించారు.


జలాంతర్గామి ఐఎన్‌ఎస్ వాఘ్‌షీర్


ఐఎన్‌ఎస్ నీలగిరి


ఐఎన్‌ఎస్ సూరత్

ద్విగుణీకృతమైన సాగర పాటవం

తిరుగులేని శక్తిగా భారత్: ప్రధాని • మూడు యుద్ధనౌకలు జాతికి అంకితం

ముంబై: భారత్ తిరుగులేని సాగరశక్తిగా ఆవిర్భవిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వెలిబుచ్చారు. మన దేశం అంతర్జాతీయంగా అత్యంత విశ్వసనీయ భాగస్వామిగా మారిందని అభిప్రాయపడ్డారు. రెండు యుద్ధ నౌకలు ఐఎన్‌ఎస్ సూరత్, ఐఎన్‌ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్‌ఎస్ వాఘ్‌షీర్‌ను బుధవారం ముంబై నావల్ డాక్ యార్డులో ఆయన జాతికి అంకితం చేశారు. ఆత్మనిర్భర్ భారత్ కింద చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా రక్షణ ఉత్పత్తి, సముద్ర జలాల రక్షణ, ఆర్థిక వృద్ధి వంటి రంగాల్లో భారత్ తిరుగులేని ప్రగతి సాధిస్తోందని ఈ సందర్భంగా అన్నారు. సాగర జలాలను డ్రగ్స్, అక్రమ ఆయుధాలు, ఉగ్రవాదం వంటి జాడ్యాల నుంచి కాపాడేందుకు అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ప్రయత్నాల్లో భారత్ మరింత చురుకైన భాగస్వామిగా మారాలని ఆకాంక్షించారు. ''మూడు యుద్ధనౌకలు ఒకేసారి అందుబాటులోకి రావడం దేశ చరిత్రలో ఇదే ప్రథమం. నౌకా నిర్మాణ వ్యవస్థను బలోపేతం చేస్తుండటమే ఇందుకు కారణం. గత పదేళ్లలో మా హయాంలో 40 నౌకలు సైన్యానికి అందుబాటులోకి వచ్చాయి. వాటిలో ఏకంగా 39 భారత్‌లోనే తయారవడం విశేషం. ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో నావికా దళానికి దేశీయ చిహ్నాలను రూపొందించుకున్నాం. రూ.1.5 లక్షల కోట్లతో మరో 60 యుద్ధ నౌకల నిర్మాణం జరుగుతోంది. సాగరగర్భంలో దాగున్న అపారమైన అవకాశాలను ఒడిసిపట్టే ప్రయత్నమూ జోరుగా సాగుతోంది. మన పరిశోధకులు 6,000 మీటర్ల లోతు దాకా వెళ్లే సముద్రయాన్ ప్రాజెక్టు ఊపందుకుంది'' అని వివరించారు. ఇండో పసిఫిక్ ప్రాంతం భాగస్వామ్య దేశాలన్నింటికీ సమాన స్థాయిలో అందుబాటులో ఉండాలని అభిప్రాయపడ్డారు. రెండు నెలల క్రితం జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని మహాయుతి కూటమి అధికారం నిలబెట్టుకున్నాక మోదీ మహారాష్ట్రలో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా మహాయుతి ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు.


ప్రధాని మోదీ

ఐఎన్‌ఎస్ సూరత్

- ప్రాజెక్ట్ 15బి స్టెల్త్ గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ శ్రేణి ప్రాజెక్టులో నాలుగో, చివరి యుద్ధ నౌక.
- ఇది నౌకాయాన చరిత్రలోనే అత్యంత భారీ, సంక్లిష్ట నిర్మాణంతో కూడిన యుద్ధ నౌక.
- అత్యాధునిక ఆయుధ, సెన్సర్ వ్యవస్థలు, అధునాతన నెట్‌వర్క్ కేంద్రిత యుద్ధ పాటవం దీని సొంతం.
- దీన్ని మజ్‌గావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్) నిర్మించింది.
- 80% దేశీయంగా తయారవడం విశేషం.

ఐఎన్‌ఎస్ నీలగిరి

- ప్రాజెక్ట్ 17ఏ స్టెల్త్ ఫ్రిగేట్ కల్వరీ శ్రేణిలో ప్రధాన యుద్ధనౌక.
- శత్రువును ఏమార్చే అత్యాధునిక స్టెల్త్ టెక్నాలజీ దీని సొంతం.
- గత యుద్ధ నౌకల కంటే అధునాతన రాడార్ టెక్నాలజీ ఉంది.
- ఎండీఎల్, నావికా దళానికి చెందిన వార్‌షిప్ డిజైన్ బ్యూరో దీన్ని సంయుక్తంగా నిర్మించాయి.
- ఐఎన్‌ఎస్ నీలగిరి 75 శాతం దేశీయంగా నిర్మితమైంది.
- ఎంహెచ్-60ఆర్ శ్రేణి హెలికాప్టర్లు కూడా దీన్నుంచి కార్యకలాపాలు సాగించగలిగేలా అధునాతన సౌకర్యాలు, పరిజ్ఞానంతో తీర్చిదిద్దారు.

ఐఎన్‌ఎస్ వాఘ్‌షీర్

- ప్రాజెక్ట్ 75 స్కార్పియన్ శ్రేణిలో ఆరో జలాంతర్గామి.
- దీని నిర్మాణంలో ఫ్రాన్స్‌కు చెందిన నేవల్ గ్రూప్ కూడా పాలుపంచుకుంది.
- యాంటీ సర్ఫేస్, యాంటీ సబ్‌మెరైన్ పోరాటాలు రెండింట్లోనూ ఉపయుక్తంగా ఉండేలా దీన్ని రూపొందించారు.
- నిఘా సమాచార సేకరణలో కూడా ఇది చురుగ్గా పాలుపంచుకోనుంది.
- అత్యాధునిక ఎయిర్-ఇండిపెండెంట్ ప్రొపల్షన్ టెక్నాలజీ దీని సొంతం.
- డీజిల్, విద్యుత్‌తో నడిచే అత్యంత వైవిధ్యమైన, శక్తిమంతమైన, భారీ జలాంతర్గాముల్లో ఇదొకటి.
- దీనిలో అధునాతన సోలార్ వ్యవస్థ, యాంటీ షిప్ మిసైళ్లు, వైర్ గైడెడ్ టార్పెడోలను మోహరించారు.
- భావి సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా అప్‌గ్రేడ్ చేసుకునే వెసులుబాటు.

కల్లోల గాజాలో కాల్పుల విరమణ

ఇజ్రాయెల్, హమాస్ అంగీకారం
- అమెరికా మధ్యవర్తుల వెల్లడి
- పరస్పరం బందీల విడుదల
- గాజాకు అంతర్జాతీయ సాయం

దోహా: యుద్ధం, మానవీయ సంక్షోభంతో 15 నెలలుగా అట్టుడుకుతున్న గాజాకు ఊరట కలిగించే పరిణామం చోటుచేసుకుంది. మరోసారి తాత్కాలికంగా కాల్పుల విరమణకు ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించాయి. ఖతార్ రాజధాని దోహాలో వారాల తరబడి జరిగిన చర్చల అనంతరం బుధవారం ఎట్టకేలకు ఈ మేరకు ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా కనీసం ఆరు వారాలపాటు యుద్ధానికి విరామం ప్రకటిస్తారు. యుద్ధానికి పూర్తిగా తెర దించే దిశగా చర్చలను ముమ్మరం చేస్తారు. అంతేగాక హమాస్ తన వద్ద వంద మంది ఇజ్రాయెల్ బందీల్లో కనీసం 30 మందికి పైగా విడతలవారీగా వదిలేయనుంది. బదులుగా వందలాది మంది పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేస్తుంది. దాంతోపాటు గాజాలో నిర్వాసితులైన వేలాది మంది స్వస్థలాలకు తిరిగి వెళ్లేందుకు అనుమతిస్తుంది. అంతేగాక గాజాకు కొద్ది నెలలుగా పూర్తిగా నిలిపేసిన అంతర్జాతీయ మానవతా సాయాన్ని పూర్తిస్థాయిలో అనుమతిస్తుంది. ఈ మేరకు ఇరు వర్గాలూ అంగీకరించినట్టు చర్చల్లో పాల్గొన్న ముగ్గురు అమెరికా ఉన్నతాధికారులు, హమాస్ ప్రతినిధి తెలిపారు. దీనిపై దోహా త్వరలో అధికారికంగా ప్రకటన చేస్తుందని చెప్పారు. ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం మాత్రం ఒప్పందం విధివిధానాలు ఇంకా ఖరారు కావాల్సి ఉందని చెప్పుకొచ్చింది. ఆ తర్వాత దానికి కేబినెట్ ఆమోదముద్ర పడాల్సి ఉంటుందని పేర్కొంది. తాను ప్రమాణస్వీకారం చేసేలోపే గాజాలో యుద్ధానికి ముగింపు పలకాలంటూ అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హమాస్‌కు ఇటీవలే అల్టిమేటమివ్వడం తెలిసిందే. లేదంటే తీవ్ర చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మరోవైపు గాజాపై మంగళవారం ఇజ్రాయెల్ దాడుల్లో ఇద్దరు మహిళలు, నలుగురు పిల్లలతో సహా 18 మంది మరణించారు.

భారత్‌కు మెటా క్షమాపణలు

వివాదం ఇంతటితో ముగిసిందన్న బీజేపీ

న్యూఢిల్లీ: ఎన్నికలపై ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ చేసిన వ్యాఖ్యల పట్ల భారత్‌కు మెటా సంస్థ క్షమాపణలు చెప్పింది. దీంతో వివాదం ముగిసిందని ఐటీ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ నిషికాంత్ దూబే తెలిపారు. ఇది భారత ప్రజల విజయమన్నారు. మెటా సంస్థ సీఈఓ జుకర్‌బర్గ్ ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ కోవిడ్‌ను ఎదుర్కోవడంలో విఫలమైన అధికార పార్టీలన్నీ 2024 ఎన్నికల్లో ఓడిపోయాయని వ్యాఖ్యానించడం, కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వాటిని ఖండించడం తెలిసిందే. మెటాకు సమన్లు జారీ చేయనున్నట్లు దూబే తెలిపారు. దాంతో మెటా ఇండియా వైస్ ప్రెసిడెంట్ శివ్‌నాథ్ తుక్రాల్ క్షమాపణ చెప్పారు.

నింగిలోకి ప్రపంచంలోనే అత్యంత హైరెజల్యూషన్ స్పెక్ట్రల్ శాటిలైట్లు

బెంగళూరు: ప్రపంచంలోనే అత్యంత హైరెజల్యూషన్ వాణిజ్యపర మూడు హైపర్‌స్పెక్ట్రల్ ఉపగ్రహాలను నింగిలోకి పంపినట్లు బెంగళూరు కేంద్రంగా పనిచేసే అంకుర సంస్థ 'పిక్సెల్' బుధవారం తెలిపింది. అమెరికాలోని కాలిఫోర్నియాలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ ప్రయోగ కేంద్రం నుంచి వీటిని ప్రయోగించినట్లు పేర్కొంది. వాతావరణ మార్పులు, భూమికి సంబంధించిన అత్యంత స్పష్టమైన శాటిలైట్ చిత్రాలను పొందొచ్చని పిక్సెల్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ అవాయిస్ అహ్మద్ చెప్పారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న 30 మీటర్ల హైపర్‌స్పెక్ట్రల్ శాటిలైట్లతో పోలిస్తే ఆరు రెట్లు అత్యంత స్పష్టమైన ఫొటోలను ఈ మూడు ఉపగ్రహాలు ఇస్తాయని తెలిపారు. సంప్రదాయ పద్ధతిలో చూస్తే కనిపించని వస్తువులనూ ఇది ఫొటో తీయగలవు. వాణిజ్య అవసరాలకు వాడే భారత్‌లోని తొలి ఉపగ్రహాల కూటమి ఇదేనని ఆయన ప్రకటించారు.


సంక్రాంతి రోజున పోటెత్తిన భక్త జనం

భక్త జన జాతర

మహా కుంభమేళాకు కొనసాగుతున్న భక్తుల వరద
- మూడు రోజుల్లోనే ఏకంగా ఆరు కోట్లు దాటిన వైనం
- ఒక్క సంక్రాంతి రోజే 3.5 కోట్ల పై చిలుకు
- 29న మౌనీ అమావాస్యకు 10 కోట్ల మంది వస్తారని అంచనా

సాక్షి, న్యూఢిల్లీ: మహా కుంభమేళాకు భక్తుల వరద అంచనాలకు మించుతోంది. మేళాలో పాల్గొని పవిత్ర స్నానాలు చేసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు పోటెత్తుతున్నారు. మంగళవారం ఒక్క రోజే 3.5 కోట్ల మందికి పైగా వచ్చినట్టు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. మకర సంక్రాంతి సందర్భంగా మంగళవారం అఖాడాలు, ఆధ్యాత్మిక పీఠాల అధిపతులు, నానాయుధ ధారులైన నాగా సాధువులు, సంతులు తొలి 'షాహీ స్నాన్ (రాజ స్నానం)లో పాల్గొన్నారు. తెల్లవారుజాము 3 గంటల వేళ శ్రీ పంచాయతీ అఖాడా మహానిర్వాణీ, శ్రీ శంభు పంచయతీ అటల్ అఖాడా సాధువులు త్రివేణి సంగమంలో తొలి స్నానాలు ఆచరించారు. రాష్ట్ర ప్రభుత్వం వారిపై హెలికాప్టర్ నుంచి పుష్ప వర్షం కురిపించింది. ఈ సందర్భంగా డమరుక, శంఖనాదాలతో సంగమ స్థలమంతా ప్రతిధ్వనించింది. ఇక బుధవారం కూడా దాదాపు కోటి మంది దాకా భక్తులు వచ్చినట్టు చెబుతున్నారు. తొలి రోజు సోమవారం 1.65 కోట్లకు పైగా పుష్య పూర్ణిమ స్నానాలు ఆచరించినట్టు వెల్లడించడం తెలిసిందే. తొలి మూడు రోజుల్లో భక్తుల సంఖ్య 6 కోట్లు దాటినట్టు సీఎం యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. అత్యంత కీలకమైన మౌనీ అమావాస్య జనవరి 29న రానుంది. ఆ రోజు భక్తుల సంఖ్య ఏకంగా 10 కోట్లు దాటుతుందని అంచనా! అందుకు ఏర్పాట్లూ చేయాల్సిందిగా సీఎం యోగి ఆదేశించారు.

ఆరోగ్యానికి పెద్దపీట

భక్తులు అసంఖ్యాకంగా వస్తున్నందున వ్యాధులు ప్రబలకుండా యూపీ సర్కార్ అన్ని చర్యలూ తీసుకుంది. 100 పడకలతో 'సెంట్రల్' ఆస్పత్రి ఏర్పాటు చేశారు. ఓపీతో పాటు ఇందులో ఆపరేషన్లు కూడా చేసే వీలుంది. ఇక్కడి మెడికల్ స్టోర్‌లో 276 రకాలకు చెందిన ఏకంగా 107 కోట్ల ట్యాబ్లెట్లున్నాయి! 380 పడకలతో 43 తాత్కాలిక ఆసుపత్రులు, అసంఖ్యాకంగా ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. 14 ఎయిర్ అంబులెన్సులూ అందుబాటులో ఉన్నాయి. 400 మంది వైద్యులు, వెయ్యికి పైగా సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటున్నారు.

లారెన్ పావెల్ కాళీ బీజదీక్ష

యాపిల్ సహ వ్యవస్థాపకుడు దివంగత స్టీవ్ జాబ్స్ భార్య లారెన్ పావెల్ బుధవారం త్రివేణి సంగమ ఘాట్‌లో పవిత్ర స్నానం ఆచరించారు. ''అనంతరం శ్రీ నిరంజనీ పంచాయ్ అఖాడా అధిపతి స్వామీ కైలాసానందగిరి నుంచి ఆమె కాళీ బీజదీక్ష స్వీకరించారు. గురుదక్షిణ కూడా సమర్పించారు'' అని అఖాడా ప్రతినిధి వెల్లడించారు. ఆమె సోమ, మంగళవారాల్లో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. పవిత్ర స్నానం అనంతరం కోలుకున్నట్టు ప్రతినిధి తెలిపారు.

నాగసాధువులతో 'వాక్

బయటి ప్రపంచానికి ఎప్పుడూ మిస్టరీగానే ఉండే నాగ సాధువుల జీవితాలను గురించి తెలుసుకునేందుకు కుంభ మేళా సందర్భంగా యూపీ సర్కారు వీలు కల్పించింది. వారితో 'వాక్ టూర్'ను అందుబాటులోకి తెచ్చింది. ప్యాకేజీని బట్టి రూ.2వేల నుంచి రూ.3,500 దాకా చెల్లిస్తే చాలు, నాగ సాధువులతో వాక్ టూర్ చేయవచ్చు. అఘోరీలు, కల్పవాసీల గురించి కూడా టూర్‌లో తెలుసుకోవచ్చు. ఇందుకోసం 900 మందికి పైగా సుశిక్షిత టూర్ గైడ్‌లు అందుబాటులో ఉన్నారు.

రాజ్యంతోనూ పోరాడుతున్నాం...

- ఆరెస్సెస్ చీఫ్ వ్యాఖ్యలు దేశద్రోహమే: రాహుల్
- దేశ వ్యతిరేకులమని నిరూపించుకున్నారు: బీజేపీ

న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు. దేశంలో ప్రతి వ్యవస్థనూ బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) చెరబట్టాయని మండిపడ్డారు. వాటితో పాటు భారత రాజ్యం (ఇండియన్ స్టేట్) తోనూ తామిప్పుడు పోరాడుతున్నామని చెప్పారు. బుధవారం ఢిల్లీలోని 9ఏ, కోట్ల రోడ్‌లో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ఇందిరాగాంధీ భవన్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడారు. అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠ జరిగిన రోజే దేశానికి నిజమైన స్వాతంత్య్రం వచ్చిందన్న ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. భగవత్ దేశాన్ని భగవత్ అవమానించారు. ఆయన వ్యాఖ్యలు ముమ్మాటికీ దేశద్రోహమే. మరో దేశంలోనైతే ఇలాంటి వ్యాఖ్యలు చేసినవారిని వెంటనే అరెస్టు చేసేవారు. దేశంలో రెండు సిద్ధాంతాల మధ్య యుద్ధం జరుగుతోంది. ఒకటి రాజ్యాంగ సిద్ధాంతం కాగా, మరొకటి ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం. మనకు 1947లో స్వాతంత్య్రం రాలేదనడం ద్వారా దేశ ప్రజలందరినీ భగవత్ అవమానించారు. బ్రిటిష్ పాలకులపై పోరాడిన యోధులను కించపర్చారు. ఇకనైనా పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలి'' అన్నారు. ''సిద్ధాంతాలకు కట్టుబడ్డ పార్టీ కాంగ్రెస్. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్న దుష్టశక్తులను అడ్డుకొనే శక్తి మాకుంది'' అని చెప్పారు.

ఈసీకి అభ్యంతరమెందుకు?

మన ఎన్నికల వ్యవస్థలో ఎన్నో లోపాలు, సమస్యలున్నాయని రాహుల్ ఆక్షేపించారు. ఎన్నికలను పూర్తి పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ''మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే అసెంబ్లీ ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. దీనికి కారణమేమిటో తెలియడం లేదు. ఆ సమాచారం ఇవ్వడానికి ఎన్నికల సంఘానికి అభ్యంతరమేమిటి?'' అని ప్రశ్నించారు. ఆరెస్సెస్‌లో కేంద్రీకృత విధానాలు, నిర్ణయాలు ఉంటాయని విమర్శించారు. ''రాజ్యాంగం చెల్లుబాటు కాదని భగవత్ అంటున్నారు. బీజేపీ, ఆరెస్సెస్ నేతలకు త్రివర్ణ పతాకంపై గౌరవం లేదు. రాజ్యాంగ విలువలపై నమ్మకం లేదు. నానక్, బుద్ధుడు, కృష్ణుడు.. వీళ్లందరి సిద్ధాంతం ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం కాదు. రాజ్యాంగాన్ని కాపాడే ఏకైక పార్టీ కాంగ్రెసే. మా సిద్ధాంతంలో కుల వ్యత్యాసాలు, తరతమ భేదాలుండవు. కాంగ్రెస్ కొత్త కార్యాలయం మా కార్యకర్తల రక్తంతో రూపొందింది. ఇది ప్రతి కార్యకర్తకూ చెందుతుంది. కాంగ్రెస్ సిద్ధాంతానికి ప్రతీకగా నిలుస్తుంది'' అని చెప్పారు.

ఇలా మాట్లాడితే దేశంలో తిరగలేరు: ఖర్గే

ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఖండించారు. ఇలా అనుచితంగా మాట్లాడితే ఇకపై దేశంలో తిరగలేరంటూ హెచ్చరించారు. ''ఆరెస్సెస్ ఏనాడూ స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొనలేదు. 1947లో స్వాతంత్య్రం వచ్చిన సంగతి వారికి తెలియదు'' అని ఎద్దేవా చేశారు. ''స్వాతంత్య్రం కోసం కాంగ్రెస్ నాయకులు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేశారు. జైళ్లకు వెళ్లారు. అందుకే 1947లోనే స్వాతంత్య్రం వచ్చిన సంగతి మాకు తెలుసు'' అన్నారు.



ముసుగు తొలగింది: బీజేపీ

భారత రాజ్యంతోనూ పోరాడుతున్నామన్న రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా మండిపడింది. కాంగ్రెస్ నీచమైన ఆలోచనను ఆ పార్టీ అగ్రనేతే బహిర్గతం చేశారని బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా అన్నారు. ''రాహుల్‌తో పాటు ఆయన పరివారానికి అర్బన్ నక్సలైట్లతో, డీప్ స్టేట్‌తో సన్నిహిత సంబంధాలున్న సంగతి రహస్యమేమీ కాదు. భారత్‌ను విచ్ఛిన్నం చేయడమే డీప్ స్టేట్ లక్ష్యం. దేశాన్ని బలహీనపర్చాలని కోరుకొనే శక్తులను ప్రోత్సహించిన చరిత్ర కాంగ్రెస్‌ది. కాంగ్రెస్ అసలు రూపం రాహుల్ వ్యాఖ్యలతో బయటపడింది. దేశాన్ని, సమాజాన్ని విచ్ఛిన్నం చేయాలన్న కాంగ్రెస్ కుట్రపై ముసుగు తొలగింది. ప్రజలందరికీ తెలిసిన నిజాన్ని స్పష్టంగా బహిర్గతం చేసినందుకు రాహుల్‌ను అభినందిస్తున్నా'' అన్నారు. రాహుల్ ప్రతి మాట, ప్రతి అడుగూ దేశాన్ని విభజించే దిశగానే ఉంటున్నాయని విమర్శించారు. ఎంపీగా రాజ్యాంగంపై ప్రమాణం చేసిన రాహుల్ ఇప్పుడు రాజ్యంపైనే యుద్ధం చేస్తున్నామని చెబుతున్నారంటూ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ దుయ్యబట్టారు. రాహుల్ చేతుల్లో కనిపించేది రాజ్యాంగం కాదా అని ప్రశ్నించారు.

ఇందిరాగాంధీ భవన్ లోపలి దృశ్యాలు | సాక్షి ప్లస్ జాతీయంలో..

దక్షిణాఫ్రికా బంగారు గనిలో 100కు పైగా మృతులు!

- 78 మృతదేహాల వెలికితీత
- సహాయక చర్యల నిలిపివేత

స్టిల్‌ఫొంటెయిన్: దక్షిణాఫ్రికాలో స్టిల్‌ఫొంటెయిన్ పట్టణంలోని బఫెల్స్‌ఫొంటెయిన్ బంగారు గనిలో అక్రమ మైనింగ్ కార్మికులు చిక్కుకుపోయిన ఉదంతంలో మరణాల సంఖ్య మరింత పెరిగింది. 100 మందికిపైగా చనిపోయారని తెలుస్తోంది. మృతదేహాలను మూటగట్టిన ప్లాస్టిక్ సంచులున్న వీడియోను కార్మికులు లోపలి నుంచి విడుదలచేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. గని ముఖద్వారం గుండా వేల అడుగుల లోతుకు బోను లాంటి ఉపకరణాన్ని లోపలికి పంపి 78 మంది కార్మికుల మృతదేహాలను బయటకు తీశారు. 240 మందిని సురక్షితంగా బయటికి తెచ్చినట్టు దక్షిణాఫ్రికా పోలీసులు చెబుతున్నారు. గనిలో ఇంకెవరూ లేరని, కనుక సహాయక చర్యలను నిలిపేస్తున్నామని బుధవారం రాత్రి హఠాత్తుగా ప్రకటించారు. కానీ మరో 500 మంది దాకా కార్మికులు అన్నపానీయాలు లేక గనిలో ఆకలికి అలమటించిపోతున్నారని స్థానిక మీడియాలో అంటోంది.

కెనడా ఓపెన్ వర్క్ పర్మిట్స్ | నిబంధనల సవరణ

భారత విద్యార్థులు, కార్మికులకు లబ్ధి

టోరంటో: కెనడాలో నివసిస్తున్న భారతీయులకు ఒక తీపికబురు. ఓపెన్ వర్క్ పర్మిట్స్(ఓడబ్ల్యూపీ) నిబంధనలను కెనడా ప్రభుత్వం సవరించింది. దీంతో వేలాది మంది భారతీయులకు ప్రయోజనం చేకూరనుంది. కెనడాలో చదువుకుంటున్న విదేశీ విద్యార్థులు, విదేశీ కార్మికుల జీవిత భాగస్వాములకు ఇకపై స్థానికంగా ఉద్యోగాలు చేసుకొనే అవకాశం కల్పించనున్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుంది. కెనడా ప్రధానమంత్రి పదవికి జస్టిన్ ట్రూడో రాజీనామా చేసిన కొద్దిరోజులకే ఓడబ్ల్యూపీ నిబంధనల్లో ప్రభుత్వం సవరణ చేయడం గమనార్హం. అర్హులైన విదేశీ విద్యార్థులు, విదేశీ కార్మికుల జీవిత భాగస్వాములు ఓడబ్ల్యూపీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దీంతో భారతీయులకు అధికంగా మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. వారు తమ భార్య/భర్తను కెనడాకు తీసుకురావొచ్చు. ఉద్యోగాలు ఇప్పించుకోవచ్చు. తద్వారా ఆర్థికంగా ఎంతో వెలుసుబాటు లభించనుంది. కెనడాలోని విదేశీ కార్మికులకు ఇది మరింత ప్రయోజనకరం. అయితే, ప్రస్తుతానికి కొన్ని రకాల కోర్సులు అభ్యసిస్తున్న విదేశీ విద్యార్థులకే ఓడబ్ల్యూపీని పరిమితం చేశారు. 16 నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాల వ్యవధి ఉండే మాస్టర్స్ ప్రోగ్రామ్స్, డాక్టోరల్ ప్రోగ్రామ్స్, కొన్ని ఎంపిక చేసిన ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న విద్యార్థుల జీవిత భాగస్వాములు ఓపెన్ వర్క్ పర్మిట్స్ పొందవచ్చు. అలాగే కార్మికుల కొరత ఉన్న రంగాలు, ప్రభుత్వ ప్రాధాన్యాలతో ముడిపడి ఉన్న రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల జీవిత భాగస్వాములకు ఓపెన్ వర్క్ పర్మిట్స్ జారీ చేస్తారు. భార్య/భర్త ఓడబ్ల్యూపీ కోసం దరఖాస్తు చేసే సమయానికి సదరు కార్మికుడి వర్క్ పర్మిట్ గడువు 16 నెలలకుపైగానే ఉండాలి. ఇదిలా ఉండగా, విదేశీ విద్యార్థులు, విదేశీ కార్మికుల పిల్లలకు ఓపెన్ వర్క్ పర్మిట్స్ ఇవ్వకూడదని కెనడా ప్రభుత్వం నిర్ణయించింది. దేశ ఆర్థిక వ్యవస్థను పునరుత్తేజితం చేయడంతోపాటు లేబర్ మార్కెట్ అవసరాలు తీర్చడానికి కెనడా ప్రభుత్వం ఓడబ్ల్యూపీ నిబంధనల్లో సవరణ చేసింది. కెనడాలోని మొత్తం విదేశీ విద్యార్థుల్లో భారతీయ విద్యార్థులు 35 శాతానికిపైనే ఉంటారు.

కేజ్రీవాల్‌ను విచారించేందుకు ఈడీకి కేంద్రం అనుమతి

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు చిక్కులు మొదలయ్యాయి. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆయనను ఈడీ విచారించేందుకు కేంద్ర హోం శాఖ అనుమతించింది. ఈ కేసులో ఆయన బెయిల్‌పై ఉండటం తెలిసిందే. న్యూఢిల్లీ స్థానం నుంచి పోటీ కూడా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ విచారణకు హోం శాఖ అనుమతి అవసరమైంది. ఇదే కేసులో ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాతో సహా ఇతర ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వ ఉద్యోగుల విచారణకు కూడా అను మతులు లభించినట్టు అధికారులు తెలిపారు. ప్రజాప్రతినిధులను విచారించాలంటే సీబీఐ తరహాలోనే ఈడీ కూడా ప్రత్యేక అనుమతులు తీసుకోవాలని గత నవంబర్‌లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను ఈడీ ఈ మేరకు కోరింది. ఆయన అనుమతించడంతో కేంద్ర హోం శాఖ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

సాక్షి
హైదరాబాద్
గురువారం, 16, జనవరి, 2025



మెట్రో రైలు కైట్..

గరిష్టం/కనిష్టం
28.0/18.0

వాతావరణం

నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు అలుముకుంటుంది. గరిష్టంగా 28, కనిష్టంగా 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.





వినువీధుల్లో ఆనంద లహరి!

ముగిసిన కైట్ ఫెస్టివల్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్వీట్స్, కైట్స్ ఫెస్టివల్ బుధవారం ఘనంగా ముగిసింది. మూడు రోజుల్లో సుమారు 15 లక్షల మంది సందర్శించినట్లు అంచనా. ఇండోనేషియా, స్వీడన్, ఆస్ట్రేలియా, కెనడా, శ్రీలంక, కాంబోడియా, థాయ్‌లాండ్, సౌత్ కొరియా, జపాన్, ఫిలిప్పీన్స్, వియత్నాం, మలేసియా, ఇటలీ, ట్యునీషియా, సౌత్ ఆఫ్రికా, పోలండ్, సింగపూర్, ఉక్రెయిన్, ఫ్రాన్స్ దేశాల నుంచి 47 మంది ఇంటర్నేషనల్ కైట్ ఫ్లయర్స్, 13 రాష్ట్రాలకు చెందిన 50 మంది దేశీయ కైట్ ఫ్లయర్స్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. చిరుత, చింపాంజీ, ఈగల్, పులి, పాము, టెడ్డీ, రోబోట్, సన్‌ఫ్లవర్, డోరేమాన్ చిన్నారులతో పాటు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌ల చేతుల మీదుగా ఈ నెల 13న ప్రారంభమైన కైట్స్, అండ్ స్వీట్స్ ఫెస్టివల్‌ను 14, 15వ తేదీల్లో పలువురు వీవీపీలు సందర్శించారు. సంక్రాంతి రోజు స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొని స్వయంగా పతంగులు ఎగురవేసి సందడి చేశారు. బుధవారం సాయంత్రం ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సింగర్ మంగ్లీ బృందం ఆలపించిన గీతాలు శ్రోతలను అలరించాయి. స్వీట్ ఫెస్టివల్‌లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో 1,200 రకాలకు పైగా మిఠాయిలు ఆహార ప్రియులను చవులూరించాయి. ముగింపు కార్యక్రమంలో పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్, సాంస్కృతిక సారథి వెన్నెల, నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.





యూపీ టు సిటీ

అక్రమంగా ఆయుధాల సరఫరా

- 2 తుపాకులు, తపంచా విక్రయానికి ప్లాన్
- పోలీసులకు చిక్కిన నిందితుడు



సాక్షి, సిటీబ్యూరో: ఉత్తరప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు ఆయుధాలను అక్రమంగా సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడిని రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. 2 తుపాకులు, 10 బుల్లెట్లు, తపంచాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాచకొండ కమిషనర్ జి.సుధీర్ బాబు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన హరేకృష్ణ జాదవ్ 2019లో తన అన్న మురళితో కలిసి హైదరాబాద్‌కు వచ్చాడు. బీబీనగర్‌లోని ఓ కంపెనీలో పనిలో చేరాడు. మూడేళ్ల పాటు పనిచేసిన తర్వాత 2022లో ఉద్యోగాన్ని వదిలేసి సొంతూరు రాంపూర్ బోహాకు వెళ్లిపోయాడు. అక్కడే పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. హరేకృష్ణ స్వగ్రామం బిహార్‌కు సరిహద్దు గ్రామం కావడంతో అక్కడ అక్రమంగా ఆయుధాలు తయారు చేసేవారితో ఇతనికి పరిచయాలు ఏర్పడ్డాయి. వ్యవసాయంలో పెద్దగా సంపాదన లేకపోవడంతో అక్రమంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. తక్కువ ధరకు తుపాకులు కొనుగోలు చేసి, హైదరాబాద్‌లో విక్రయించాలని పథకం వేశాడు. ఈక్రమంలో బిహార్‌లోని షాపూర్ గ్రామానికి చెందిన సంపత్ యాదవ్ నుంచి 3 ఆయుధాలు కొనుగోలు చేశాడు. వీటిని తీసుకొని బుధవారం హైదరాబాద్ వచ్చాడు. జవహర్‌నగర్ ఠాణా పరిధిలోని అంబేద్కర్ నగర్ బస్టాప్ వద్దకు చేరుకున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న భువనగిరి స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ), జవహర్‌నగర్ పోలీసులు హరేకృష్ణ జాదవ్‌ను అరెస్టు చేశారు.

చెత్తను పీల్చే.. 'జటాయు'

చెత్త కుప్పలు తొలగించేందుకు సరికొత్త యంత్రం

- ప్రయోగాత్మకంగా ఒక జోన్‌లో..
- పని తీరు బాగుంటే అదనంగా మరిన్ని అందుబాటులోకి..
- అద్దె ప్రాతిపదికన తీసుకోనున్న జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో మెరుగైన పారిశుద్ధ్యానికి పలు విధాలుగా చర్యలు చేపడుతున్న జీహెచ్ఎంసీ.. వాక్యూమ్ మెషిన్లను వినియోగించేందుకు సిద్ధమవుతోంది. సాధారణ స్వీపింగ్ మెషిన్‌లో దిగువన చీపుర్ల వంటి ఉపకరణాలు రోడ్లను శుభ్రం చేస్తే 'జటాయు సూపర్' అనే వాహనంలో ఉండే గొట్టం మాదిరి ఉపకరణం రోడ్లపై వ్యర్థాలన్నింటిని లాగి వాహనంలో పడవేస్తుంది. గొట్టాన్ని పట్టుకొని పారిశుద్ధ్య కార్మికుడు చెత్త కుప్పల వద్ద ఉంచితే చెత్తను మొత్తం పీల్చుతుంది. కాంటాక్ట్‌లెస్ ఫ్యాన్ టెక్నాలజీతో పని చేసే ఇది త్వరితంగా వ్యర్థాలను శుభ్రం చేయడంతో పాటు ఎలాంటి వాతావరణంలోనైనా వినియోగానికి అనువైనదని అధికారులు చెబుతున్నారు. తొలుత పైలట్ ప్రాజెక్టుగా ఖైరతాబాద్‌జోన్‌లో ఒక మెషిన్‌ను వినియోగించి చూసి, ఫలితాన్ని బట్టి అదనపు మెషిన్లను అందుబాటులోకి తేనున్నట్లు జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్(పారిశుద్ధ్యం) ఎస్. రఘుప్రసాద్ తెలిపారు. ఈ వాహనాన్ని సమకూర్చుకున్న కాంట్రాక్టు ఏజెన్సీ గురువారం దీని పనితీరును ప్రదర్శించనుందన్నారు. పని తీరు బాగుంటే అద్దె ప్రాతిపదికన వినియోగించనున్నారు.



చెత్తను లోపలికి లాగుతున్న పైపు



జటాయు యంత్రంతో కూడిన వాహనం

పారిశుద్ధ్యానికా.. ప్రైవేటు ఏజెన్సీల కోసమా ?

పారిశుద్ధ్యం కోసం కొత్త సాంకేతికతతో కూడిన జటాయు సూపర్‌ను పరిశీలించనున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ, ప్రైవేటు కాంట్రాక్టు ఏజెన్సీల ప్రయోజనం కోసమే వీటిని తెచ్చే యోచన చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే పర్యాటక ప్రాంతాలు, వీవీపీ మార్గాలు పేరిట పారిశుద్ధ్య నిర్వహణకు అంటూ ప్రైవేటు ఏజెన్సీలకు భారీ మొత్తంలో నిధులు ధార పోస్తున్నారనే విమర్శలున్నాయి. ఆ మార్గాల్లో పారిశుద్ధ్యం ఏమాత్రం మెరుగుపడకపోయినా, అదనపు చెల్లింపుల వెనుక ఆమ్యామ్యాలున్నాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ మెషిన్ల పేరిట మరో కొత్త ఎత్తుగడ వేస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి.

జటాయు సూపర్ ఏం చేస్తుంది?

ఇళ్లలోని దుమ్మూ ధూళిని శుభ్రం చేసే వాక్యూమ్ క్లీనర్ లాంటి మెషిన్ జటాయు సూపర్. ఇది రోడ్లపై చెత్తను, చిన్నచిన్న రాళ్లను మాత్రమే కాకుండా గుట్టలుగా పోగుపడ్డ అన్ని రకాల చెత్తను పైపు వంటి ఉపకరణంతో గుంజుకొని శుభ్రం చేస్తుందని అధికారులు చెబుతున్నారు. స్వీపింగ్ మెషిన్ లాంటిదే జటాయు సూపర్ కూడా. ఇందులో ఉండే శక్తిమంతమైన సక్షన్ పంపులు చెత్తను గొట్టంలోకి గుంజుతాయి. ఎప్పుడైనా, ఎక్కడైనా, తడి పొడి చెత్తను సైతం గుంజుతుందని అధికారులు పేర్కొన్నారు. చెత్తలో ఉండే కొబ్బరిచిప్పలు, పగిలిన గ్లాసులు, సీసాలు, ఆకులు, కాగితాల వంటి అన్ని రకాల చెత్తను సక్షన్ పవర్‌తో లాగేస్తుందని తెలిపారు. క్లీన్ చేశాక నేలపై ఎలాంటి చెత్త, రాళ్లవంటివి కూడా కనిపించవు అని చెబుతున్నారు.

పుప్పాలగూడలో జంట హత్యల కలకలం

కత్తులతో పొడిచి.. బండరాళ్లతో మోది ఇద్దరి దారుణ హత్య

- వివాహేతర సంబంధమే ప్రాణాలు తీసిందా?
- నిందితుల కోసం పోలీసుల వేట



బిందు (ఫైల్)



అంకిత్ సాకేత్ (ఫైల్)



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడలో జంట హత్యల ఘటన కలకలం రేపింది. వివాహితను, ఆమె ప్రియుడిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. మంగళవారం గాలిపటాలు ఎగురవేసేందుకు పద్మనాభ స్వామి గుట్టల వైపు వెళ్లిన యువకులకు అక్కడ రెండు మృతదేహాలు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించడంతో జంట హత్యల ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బేమెతరా జిల్లా నమాగఢ్‌కు చెందిన బిందు బింజారె (27)కు, ఇదే రాష్ట్రం ముంగిలి జిల్లా బయక్‌కాంప గ్రామానికి చెందిన వ్యక్తితో పదకొండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. బిందు కుటుంబం బతుకుదెరువు కోసం కొన్నాళ్ల క్రితం నగరానికి వలస వచ్చింది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలోని ఓ విల్లా ప్రాజెక్ట్‌లో మేస్త్రీ, కూలీలుగా భార్యాభర్తలు కొంత కాలం పని చేశారు. అనంతరం వనస్థలిపురం వచ్చారు.

ప్రియుడి మోజులో పడి.. కుటుంబాన్ని వదిలి..

గతంలో శంకర్‌పల్లి సైట్‌లో పని చేసినప్పుడు బిందుకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అంకిత్ సాకేత్ (27)తో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారి తీసింది. ప్రియుడి మోజులో పడిన బిందు తన కుటుంబాన్ని వదిలేసి ఈ నెల 4న అంకిత్ సాకేత్ ఉంటున్న నానక్‌రాంగూడకు వచ్చేసింది. తన వద్దకు వచ్చిన బిందును సాకేత్ తన స్నేహితుల గదిలో ఉంచాడు. ఈ క్రమంలో తన భార్య బిందు కనిపించడం లేదంటూ భర్త ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి అదే రోజు పిల్లలను తీసుకుని స్వస్థలానికి వెళ్లిపోయాడు.

నిర్మానుష్య ప్రదేశంలో శవాలుగా బిందు, అంకిత్ సాకేత్..

నానక్‌రాంగూడలో ఉంటున్న అంకిత్ సాకేత్ కనిపించటం లేదని ఆయన తమ్ముడు గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 8న ఫిర్యాదు చేశాడు. కాగా.. పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలోని నిర్మానుష్య ప్రదేశమైన పద్మనాభస్వామి ఆలయ పరిసరాల్లోని గుట్టల్లో బిందు, సాకేత్ మృతదేహాలు స్థానికులకు కనిపించాయి. గుర్తు తెలియని వ్యక్తులు వీరిని కత్తులతో పొడిచి, ముఖాలు గుర్తించకుండా బండరాళ్లతో మోది దారుణంగా హత్య చేశారు. జంట హత్యలు ఈ నెల 11, 12 తేదీల్లో జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

భిన్న కోణాల్లో విచారణ ముమ్మరం..

జంట హత్యల ఘటనా స్థలాన్ని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, నార్సింగి ఏసీపీ రమణగౌడ్, నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిలు మంగళవారం పరిశీలించారు. క్లూస్, డాగ్ స్క్వాడ్‌లతో వివరాలు సేకరించారు. నిందితుల కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. బిందు, అంకిత్ సాకేత్‌లతో పాటు మరో ముగ్గురు అటుగా వెళ్లినట్టు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు బిందును గదిలో ఉంచిన సాకేత్ మిత్రులా? లేదా గతంలో శంకర్‌పల్లిలో పని చేసిన సమయంలో బిందుతో పాటు పనిచేసిన వారా? లేక ఇతరులెవరైనా వారిని అక్కడ చూసి అఘాయిత్యానికి పాల్పడ్డారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి శరీరంపై దుస్తులు లేకపోవటంతో అత్యాచారం చేసి హతమార్చారా? బిందు, సాకేత్ ఏకాంతంగా ఉన్న సమయంలో హత్య చేశారా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలం సమీపంలో సుమారు 10 ఖాళీ బీరు సీసాలు ఉన్నాయి. మృతదేహాలకు ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

పండగ పూటా ఇదేం పద్ధతి?

- జీహెచ్ఎంసీ అధికారుల తీరుపై పారిశుద్ధ్య కార్మికుల ఆవేదన
- ఓ గంట ముందుగా ఇంటికి వెళ్లనివ్వకపోవడంపై అసహనం

సాక్షి, సిటీబ్యూరో: పండగా.. పబ్బమూ అని లేకుండా కరోనా విపత్కర పరిస్థితులెదురైనా విధులు నిర్వర్తించి నగర ప్రజల ఆరోగ్యం కోసం పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పండగల పూటైనా కనీసం గంట ముందు వెళ్లనివ్వకుండా వ్యవహరిస్తున్న అధికారుల తీరును పలువురు తప్పుపడుతున్నారు. నగరంలో ఒక్కరోజు పారిశుద్ధ్య పనులు జరగకున్నా, ప్రజారోగ్యంపై ప్రభావం పడుతుందని జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు సెలవులివ్వడం లేదు. దీంతో పండగలకు సెలవులు పెట్టకుండానే కార్మికులు పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలందరూ పండగలు చేసుకునే సమయంలో వీరికి కనీసం గంటో, రెండు గంటలో నిర్ణీత వ్యవధి కంటే ముందుగా ఇళ్లకు వెళ్లే సదుపాయం కల్పించాలని కార్మిక సంఘాలు చేసిన విజ్ఞప్తి మేరకు అప్పటి కమిషనర్ ఆమ్రపాలి మినహాయింపునిచ్చారు. రోజూ మాదిరిగా పనిలోకి వచ్చినప్పుడు, తిరిగి వెళ్లేటప్పుడు రెండు పర్యాయాలు 'అటెండెన్స్' బదులు ఒక్కసారి వేస్తే చాలు అని మినహాయింపు ఇచ్చారు. అయితే.. వారు చేయాల్సిన పని మొత్తం పూర్తిచేసి త్వరితంగా వెళ్లిపోవచ్చని స్పష్టం చేశారు. ఎవరైనా వీఐపీల కార్యక్రమాలుంటే తప్ప పండగల సందర్భాల్లో ఒకసారి హాజరు చాలునని సర్క్యులర్ జారీ చేశారు. దసరా పండగ సందర్భంగా దాన్ని వర్తింపజేశారు. సంక్రాంతికి మాత్రం అధికారులు తమను పూర్తి సమయం వరకు ఉండాల్సిందేనని పట్టుబట్టారని, తమకు మాత్రం కుటుంబాలు ఉండవా.. ఊళ్లకు వెళ్లకున్నా కనీసం ఇంటికి త్వరగా వెళ్లి పనులు చేసుకోవద్దా? అని పలువురు మహిళా కార్మికులు వాపోయారు. దీనిపై ఓ అధికారి వివరణనిస్తూ, అప్పట్లో మినహాయింపు ఇచ్చినప్పుడు కేవలం దసరాకు మాత్రమే ఇచ్చారని, ముఖ్యమైన పండగలకు అలాంటి మినహాయింపు ఉంటుందని తెలిపినప్పటికీ, ప్రతి పండగకు ముందస్తుగా విజ్ఞప్తి చేసుకోవాలని సూచించారన్నారు. ప్రతి పెద్ద పండగకూ విజ్ఞప్తి చేసుకోవడమేమిటన్నారు. తాము ఎవరికి విజ్ఞప్తి చేసుకోగలమని, ప్రతిసారీ యూనియన్ నేతలను ఆశ్రయిస్తే, వారు విజ్ఞప్తి చేయాలా? అని పారిశుద్ధ్య కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఎప్పుడైనా పనులు చేసేది తామేనని, అయినా చేయాల్సిన పని మొత్తం పూర్తి చేశాకే కదా ఇళ్లకు వెళ్లేది. పనిలేకున్నా పూర్తి సమయం వరకు ఉండాలనడం ఏం న్యాయం అంటున్నారు. ఇప్పటికైనా ఈ అంశంలో ఉన్నతాధికారులు తగిన నిర్ణయం తీసుకొని, భవిష్యత్‌లోనైనా కనీసం పెద్ద పండగలకైనా ఈ వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు. పారిశుద్ధ్య కార్మికుల్లో దాదాపు 90 శాతం మహిళలే ఉన్నారని తెలిపారు.



సెలవుల్లోనూ సై అన్నారు!

ప్రధాన రహదారులపై రేయింబవళ్లు పనులు

- తాగునీటి డ్రైనేజీ పైపులైన్‌లకు మరమ్మతులు
- విధులు నిర్వర్తించిన జలమండలి ఉద్యోగులు
- అభినందించిన ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్

సాక్షి, సిటీబ్యూరో: పండగ సమయంలోనూ జలమండలి యంత్రాంగం రాత్రింబవళ్లు శ్రమించి నగరంలోని పలు ప్రాంతాల్లో పైపులైన్ల మరమ్మతు పనులు చక్కబెట్టింది. సంక్రాంతి సెలవులతో కొన్ని శాఖల ఉద్యోగులు కుటుంబ సమేతంగా ఊరెళ్లగా.. మరికొందరు ఇంటి పట్టునే ఉండగా.. జలమండలి ఉన్నతాధికారులు, సిబ్బంది మాత్రం తాగునీటి, డ్రైనేజీ పైపులైన్ల మరమ్మతు పనుల్లో నిమగ్నమయ్యారు. సాధారణ రోజుల్లో రద్దీగా ఉండే నగరంలోని ప్రధాన రహదారులపై సంక్రాంతి పండగ సెలవులతో వాహనాల రాకపోకలు తగ్గుముఖం పట్టాయి. దీంతో జలమండలి సిబ్బంది ముందస్తు ప్రణాళికతో పైపులైన్ లీకేజీలు, పైపులైన్ల మార్పిడి పనులు చేపట్టి పలు సమస్యలను పరిష్కరించారు. నగరంలో కేపీహెచ్‌బీ, అమీర్‌పేట, పంజాగుట్ట, మూసాపేట్, బంజారాహిల్స్, జగద్గిరిగుట్ట, ప్రగతినగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై ఏర్పడ్డ లీకేజీలు, సీవరేజ్, ఇతర సమస్యలను రాత్రి, పగలు తేడా లేకుండా పని చేశారు. అవసరమైన చోట్ల పోలీసు, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, ట్రాన్స్‌కో, టీజీఎస్పీడీసీఎల్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు సాగారు.

పనులు ఇలా..

నగరంలో రెండు రోజుల పాటు రాత్రి సమయాల్లోనూ రోడ్ క్రాసింగ్ పనులు నిర్వహించారు. మూసాపేట, కేపీహెచ్‌బీ పరిధిలోని ఫోరం మాల్ సర్కిల్ దగ్గర సీవరేజీ పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. మూసాపేట్‌లోని ఆంజనేయనగర్ లో సీవరేజీ పైపులైన నిర్మాణ పనులు చేశారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్– 10 లో ఏర్పడిన లీకేజీని అరికట్టారు. జగద్గిరిగుట్టలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద లీకేజీని కట్టడి చేశారు. ప్రగతి నగర్‌లో నీటి సరఫరా పెంచడానికి గ్యాప్ క్లోజర్ పనులు నిర్వహించారు. పంజాగుట్ట క్రాస్ రోడ్స్‌లో సీవరేజ్ పైపులైన్ డ్యామేజీ కావడంతో దానికి మరమ్మతులు నిర్వహించారు.



మూసాపేట్‌లో రాత్రి పూట పైపులైన్‌కు మరమ్మతులు

ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ప్రధాన రహదారులపై చేపట్టిన పనులు సంబంధిత సర్కిళ్ల జీఎంలు, సెక్షన్ల మేనేజర్లు పరిశీలించారు. నగరంలోని రోడ్లు ఖాళీగా ఉండటం పనులకు మరింత కలిసి వచ్చినట్లయింది. జలమండలి ఇటీవల ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 90 రోజుల సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌లో కూడా ప్రధాన రహదారులపై అంతగా డీ సిల్టింగ్ ప్రక్రియ కొనసాగలేదు. దీంతో సెలవుల దినాల్లో మరమ్మతు పనులు చేపట్టాలని నిర్ణయించారు. సంక్రాంతి సెలవుల్లో సమస్యలను పరిష్కరించడానికి సరైన సమయమని భావించి మరమ్మతులు చేపట్టారు. సాధారణ సమయంలో ఇలాంటి పనులు నిర్వహిస్తే ప్రజలకు ఇబ్బంది కలిగే అవకాశం ఉండటంతో ఇప్పుడు వాటిని చేపట్టారు. సంక్రాంతి పండగ సమయాల్లోనూ పని చేసిన జలమండలి సిబ్బంది, అధికారులను ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మాయాంక్ మిట్టల్ అభినందించారు.

13 రోజులు.. 5 లక్షల మంది సందర్శకులు

ఎగ్జిబిషన్‌కు సందర్శకులు పోటెత్తారు. బుధవారం నుమాయిష్‌కు దాదాపు 65 వేల మంది వచ్చినట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 3 నుంచి బుధవారం వరకు సుమారు 5 లక్షల మంది సందర్శించినట్లు వివరించారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సందర్శకులందరినీ మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేసి లోపలికి అనుమతిస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా నిఘా ముమ్మరం చేశారు. – అబిడ్స్





వాటర్ అనుకుని యాసిడ్ తాగి వ్యక్తి మృతి

మియాపూర్: వాటర్ బాటిల్ అనుకుని రోడ్డుపై పడి ఉన్న యాసిడ్ తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా, శెట్టి బలిజపేట గ్రామానికి చెందిన రాయుడు వెంకట సత్య సూర్యనారాయణ(41) కుటుంబంతో సహా నగరానికి వలస వచ్చి మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హాఫీజ్‌పేట్ మార్తాండ నగర్ కాలనీలో ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం కూలి పనికి వెళ్లిన రాయుడు వెంకట సత్య సూర్యనారాయణ మధ్యాహ్నం ఇంటికి వస్తుండగా హాఫీజ్‌పేట్ రోడ్డు సమీపంలో రోడ్డుపై పడి ఉన్న బాటిల్ తీసుకుని నీళ్ల అనుకుని యాసిడ్ తాగాడు. ఇంటికి వచ్చిన కొద్ది సేపటికే నోట్లో నుంచి రక్తం రావడంతో కుటుంబ సభ్యులు అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి రాయుడు గోవింద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని యువకుడి దారుణ హత్య

కుషాయిగూడ: గుర్తు తెలియని యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన బుధవారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చర్లపల్లి, పుకట్‌నగర్ దారిలో ఓ యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. సదరు యువకుడిని గుర్తు తెలియని వ్యక్తులు బండరాళ్లతో మోది హత్య చేసినట్లు గుర్తించారు. మృతుడి వయసు 35 ఏళ్లు ఉండవచ్చునని, ఘటనా స్థలం వద్ద అతడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించాయి. మృతుడు జార్ఖండ్, బీహార్ రాష్ట్రాలకు చెందినవాడై ఉండవచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు చర్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

అమీర్‌పేట: ద్విచక్ర వాహనంపై ట్రిబుల్ రైడ్ వచ్చిన యువకులు ముందు వెళ్తున్న బైక్‌ను ఢీ కొనడంతో ఓ విలేకరి తీవ్రంగా గాయపడిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లాకు చెందిన రమేష్ (57) యూసుఫ్‌గూడలో ఉంటూ ఓ దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్నాడు. మంగళవారం అతను తన అల్లుడితో కలిసి వేర్వేరు బైక్‌లపై ఎస్ఆర్‌నగర్‌కు వచ్చారు. ఉమేష్ చంద్ర విగ్రహం నుంచి పాత పోలీస్‌స్టేషన్ వైపు వెళుతుండగా వెనక నుంచి ట్రిబుల్ రైడ్‌తో వేగంగా వచ్చిన యువకులు రమేష్ బైక్‌ను ఢీకొట్టారు. అతను కిందపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని అమీర్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రమేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోటీతత్వంతో ముందుకు సాగాలి

• సీఐఎస్ఎఫ్ డీజీ రజ్వీందర్‌సింగ్ భట్టి • 'నీసా'లో ఘనంగా అసిస్టెంట్ కమాండోల పాసింగ్ అవుట్ పరేడ్

జవహర్‌నగర్: పోటీతత్వంతో ముందుకు సాగితేనే విజయం సాధ్యమని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ రజ్వీందర్‌సింగ్ భట్టి అన్నారు. బుధవారం హకీంపేటలోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (నీసా) దీక్షాంత్ పరేడ్ గ్రౌండ్‌లో 37వ బ్యాచ్‌కు చెందిన 53మంది అసిస్టెంట్ కమాండోలు, 20వ బ్యాచ్‌కు చెందిన 221 మంది కానిస్టేబుళ్లకు పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐఎస్ఎఫ్ డీజీ రజ్వీందర్‌సింగ్ భట్టి పరేడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక కాలంలో పోటీతత్వంతో ముందుకు సాగితే విజయాలు సాధిస్తారన్నారు. దేశ భద్రతలో ధైర్యసాహసాలతో కూడిన సేవలు అందించాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరుతున్నందున పట్టుదలతో దేశ భద్రతకు యువ అసిస్టెంట్ కమాండెంట్స్, కానిస్టేబుళ్లు అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశ సంపద, ప్రజా రక్షణకు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కమాండోలకు అవార్డులతో పాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో నీసా డైరెక్టర్ కె.సునీల్ ఇమాన్యుయేల్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసబాబు, అధికారులు, జవాన్ల తల్లిదండ్రులు, నీసా సిబ్బంది పాల్గొన్నారు.


అసిస్టెంట్ కమాండోలకు అవార్డులు అందజేస్తున్న దృశ్యం


పరేడ్‌ను తిలకిస్తున్న సీఐఎస్ఎఫ్ డీజీ రజ్వీందర్‌సింగ్ భట్టి


అసిస్టెంట్ కమాండోల కవాతు

రైల్వే ట్రాక్‌పై మహిళ ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు


మంగమ్మకు కౌన్సెలింగ్ ఇస్తున్న కానిస్టేబుళ్లు

బాలానగర్: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ మహిళ రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిపై సమాచారం అందడంతో సకాలంలో స్పందించిన బాలానగర్ పోలీసులు ఆమెను రక్షించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజు కాలనీకి చెందిన మంగమ్మ (45) బుధవారం ఫిరోజ్‌గూడ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌లో రైల్వే ట్రాక్‌పై కూర్చుని ఆత్మహత్యకు యత్నించింది. దీనిపై సమాచారం అందడంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్న కానిస్టేబుళ్లు రవీందర్, సుధాకర్ రెడ్డి ఆమెను రక్షించారు. ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించిన కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు అభినందించారు.

చైనా మాంజాతో ఇద్దరికి గాయాలు

చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై ప్రభుత్వం నిషేధం విధించినా వాటి వినియోగం మాత్రం ఆగడం లేదు. పోలీసులు దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున నిషేధిత మాంజాను స్వాధీనం చేసుకున్నా కొందరు వ్యాపారులు దొంగచాటుగా చైనా మాంజాను దిగుమతి చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. చైనా మాంజా బారిన పడి మంగళవారం ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల్లో ఒకరు పోలీస్ కానిస్టేబుల్ కాగా, మరొకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కావడం గమనార్హం.. వివరాల్లోకి వెళితే..


గాయపడిన ట్రాఫిక్ కానిస్టేబుల్ బాలరాజ్

కాచిగూడ: అంబర్‌పేట తిలక్‌నగర్ ప్రాంతానికి చెందిన ఏర్పుల బాల్‌రాజ్ లంగర్ హౌస్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం అతను విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో నారాయణగూడ ఫ్లైఓవర్‌పై చైనా మాంజా మెడకు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. గొంతుపై 5 కుట్లు పడినట్లు బాధితుడు తెలిపారు. బాలరాజ్ ఫిర్యాదు మేరకు నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పల్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..


గాయపడిన సాయివర్ధన్ రెడ్డి

చైనా మాంజా మెడకు చుట్టుకుని సాఫ్ట్ వేర్ ఉద్యోగి గాయపడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఏఎస్‌రావునగర్, బృందావన్ కాలనీకి చెందిన సాయివర్ధన్ రెడ్డి సాఫ్ట్ వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం అతను డ్యూటీకి వెళుతుండగా ఉప్పల్ స్టేడియం మెట్రో స్టేషన్ సమీపంలో చైనా మాంజా అతడి గొంతుకు చుట్టుకుంది. అప్రమత్తమైన అతను బైక్‌ను ఆపి చూడగా అప్పటికే గొంతుకు గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించారు.

ఇందిరానగర్‌లో భారీ చోరీ

బంజారాహిల్స్: ఇంటి తాళాలు పగులగొట్టి భారీగా నగదు, నగలు చోరీకి పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2, ఇందిరానగర్‌లో నివసించే లోవకుమారి, వీర వెంకటరమణ దంపతులు కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 12న ఇంటికి తాళం వేసి రాజమండ్రికి వెళ్లారు. ఈ నెల 14న ఉదయం అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న కరుణాకర్ అనే వ్యక్తి మోటార్ ఆన్ చేసేందుకు కిందికి వచ్చి చూడగా లోవకుమారి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. తలుపు పక్కన కిటికీతో పాటు బీరువా ధ్వంసమై ఉండడమే కాకుండా వస్తువులన్నీ చెల్లాచెదురై ఉన్నాయి. దీంతో అతను వీర వెంకటరమణకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. ఆందోళనకు గురైన లోవకుమారి, వీర వెంకటరమణ సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు బీరువాను పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఇల్లు కొనుగోలు నిమిత్తం బీరువాలో దాచిన రూ.25 లక్షల నగదుతో పాటు 20 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన ఆభరణాల్లో బంగారు హారం, గొలుసు, గాజులు, ఉంగరాలు, నెక్లెస్, పాపిడి బిళ్ల, బంగారు బిస్కెట్లు, చెవి రింగులు, లక్ష్మీ రూపులు, లక్ష్మీ రూపు విగ్రహం, వెండి పళ్లెం, పట్టీ గొలుసులు, వెండి గిన్నె ఉన్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇళ్లు తాళం వేసి ఉన్నట్లు గుర్తించిన దొంగలు పథకం ప్రకారం డోర్ పక్కన ఉన్న కిటికీ అద్దాలు పగులగొట్టి ఇంట్లోకి వెళ్లే మార్గాలను తెలుసుకుని చోరీకి పాల్పడినట్లుగా భావిస్తున్నారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా ఒక మహిళ, ఒక యువకుడు సంచుల్లో ఆభరణాలు, డబ్బులు నింపుకుని వెళ్తున్న దృశ్యాలను పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించాయి. తెలిసిన వారే ఈ చోరీకి పాల్పడి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


బీరువా పగులగొట్టిన దృశ్యం

అన్న కూతురిని ప్రేమిస్తున్నాడని..

- యువకుడి ఇంటిపై పెట్రోల్‌పోసి నిప్పంటించిన చిన్నాన్న
- ఇద్దరికి తీవ్ర గాయాలు

అల్వాల్: అన్న కూతురిని ప్రేమిస్తున్నాడనే కోపంతో ఓ యువతి చిన్నాన్న ప్రేమించిన యువకుడి ఇంటిపై దాడి చేసి పెట్రోల్ పోసి నిప్పంటించిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మచ్చబొల్లారం గోపాల్‌నగర్ ఎరుకల బస్తీలో ప్రకాష్, హేమలత దంపతులు తమ కుమారుడు ప్రదీప్‌తో కలిసి నివాసం ఉంటున్నారు. ప్రదీప్ అదే ప్రాంతంలోని వివేకానందకు చెందిన బైక్ షోరూమ్‌లో పనిచేస్తున్నాడు. వివేకానంద అన్న కుమార్తెతో ప్రదీప్‌కు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దీంతో పలుమార్లు వివేకానంద ప్రదీప్‌ను హెచ్చరించాడు. అయినా ప్రదీప్ వైఖరి మార్చుకోకపోవడంతో ఆగ్రహానికి లోనైన వివేకానంద ప్రదీప్, అతడి కుటుంబసభ్యులను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి పెట్రోల్ తీసుకుని ప్రదీప్ ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ప్రదీప్ ఇంట్లో లేకపోవడంతో ఇంట్లో ఉన్న అతడి తల్లిదండ్రులు ప్రకాష్, హేమలతలతో పాటు ఇంటి తలుపులపై పెట్రోల్ చల్లి నిప్పంటించాడు. ఈ ఘటనలో ప్రకాష్‌కు తీవ్ర గాయాలు కాగా, పక్కింట్లో ఉండే దిలీప్ అనే వ్యక్తి కుమార్తె చిన్నారి చాందిని (4) రెండు కాళ్లకు మంటలంటున్నాయి. చిన్నారి చాందినిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, ప్రకాష్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిందితుడు వివేకానంద పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన చాందిని


ప్రకాష్ (ఫైల్)

ప్రాణం తీసిన చీర గొడవ

- తండ్రిని హతమార్చిన తనయుడు
- నిందితుడి అరెస్ట్


హన్మంతు మృతదేహం

శామీర్‌పేట్: చీర కారణంగా చెలరేగిన వివాదం తల్లి, కుమార్తె మధ్య ఘర్షణకు దారితీయగా అడ్డు వచ్చిన తండ్రిని కుమారుడు హత్య చేసిన సంఘటన మంగళవారం రాత్రి శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట, పెద్దమ్మ కాలనీలో హన్మంతు (50), పెద్దమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. బుధవారం తల్లి, కుమార్తెకు చీర విషయమై గొడవ జరిగింది. ఈ విషయంలో తండ్రి హన్మంతు, పెద్దకొడుకు నర్సింహ జోక్యం చేసుకోవడంతో వారి మధ్య ఘర్షకు దారి తీసింది. మద్యం మత్తులో ఉన్న నర్సింహ తండ్రిపై రోకలిబండతో దాడి చేయడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది అతడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న శామీర్‌పేట పోలీసులు పంచనామా నిర్వహించారు.



పోలీసుల అదుపులో నిందితుడు నర్సింహ

నిందితుడి రిమాండ్..

శామీర్‌పేట సీఐ శ్రీనాథ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. నిందితుడు నర్సింహను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. బుధవారం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అమాయకులే టార్గెట్

- ఏటీఎంల వద్ద మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా ఆటకట్టు
- డబ్బులు డ్రా చేసి ఇస్తామంటూ టోకరా
- ముగ్గురు నిందితుల రిమాండ్
- రూ.2,38,140 నగదు, డూప్లికేట్ ఏటీఎం కార్డులు స్వాధీనం

షాద్‌నగర్ రూరల్: అమాయకులు, మహిళలను టార్గెట్‌గా చేసుకుంటారు.. ఏటీఎంలలో డబ్బులు తీయడం రాని వారిని పరిచయం చేసుకుంటారు.. డబ్బులు తీసిస్తామని దృష్టి మరల్చి ఏటీఎం కార్డు మార్చేసి డూప్లికేట్ కార్డు ఇస్తారు. ఒరిజినల్ కార్డుతో డబ్బులు డ్రా చేసుకుంటారు. ఈ తరహా మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాలోని ముగ్గురు సభ్యులను బుధవారం పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ విజయ్ కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..

ఉపాధి కోసం వచ్చి..

బీహార్ రాష్ట్రం, సోనబర్సా గ్రామానికి చెందిన కరిమన్ సహాని, రూప్‌దేవ్ సహాని, పంజాబ్ రాష్ట్రం, కపుర్తల పగ్వారా గ్రామానికి చెందిన సహీబ్‌సహాని కొన్నేళ్ల క్రితం ఉపాధికోసం వచ్చారు. కూలీ పనులు చేస్తూ శంషాబాద్ మండలం తొండుపల్లిలో నివాసం ఉంటున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో వారు ముఠాగా ఏర్పడి ఏటీఎంల వద్ద మోసాలకు పాల్పడుతున్నారు.

జడ్చర్ల కేసుతో ఆటకట్టు..

నందిగామ మండలం, శ్రీనివాసులగూడెం గ్రామానికి చెందిన కుమ్మరి రాజు గత ఆగస్టు 5న జడ్చర్ల రోడ్డులోని ఐడీబీఎం ఏటీఎంకు వెళ్లాడు. అతడికి డబ్బులు డ్రా చేయడం రాదని గుర్తించిన దుండగులు, అతడి వద్దకు వెళ్లి మాటల్లో పెట్టి కార్డు మార్చేశారు. కొంతసేపటి తర్వాత తన ఖాతా నుంచి డబ్బులు డ్రా అయినట్లు గుర్తించిన రాజు అదేరోజు షాద్‌నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో ముఠా సభ్యులను పట్టుకున్నారు.


వివరాలు వెల్లడిస్తున్న టౌన్ సీఐ విజయ్‌కుమార్

15 ప్రాంతాల్లో నేరాలు

నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు తమ శైలిలో విచారించగా ఏటీఎంల వద్ద నేరాలకు పాల్పడినట్లు అంగీకరించారు. షాద్‌నగర్, ఆర్‌జీఐఏ, పటాన్‌చెరు, శంషాబాద్‌లో రెండేసి చొప్పున, దుండిగల్, సనత్‌నగర్, జడ్చర్ల, గచ్చిబౌలి, జీడిమెట్ల, మైలార్‌దేవ్‌పల్లి, బాలానగర్ ఏటీఎంల వద్ద ఒక్కోటి చొప్పున మొత్తం 15 దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి రూ.2,38,140 నగదు, డూప్లికేట్ ఏటీఎం కార్డులు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ డీసీపీ రాజేశ్, అడిషనల్ డీసీపీ రాంకుమార్, సైబరాబాద్ ఎస్‌ఓటీ డీసీపీ శోభన్‌బాబు, సీఐ సంజయ్, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో టౌన్ సీఐ విజయ్ కుమార్, డీఐ వెంకటేశ్వర్లు, డీఎస్ఐ శరత్‌కుమార్, క్రైం టీం మోహన్, కరుణాకర్, జాకీర్, రాజు, రఫీ కేసును ఛేదించారు.

రెండు బైక్‌లు ఢీ

- ఓ యువకుడి మృతి
- మరో యువకుడికి తీవ్ర గాయాలు


దేవహర్ష మృతదేహం

జీడిమెట్ల: యూటర్న్ తీసుకుంటున్న ద్విచక్రవాహనాన్ని మరో బైక్ ఢీ కొట్టడంతో ఓ యువకుడు మృతిచెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చింతల్ గణేష్‌నగర్‌కు చెందిన మలిశెట్టి లక్ష్మీవరమోహన్ కుమారుడు దేవహర్ష(26) గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి అతను ఆఫీసు నుంచి ఇంటికి బయలుదేరాడు. ఐడీపీఎల్ చౌరస్తా నుంచి కుత్బుల్లాపూర్ వైపు వస్తుండగా, అదే సమయంలో పద్మానగర్ ఫేజ్-2కు చెందిన పవన్‌రెడ్డి కుత్బుల్లాపూర్ చౌరస్తా వైపు వెళ్లేందుకు చింతల్ కేఎఫ్‌సీ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా ఇద్దరి బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో ఇద్దరూ ఎగిరి కింద పడటంతో వారి తలలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా దేవహర్ష మార్గమధ్యలోనే మృతి చెందాడు. పవన్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉంది. జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరు యువకులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉందని పోలీసులు పేర్కొన్నారు.

ఫుట్‌పాత్‌ ఇలా... నడిచేదెలా..?


సినార్‌ వ్యాలీ నుంచి ఫిలింనగర్‌ వైపు వస్తుంటే ఫుట్‌పాత్‌పై నిర్మాణ వ్యర్థాలు...

ఫిలింనగర్‌: పాదచారులు నడిచేందుకు అనువుగా ఒక వైపు ప్రభుత్వం ఫుట్‌పాత్‌లు నిర్మిస్తుంటే మరో వైపు కొంత మంది వాటిని ఆక్రమించి నిర్మాణ వ్యర్థాలతో పాటు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఫిలింనగర్‌లోని సినార్‌ వ్యాలీ నుంచి ఫిలింనగర్‌ వైపు వస్తున్న రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లు ఎంత మాత్రం కూడా పాదాచారులు నడిచేందుకు అనువుగా లేకుండా కొంత మంది స్థల యజమానులు, వ్యాపారులు ఆక్రమణలు చేయడంతో పాటు నిర్మాణ వ్యర్థాలు, మట్టి, చెత్తా చెదారం వేస్తున్నారు. దీంతో అసలే వంపుగా ప్రమాదకరంగా ఉన్న ఈ రోడ్డులో రోడ్డు మీదుగా నడుస్తున్న పాదాచారులు రోడ్డు ప్రమాదాలబారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లు వాడుకలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇందిరానగర్‌లో అల్లరిమూకల ఆగడాలు

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్‌ నెంబర్‌-2లోని ఇందిరానగర్‌ స్ట్రీట్‌నెంబర్‌-13లో అల్లరి మూకలు చెలరేగిపోతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో పీకలదాకా మద్యంతాగిన10 మంది యువకులు సిలిండర్లు పైనుంచి కిందకి వేస్తూ, వాహనాలను ధ్వంసం చేస్తూ, రాళ్లు విసురుతూ స్థానికంగా విధ్వంసం సృష్టించారు. రాజీవ్‌ గాంధీ విగ్రహం గల్లీలో, స్ట్రీట్‌నెంబర్‌-13లో ప్రతిరోజూ గంజాయి, మద్యం తాగిన యువకులు తీవ్ర గొడవలకు పాల్పడుతూ దారినపోయేవారిని అడ్డగించి, బెదిరించి డబ్బులు లాక్కుంటున్నారని స్థానిక మహిళలంతా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గొడవలకు పాల్పడుతున్న వారి వివరాలతో బుధవారం ఈ వీధి ఉండేవారంతా బంజారాహిల్స్‌ ఎస్‌ఐ యాసీన్‌ అలీకి ఫిర్యాదు చేశారు. ఈ అల్లరి మూకలు ఇలాగే దౌర్జన్యాలకు పాల్పడితే తాము ఇళ్లు ఖాళీ చేసి వెళ్ళిపోతామని, భయభ్రాంతులకు గురవుతున్నామని, కత్తులు, బ్లేడ్లతో స్వైరవిహారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ వీధిలో పోలీసు పికెటింగ్‌ ఏర్పాటుచేయాలని, రాత్రిపూట పాట్రోలింగ్‌ పెంచాలని, గంజాయి బ్యాచ్‌ను పట్టుకోవాలని కోరారు. బంజారాహిల్స్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

మురుగు కష్టాలు తీరేదెలా..?


ఫిలింనగర్‌ దైవసన్నిదానం రోడ్డులో పారుతున్న మురుగు నీరు..

ఫిలింనగర్‌: ఫిలింనగర్‌ దైవసన్నిదానం, ఫిలించాంబర్‌ పరిసర ప్రాంతాల్లో గడిచిన రెండు నెలలుగా మురుగు కష్టాలు స్థానికులను వేధిస్తున్నాయి. నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు మురుగు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో స్థానికులు, వ్యాపారులు, ఈ దారిగుండా వెళ్ళేవారు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. పలుమార్లు ఈ సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ రోడ్డుగుండా నడవాలంటే దుర్వాసనలతో ఇబ్బందికరంగా ఉంటుందంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్కింగ్‌ చేసిన ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్‌ : ఇంటి ముందు పార్కింగ్‌ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. ఈ నెల 12న రాత్రి జి.శివారెడ్డి అనే యువకుడు తన వరసకు సోదరుడి ద్విచక్ర వాహనం తీసుకుకొచ్చి తాను అద్దెకుంటున్న ఇంటి ముందు పార్క్‌ చేసి వెళ్లారు. ఉదయం చూసేసరికి ద్విచక్ర వాహనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో ట్రాక్టర్‌ బ్యాటరీ..

వెంగళరావునగర్‌ : పార్కింగ్‌ చేసిన ట్రాక్టర్‌ బ్యాటరీ చోరీకి గురైన ఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పాపిరెడ్డినగర్‌కు చెందిన పి.మహేష్‌ జీహెచ్‌ఎంసీ ట్రాక్టర్‌ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. ఈ నెల 13న యూసుఫ్‌గూడ చెత్త ట్రాన్స్‌ఫర్‌ స్టేషన్‌లో ట్రాక్టర్‌ను పార్కింగ్‌ చేసి ఉదయం వచ్చి చూడగా ట్రాక్టర్‌ బ్యాటరీ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరోసారి ఇందిరమ్మ సర్వే..

- అర్హులను ఎంపిక చేసేందుకు సూపర్‌ చెక్‌..
- జాబితా పారదర్శకంగా ఉండాలన్నది ప్రభుత్వ యోచన..
- సర్వేలో తప్పులు జరిగాయా? కరెక్టుగానే ఉందా? అన్న దానిపై అధికారుల తనిఖీలు..


ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సూపర్‌ చెక్‌ చేస్తున్న సర్కిల్‌-17 డీసీ రజనీకాంత్‌రెడ్డి

బంజారాహిల్స్‌: పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి స్వీకారం చుట్టింది. గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేపట్టారు. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్‌ సర్కిల్‌-17 పరిధి కిందికి వచ్చే సోమాజీగూడ, ఖైరతాబాద్‌, అమీర్‌పేట, సనత్‌నగర్‌, జూబ్లీహిల్స్‌ సర్కిల్‌-18 పరిధిలోని వచ్చే బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో గత రెండు వారాల నుంచి ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుంది. సర్కిల్‌-17 పరిధిలో 21,000 మంది లబ్ధిదారులను సర్వే చేసేందుకు 55 మంది సిబ్బందిని నియమించారు. సర్కిల్‌-18 పరిధిలో 28 వేల మంది అర్హులను సర్వే చేసేందుకు 63 మందిని నియమించారు. ఈ రెండు సర్కిళ్ల పరిధిలో ఇప్పటివరకు 70 శాతం మందిని సర్వే చేశారు. సిబ్బందితో ప్రత్యేక మొబైల్‌ యాప్‌ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేపట్టారు. లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వం పారదర్శకతకు పెద్ద పీట వేస్తోంది. ఇప్పటివరకు జరిగిన సర్వేలో ఏమైనా అవకతవకలు జరిగాయా? అని తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో 'సూపర్‌ చెక్‌' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. సర్కిల్‌-17 పరిధిలో డిప్యూటీ కమిషనర్‌ రజనీకాంత్‌రెడ్డి, సర్కిల్‌-18 పరిధిలో డిప్యూటీ కమిషనర్‌ ప్రశాంతిలు గత వారం రోజుల నుంచి సూపర్‌ చెక్‌ నిర్వహిస్తున్నారు. సర్వే చేపట్టిన వాటిలో ఐదు శాతం ఇళ్ల వివరాలను ప్రభుత్వం వీరికి అందజేసింది. ఆ ఇళ్లను మాత్రమే వీరు సూపర్‌చెక్‌ నిర్వహించనున్నారు.

సూపర్‌ చెక్‌ ఇలా నిర్వహిస్తారు..

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుదారుల వివరాలను మాత్రమే యాప్‌లో నమోదు చేశారా..?, దరఖాస్తు చేయనివారివి నమోదు చేశారా..? దరఖాస్తుదారులు ప్రస్తుతం ఉంటున్న ఇళ్లు ఏవిధంగా ఉన్నాయి..? ఎక్కడ ఉంటున్నారా..? , సొంత ఇల్లా అద్దెకు ఉంటున్నారా..? అనే అంశాలపై వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు సూపర్‌ చెక్‌ చేపడుతున్నారు. వివరాలు వాస్తవానికి విరుద్ధంగా యాప్‌లో నిక్షిప్తమై ఉంటే వాటిని తిరస్కరిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన 5 శాతం ఇళ్ల వివరాల జాబితా ప్రకారం అధికారులు సూపర్‌ చెక్‌ పేరుతో వివరాలు సేకరిస్తున్నారు. దీంతో అర్హులకు మాత్రమే ఇళ్లు లభించే అవకాశం ఉంది. మరోవైపు త్వరలో ఈ పథకం అమలుచేయనున్న నేపథ్యంలో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల సర్వే ప్రక్రియను గత నెల మొదటి వారంలో ప్రారంభించగా, 31వ తేదీనే సర్వే గడువు ముగిసింది. లబ్ధిదారులు ఇంకా మిగిలి ఉండడంతో మరో వారం రోజులు గడువు పొడిగించగా, ఆ గడువు కూడా పూర్తయ్యింది. ఇంకా 40, 50 శాతం మంది లబ్ధిదారుల సర్వే చేయాల్సి ఉండగా ఇంకో వారం రోజులు సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒక వైపు సర్వే చేస్తుండగానే ఇంకోవైపు సర్వే పూర్తయిన వాటిల్లో మొత్తం దరఖాస్తుల్లో ఐదు శాతం తీసుకుని సూపర్‌ చెక్‌ పేరుతో దరఖాస్తుదారుల ఇంటికి మళ్లీ వెళ్లి పరిశీలిస్తున్నారు. త్వరలోనే అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు బస్తీ సభలు నిర్వహించాలని ప్రభుత్వం తలపెట్టింది. ఆ లోగా సర్వే పూర్తవుతుందా? లేదా? అనే అంశంపై సందిగ్ధం నెలకొంది.

సందడిగా సంక్రాంతి సంబరాలు



ఫిలింనగర్‌: ఫిలింనగర్‌ కల్చరల్‌ సెంటర్‌లో సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలు, సంప్రదాయ సన్నాయి మేళం, గాలిపటాల రెపరెపలతో పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కేఎస్‌ రామారావు మాట్లాడుతూ ఫిలింనగర్‌ కల్చరల్‌ సెంటర్‌ మొదటి నుంచి తెలుగు వారి సంస్కృతీ సంప్రదాయాలు, పండుగలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గత మూడు దశాబ్దాలుగా ఆ వారసత్వాన్ని తాము


ఫిలింనగర్‌ కల్చరల్‌ సెంటర్‌లో సంక్రాంతి సంబరాలు

కొనసాగిస్తున్నామని చెప్పారు. సంక్రాంతి పండుగను తెలుగు వారందరూ కుటుంబ సభ్యులందరితో గ్రామాల్లో జరుపుకుంటారని, పట్టణాల్లో, నగరాల్లో ఉన్నవారు కూడా పండుగను ఆనందోత్సాహాలతో వేడుకగా జరుపుకుంటారని చెప్పడానికి ఇదే నిదర్శనమన్నారు. కార్యదర్శి తుమ్మల రంగారావు మాట్లాడుతూ ఫిలింనగర్‌ కల్చరల్‌ సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగిస్తుందని, ప్రతి పండుగను సభ్యుల సమక్షంలో ఆనందంగా జరుపుతామని, సంప్రదాయ వంటలను కూడా ఏర్పాటుచేయడం జరిగిందని తెలిపారు. మన కళలు, మన సంస్కృతికి ఈ కల్చరల్‌ సెంటర్‌ అధిక ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. రెండు గంటల పాటు గంగిరెద్దులు విన్యాసాలు, హరిదాసులు ఆలాపించే కీర్తనలతో గాలిపటాలను ఎగురవేస్తూ సభ్యులు ఆనందంగా పండుగను కుటుంబాలతో జరుపుకున్నారన్నారు. ఈ వేడుకల్లో కల్చరల్‌ సెంటర్‌ మాజీ అధ్యక్షులు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, ఉపాధ్యక్షులు ఎస్‌ఎన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి శివారెడ్డి, కార్యవర్గ సభ్యులు కోగంటి భవానీ, భాస్కరనాయుడు, ఏడిద శ్రీరామ్‌, కల్చరల్‌ కమిటీ చైర్మన్‌ గోపాలరావు, మీడియా కమిటీ చైర్మన్‌ భగీరథ తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా పండుగలు జరుపుకోవాలి

వెంగళరావునగర్‌ : కులమతాలకతీతంగా పండగలు జరుపుకోవాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ యువజన కాంగ్రెస్‌ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్‌ పి.వి.రవిశేఖర్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వెంగళరావునగర్‌ కాలనీలోని యువతకు గత రెండ్రోజులుగా పతంగులు పంపిణీ చేసి యువతతో కలిసి ఎగురవేసి సందడి చేశారు.


గాలిపటం ఎగరవేస్తున్న రవిశేఖర్‌రెడ్డి


గాలిపటం ఎగుర వేస్తున్న సీఎన్‌ రెడ్డి


సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్న హబీబా సుల్తానా

రహమత్‌నగర్‌, బోరబండ డివిజన్లలో..

రహమత్‌నగర్‌: రహమత్‌నగర్‌, బోరబండ డివిజన్లలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రహమత్‌నగర్‌ కార్పొరేటర్‌ సీఎన్‌ రెడ్డి క్వారీ మైదానంలో కాంగ్రెస్‌ పార్టీ నాయకులతో కలిసి గాలి పటాలు ఎగురవేశారు. మహిళలు తమ నివాసాల ముందు వేసిన రంగురంగులు ఆకట్టుకున్నాయి. స్థానిక మహిళలకు కార్పొరేటర్‌ బాబా ఫసియుద్దీన్‌ సతీమణి హబీబా సుల్తానా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి మొక్కలు అందజేశారు.

చైనా మాంజా స్వాధీనం

వెంగళరావునగర్‌: అనుమతి లేకుండా విక్రయిస్తున్న చైనా మాంజాను మధురానగర్‌ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రహమత్‌నగర్‌కు చెందిన గ్యాన్‌సింగ్‌, కార్మికనగర్‌ నివాసి భూషణ్‌సింగ్‌ అనుమతి లేకుండా చైనా మాంజాను విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆయా దుకాణాలపై దాడులు నిర్వహించి, 81 చైనా మాంజాలను స్వాధీనం చేసుకున్నారు.

పార్కుకు తాళం.. గేటు ముందు ఆక్రమణలు...



బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌-2 ప్రధాన రహదారిలో కేబీఆర్‌ పార్కు సమీపంలో ఎనిమిదేళ్ల క్రితం జపనీస్‌ గార్డెన్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. జపాన్‌ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దంపట్టే రీతిలో నిర్మాణ శైలి, అక్కడి పూల జాతులను, మొక్కలను ఇక్కడ నాటి సర్వాంగ సుందరంగా నిర్మించారు. అయితే జీహెచ్‌ఎంసీ నిర్వహణ లోపంతో పార్కు శిథిలావస్థకు చేరింది. నిర్మాణాలు కూలిపోయి, మొక్కలు ఎండిపోయి, నీళ్లు లేక, పర్యవేక్షణ లేక మురికికూపంగా మారింది. దీనికి తోడు గేటుకు ఎప్పుడూ తాళంకప్ప వేలాడుతుండడంతో ఇదే అదునుగా పార్కు ముందు ఫుట్‌పాత్‌లు, రోడ్డును ఆక్రమించి కొంతమంది ఆక్రమణలకు తెగబడ్డారు. పర్మినెంట్‌ షెడ్డులు నిర్మించారు. పార్కు గేట్‌లోకి వెళ్లడానికి వీల్లేకుండా దీని ముందు 10 వరకు డబ్బాలు ఏర్పాటుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాకపోకలు సాగించే రోడ్డులోనే ఈ ఆక్రమణలు, పార్కు గేటుకు తాళాలు, జీహెచ్‌ఎంసీ పనితీరుకు అద్దంపడుతున్నాయి. కనీసం ట్రాఫిక్‌ పోలీసులైనా స్పందించి ఇక్కడ రోడ్డును ఆక్రమించి అక్రమ పార్కింగ్‌లను, ఫుట్‌పాత్‌లపై ఆక్రమ డబ్బాలను తొలగించి ఈ పార్కును ఆహ్లాదానికి చిరునామాగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యువకుడు అదృశ్యం



ఖైరతాబాద్‌: ఖైరతాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఖైరతాబాద్‌ గాంధీనగర్‌లో నివాసముండే శశాంక్‌ (29) మంగళవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో పాటు ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ చేశాడు. దీంతో సోదరుడు ఉమామహేశ్వర్‌ ఖైరతాబాద్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్‌: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.11, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్‌ 45, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్‌ 37, దొండ 45, గుండుబీన్స్‌ 45, గింజ చిక్కుడు 35, గోకరకాయ 35, కీర 31, దోసకాయ 18, బీట్‌రూట్‌ 35 ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఘనంగా మాయావతి జన్మదిన వేడుకలు

బంజారాహిల్స్‌: లక్డీకాపూల్‌లోని బహుజన్‌ సమాజ్‌ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షురాలు మాయావతి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్‌ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో రాష్ట్ర సమన్వయకర్త ఈశ్వర్‌, ఉపాధ్యక్షులు శ్రీరామకృష్ణ, జిల్లా ఇన్‌చార్జి దోరపల్లి రమేష్‌, నర్సింగ్‌రావు, బండారి శ్రీనివాస్‌, కుమార్‌, విశ్వప్రియుడు, ఎల్లన్న జనక్‌, వెంకటేశ్వరరావు, సంపత్‌, ప్రవీణ్‌కుమార్‌, ఈశ్వర్‌, విష్ణుమూర్తి, అలీభాయ్‌, మహేందర్‌, చంద్రహాసన్‌ తదితరులు పాల్గొన్నారు.


మాయావతి జన్మదిన వేడుకల్లో బీఎస్పీ నేతలు

మల్టీలెవల్‌ పార్కింగ్‌ వద్దు

కేబీఆర్‌ పార్కు వాకర్లు, సందర్శకులు


కేబీఆర్‌ పార్కు జీహెచ్‌ఎంసీ వాక్‌ వే పార్కింగ్‌ నెంబర్‌-1లో వాహనాల పార్కింగ్‌లు..

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌లోని కేబీఆర్‌ పార్కు జీహెచ్‌ఎంసీ వాక్‌వేను ఆనుకుని ఉన్న ఒకటో నెంబర్‌ పార్కింగ్‌ లాట్‌లో మల్టీలెవల్‌ పార్కింగ్‌ నిర్మాణాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని, ఈ నిర్మాణం వల్ల ప్రకటనలు తప్పితే పార్కింగ్‌దారులకు ఎలాంటి ఉపయోగం లేదని కేబీఆర్‌ పారుక వాకర్లు, సందర్శకులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ మల్టీలెవల్‌ పార్కింగ్‌ సౌకర్యం నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ ఇటీవలనే ప్రతిపాదించింది. అయితే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ఇక్కడ మల్టీలెవల్‌ పార్కింగ్‌ సౌకర్యం అవసరం లేదని పార్కుకు వచ్చే వాకర్లు, సందర్శకులు డిమాండ్‌ చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ 40 వాహనాలు పార్కింగ్‌ చేసేందుకు సదుపాయం ఉందని, మల్టీలెవల్‌ పార్కింగ్‌ నిర్మించినా ఇంతకంటే ఎక్కువ వాహనాలు పార్కింగ్‌ చేసే అవకాశం లేదని వారు అంటున్నారు. కొందరు స్వలాభం కోసం మల్టీలెవల్‌ పార్కింగ్‌ చేపట్టి వాకర్లు, సందర్శకుల నుంచి పార్కింగ్‌ ఫీజు వసూలు చేయాలని ప్రణాళికలు రూపొందించుకున్నారని, ఇది ఒకరిద్దరికే లాభం చేకూరుస్తుందన్నారు. అంతేకాకుండా ప్రకటనలు, పార్కింగ్‌ ఫీజులు వసూలు చేయడానికి దీనిని తలపెట్టారని, ఇది ఒకరిద్దరి ప్రయోజనాల కోసమే నిర్మాణం జరుపుకుంటుందని ఆరోపిస్తున్నారు. ఇక్కడ మల్టీలెవల్‌ పార్కింగ్‌ నిర్మాణం చేపడితే ఆందోళనకు దిగుతామని కూడా హెచ్చరిస్తున్నారు. మల్టీలెవల్‌ పార్కింగ్‌ నిర్మాణం ఫీజు పేరుతో ఖరీదైన 2000 గజాల పార్కు స్థలాన్ని కొట్టేయాలని చూస్తున్నారని, దీని వెనుక దురుద్దేశాలు ఎన్నో ఉన్నాయని, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఈ అక్రమాలపై దృష్టిపెట్టాలని వాకర్లు కోరుతున్నారు. తక్షణమే ఈ నిర్మాణ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని కోరారు.

శక్తియుక్తులను సరైన మార్గంలో వినియోగించాలి


చర్చా కార్యక్రమంలో జయశ్రీ రమేష్‌ తదితరులు

బంజారాహిల్స్‌: యువత తమ శక్తియుక్తులను సరైన విధంగా ఉపయోగిస్తే నాయకులుగా ఎదుగుతారని, అందుకోసం కోటక్‌ ఎడ్యుకేషన్‌ ఫౌండేషన్‌ అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తుందని కోటక్‌ ఎడ్యుకేషన్‌ ఫౌండేషన్‌ విద్య, స్కాలర్‌షిప్‌ల డైరెక్టర్‌ జయశ్రీరమేష్‌ అన్నారు. 'ది పవర్‌ ఆఫ్‌ యు: ట్రాన్స్‌ఫార్మింగ్‌ ప్రొటెన్షియల్‌ ఇన్‌ లీడర్‌షిప్‌' అనే అంశంపై కోటక్‌ కన్యా స్కాలర్స్‌ విద్యార్థులతో బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్‌ జయశ్రీ రమేష్‌ మాట్లాడుతూ యువ మహిళా స్కాలర్ల నాయకత్వ ఆలోచనలను వివిధ కోణాల్లో లోతుగా పరిశీలించే వకాశం లభించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ రౌండ్‌టేబుల్‌ చర్చ వారిలోని ఆకాంక్షలను రగిలించిందని, రేపటి నాయకులుగా ఎదగడానికి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని వివరించారు. కార్యక్రమంలో సెంటర్‌ ఫర్‌ డీఎన్‌ఏ ఫింగర్‌ ప్రింటింగ్‌ అండ్‌ డయాగ్నస్టిక్స్‌లోని లేబరేటరీ ఆఫ్‌ సెల్‌ సిగ్నలింగ్‌ హెడ్‌ డాక్టర్‌ రష్న భండారి, కోటక్‌ సెక్యూరిటీస్‌ లిమిటెడ్‌ పీసీజీ ఈక్విటీ సేల్స్‌ సీనియర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ అర్నాబ్‌ భట్టాచార్య, ఐఐటీ హైదరాబాద్‌ అసోసియేట్‌ ప్రొఫెసర్‌ మానేంద్ర దేశ్కార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పలువురి శుభాకాంక్షలు


ఎమ్మెల్యే తలసానికి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న స్థానిక నాయకులు

అమీర్‌పేట: మాజీ మంత్రి,సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ సంక్రాంతి పండుగ వేళ బీఆర్‌ఎస్‌ నాయకులతో చాలా సమయం గడిపారు. బుధవారం ఉదయం అమీర్‌పేట డివిజన్‌ ఎస్‌ఆర్‌నగర్‌లో బీఆర్‌ఎస్‌ నేతలతో కలిసి హోటల్‌లో టిఫిన్‌ చేశారు. బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలతో పాటు పోలీసు అధికారుల సంఘం నాయకులు ఎమ్మెల్యేకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇంట్లో కాలు జారి కింద పడి పోయి గాయాలపాలైన సీనియర్‌ సిటిజన్‌ కౌన్సిల్‌ మాజీ అధ్యక్షులు పార్థసారథి నివాసానికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు హనుమంత్‌రావు, సంతోష్‌, కూతరు నర్సింహ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటా


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన డీఎస్‌ఎంకాలనీ నివాసితులు

సనత్‌నగర్‌: డీఎస్‌ఎంకాలనీలో పర్యటించి అక్కడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మాజీ మంత్రి, సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ తెలిపారు. బుధవారం సనత్‌నగర్‌ డీఎస్‌ఎంకాలనీకి చెందిన పలువురు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలను విన్నవించారు. ప్రధానంగా తమ కాలనీలోని చెత్తను సక్రమంగా తరలించడం లేదని తెలపగా, వెంటనే సంబంధిత అధికారికి ఫోన్‌ చేసి పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఇలాంటి ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాలనీకి చెందిన మసీదు కమిటీ అధ్యక్షుడు నోమాన్‌, కాలనీ అధ్యక్షుడు శంషీర్‌, ఇలియాస్‌, రషీద్‌ఖాన్‌, ఆసిఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

బేగంబజార్‌ చేపల వ్యాపారులకు న్యాయం చేయాలి



అబిడ్స్‌: బేగంబజార్‌లోని చేపల మార్కెట్‌ స్టాల్స్‌ను గతంలో మంజూరైన గంగపుత్ర సంఘం సభ్యులైన చేపల వ్యాపారులకు కేటాయించాలని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్‌ అన్నారు. బేగంబజార్‌ గంగపుత్ర సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే కౌసర్‌ ఆధ్వర్యంలో బల్దియా కమిషనర్‌ ఇలంబర్తిని కలిశారు. బేగంబజార్‌లో చేపల మార్కెట్‌ ఏర్పాటు సమయంలో 236 మంది చేపల వ్యాపారులకు స్టాల్స్‌ కేటాయించాలని అప్పట్లో వినతిపత్రం సమర్పించడం జరిగిందన్నారు. 2016లో ఈ స్టాల్స్‌ వారికి కేటాయిస్తామని అధికారులు హామీ కూడా ఇచ్చారని ఆయన బల్దియా కమిషనర్‌ దృష్టికి తెచ్చారు. ఈ 236 మంది చేపల వ్యాపారులు వంశపార్యపరంగా నిజాం కాలం నుంచి బేగంబజార్‌లో చేపల వ్యాపారం నిర్వహిస్తున్నారన్నారు. వారికే స్టాల్స్‌ కేటాయించి న్యాయం చేకూర్చాలని ఈ సందర్భంగా ఆయన బల్దియా కమిషనర్‌ను కోరారు. బేగంబజార్‌ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ప్రకాష్‌సింగ్‌, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కష్టపడి పని చేసే వారికి బీజేపీలో సముచిత స్థానం

అబిడ్స్‌: కష్టపడి పని చేసే వారికి బీజేపీలో సముచిత స్థానం ఉంటుందని గోషామహల్‌ నియోజకవర్గ బీజేపీ సీనియర్‌ నాయకుడు అల పురుషోత్తం రావు పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సుఖః సంతోషాలతో ఉంటున్నారన్నారు. గోషామహల్‌ డివిజన్‌ బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన సోమరాజు సింగును ఆయన సత్కరించి అభినందించారు. అనంతరం పురుషోత్తం రావు మాట్లాడుతూ..నియోజకవర్గంలో బీజేపీ ఎల్లప్పుడూ నెంబర్‌ వన్‌ స్థాయిలో ఉంటుందన్నారు. సోమరాజు సింగ్‌ మాట్లాడుతూ.. గోషామహల్‌ డివిజన్‌లో ఎలాంటి సమస్యలున్నా ఎమ్మెల్యే రాజాసింగ్‌ సహకారంతో పరిష్కరించేందుకు నిరంతరం పాటుపడుతున్నారు.

బేసిక్ ఫౌండేషన్ కోర్సుకు దరఖాస్తు గడువు ఫిబ్రవరి 15

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ మైనార్టీస్ స్టడీ సర్కిల్ మైనార్టీ విద్యార్థులకు బేసిక్ ఫౌండేషన్ కోర్సు ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఫిబ్రవరి 15 వరకు గడువు పొడిగించినట్లు హైదరాబాద్ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్ ఇలియాస్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్స్, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ మొదలైన వివిధ పోటీ పరీక్షల కోసం ముస్లిం, క్రిస్టియన్, సిఖ్, జైన్, పార్సీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు బీసీ మేధావుల సదస్సు


జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఈ నెల 17వ తేదీన శుక్రవారం ఉదయం 10 గంటలకు కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ మేధావుల సదస్సు నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం తెలిపారు. బుధవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సమగ్ర కులగణన సర్వేను వంద శాతం పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. దేశంలో జరిగే జనగణనలో బీసీ కుల గణన చేర్చాలని డిమాండ్ చేశారు.

చేనేతకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ అవసరం


డా.చిక్కా దేవదాసు

చిక్కడపల్లి: చేనేతకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం చిక్కడపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత, జౌళి శాఖలను వేరు చేయాలని, చేనేతకు రెండు వేల కోట్ల నిధులను విడుదల చేయాలన్నారు. గత సంవత్సరం ఆర్థిక ఇబ్బందుల కుతోడు ఉపాధి లభించకపోవడంతో 27 మంది చేనేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నేతలు శ్రీనివాస్, సుదర్శన్, నాగమూర్తి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

షెల్టర్ హోమ్‌కు ముగ్గురు బాలురు

ఘట్‌కేసర్: ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా ఘట్‌కేసర్ పోలీసులు మున్సిపాలిటీలోని పలు దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు మైనర్ బాలురను పనిలో పెట్టుకున్న దుకాణాల యజమానులపై చైల్డ్ లేబర్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు. బాలురను చైల్డ్ లేబర్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరచగా షెల్టర్ హోమ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మైనర్ బాలురను పనిలో పెట్టుకోవద్దని, నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అబ్దుల్ రషీద్‌కు 'తెలుగుకీర్తి'



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ రచయిత మహ్మద్ అబ్దుల్ రషీద్ తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. అంతర్జాతీయ శ్రీ కళావేదిక ఈ నెల 21వ తేదీన ఈ అవార్డును అందజేయనున్నట్లు అబ్దుల్ రషీద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత 35 ఏళ్లుగా సాహిత్యరంగంలో చేస్తున్న కృషిని గుర్తించి అవార్డును ప్రకటించడంపట్ల కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు 42 పుస్తకాలు వచ్చాయని, త్వరలోనే మరికొన్ని పుస్తకాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

ఓయూలో జార్జిరెడ్డి జయంతి


ఓయూలో జార్జిరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో జార్జిరెడ్డి జయంతిని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. బుధవారం జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో యూనివర్సిటీ క్యాంపస్‌లోని సింథటిక్ ట్రాక్‌లో ఏర్పాటు చేసిన జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జనవరి 5 నుంచి 15వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఫిట్‌నెస్ అండ్ కల్చరల్ వీక్ పేరుతో వివిధ రకాల క్రీడా పోటీలను, ఇతర కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎస్.సుమంత్ తెలిపారు. జార్జిరెడ్డి స్ఫూర్తితో విద్యారంగ సమస్యల పరిష్కారానికి, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అసమానతలను రూపుమాపేందుకు ఉద్యమాలను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓయూ ప్రధాన కార్యదర్శి రుక్మత్ పాషా, నాయకులు తిరుపతి, శ్రీనివాస్, మహేష్, మధు, హరీష్, గౌతమ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల రక్షణపై హైడ్రా దృష్టి

- శివారులో వందకుపైగా చెరువులు కబ్జాకు గురైనట్లు గుర్తింపు
- గతంలో నామమాత్రపు చర్యలతో ఆగని దందా
- ఇటీవల శివారుల్లో హైడ్రా బృందానికి వినతుల వెల్లువ
- హైడ్రా ప్రజావాణిలో ఆక్రమణలపై ఫిర్యాదులు


చింతల్ చెరువు

సాక్షి,సిటీబ్యూరో: ఆక్రమణదారుల చెర పడకుండా చెరువులను కాపాడేందుకు కంకణం కట్టుకున్న హైడ్రా వాటి పరిరక్షణే లక్ష్యంగా దృష్టి సారిస్తోంది. ఇటీవల హైడ్రా బృందం శివారుల్లో పలు ప్రాంతాల్లో పర్యటించి చెరువుల పరిస్థితితోపాటు ప్రభుత్వ భూముల కబ్జాల సంగతి తేల్చేందుకు పర్యవేక్షణలు చేపట్టింది. ఈ సందర్భంగా స్థానికులు, బస్తీవాసులు, ప్రజలు తమ చెరువులు, కుంటలు కబ్జాకు గురయ్యాయని, భవనాలు, బహుళ అంతస్తులు వెలుస్తున్నాయని వినతులు సమర్పించారు. హైడ్రా కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో కూడా చాలామంది చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రాత పూర్వక ఫిర్యాదులను అందజేశారు. ఈ మేరకు హైడ్రా రాజధానికి సమీపంలోని చాలా చెరువులు ఆక్రమణకు గురైనట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. ఆక్రమణదారులు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో సుమారు 200 చెరువులను, చెరువు శిఖం భూములను, బఫర్‌జోన్లలో పెద్ద ఎత్తున వెంచర్లు వేసి, రూ.వందల కోట్లు ఆర్జించారు. అసలు విషయం తెలియక స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకొన్న సామాన్య, మధ్యతరగతి ప్రజలు మాత్రం ఆర్థికంగా నష్టపోతున్నారు. వర్షాకాలంలో ఈ కాలనీలు, అపార్ట్‌మెంట్‌లు జలాశయాలుగా మారుతున్నాయి. హబ్సిగూడ, రామంతాపూర్ చెరువును ఆనుకొని ఏర్పడిన మూడు కాలనీలు ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మునకేస్తున్నాయి. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ప్రగతినగర్, నిజాంపేట్, గాజుల రామారం, సరూర్‌నగర్, మేడ్చల్, దమ్మాయిగూడ, వెంకటాపూర్, బోడుప్పల్, ఫీర్జాదిగూడ, టోలిచౌకి, గుండ్లపోచంపల్లి,



జల్‌పల్లి, బడంగ్‌పేట్, నాచారం, ఉప్పల్, చెంగిచర్ల, మల్కాజిగిరి, ఘట్కేసర్, పోచారం తదితర ప్రాంతాల్లో చెరువులు అదృశ్యమై కాలనీలు పుట్టుకొచ్చాయి.

అంతంతే..

శివారుల్లో చెరువులు, కుంటల ఆక్రమణలు ,ప్రభుత్వ భూముల కబ్జాలపై ఫిర్యాదులు చేసినప్పుడు , కథనాలు వచ్చినపుడు లేదా ఉన్నతస్థాయి ఒత్తిళ్లు వచ్చినప్పుడు మాత్రమే ఇరిగేషన్, రెవెన్యూ యంత్రాంగం కదలి తూతూ మాత్రంగా కూల్చివేతలకు శ్రీకారం చుట్టి .. రాజకీయ పెద్దల జోక్యంతో చేతులు దులుపేసుకుంటున్నారు. కొన్ని చోట్ల కూల్చివేతలకు చేపట్టినా కొంత కాలం తర్వాత తిరిగి నిర్మాణాలు కొనసాగుతున్నాయి. శాఖల మధ్య సమన్వయ లోపం కబ్జాదారులకు అనువుగా మారుతోంది. హైడ్రా ఏర్పడిన తర్వాత కబ్జాదారులు, భూఆక్రమణ దారుల్లో వణుకు మొదలైంది. ఎప్పుడు తమ బండారం బయట పడి అక్రమ కట్టడాలు నేలమట్టమవుతాయోనని బిక్కుబిక్కుమంటున్నారు.

ఆక్రమణలో..

- మేడ్చల్ నియోజకవర్గంలోని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 'రా'చెరువు, చింతల చెరువులోని బఫర్ జోన్లను దర్జాగా కబ్జా చేసి, బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టారు. చెంగిచర్ల బస్సు డిపో సమీపంలో ఉన్న చెరువు కట్టను ధ్వంసం చేసి... బహుళ అంతస్తుల భవనాలను నిర్మించటం వల్ల సమీపంలోని కాలనీలు జలమయం కాగా, రోడ్లన్నీ అధ్వాన్నంగా మారాయి.
- పోచారం పురపాలక సంఘం పరిధిలోని వెంకటాపూర్ నాడెం చెరువు ఆక్రమణకు గురికావటంతో బహుళ అంతస్తులు వెలిశాయి.
- దమ్మాయిగూడ, నాగారం,బోడుప్పల్, పీర్జాదిగూడ, ఘట్కేసర్ పురపాలక సంఘాల పరిధిలోని చెరువు భూముల్లో కూడా అక్రమంగా భవనాలు వెలిశాయి. రెవెన్యూ, నీటి పారుదల, పురపాలక శాఖల మధ్య సమన్వయం లేకపోవటం వల్లే ఈ కబ్జాల పర్వం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
- కుత్బుల్లాపూర్, గాజుల రామారం, కూకట్‌పల్లి, ఉప్పల్ సర్కిళ్లలో వరదలతో కాలనీలన్నీ జలమయంగా మారినప్పుడల్లా... చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్ పరిధితో ఉన్న పలు అక్రమ కట్టడాలను మొక్కుబడిగా కూల్చివేస్తున్నారు. వీరి అలసత్వాన్ని అవకాశంగా తీసుకుంటున్న కబ్జారులు కోర్టు కెళ్లుతుండటంతో వాటి జోలికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది.


నాసిమ్ చెరువు


నాసిమ్ చెరువు (దమ్మాయిగూడ)

స్లో బైక్ రేస్.. ముగ్గుల పోటీలు



మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మండలం రావల్‌కోల్ గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఐద్వా, జీఎంపీఎస్‌ల ఆధ్వర్యంలో గ్రామస్తులకు స్లో బైక్ రేసింగ్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు ముగ్గుల పోటీలు, యువకులు స్లో బైక్ రేసింగ్‌లో పాల్గొన్నారు. విజేతలకు సినీనటులు కోటేశ్వర్‌రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి నరేశ్, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ యాదవ్ బహుమతులు ప్రదానం చేశారు. ముగ్గుల పోటీల విజేతలకు పట్టుచీరలు అందజేయగా, స్లో బైక్ రేసింగ్ పోటీలో విజేతకు రూ.3 వేల నగదుతోపాటు హెల్మెట్, ద్వితీయ బహుమతి రూ.2 వేలు, తృతీయ బహుమతి రూ.వెయ్యితోపాటు హెల్మెట్ అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాజశేఖర్, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి కొమురయ్య, మాజీ వైస్ ఎంపీపీ గోపని వెంకటేశ్, నాయకులు యాదగిరి, రాజకుమారి, భాషమ్మ, బాలమణి, గ్రామస్తులు పాల్గొన్నారు.



గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంట్రన్స్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల గురుకుల పాఠశాలలకు డిమాండ్ పెరిగిందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికిగాను ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2025 పోస్టర్‌ను ఎమ్మెల్యే శ్రీగణేశ్ అధికారులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంట్రన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినవారికి మాత్రమే అడ్మిషన్‌లు, ఉచిత భోజన, వసతి సదుపాయాలు, ఉత్తమ బోధన అవకాశాలు కల్పిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో 5 వ తరగతి, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో ఆరు నుంచి తొమ్మిదవ తరగతి, గౌలిదొడ్డి, అలుగునూర్‌లలోని కాలేజ్ ఫర్ ఎక్సలెన్స్‌లో 9వ తరగతి, ఖమ్మం, పరిగిలోని స్కూలు ఆఫ్ ఎక్సలెన్స్‌లో 8వ తరగతి, రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజిగిరి ఫైన్ ఆర్ట్స్ స్కూళ్లలో 6 తరగతి ప్రవేశాల కోసం ప్రభుత్వం కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తోందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి ఒకటవ తేదీలోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే httpr://tfcet.cff.gov.in ద్వారా సమర్పించాలి. పరీక్షను ఫిబ్రవరి 23వ తేదీన నిర్వహిస్తారు. కులం, ఆదాయం, బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్ నెంబరు, ఒక ఫొటో జత చేయాలి. కార్యక్రమంలో మహేంద్ర హిల్స్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నరసింహులు గౌడ్‌తోపాటు దివ్య, రంజిత్, రవీందర్ పాల్గొన్నారు.


గురుకుల పాఠశాలల ప్రవేశాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

ఫిబ్రవరి 2న రేడియాలజీ జాతీయ సదస్సు

లక్డీకాపూల్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ ఫౌండర్ డైరెక్టర్ పద్మశ్రీ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు శత జయంతి సందర్భంగా వచ్చే నెల 2న క్రైస్ట్ ఆడిటోరియంలో ఒక రోజు రేడియాలజీ జాతీయ సదస్సును సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ తెలంగాణ శాఖ, నిజాం వైద్య విజ్ఞాన సంస్థ సంయుక్తంగా నిర్వహించనున్నారు. సదస్సులో డాక్టర్ జె.జగన్మోహన్ రెడ్డి, డాక్టర్ విజయానంద్ ఎచ్ కేల్కరి, డాక్టర్ రామ కృష్ణ, డాక్టర్ రావూరి పవర్, డాక్టర్ పన్నీర్ సెల్వం, గద్దం గంగాధర్, అర్జున్ మంజే గౌడ డాక్టర్ సుజాత పట్నాయక్ వివిధ అంశాలపై ఉపన్యాసాలు ఇవ్వనున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి రేడియాలజీ విద్యార్థులు వేర్వేరు అంశాల్లో పరిశోధనాపత్రాలు సమర్పించనున్నారు. ఉత్తమ పరిశోధనాపత్రం సమర్పించినవారిని ప్రొఫెసర్ కాకర్ల ఉత్తమ శాస్త్రీయ పత్రం పేరిట నగదు బహుమతి, మెమెంటోతో సత్కరిస్తారు. రేడియాలజీ విభాగంలో ఉత్తమ సేవలు అందించిన రేడియోగ్రాఫర్‌కు డాక్టర్ కాకర్ల జీవన సాఫల్య అవార్డు ప్రదానం చేస్తారు.

శంకర్ కె.భగత్‌కు ప్రొఫెసర్ కాకర్ల అవార్డు

ఈ ఏడాది ఈ అవార్డును ముంబైలోని టాటా మెమోరియల్ ఆసుపత్రి టెక్నికల్ ఆఫీసర్, మహారాష్ట్ర వైద్య అనుబంధ వృత్తి మండలి సభ్యులు, సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ జాతీయ సమన్వయకర్త శంకర్ కె.భగత్‌కు అందజేయనున్నారు. సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, రేడియో డయాగ్నోసిస్ విభాగపు అధిపతి డాక్టర్ అను కపూర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిమ్స్ వైద్య అనుబంధ వృత్తి కళాశాల ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాస్, సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ అకడమిక్ డైరెక్టర్, చైర్‌పర్సన్ దామోదర నాయుడు పాల్గొన్నారు. సదస్సులో దాదాపు నాలుగు వందల మంది సాంకేతిక నిపుణులు, విద్యార్థులు పాల్గొనున్నారు.

మహిళా స్ఫూర్తి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: మహిళా స్ఫూర్తి అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. వివిధ రంగాల్లోసేవలందిస్తున్న మహిళలు అవార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చు. శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 19న జరిగే సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమంలో ఎంపికైన మహిళలకు అవార్డులను అందచేయనున్నట్లు సొసైటీ చైర్మన్ డాక్టర్ కమలమనోహర్ తెలిపారు. గతంలో చేసిన సేలను, పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను 9392937486 నంబర్‌కు వాట్సాప్ చేయవచ్చు.

సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్ష ఫలితాల విడుదల

సత్తా చాటిన సూర్యాపేట జిల్లా విద్యార్థులు


సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న డాక్టర్ ఏఎస్‌రావు అవార్డ్స్ కౌన్సిల్ ప్రతినిధులు

కాప్రా: డాక్టర్ ఏఎస్‌రావు అవార్డ్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 34వ సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్ష ఫలితాలు విడుదల చేశారు. 2024 డిసెంబర్ 29న ఏపీ, తెలంగాణలోని 9వ, 10వ తరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్ష నిర్వహించారు. డాక్టర్ ఏఎస్‌రావు అవార్డ్స్ కౌన్సిల్ సంస్థ ఏఎస్‌రావునగర్‌లోని కార్యాలయంలో బుధవారం వివరాలు వెల్లడించింది. మొత్తం 214 మంది విద్యార్థులు అర్హత సాధించారు. 9వ తరగతిలో సూర్యాపేటకు చెందిన కొమ్ము కార్తికేయ మొదటి ర్యాంక్ సాధించగా, వలుపుల వైష్ణవి(సూర్యాపేట) ద్వితీయ ర్యాంక్, రామరాజు వెంకట్ సాయి ప్రణవ(సూర్యాపేట) తృతీయ ర్యాంక్ సాధించారు. 10వ తరగతిలో రాజమండ్రికి చెందిన కశ్యప వంశీ ఇళ్ల మొదటి ర్యాంక్, పూజేంద్ర వడ్లమూడి(రాజమండ్రి) ద్వితీయ ర్యాంక్, సూర్యాపేటకు చెందిన యాతం ప్రజ్ఞారెడ్డి తృతీయ ర్యాంక్ సాధించారు. వీరితోపాటు మొత్తం తెలుగు రాష్ట్రాల్లో 9వ తరగతిలో 19 ర్యాంకులు, 10వ తరగతిలో 18 ర్యాంకులు ప్రకటించారు. ఈ ఫలితాల్లో మొదటి ర్యాంక్ సాధించినవారికి రూ. 25 వేలు, ద్వితీయ ర్యాంక్ సాధించిన వారికి రూ. 15 వేలు, తృతీయ ర్యాంక్ సాధించినవారికి రూ.10 వేలు అందించనున్నారు. ఈ నగదు ప్రోత్సాహక బహుమతులు ఫిబ్రవరి 9న ఏఎస్‌రావు నగర్‌లోని డాక్టర్ హోమి.జె.బాబా కమ్యూనిటీ హాల్‌లో విద్యార్థులకు అందించనున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ ఈఎస్‌వీఆర్‌కే చౌదరి, కార్యదర్శి కె.రామరాజు, ఉపాధ్యక్షుడు కె.లక్ష్మణరాజు, సంయుక్త కార్యదర్శులు సి.చంద్రశేఖరం, వైవీ సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు ఎంటీకే హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ సైంటిఫిక్ హబ్‌గా హైదరాబాద్



విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి డాక్టర్ ఔసఫ్ సయీద్

సాక్షి,సిటీబ్యూరో: ఒకప్పుడు ముత్యాల నగరంగా పేరొందిన హైదరాబాద్ ప్రపంచ వైజ్ఞానిక పటంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంటోందని భారత విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి డాక్టర్ ఔసఫ్ సయీద్ అన్నారు. బుధవారం సెంట్రల్ హైదరాబాద్‌లోని మీడియా ప్లస్ ఆడిటోరియంలో జరిగిన మీడియా ప్లస్ ఫౌండేషన్ రజతోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. గ్లోబల్ రీసెర్చ్ కమ్యూనిటీలో నగరానికి పెరుగుతున్న ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ముస్లిం విద్యార్థులు కూడా మెడిసిన్, ఇంజనీరింగ్ వంటి రంగాలకు అతీతంగా తమ విద్యాపరిధిని ఇతర కోర్సులకు విస్తరించుకోవాలని పిలుపునిచ్చారు. మెస్కో మాజీ కార్యదర్శి దివంగత డాక్టర్ ఫకృద్దీన్ మహమ్మద్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లో ముస్లిం సామాజిక వర్గం నిర్వహిస్తున్న విద్యాసంస్థలు ఆదర్శప్రాయమని అన్నారు. ఈ సందర్భంగా విద్యా, ఆర్థిక పురోగతిని పెంపొందించడానికి మెస్కో మిషన్ చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ తబ్రేజ్ హుస్సేన్ తాజ్ రచించిన హయత్ అజ్మ్–ఓ–హిమ్మత్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ సయ్యద్ ఫాజిల్ హుస్సేన్ పర్వేజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మెస్కో ప్రెసిడెంట్ నవాబ్ అహ్మద్ ఆలం ఖాన్, ఉస్మానియా కార్డియాలజీ విభాగం అధిపతి సనా కుతుబుద్దీన్, డాక్టర్ అక్బర్ మహ్మద్, డాక్టర్ అల్తాఫ్ అక్బర్, డాక్టర్ ఇమాముద్దీన్, డాక్టర్ సయ్యద్ ఖాలీద్ షాబాజ్, హనీఫ్ అహ్మద్ డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ రషీద్ జునైద్ తదితరులు పాల్గొన్నారు.


ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీకి 9వ పేటెంట్ మంజూరు


పేటెంట్ సాధించిన డిజైన్ టేబుల్ టాప్ డిజైన్ యాక్సెసరీ ఇదే


ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ డాక్టర్ రాంబాబు ముప్పిడి

రాయదుర్గం: ఫుట్‌వేర్ డిజైన్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ)లోని ఫ్యాకల్టీ డాక్టర్ రాంబాబు బృందానికి 9వ పేటెంట్ లభించింది. ఈ మేరకు డాక్టర్ రాంబాబు బుధవారం వివరాలు వెల్లడించారు. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ లెదర్ గూడ్స్ యాక్సెస్టడీస్ డిజైనింగ్ విభాగంలో అధ్యాపకుడు డాక్టర్ రాంబాబు ముప్పిడితోపాటు ఆయన బృందం తయారు చేసిన టేబుల్ టాప్స్ డిజైన్ యాక్సెసరీస్‌కుగాను భారతీయ డిజైన్ పేటెంట్ అందజేశారు. వీరు తయారు చేసిన డిజైన్ నమూనాను వీక్లీ మ్యాగజైన్‌లో ప్రచురించడం విశేషం. దీంతోపాటు ఆయనకు భారతదేశ ప్రభుత్వం పేటెంట్ డిజైన్ రిజిస్ట్రేషన్ విభాగం నుంచి సర్టిఫికెట్‌ను కూడా పంపించడం మరో విశేషం. డాక్టర్ రాంబాబుతోపాటు సుజీవన్‌కుమార్, డాక్టర్ యోగేష్‌బాబు సారథ్యంలోని బృందం టేబుల్ యాక్సెసరీస్ గురించి పరిశోధన చేసి నమూనాను తయారు చేసింది. టేబుల్‌పై ఆకర్షణీయంగా పెట్టుకునే ఉత్పత్తిలపైన డిజైన్ రూపకల్పన(టేబుల్ టాప్ డెకొరేటివ్ ఆర్టికల్) యాక్సెసరీస్ డిజైన్ అంశాలను గ్రూపుగా డిస్కషన్ చేసి దీనిని రూపొందించారు. ఆయనను ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్‌లోహిత్‌రెడ్డి, ఫ్యాకల్టీ ప్రతినిధులు అభినందించారు.

'పద్మ భారతీలు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హరికిరణ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: పద్మ అవార్డు గ్రహీతలు దేశం నిజమైన వైవిధ్యానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక నమూనా అని ఇండిక పబ్లిషర్స్ వ్యవస్థాపకులు వడ్లమాని హరికిరణ్ అన్నారు. బుధవారం అబిడ్స్‌లోని గ్రాండ్ హోటల్‌లో ప్రముఖ వ్యాసకర్త జె.జిన్న వివిధ వ్యాసాల సంకలనం 'పద్మ భారతీలు'పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ భారతీయుల విశేషమైన విజయాలను తన వ్యాసాలతో ఎంతో చక్కగా వివరించారని కొనియాడారు. భారతదేశం ఎంతో శక్తివంతమైన గొప్ప సంప్రదాయాలతో ముడిపడి ఉన్న దేశమని అన్నారు. తరతరాలుగా వారి సంస్కృతి, సంప్రదాయాలు, అనుభవ జ్ఞానాన్ని గౌరవిస్తూ స్థిరమైన మార్పును విశ్లేషిస్తూ రాయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ హోటల్ ఎండీ జె.జినా తదితరులు పాల్గొనారు.

రైతుకు జాతీయహోదా కల్పించేదాకా పోరు


ప్రజా జీవన రైతు పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు చుండి శోభన్‌బాబు

లాలాపేట: దేశానికి వెన్నెముక అయిన రైతుకు జాతీయహోదా కల్పించాలని తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చుండి శోభన్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం తార్నాక చౌరస్తాలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ఆ పార్టీలో చేరగా వారికి శోభన్‌బాబు కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు గత ఎన్నికల ముందు గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామంటే ఇదే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం గడుస్తున్నా ఇంకా రెండు లక్షల రుణమాఫీ చేయలేదని విమర్శించారు. రైతుల జీవితాలతో చెలగాటం ఆడవద్దని ఆయా పార్టీలను శోభన్‌బాబు హెచ్చరించారు. రైతులంతా ఆలోచించి వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో ప్రజాజీవన రైతు పార్టీ తరపున స్వచ్ఛందంగా ఎన్నికల్లో పోటీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 16, జనవరి, 2025





అలవోకగా..

- 1.54 నిమిషాలు.. 196 దేశాల పేర్లు ఉచ్చారణ
- 118 రసాయన మూలకాల పఠనం కూడా..
- తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నెలకొల్పిన అద్వైత్ రాజు
- అందర్నీ అబ్బురపరుస్తున్న యూకేజీ పిల్లాడి ప్రతిభ

సాక్షి, సిటీబ్యూరో: స్కూల్‌కు వెళ్లే వయసు కూడా రాలేదు కానీ.. ప్రపంచ దేశాలు, రాజధానుల పేర్లు చెబుతూ అందర్నీ అబ్బురపరుస్తున్నాడు ఈ చిచ్చర పిడుగు. పెద్దోళ్లే సరిగా పలకలేని రసాయన మూలకాల పేర్లను సులువుగా వివరిస్తూ ఆశ్చర్యపరుస్తున్నాడు అద్వైత్ రాజు. 1.54 నిమిషాల వ్యవధిలోనే 196 దేశాల పేర్లను అలవోకగా చెప్పడంతో పాటు ఆయా దేశాల జెండాలనూ గుర్తించాడు. అలాగే మరో ప్రయత్నంలో 8 నిమిషాల్లోనే 196 దేశాలతో పాటు వాటి రాజధానులను చెప్పేశాడు. 1.60 నిమిషాల వ్యవధిలోనే హైడ్రోజన్, లిథియం వంటి 118 రసాయన మూలకాలు, వాటి పరమాణు సంఖ్యలతో కూడిన ఆవర్తన పట్టికను ఉచ్చారించి రికార్డు నెలకొల్పాడు. 4 సంవత్సరాల 6 నెలల వయసులో ఈ ఘనత సాధించి బాస్కే అద్వైత్ రాజు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. ఈమేరకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ 13వ వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల బొగ్గుల కుంటలో జరిగిన వేడుకలో ఆ చిన్నారిని హైదరాబాద్ అదనపు కలెక్టర్ వెంకటాచారి, ఏసీపీ ఎం.కిరణ్ కుమార్ సత్కరించారు.

తొలి గురువు తల్లే..

బాస్కే రాజు, అరుణ దంపతులకు చిన్న కొడుకైన అద్వైత్ రాజుకు జ్ఞాపకశక్తి ఎక్కువ. సాధారణంగానే చిన్నపిల్లలు టీవీల్లో వచ్చే పాపులర్ సినిమా డైలాగ్‌లు చూసి వాటినే వల్లెవేస్తుంటారు. అద్వైత్ కూడా అలాగే చెప్పేవాడు కానీ, ఒకసారి విన్న డైలాగ్ అయినా సరే ఎన్ని రోజులకు అడిగినా సరే ఠక్కున చెప్పేవాడు. చిన్నతనం నుంచే సంగ్రహణ జ్ఞాపకశక్తి ఉందని గ్రహించిన తల్లి ఆ జ్ఞాపకశక్తిని చదువుపైకి మళ్లించింది. స్కూల్‌కు వెళ్లే వయసు రాకపోయే సరికి.. ఇంట్లోనే ఉంటూ ప్రతిరోజూ దేశాలు, రాజధానుల గురించి చెబుతుండేది. దీంతో అనతికాలంలో చిన్నారికి అవన్నీ వంటబట్టేశాయి. 15 రోజుల క్రితమే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ పోటీలోనూ సత్తా చాటాడు. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన ఉండనుంది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సంపాదించడమే లక్ష్యమని చిన్నారి తల్లిదండ్రులు చెబుతున్నారు.



మతిస్థిమితం కోల్పోయిన మానసిక వికలాంగులకు, అనాథలకు అండగా నిలుస్తోంది.. ఏ చిరునామా లేని అభాగ్యులకు ఓ కేరాఫ్ అడ్రస్‌గా మారింది.. రుచికరమైన భోజనం వడ్డించడంతో పాటు దుస్తులు, పడుకునేందుకు మంచం, దుప్పటి వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది.. తమకు ఎవరూ లేరనే బాధ నుంచి అక్కడ ఉన్నవారంతా తమవారే అన్న భరోసా ఇస్తోంది.. కుల మత, భాషా బేధాలతో సంబంధం లేకుండా అభాగ్యులందరినీ చేరదీస్తోంది. అంతేకాదు అనాథ మృతదేహాలకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథ మానసిక దివ్యాంగుల ఆశ్రమం. – బడంగ్‌పేట్

అభాగ్యులకు అమ్మలా..

మాతృదేవోభవ

'ఈయన పేరు డి.శివుడు. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామం. ఆరేళ్ల క్రితం మతిస్థిమితం కోల్పోయి.. ఇంటి నుంచి బయటికి వచ్చాడు. ఊరే కాదు చివరకు జిల్లా సరిహద్దులు దాటుకుని చివరకు ఉప్పల్ చేరుకున్నాడు. రోడ్డు వెంట అనాథగా తిరుగుతున్న ఆయనను మాతృదేవోభవ ఆశ్రమ నిర్వాహకులు చేరదీశారు. ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయానికి తరలించి వైద్యం అందించారు. కోలుకున్న తర్వాత బంధువులకు అప్పగించారు. ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటూ వృద్ధాప్యంతో మంచం పట్టిన తల్లికి సపర్యలు చేస్తున్నాడు'



- రోడ్లపక్కన జీవిస్తున్న శరణార్థులను చేరదీస్తూ..
- మతిస్థిమితం లేని వారికి ఆశ్రయం కల్పిస్తూ..
- అనాథ శవాలకు దహన సంస్కారాలు చేస్తూ..
- తల్లిలా సేవలందిస్తున్న 'మాతృదేవోభవ' సంస్థ



ఒక్కరితో 2018లో ప్రారంభమైన ఈ ఆశ్రమ సేవలు ప్రస్తుతం 150 మందికి చేరుకున్నాయి. మధ్య వయసులో మతి స్థిమితం కోల్పోయి.. జుట్టు, గడ్డాలు, మీసాలు పెరిగి గుర్తుపట్టలేని స్థితిలో అర్ధనగ్నంగా వీధుల్లో సంచరిస్తున్న వారితో పాటు నగరంలోని ప్రధాన రోడ్ల వెంట, డ్రైనేజీలు, చెత్త డబ్బాల పక్కన దీనంగా పడి ఉన్న అనాథలను ఆశ్రమానికి తరలిస్తున్నారు మాతృదేవోభవ సంస్థ నిర్వాహకులు. ఎర్రగడ్డ మానసిక వైద్యశాలకు తరలించి, మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. కోలుకున్న వారిని తిరిగి ఇళ్లకు పంపుతున్నారు. ఇలా ఇప్పటి వరకు 280 మందికి పునర్జన్మను ప్రసాదించారు. ఆశ్రమ సేవలు గుర్తించిన సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు ఇక్కడికి విచ్చేసి వారు కూడా అభాగ్యులకు సేవలు అందిస్తుండటం విశేషం. పండగలు, పర్వదినాలు, పుట్టిన రోజులు ఇలా అన్ని సందర్భాల్లోనూ వారు భాగస్వాములు అవుతున్నారు.



నాడు

'చిత్రంలో కనిపిస్తున్న ఇతడి పేరు వట్టేం రమేష్. ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం, శివపురం గ్రామం. నాలుగేళ్ల క్రితం మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. వివిధ ప్రాంతాలు తిరుగుతూ చివరకు నగరానికి చేరుకున్నాడు. మాతృదేవోభవ అనాథ ఆశ్రమ నిర్వాహకులు చేరదీసి ఆశ్రమం కల్పించారు. అతడికి మెరుగైన చికిత్సతో పాటు ప్రశాంత వాతావరణం కల్పించడంతో నాలుగేళ్లకు ఆరోగ్యం కుదుటపడింది. కుటుంబ వివరాలు తెలుసుకుని, చివరకు వారికి అప్పగించారు. ప్రస్తుతం సొంత భూమిలో వ్యవసాయం చేసుకుంటూ సంతోషంగా జీవిస్తున్నాడు'



నేడు



నాడు

'చిత్రంలోని ఈయన పేరు కావూరి నాగభూషణం. పశ్చిమగోదావరి జిల్లా పోలమూరు మండలం నాగిళ్లదిబ్బ గ్రామం. ఆరు సంవత్సరాల క్రితం మతిస్థిమితం కోల్పోయి బంజారాహిల్స్ చేరుకున్నాడు. చినిగిన దుస్తులు, మాసిన గడ్డం, పెరిగిన జుట్టుతో తనలో తానే ఏదో మాట్లాడుకుంటూ.. తిరుగుతూ కన్పించాడు. మాతృదేవోభవ ఆశ్రమం నిర్వాహకులు ఆయనను చేరదీసి, ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం కుదుటపడిన తర్వాత కుటుంబ సభ్యుల వివరాలు తెలుపగా.. ఆశ్రమ నిర్వాహకులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆ తర్వాత ఆయన్ను బంధువులకు అప్పగించారు. ప్రస్తుతం సొంత ఊరిలో రెండు ఆవులను చూసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయం చేసుకుంటున్నాడు'



నేడు



అనాథ శవాలకు అంతిమ సంస్కారాలు

ఏదైనా ప్రమాదాల్లో చనిపోయిన అనాథ శవాలనే కాకుండా ఆశ్రమంలో ఉంటూ వృద్ధాప్యం, ఇతర అనారోగ్య కారణాలతో చనిపోయిన వారికి ఆయా మతాల సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. అంతిమ యాత్రలో మాతృదేవోభవ అనాథ ఆశ్రమం వ్యవస్థాపకుడు గిరితో పాటు అతడి భార్య ఇందిర, అమ్మ ముత్తమ్మ, కొడుకు అభిరాం, కూతురు లోహిత ఆ నలుగురిలా వ్యవహరిస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు 60 మంది మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. సేవలను గుర్తించిన పలు సంస్థలు గిరిని గౌరవ డాక్టరేట్‌తో పాటు 300 అవార్డులతో సత్కరించాయి.





కొంత స్థలం కేటాయించాలి

శాశ్వత భవనం లేకపోవడంతో ఖాళీ స్థలాన్ని అద్దెకు తీసుకుని తాత్కాలిక షెడ్లు వేసి, వాటిలో వసతి కల్పిస్తున్నాం. స్థలం కేటాయిస్తే మరింత మందికి సేవలు అందిస్తాం. ఆశ్రమంలో ఉన్న వాళ్లకు వృద్ధాప్య పెన్షన్ సహా ఆరోగ్యశ్రీ కార్డు, రేషన్ బియ్యం ఉచితంగా అందజేయాలి.

– గట్టు గిరి, 'మాతృదేవోభవ' ఆశ్రమ వ్యవస్థాపకుడు





మినీ శిల్పారామంలో.. నృత్యోత్సాహం

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గంగిరెద్దుల నృత్యాలు, జంగమ దేవరులు, ఎరుకలసాని, బుడబుక్కల తదితరులు కళా ప్రదర్శనలు బుధవారం కనువిందు చేశాయి. రమణి సిద్ధి ఆధ్వర్యంలో కిరణ్మయి, బాలాజీ శిష్య బృందంచే నిర్వహించిన అంశాలు అలరించాయి. కళాకారులు మైథిలి శరణ్య, స్వప్న, శ్రీనిజ, అర్వీ, శాన్వి, శ్రేయ తదితరులున్నారు.



కొత్త బంగారు లోకం..

అనాథ చిన్నారులకు ఆహ్వానం

- అనాథ బాలల టూరిజం ఎక్స్ఛేంజ్
- హైదరాబాద్ నుంచి చెన్నైకి ఎన్జీఓ చిన్నారులు
- విధిగా హైదరాబాద్‌కు అక్కడి పిల్లలు..
- వినూత్న సంస్కృతికి నాంది పలికిన వాల్మీకి సంస్థ, చెన్నైకి చెందిన స్కల్
- విజ్ఞానం, వినోదం, మానసిక తోడ్పాటుకు వేదిక

సాక్షి, సిటీబ్యూరో: మన చుట్టూనే ప్రేమ, ఆదరణ నోచుకోని బాల్యాలెన్నో.., తల్లిదండ్రులు లేకపోవడం వలనో, పేదరికం కారణంగానో అనాథ శరణాలయాల్లో ఆశ్రయం పొందుతున్న చిన్నారులు ఎందరో.. అందమైన భవిష్యత్ కోసం కలలు కంటూ, ఉన్న అవకాశాలను వినియోగించుకుంటూ ముందుకు సాగుతుంటాయి ఆ పసి హృదయాలు. ఆ పిల్లలకు ప్రపంచ విజ్ఞానం, సంస్కృతుల సమ్మేళనం, ప్రస్తుత ఆధునిక జీవన శైలి గురించి తెలియాల్సిన అవసరం ఉందని కొందరి ఆలోచన. ఈ నేపథ్యంలో వివిధ రాష్ట్రాల్లోని అనాథ చిన్నారులను హైదరాబాద్‌కు ఆహ్వానించి, విలాసవంతమైన ఆతిథ్యమిచ్చి వారి సంతోషాలకు, విజ్ఞానానికి ప్రోత్సాహం అందించే 'యూనిటీ–ఎక్స్' అనే అద్భుత ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఇక్కడి చిన్నారులను సైతం వివిధ నగరాలకు తీసుకెళ్లే నూతన సంస్కృతికి నాంది పలికారు.



విజ్ఞాన, వినోదం..

గతేడాది సెప్టెంబర్ నెలలో చెన్నైలోని ఫరెవర్ ట్రస్ట్‌కు చెందిన 45 మంది చిన్నారులు నగరానికి చేరుకుని 4 రోజుల విజ్ఞాన, వినోద పర్యటనను ఆస్వాదించారు. ఈ యూనిటీ–ఎక్స్ ప్రాజెక్ట్‌లో భాగంగా నగరంలోని పర్యాటక ప్రాంతాలు, పరిశోధన కేంద్రాలను వీక్షించారు. అదేవిధంగా కొద్ది రోజుల క్రితమే నగరంలోని వాల్మీకి గురుకుల్‌కు చెందిన 20 మంది చిన్నారులు చెన్నైకి సుసంపన్నమైన యాత్ర చేశారు. ఐకమత్యం, కల్చరల్ ఎక్స్ఛేంజ్‌లో భాగంగా ఈ చిన్నారులు ఎన్నో మధుర జ్ఞాపకాలను, సామాజిక–వాస్తవిక అవగాహన పెంచుకుంటున్నారు. ఇలాంటి వినూత్న ప్రాజెక్టును హైదరాబాద్‌లోని వాల్మీకి ట్రావెల్ అండ్ టూరిజం సొల్యూషన్స్ ఆధ్వర్యంలో డాక్టర్ హరి కిషన్ వాల్మీకి ప్రారంభించారు. ఈ గొప్ప ప్రయత్నానికి చెన్నైలోని స్కల్ ఇంటర్నేషనల్ సంస్థ కూడా భాగస్వామిగా చేరింది. ఈ సంస్థల సీఎస్ఆర్ నిధులతో యూనిటీ–ఎక్స్ ప్రాజెక్టును నిర్వహిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా జీఆర్‌టీ రాడిసన్, టెంపుల్ బే, రెయిన్ ట్రీ, ది పార్క్ హోటల్, రెసిడెన్సీ హోటల్స్ తదితర 5–స్టార్ హోటళ్లలో బస చేయడం, అక్కడి ఆహారాన్ని విందు చేయడం, విలాసవంతమైన బెంజ్ బస్సులతో గరుడ లాజిస్టిక్స్‌లో ప్రయాణం చేయడం వంటి అవకాశాలను కల్పిస్తున్నారు. ముఖ్యంగా విద్య, విజ్ఞానం, కెరీర్ సెమినార్స్ తదితర అంశాల్లో అవకాశాలు కల్పిస్తున్నారు.

ఆలోచన మారింది..

మా ఆశ్రమం తప్ప మరే ప్రపంచం తెలియని మేమంతా చెన్నై వెళ్లడం మంచి అనుభూతి. ఈ ప్రయాణం విజ్ఞానంతో పాటు చెన్నైలో మంచి మిత్రులనూ చేరుకునేలా చేసింది. మళ్లీ అక్కడి పిల్లలు హైదరాబాద్ రావడం కుటుంబ సభ్యులను కలిసినట్లే అనిపించింది. యూనిటీ–ఎక్స్ నా ఆలోచనా విధానాన్ని, భవిష్యత్ ప్రణాళికలను మార్చింది. ప్రపంచం చాలా పెద్దది, అవకాశాలకు కొదువ లేదు అనే నమ్మకాన్ని ఇచ్చింది.

– మారుతి, వాల్మీకి గురుకుల్ విద్యార్థి

ఐక్యతకు నిదర్శనంగా..

ప్రేమ, ఆదరణ పొందకపోవడమే కాకుండా సామాజికంగా నిర్లక్ష్యానికి గురైన పిల్లలు ఈ అనాథలు. వారిని భావిపౌరులుగా తీర్చిదిద్దాలనుకుంటే సౌలభ్యాలు, విద్య మాత్రమే సరిపోదు. అధునాతన ప్రపంచం, ఈ తరం జీవనశైలి, సామాజిక పరిపక్వత చాలా అవసరం. ఈ నేపథ్యంలో ఇలాంటి చిన్నారులు సైతం అందరి పిల్లలమాదిరిగానే వారి జీవితాన్ని ఆస్వాదించడంలో ప్రాజెక్ట్ యూనిటీ–ఎక్స్ విశేషంగా కృషి చేస్తుంది. ఈ తరహా కార్యక్రమాలు సామాజిక సమానత్వానికి, ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తాయి.

– డాక్టర్ సూర్య గణేష్ వాల్మీకి, వాల్మీకి ఫౌండేషన్ అధ్యక్షుడు.



- విభిన్న సంస్కృతుల సమ్మిళిత ప్రయాణం, అనుభవాలు, ప్రాక్టికల్ నాలెడ్జ్ కూడా గొప్ప ఉపాధ్యాయుడితో సమానం. ఈ కోణంలోనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వ్యవస్థాపకులు డాక్టర్ హరికిషన్ వాల్మీకి తెలిపారు. మా ప్రయత్నానికి చెన్నైలోని స్కల్ అధ్యక్షుడు షబిన్ సర్వోత్తమ్ వంటి వారు భాగస్వామ్య సహకారం అందించడం శుభపరిణామం అన్నారు. ఈ ప్రాజెక్టును నగరంలోని వాల్మీకి ఫౌండేషన్ పర్యవేక్షిస్తూ, అవసరమైన మద్దతు, సహకారం అందిస్తోంది.

రిషి.. సాఫ్ట్‌వేర్ ఎంప్లాయ్.. ప్రస్తుతం కోనసీమ కోళ్ల పందేల్లో బిజీబిజీగా ఉన్నాడు.. పండుగకు మూడ్రోజుల ముందే ఊరొచ్చేశాడు. ఫుల్‌గా ఎంజాయ్ చేస్తున్నాడు..

ప్రవీణ్.. ప్రభుత్వ ఉద్యోగి.. సొంతూరు జనగామ. భోగి ముందు రోజున వచ్చాడు. చెడ్డీ దోస్తులతో, బంధువులతో సంబరాలు చేసుకుంటున్నాడు.

కిశోర్.. ప్రైవేటు ఉద్యోగి.. తూర్పుగోదావరి జిల్లా.. సేమ్ అందరిలాగే సంక్రాంతి వేడుకల్లో తలమునకలై ఉన్నాడు..

వాళ్లు.. విందులు, వినోదాల్లో.. వీళ్లు.. వీధుల్లో, విధుల్లో..

ఇక్కడా కొందరు తలమునకలై ఉన్నారు.. విందులు, వినోదాల్లో కాదు.. వీధుల్లో.. విధులను నిర్వహిస్తూ తలమునకలై ఉన్నారు. నాన్నెప్పుడొస్తడా అంటూ ఇంట్లో ఎదురుచూస్తున్న పిల్లలను తలచుకుంటూ.. ఊర్లో ఉన్న అమ్మాబాపులను యాది చేసుకుంటూ.. పండుగ రోజున కూడా సెలవు తీసుకోని మన సంరక్షకులు నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూనే ఉన్నారు.

అది ఉప్పల్‌లో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న ఓ పోలీసు కావచ్చు.. గోల్కొండ ప్రభుత్వాస్పత్రిలో ఎమర్జెన్సీ ఆపరేషన్ చేస్తున్న ఒక వైద్యుడు కావచ్చు.. పతంగులు చిక్కుకోవడం వల్ల ఫీడర్‌లో అంతరాయాలు తలెత్తి.. మనకు కరెంట్ పోకుండా చూస్తున్న ఓ విద్యుత్ ఉద్యోగి కావచ్చు.. లేదా.. ఆర్టీసీ, వాటర్ బోర్డు, శానిటరీ సిబ్బంది, టీవీ రిపోర్టర్లు, అత్యవసర విభాగాల్లో పనిచేసేవాళ్లు, మాల్స్‌లో పనిచేసేవారు, స్విగ్గీ, జొమాటో బాయ్స్.. వీళ్లెవరైనా కావచ్చు. పగలు, రాత్రి అని తేడా లేకుండా 'మన కోసం' అలుపెరుగని వీరుల్లా పనిచేస్తూనే ఉన్నారు.

కుటుంబాలకు దూరంగా పండుగ రోజుల్లోనూ విధుల్లో అత్యవసర సర్వీసుల సిబ్బంది..

వాళ్లతో గడపాలని ఉన్నా ప్రజాసేవలో సంతృప్తి దక్కుతోందంటున్న 'అలుపెరుగని వీరులు'

సాక్షి, హైదరాబాద్, గోల్కొండ, ఉప్పల్, జనగామ: సంక్రాంతి పండుగ జరుపుకొనేందుకు హైదరాబాద్ నుంచి లక్షలాదిగా జనం తమ ఊళ్లకు తరలివెళ్లారు. మరో వైపు అత్యవసర సేవలు, మరికొన్ని రంగాల సిబ్బంది మాత్రం విధుల్లోనే బిజీ బిజీగా గడిపారు. పండుగ రోజున కూడా సెలవు లేకుండా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న వీరిని 'సాక్షి' పలకరించింది. వారి మనోగతాన్ని అడిగి తెలుసుకుంది.



పండుగ రోజు.. కరెంట్ పోకుండా..

సంక్రాంతి పండుగ అంటే పతంగులు. ఎగరేసేప్పుడు గాలివేగానికి దారం తెగి పతంగులు అనేక చోట్ల విద్యుత్ లైన్ల మధ్య చిక్కుకుంటాయి. ఇదే సమయంలో పలు ఫీడర్లలో సాంకేతిక లోపాలు తలెత్తి విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. వాటిని వెంటనే సరిచేసి సరఫరాను పునరుద్ధరించాల్సి ఉంటుంది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని గ్రీన్‌లాండ్స్ డివిజన్ సెంట్రల్ బ్రేక్ డౌన్ (సీబీడీ)విభాగం ఏడీఈ చరణ్‌సింగ్ నేతృత్వంలోని బృందం ఫ్యూజ్ ఆఫ్ కాల్ సహా ఎలక్ట్రిసిటీ కంట్రోల్ రూం నుంచి వచ్చే ఫిర్యాదులను అటెండ్ చేస్తూ.. ఎప్పటికప్పుడు లైన్ల మధ్య చిక్కుకున్న గాలిపటాలను తొలగించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే పనిలో నిమగ్నమైంది.



జనం హ్యాపీ అయితే.. మేమూ హ్యాపీ..

మేం డ్యూటీలో ఉన్నామనే ధైర్యంతోనే అనేక మంది రోడ్ల పైకి వస్తుంటారు. పండుగ సందర్భంలో కుటుంబాన్ని మిస్సవుతున్నామనే ఫీలింగ్ మాకూ ఉంటుంది. అయితే ఠాణానే ఇల్లుగా, సహోద్యోగులే కుటుంబీకులుగా ఫీల్ అవుతాం. అక్కడే భోగి మంటలూ వేశాం. మధ్యాహ్నానికే ఇంటికి వెళ్లాలని అనుకున్నా కానీ సొంతూర్లకు వెళ్లే వారి రద్దీ వల్ల అర్ధరాత్రి దాటే వరకు విధుల్లోనే ఉండాల్సి వస్తోంది. మా వల్ల ప్రజలు హ్యాపీగా ఉన్నారనే ఫీలింగే మాకు ఆనందాన్ని ఇస్తుంది. – జి.లక్ష్మీమాధవి, ఉప్పల్ ట్రాఫిక్ సీఐ



అంతకు మించిన ఆనందం ఏముంది?

సంక్రాంతి రోజున హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే రూట్‌లో వివిధ ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహించాం. ప్రజలకు ఇబ్బందులు ఎదురవకుండా చూశాం. పండుగ రోజు పనిచేయడం కొద్దిగా ఇబ్బందే. అయినా రహదారి భద్రత చాలా ముఖ్యం కదా. పండుగ పూట ప్రయాణికులు క్షేమంగా గమ్యం చేరుకోవడాన్ని మించిన ఆనందం ఏముంటుంది.

– శ్రీనివాస్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్



ఉప్పల్ వద్ద వాహనాలను చెక్ చేస్తున్న ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి

ఇంట్లో ఉండాలంటారు.. నాకు వీలవదు..

నాకు పండుగ పూట ఇంట్లో ఉండాలని ఉంటుంది. కానీ విధి నిర్వహణ తప్పదు. నాన్న వస్తాడంటూ ఎదురు చూడటం పిల్లలకు అలవాటైపోయింది. ఇంట్లో ఉండండి అని చాలా సార్లు అడిగారు. నాకు వీలవ్వదుగా.. ఈ మధ్య వాళ్లు అమ్మమ్మ వారింటికి వెళ్లిపోతున్నారు. నేను ఇలా డ్యూటీకి వచ్చేస్తున్నాను. – ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి

ఈ సంతృప్తి ముందు ఏదీ సాటి రాదు..



సొంతూరు వెళ్లి కుటుంబం, బంధువులతో సంక్రాంతి పండుగను జరుపుకోలేక పోతున్నామనే బాధ కొంత ఉంటుంది. అయితే విధి నిర్వహణలో రోగులకు సేవలు అందించడంలో ఉన్న సంతృప్తి ముందు ఏదీ సాటిరాదు. రోగులకు సేవలు అందించడం గర్వంగా ఉంది.
– డాక్టర్ పీవీ శ్రీనివాసరావు, గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్

మేం పనులు చేయకపోతే.. రోడ్లు అధ్వానమే..

మాది వరంగల్ దగ్గరి మైలారం. పండుగలప్పుడు మేం పనులు చెయ్యకపోతే రోడ్లు అధ్వానంగా అవుతయి. అప్పుడెలా? అందుకే మాకు పండుగలప్పుడు సెలవులుండవు. ఊరికి వెళ్లడం కుదరదు.
–జి.బాబమ్మ, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికురాలు



ఇలాంటి సంతృప్తి పోలీసు శాఖలోనే..



పోలీసు ఉద్యోగంలోకి వచ్చి 30 ఏళ్లవుతోంది. దసరా, దీపావళి, రంజాన్, క్రిస్మస్ ఇలా ఎన్నో పండుగల సమయంలో విధుల్లో ఉన్నాను. విధినిర్వహణలో ఎంతో మంది మమ్మల్ని కలిసి శుభాకాంక్షలు తెలుపు తారు. ఇలాంటి సంతృప్తి పోలీసుశాఖలోనే దొరుకుతుంది.తర్వాతి రోజు ఇంట్లో పండుగ జరుపుకొంటాం.
– బి.యాదగిరి, హెడ్ కానిస్టేబుల్, బచ్చన్నపేట, జనగామ జిల్లా

చంద్రబాబుకు వ్యతిరేకంగా నోరు మెదపని సీఐడీ

- గతంలో చంద్రబాబుకు బెయిల్‌ను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్
- ఇప్పుడు చంద్రబాబే సీఎం కావడంతో మిన్నకుండిపోయిన సీఐడీ
- చార్జిషీట్ దాఖలు చేశామని.. బెయిల్ రద్దుపై జోక్యం వద్దన్న రోహత్గీ
- సీఐడీ దాఖలు చేసిన రద్దు పిటిషన్‌ను పరిష్కరించిన సుప్రీంకోర్టు
- విచారణకు సహకరించాలని చంద్రబాబుకు ఆదేశం

వివరాలు, మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగలరు.



హరిహరనాథ శర్మ | లక్ష్మణరావు

ఏపీ హైకోర్టు న్యాయమూర్తులుగా ఇద్దరు న్యాయాధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తుల పోస్టులకు న్యాయాధికారులు (జిల్లా జడ్జీలు) కోటా నుంచి ఇద్దరు న్యాయాధికారుల పేర్లను కేంద్రానికి సిఫారసు చేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తులు జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్మానం చేసింది. జుడిషియల్ అకాడమీ డైరెక్టర్‌గా ఉన్న అవధానం హరిహరనాథ శర్మ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జీ)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ యడవల్లి లక్ష్మణరావును హైకోర్టు న్యాయమూర్తులుగా సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది.

క్యాసినోలా కోళ్ల పందేలు

- ఏపీలో ఊరూ వాడా యథేచ్ఛగా పందేల జోరు.. జూద క్రీడలు
- 3 రోజుల్లో రూ.5 వేల కోట్లకుపైగా దందా
- బరి తెగించి ఆడించిన కూటమి ఎమ్మెల్యేలు
- కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి యథేచ్ఛగా నిర్వహిస్తున్నా పోలీసుల ప్రేక్షకపాత్ర



ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే బండారు ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలోని ప్రభుత్వ స్కూల్లో కోళ్ల పందేలు

సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: ఇటు జూదం.. అటు మద్యం! కోట్లు వెదజల్లితే చాలు కోరినవన్నీ కూర్చున్న చోటకే! ఎక్కడ చూసినా పందెం కోళ్లు.. బెల్టు షాపుల కోలాహలం! గోవా, శ్రీలంక, బ్యాంకాక్ తదితర చోట్ల కళ్లు మిరుమిట్లు గొలిపే క్యాసినోలను మించి ఏపీలో కోడి పందేలు, జూద క్రీడలు బరి తెగించి విచ్చలవిడిగా సాగాయి. కోడి పందేల బరుల వద్ద మినీ బార్లు, మద్యం షాపులను తెరిచి యథేచ్ఛగా బెల్టు అమ్మకాలు సాగించారు. హైకోర్టు ఉత్తర్వులను లెక్క చేయకుండా సంక్రాంతి సంబరాల ముసుగులో ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో టీడీపీ కూటమి పార్టీ ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో అడ్డూ అదుపు లేకుండా నిర్వహించారు. పోలీసులు అటువైపు కన్నెత్తి చూసే సాహసం కూడా చేయలేదు. ఎన్నడూ లేనిది విజయవాడ నడిబొడ్డున రామవరప్పాడులో కోడి పందేలు, పేకాట, గుండాట జోరుగా నిర్వహించినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో సాగించిన ఈ పందేల విలువ ఏకంగా రూ.5 వేల కోట్లకుపైనే ఉంటుందని అంచనా. కోడిపందేల నిర్వహణ పూర్తిగా కూటమి ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలోనే సాగింది. చాలాచోట్ల నేరుగా కూటమి ఎమ్మెల్యేలు, మంత్రులు పాల్గొనగా కొన్నిచోట్ల వారి అనుచరులతో నిర్వహించారు. కోడి పందేలను భారీ ఆదాయ వనరుగా మార్చుకుని కూటమి నేతలు ఈ మూడు రోజులు విజృంభించారు. ఒక్కో బరిపై మూడు రోజుల్లో రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లు పిండుకున్నట్లు తెలుస్తోంది.

పోటాపోటీగా 'గోదావరి'

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,200కిపైగా బరుల్లో కోడి పందేలు జరిగినట్లు తెలుస్తోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే 350 చోట్ల పందేలు నిర్వహించగా వాటిలో 120కి పైగా పెద్ద బరులున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 300కిపైగా పందేల బరులుండగా వందకుపైగా పెద్ద బరులు ఏర్పాటు చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోనూ 320కిపైగా కోడి పందేల బరుల్లో పందేలు జరిగాయి. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 150 వరకు బరులు ఏర్పాటు చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని పెద్ద బరుల్లో రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలు.. ఆపైన మొత్తాలతో పందేలు నిర్వహించారు. చిన్న బరుల్లో రూ.10 వేల నుంచి రూ.2 లక్షల వరకూ పందేలు సాగాయి. కొన్ని చోట్ల రూ.కోటి, కోటిన్నర పందేలు కూడా జరిగినట్లు తెలుస్తోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో కోడి పందేలను స్వయంగా ఎమ్మెల్యేలే పోటాపోటీగా నిర్వహించడం గమనార్హం. పశ్చిమ గోదావరి జిల్లా పెద అమిరంలో భారీగా నిర్వహించిన కోడి పందేలకు అక్కడి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు నేతృత్వం వహించారు.

ప్రాణాలు తీసిన పతంగులు

వేర్వేరు చోట్ల భవనాల పైనుంచి పడి నలుగురి మృతి.. 11 మందికి గాయాలు... ఇద్దరి పరిస్థితి విషమం

మోటకొండూర్/నిర్మల్‌టౌన్ /మీర్‌పేట/ మైలార్‌దేవ్‌పల్లి: పతంగులు ఎగురవేస్తూ.. ప్రమాదవశాత్తు భవనాల పైనుంచి జారిపడి వేర్వేరు చోట్ల ముగ్గురు మృతి చెందగా, చూసేందుకు వెళ్లి మరొకరు మృత్యువాత పడ్డారు. బైక్‌లపై వెళుతుండగా..చైనా మాంజా గొంతుకు కోసుకుని, కాళ్లకు చుట్టుకొని పలువురు గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది.



➤ నిర్మల్ జిల్లా కేంద్రంలోని గుల్జర్(పాత) మార్కెట్‌కు చెందిన మొహమ్మద్ షఫీ రెండో కుమారుడు మొహమ్మద్ ఊజేఫ్ (11) ఓ భవనంపై తన స్నేహితులతో కలిసి బుధవారం గాలిపటాలు ఎగురవేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి భవనంపై నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఊజేఫ్‌ను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడు. మృతుడు ఐదో తరగతి చదువుతున్నాడు.



➤ యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన జూపల్లి నరేందర్(48) సంక్రాంతి పండుగ రోజు ఇంటి పైన గాలిపటం ఎగురవేస్తుండగా, అదుపుతప్పి కిందపడిపోయాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయమైంది. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. మృతుడు రోజువారీ పనులకు వెళతాడు.



➤ రంగారెడ్డి జిల్లా మీర్‌పేట పరిధిలోని జిల్లెలగూడ శ్రీసాయి బాలాజీ నగర్‌కు చెందిన కె.మహేశ్‌యాదవ్ (39) ప్రైవేటు ఉద్యోగి. మంగళవారం సాయంత్రం స్నేహితులు, సోదరులతో కలిసి గాలిపటాలు ఎగురవేసేందుకు ఇంటి ఎదురుగా ఉన్న భవనంపైకి ఎక్కారు. ఈ క్రమంలో మహేశ్ ప్రమాదవశాత్తు కాలుజారి 3వ అంతస్తు పైనుంచి కిందపడ్డాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతడికి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్టు డాక్టర్లు చెప్పారు. మృతుడు బీజేపీ బూత్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు.



➤ కుటుంబసభ్యులు పతంగులు బుధవారం ఎగురవేస్తుండగా, మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని మార్కండేయనగర్‌కు చెందిన తాపీమేస్త్రి మాధవరావు(55) బిల్డింగ్‌పైకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు 4వ అంతస్తు నుంచి కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

బైక్‌లపై వెళుతుండగా.... చైనా మాంజా తగిలి

సంక్రాంతి పండుగ వేళ బైక్‌లపై వెళుతుండగా చైనా మాంజా తగిలి 11 మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిలో వికారాబాద్‌కు చెందిన కె.వెంకటేష్, యాదగిరిగుట్ట పరిధిలోని గోధుమకుంటకు చెందిన నారాయణ-వీరమణి దంపతులు, -కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌కు చెందిన చరణ్, పాల్వంచకు చెందిన దంపతులు నవీన్-సుప్రజ, నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లికి చెందిన ప్రవీణ్, నవీపేట మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన అద్నాన్, కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇస్లాంపుర కాలనీకి చెందిన జావేద్, - హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఏర్పుల బాల్‌రాజ్, ఏఎస్‌రావు నగర్‌లోని బృందావన్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సాయివర్ధన్‌రెడ్డి గాయపడ్డారు.

'కొడంగల్'పై వివరణ ఇవ్వండి

ప్రాజెక్టు స్థితిగతులు వివరించండి.. తెలంగాణను కోరిన కేంద్ర జలసంఘం

ప్రాజెక్టుపై ఏపీ ఫిర్యాదుకు స్పందన

సాక్షి, హైదరాబాద్: నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంపై ఏపీ లేవనెత్తిన అభ్యంతరాలపై వివరణతోపాటు ప్రాజెక్టు తాజా స్థితిగతులను తెలపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) కోరింది. ఏపీ ఫిర్యాదు నేపథ్యంలో గతేడాది జూలై 30న తాము ఈ వివరాలను కోరగా, ఇంత వరకు తెలంగాణ నుంచి స్పందన రాలేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ మేరకు సీడబ్ల్యూసీ డైరెక్టర్ ప్రశాంత్‌కుమార్ గుప్తా మంగళవారం రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(జనరల్)కు లేఖ రాశారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌తోపాటు నారాయణపేట నియోజకవర్గంలో లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి రూ.4,350 కోట్లతో ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. అనుమతి లేని ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరుతూ గతేడాది జూలై 23న, ఆ తర్వాత మళ్లీ అక్టోబర్ 8న సీడబ్ల్యూసీకి ఏపీ ఫిర్యాదు చేసింది. ప్యాకేజీ-1 కింద రూ.1,134.62 కోట్లు, ప్యాకేజీ-2 కింద రూ.1,126.85 కోట్ల అంచనాలతో టెండర్లు పిలిచిన విషయాన్ని ఫిర్యాదులో పేర్కొంది. 0.9 టీఎంసీలను తరలించడానికి తొలుత ఈ పథకాన్ని ప్రతిపాదించగా, తర్వాత 2.1 టీఎంసీలు, ఆ తర్వాత 4.02 టీఎంసీలకు పెంచినట్టు తెలిపింది. 6 దశల్లో నీళ్ల ఎత్తిపోయడానికి ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టుకు ఎలాంటి నీటి కేటాయింపులు లేవని అభ్యంతరం తెలిపింది. కృష్ణా బోర్డు, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిళ్ల అనుమతి లేకుండా ప్రాజెక్టు చేపట్టడం రాష్ట్ర పునర్విభజన చట్టంలోని 84(3)(2), 85(8)(డీ)సెక్షన్లకు విరుద్ధమని స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టు టెండర్ల విషయంలో ముందుకెళ్లకుండా తెలంగాణ ప్రభుత్వాన్ని నిలువరించాలని కేంద్ర జలశక్తి శాఖను కోరింది. కృష్ణా బోర్డు, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ అనుమతి వచ్చే వరకు పనులు జరగకుండా చూడాలని కోరింది. ప్రాజెక్టుకు నీటి కేటాయింపులకు సంబంధించిన హైడ్రాలజీ అనుమతులు ఇవ్వరాదని సూచించింది.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజోయ్‌పాల్

▶ మొదటి పేజీ తరువాయి

జన్మించారు. బీకాం, ఎంఏ, ఎల్ఎల్‌బీ పూర్తిచేసి 1990లో మధ్యప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ చేసుకున్నారు. సివిల్, రాజ్యాంగ, పారిశ్రామిక, సర్వీస్‌తోపాటు పలు బ్యాంకులు, మానవ హక్కుల కమిషన్, బోర్డులకు న్యాయవాదిగా పనిచేశారు. 2011, మే 27న మధ్యప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2014, ఏప్రిల్ 14న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. జస్టిస్ సుజోయ్‌పాల్ కుమారుడు మధ్యప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. దీంతో అక్కడి హైకోర్టు నుంచి బదిలీ చేయాలని ఆయన కోరుకోగా, రాష్ట్రపతి ఆమోదించారు. 2024, మార్చి 21న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. దాదాపు 10 నెలలుగా ఇక్కడ పనిచేస్తున్న ఆయన మార్గదర్శి ఫైనాన్షియర్స్ నిబంధనల ఉల్లంఘన, గ్రూప్-1, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ సహా పలు కీలక కేసులపై విచారణ చేపట్టారు. పలు కేసుల్లో తీర్పులు కూడా వెలువరించారు. కాగా, జస్టిస్ అలోక్‌అరాధే బదిలీతో హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 26కు తగ్గనుంది.

హైకోర్టుకు నలుగురు కొత్త జడ్జీలు

నలుగురి పేర్లను సిఫార్సు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం	జాబితాలో రేణుక యార, నర్సింగ్‌రావు, తిరుమలాదేవి, మధుసూదన్‌రావు	సుదీర్ఘ కాలం ట్రయల్ కోర్టు జడ్జీలుగా పనిచేసిన అనుభవం	న్యాయాధికారుల కోటాలో ఎంపిక చేసిన సుప్రీంకోర్టు	రాష్ట్రపతి ఆమోదం తెలిపితే 30కి చేరనున్న జడ్జీల సంఖ్య

సాక్షి, హైదరాబాద్: హైకోర్టుకు న్యాయమూర్తులుగా నలుగురి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం ఈనెల 11న సిఫార్సు చేసింది. ఢిల్లీలో జరిగిన కొలీజియం భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. సిటీ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి రేణుక యార, సిటీ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జి నర్సింగ్‌రావు నందికొండ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ తిరుమలాదేవి ఈద, హైకోర్టు రిజిస్ట్రార్(అడ్మినిస్ట్రేషన్) మధుసూదన్‌రావు బొబ్బిలిరామయ్య పేర్లను సిఫార్సు చేసింది. వీరంతా 2012లో జిల్లా జడ్జీలుగా ఎంపికైన వారే కావడం గమనార్హం. న్యాయాధికారుల కోటాలో వీరిని ఎంపిక చేసింది. రాష్ట్రపతి ఆమోదం పొందితే ఈ నలుగురితో కలిపి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 30(సీజేతో సహా)కి చేరుతుంది. మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 42 కాగా, ఇంకా 12 ఖాళీలు ఉంటాయి. ప్రస్తుతం సీజేతో కలిపి 27 మంది న్యాయమూర్తులు ఉండగా, రెండు రోజుల క్రితం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేను బాంబే హైకోర్టుకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీంతో న్యాయమూర్తుల సంఖ్య 26కు చేరింది. త్వరలో న్యాయవాదుల కోటా నుంచి మరికొందరిని సిఫార్సు చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు హైకోర్టు పలువురి పేర్లను పంపేందుకు పరిశీలిస్తోందని తెలిసింది.

రేణుక యార:

ప్రస్తుతం సిటీ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 1973, జూన్ 14న ఐలయ్య-నాగమణి దంపతులకు హైదరాబాద్‌లో జన్మించారు. విద్యాభ్యాసమంతా నగరంలోనే పూర్తి చేశారు. 1998లో న్యాయవిద్య పూర్తి చేసి, బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. కొన్నాళ్లు ప్రాక్టీస్ చేశాక, జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శితోపాటు వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లో ఆమె పనిచేశారు.



నర్సింగ్‌రావు నందికొండ:



ప్రస్తుతం సిటీ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్‌జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. 1969, మే 3నపెంటయ్య- మణెమ్మ దంపతులకు హైదరాబాద్‌లో జన్మించారు. ఈయన విద్యాభ్యాసం కూడా నగరంలోనే సాగింది. 1995లో న్యాయవిద్య పూర్తి చేసి, న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. తొలుత విశాఖపట్నం అడిషనల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టారు. న్యాయశాఖ కార్యదర్శితోపాటు హైకోర్టు రిజిస్ట్రార్‌గా, గుంటూరు, వరంగల్, రంగారెడ్డి కోర్టులు, జ్యుడీషియల్ అకాడమీలో పనిచేశారు.

ఇ.తిరుమలాదేవి:



ప్రస్తుతం హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, రిజిస్ట్రార్ విజిలెన్స్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 1964, జూన్ 2న సంగారెడ్డిలో జన్మించారు. హైదరాబాద్ సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్య పూర్తి చేశారు. లా డిగ్రీ పూర్తి చేశాక హైకోర్టు, సిటీ కోర్టులో కొన్నాళ్లు న్యాయవాదిగా పనిచేశారు. తొలుత నిజామాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ జడ్జిగా విధులు నిర్వర్తించారు. ఖమ్మం జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జడ్జితో సహా వరంగల్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్ జడ్జిగా కీలక కేసుల విచారణ చేపట్టారు. హైకోర్టు రిజిస్ట్రార్‌గా, తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

మధుసూదన్‌రావు బొబ్బిలి రామయ్య:



ప్రస్తుతం హైకోర్టు రిజి స్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తు న్నారు. 1969, మే 25న అనసూయ-ఎల్లయ్య దంపతులకు కాజీపేటలో జన్మించారు. రైల్వే పాఠశాలలో విద్యనభ్యసించారు. కాకతీయ వర్సిటీలో న్యాయవిద్య పూర్తి చేశారు. 1998లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. నెల్లూరు, చిత్తూరు, మేడ్చల్ మల్కాజిగిరి సహా సీబీఐ కోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. తెలంగాణ వ్యాల్యూ యాడెడ్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్, మేడ్చల్-మల్కాజిగిరి ప్రిన్సిపల్ జడ్జి, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు.

● ఉమెన్ పవర్


హేమలత





పల్లె టు ఢిల్లీ

'ఇప్పుడు ఎందుకు లే...' అని రాజీపడే వాళ్లు ఉన్నచోటే ఉండి పోతారు. 'ఎప్పుడు అయితే ఏమిటి!' అనుకుంటూ ఉత్సాహంగా కార్యక్షేత్రంలోకి దిగేవాళ్లు ఎప్పుడూ విజేతలే. అలాంటి ఒక విజేత పెబ్బటి హేమలత. పెద్ద చదువులు చదవకపోయినా... పెద్ద వ్యాపారవేత్త కావాలని కలలు కన్నది.'హేమశ్రీ ఫ్యామిలీ రెస్టారెంట్ (ఫిష్ ఆంధ్ర) తో తన కలను నిజం చేసుకుంది. అత్యుత్తమ వ్యాపార వేత్తగా రాష్ట్రపతి అవార్డ్‌కు ఎంపికైంది. స్థానిక వినియోగం పెంచాలన్న సంకల్పంతో వైఎస్ జగన్ ప్రభుత్వం డొమెస్టిక్ మార్కెటింగ్‌పై దృష్టి పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఫిష్ 'ఆంధ్ర స్టోర్స్'ను ప్రోత్సహించింది. రూ.3.25 లక్షల నుంచి రూ.50 లక్షల విలువైన యూనిట్లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఫిష్ ఆంధ్ర లాంజ్ (కంటైనర్ మోడల్) యూనిట్ కోసం హేమలత దరఖాస్తు చేసుకోగా 40 శాతం సబ్సిడీతో యూనిట్ మంజూరైంది. ఆరోజు మొక్కై మొలిచిన 'హేమశ్రీ ఫ్యామిలీ రెస్టారెంట్' ఇప్పుడు చెట్టై ఎంతో మందికి నీడనిస్తోంది. 'డొమెస్టిక్ మార్కెటింగ్' విలువను జాతీయ స్థాయికి తీసుకువెళ్లింది...

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పురపాలక సంఘం పరిధిలోని సోమప్ప నగర్‌కు చెందిన హేమలత సాధారణ గృహిణి. ఇంటి నాలుగు గోడలకే పరిమితం కావాలనుకోలేదు. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనేది తన కల. స్నాక్స్ (తినుబండారాలు)తో వ్యాపారం మొదలుపెడితే బాగుంటుందని ఆలోచించింది. కొంత మంది మహిళలతో కలసి చక్కిలాలు తయారు చేయటం మొదలు పెట్టింది. వాటిని పట్టణంలోని చిన్నచిన్న మిఠాయి కొట్లకు సరఫరా చేసేది. క్రమంగా నలభై మంది మహిళలతో కలసి వ్యాపారాన్ని విస్తరించింది. పరోక్షంగా వంద మందికిపైగా ఉపాధి కల్పించింది. చకిలాలతోపాటు చెగోడీలు, నిప్పట్లు, బులెట్లు, మసాలా వడలు, స్వీట్స్ వంటి పదిరకాల స్నాక్స్‌ను తయారు చేసి ఎమ్మిగనూరు, కోడుమూరు, కర్నూలు, తెలంగాణ లోని ఐజ, గద్వాల వరకూ అంగళ్లకు సరఫరా చేస్తోంది. ప్రతి రోజు రూ.30 వేలకు పైగా స్నాక్స్‌ను తయారు చేయించి మార్కెట్ చేస్తోంది. తన దగ్గర పనిచేసే నలభై మంది మహిళలతో నాలుగు పొదుపు గ్రూపులు ఏర్పాటు చేసి వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేసింది.

ఎకో ఫ్రెండ్లీ నాన్ ఓవెన్ బ్యాగ్‌లు

ప్లాస్టిక్ వినియోగానికి ప్రత్యామ్నాయం ఆలోచించిన హేమలత బ్యాంక్‌ల సహకారంతో రూ.50 లక్షలతో కాలుష్యరహిత నాన్ ఓవెన్ బ్యాగ్‌ల తయారీ యూనిట్‌ను ప్రారంభించింది. పది మంది వర్కర్స్‌తో ఈ యూనిట్‌ను నడుపుతోంది. 10–14 ఇంచుల సైజ్ మొదలు 16–21 సైజు వరకూ వివిధ రకాల బ్యాగ్‌లను తయారు చేయిస్తోంది. వినియోగదారుల డిమాండ్‌ను బట్టి డి–కట్, డబ్లూ–కట్, బాక్స్‌టైప్, స్టిచ్చింగ్ బ్యాగ్‌లను తయారు చేయిస్తోంది. తమ దగ్గర తయారు చేసే నాన్ ఓవెన్ బ్యాగ్‌ల స్టిచ్చింగ్ పనిని పొదుపు సంఘాల్లో పనిచేసే మహిళా టైలర్‌లకు ఇస్తూ వారికి వేతనాలు చెల్లిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల్లోని మాల్స్, స్టోర్స్‌కు సరఫరా చేస్తోంది. నాన్ ఓవెన్ బ్యాగ్‌ల తయారీ టర్నోవర్ ఏడాదికి రూ. కోటి దాటిపోయింది. కోవిడ్ సమయంలో మాస్కులు, ఆస్పత్రి మెటీరియల్స్‌ను తయారు చేయించి ఎంతోమందికి ఉపాధి చూపింది.





దక్షిణాదిలో నెంబర్‌వన్

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నప్పుడు స్వయం ఉపాధి రంగాలకు ప్రోత్సాహకాలందించేవారు. గత ప్రభుత్వ సహకారంతో ప్రధానమంత్రి మత్స్య సహకార యోజన (పీఎంఎంఎస్‌వై)తో హేమలత ఎమ్మిగనూరులో రూ.50 లక్షలతో ఫిష్ ఆంధ్ర (హేమ శ్రీ ఫ్యామిలీ రెస్టారెంట్) ను ప్రారంభించింది. ఫిష్ ఆంధ్ర నిర్వహణలో దక్షిణాదిలోనే 'హేమశ్రీ ఫ్యామిలీ రెస్టారెంట్' ప్రథమ స్థానంలో నిలిచింది.

కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలోని ఓ చిన్న గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో పుట్టిన హేమలత ఎంతోమంది ఔత్సాహికులకు 'ఐకానిక్ ఎంటర్‌ప్రెన్యూర్'గా స్ఫూర్తిని ఇస్తోంది.

– గోరుకల్లు హేమంత్ కుమార్,
సాక్షి, ఎమ్మిగనూరు,
– పంపాన వరప్రసాదరావు, సాక్షి, అమరావతి

'ఫిష్ ఆంధ్ర'కు రాష్ట్రపతి అవార్డు

ఫిష్ ఆంధ్ర లాంజ్ (కంటైనర్ మోడల్) యూనిట్ కోసం హేమలత దరఖాస్తు చేసుకోగా 40 శాతం సబ్సిడీతో యూనిట్ మంజూరైంది. రూ.20 లక్షలు సబ్సిడీ రూపంలో వైఎస్ జగన్ ప్రభుత్వం సమకూర్చగా, రూ.7.5 లక్షలు హేమలత సమకూర్చుకుంది. మిగిలిన రూ.42.50 లక్షలను బ్యాంక్ రుణంగా ఇచ్చింది. 'ఫిష్ ఆంధ్ర లాంజ్..హేమశ్రీ ఫ్యామిలీ రెస్టారెంట్' తక్కువ కాలంలోనే విశేష ఆదరణ పొందింది. ఇరవై మందికిపైగా ఉపాధి కల్పిస్తున్న ఈ యూనిట్ ద్వారా రోజుకు రూ.40–50 వేల వరకు వ్యాపారం సాగించే స్థాయికి చేరుకుంది. చిక్కీల నుంచి రెస్టారెంట్ వరకు ఏటా రూ.కోటికి పైగా వ్యాపారం చేస్తూ వందమంది ప్రత్యక్షంగా, మరో యాభై మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలిచింది హేమలత. సూపర్ సక్సెస్ అయిన ఈ యూనిట్‌ను కేంద్ర బృందం పలుమార్లు సందర్శించి అత్యుత్తమ యూనిట్‌గా గుర్తించింది. హేమలత రాష్ట్రపతి అవార్డుకు ఎంపికైంది.

గర్వంగా ఉంది

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ నెల 26న అవార్డు అందుకోబోతున్నానన్న వార్త తెలిసినప్పటి నుంచి చాలా సంతోషంగా ఉంది. సుమారు వందమందికిపైగా మహిళలకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడం గర్వంగా ఉంది. పేదరిక నిర్మూలనకు, మహిళా ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహం, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. చాలా పథకాలపై ప్రజలకు సరైన అవగాహన లేదు. ప్రభుత్వ పథకాలు, నిధులు నిరుపయోగంగా మారుతున్నాయి.

- పెబ్బటి హేమలత

● మన(సు)లో మాట

ఈ వ్యసనం నుంచి బయటపడేదెలా?

నా వయస్సు 30. నా భర్తకు 35 ఏళ్లు. ఆయన ఈ మధ్య తీవ్రమైన పోర్నోగ్రఫీ వ్యసనానికి గురయ్యాడు. ఇది మా కుటుంబ జీవితంతోపాటు అతని పనితీరునూ ప్రభావితం చేస్తోంది. అతను తన మొబైల్‌లో పోర్న్ వీడియోలు స్క్రోల్ చేయడంలో గంటల తరబడి గడుపుతున్నాడు. నన్ను, మా ఇద్దరు పిల్లల్ని నిర్లక్ష్యం చేస్తున్నాడు. ఆన్‌లైన్ సెక్స్ చాట్‌లకు డబ్బు కూడా చెల్లిస్తున్నాడని ఈ మధ్యే తెలిసింది. ఆయన బాస్‌తో తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. నా మీద కూడా ఏమీ ఆసక్తి చూపడం లేదు. ఈ సమస్యను ఎలా పరిష్కరించాలో మా వివాహబంధాన్ని ఎలా రక్షించుకోవాలో సలహా ఇవ్వగలరు.

- అరుణకుమారి, చెన్నై

మీ ఆందోళన మీ మాటల్లోనే అర్థమవుతోంది. పోర్నోగ్రఫీ వ్యసనం అనేది కుటుంబ జీవితం, వృత్తిపరమైన పనితీరుపై తీవ్రమైన ప్రభావాలను కలిగించే సంక్లిష్టమైన సమస్య. అతని ప్రవర్తన, మీ కుటుంబంపై దాని ప్రభావం గురించి అతనితో మాట్లాడే ప్రయత్నం (అతన్ని నిందించేటట్లు లేకుండా) చేయండి. మీ ఆందోళనలు, భావాలను ప్రశాంతంగా వ్యక్తపరుస్తూ అతని చర్యలు మీపైన, మీ పిల్లలపైనా ఎంత ప్రభావం చూపుతున్నాయో వివరంగా మాట్లాడి చూడండి. ఒక మంచి సైకియాట్రిస్ట్ లేదా థెరపిస్ట్ సలహాతో కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ, ఇతర చికిత్సా విధానాలతో అతన్ని ఈ వ్యసనానికి దూరం చేయవచ్చు. ఇద్దరూ కలిసి కపుల్ థెరపీకి హాజరు కావడం వల్ల కూడా మరింత మెరుగైన ఫలితాలుంటాయి. ఇది మీ సమస్యలను పరిష్కరించడానికి, మీ మధ్య సాన్నిహిత్యం పెంచడానికి కూడా దోహదపడుతుంది. ఇంట్లో ఇంటర్నెట్ వినియోగం గురించి స్పష్టమైన హద్దులను ఏర్పాటు చేసుకోండి. మీరు ఈ సమస్యల నుండి ధైర్యంగా సమర్థంగా బయట పడేందుకు వ్యక్తిగత కౌన్సెలింగ్ సహాయపడుతుంది. ఇక ఆయన ఈ వ్యసనం నుండి బయటపడటం, మీరు ఆ పరిస్థితుల ప్రభావం నుంచి కోలుకోవడం చాలా సమయం ఓర్పు, క్రమశిక్షణతో కూడుకున్న ప్రక్రియ అని గుర్తుంచుకోండి. ధైర్యంగా ఉండండి.

ఈ క్లిష్ట పరిస్థితుల నుండి బయట పడడానికి నమ్మకమైన బంధుమిత్రులు లేదా నిపుణుల సహకారం తీసుకోవడానికి వెనుకాడకండి. మీ భర్త తన వ్యసనాన్ని అంగీకరించడానికి లేదా దాని నుంచి బయట పడడానికి ఇష్టపడకపోతే మీరు మీ శ్రేయస్సు, మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని న్యాయనిపుణుడిని సంప్రదించడం అవసరం కావచ్చు.



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ:
sakshifamily3@gmail.com

● బ్యూటిప్స్



● మూడు టీ స్పూన్ల దోసరసం, రెండు టీ స్పూన్ల అలోవెరా జెల్, టీ స్పూన్ పెరుగు కలిపి ముఖానికి, మెడకు పట్టించి, పది నిముషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఎండవల్ల కందిపోయిన, రసాయనాల వల్ల ర్యాష్ ఏర్పడిన చర్మానికి ఈ ప్యాక్ సహజమైన సౌందర్యలేపనంలా పనిచేస్తుంది.

● రెండు స్పూన్ల టొమాటో జ్యూస్, స్పూన్ ఓట్స్, స్పూన్ పెరుగులో కొద్దిగా నీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి, అరగంట తర్వాత చల్లటి నీటితో శుభ్రపరుచుకోవాలి. బ్లాక్‌హెడ్స్, మొటిమలు తగ్గి చర్మం మృదువుగా కాంతిమంతంగా కనిపిస్తుంది.

● రెండు టీ స్పూన్ల క్యారెట్ తురుము, టీ స్పూన్ తేనె, రెండు చుక్కల ఎసెన్షియల్ ఆయిల్ బాగా కలిపి ముఖానికి పట్టించాలి. మృదువుగా రబ్ చేసి, పది నిముషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మానికి జీవకాంతి లభిస్తుంది.

● సోషల్ మీడియా

కలల మేఘంపై అనూజ



ప్రేక్షకులు మెచ్చే పాత్రలు ఎన్నో చేసిన ప్రియాంక చోప్రా 'అనూజ' ద్వారా తన ఉత్తమ అభిరుచిని చాటుకుంది. 97వ ఆస్కార్ అవార్డ్‌ల్లో బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ కేటగిరిలో 'అనూజ' షార్ట్ లిస్ట్ అయింది. 'అనూజ' త్వరలో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ కానుంది. ఈ షార్ట్ ఫిల్మ్‌కు మిండి కాలింగ్, గునిత్ మోంగాలతో పాటు వెన్నుదన్నుగా నిలిచింది ప్రియాంక చోప్రా.

బాలకార్మికులైన పిల్లల బతుకు పోరాటంపై వెలుగులు ప్రసరించిన ఈ లఘుచిత్రానికి ఆడమ్ జోగ్రేవ్స్ డైరెక్టర్. తొమ్మిదేళ్ల అనూజ తన అక్కతో కలిసి ఒక గార్మెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తుంటుంది. తన భవిష్యత్ కోసం పని మానేసి చదువుకోవాలా? కుటుంబం కోసం చదువును త్యాగం చేయాలా? అనే అనూజ జీవితంలోని ఈ సందిగ్ధ స్థితికి 'అనూజ' షార్ట్ ఫిల్మ్ అద్దం పడుతుంది.

దోపిడి ప్రపంచంలో తమ ఆనందం, అవకాశాల కోసం ఆశపడే, పోరాడే ఇద్దరు సోదరీమణుల గురించి చెప్పే కథ ఇది.

'ప్రౌడ్ ఆఫ్ దిస్ బ్యూటీఫుల్ ఫిల్మ్' అంటూ 'అనూజ' గురించి తన సంతోషాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంది ప్రియాంక చోప్రా.

'అనూజ'లో అనన్య షాన్‌బాగ్ (పాలక్), సజ్దా పఠాన్ (అనూజ), నగేష్ బోంస్లే (మిస్టర్ వర్మ) నటించారు.


● ప్రియాంకా చోప్రా

ష్... ఎగ్జామ్ ప్రిపరేషన్

సినీరంగంలో రాణించాలనే లక్ష్యం ఉన్నంత మాత్రాన అకాడమిక్ జర్నీని నిర్లక్ష్యం చేయనక్కర్లేదు. అయితే రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లడం అనేది పెద్ద కళ. ఆ కళలో రాషా ఆరితేరింది.

ప్రముఖ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా థడానీ 'ఆజాద్' సినిమాతో బాలీవుడ్‌లో ఆరంగేట్రం చేయనుంది. 'ఆజాద్' సెట్స్‌కు సంబంధించిన వీడియో క్లిప్ ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఈ వీడియో క్లిప్‌లో సినిమా సెట్స్‌లో మేకప్‌లో ఉన్న రాషా 12వ తరగతి ఎగ్జామ్స్‌కు ప్రిపేరవుతూ కనిపిస్తుంది.

జాగ్రఫీ పరీక్ష కోసం శ్రద్ధగా ప్రిపేరవుతున్న రాషా వీడియోను చూసి నెటిజనులు ప్రశంసలు కురిపించారు.

'ఎంతైనా చదువు చదువే. సినిమాల్లోనే కాదు అకడమిక్‌గా కూడా రాషా విజయం సాధించాలి' అని ఆశీర్వదించారు.


● రాషా



జీవితం ప్రతి దశలోనూ ఒక అడ్డంకిని సృష్టిస్తుంది. ఆ అడ్డంకిని ఎదుర్కొనే విధానంలోనే విజయమో, అపజయమో ప్రాప్తిస్తుంది. విజయాన్ని సాధించి, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది మూడు పదుల వయసున్న సంతోషి దేవ్ జీవన పోరాటం.

భారమైన జీవనాన్ని పరుగులు తీయిస్తోంది


● ట్రక్కు నడుపుతున్న సంతోషి దేవ్

హర్యానా వాసి సంతోషి దేవ్ ఒడిశాలోని కొయిడా మైనింగ్ గనుల నుండి ఇనుప ఖనిజాన్ని రవాణా చేసే వోల్వో ట్రక్కు నడుపుతోంది. ఈ రంగంలో పురుషులదే ప్రధాన పాత్ర. మరి సంతోషి మైనింగ్‌లో ట్రక్కు డ్రైవర్‌గా ఎలా నియమితురాలైంది?! ముందు ఆమె జీవనం ఎక్కడ మొదలైందో తెలుసుకోవాలి.

మలుపు తిప్పిన గృహహింస...

పదహారేళ్ల వయసులో సంతోషి దేవ్‌ని ఒడిశాలోని హడిబంగా పంచాయతీ, బాదముని గ్రామంలోని ఒక వ్యక్తితో వివాహం జరిగింది. ఆ వివాహం ఆమె జీవితాన్ని భయంకరమైన మలుపు తిప్పింది. నిత్యం వరకట్న వేధింపులు, గృహహింసతో బాధాకరంగా రోజులు గడిచేవి. కన్నీటితోనే తన పరిస్థితులను తట్టుకుంటూ కొన్నాళ్లు గడిపింది. అందుకు కారణం తల్లిదండ్రులకు తొమ్మిదిమంది సంతానంలో తను ఆరవ బిడ్డ. ఎంతటి కష్టాన్నైనా సహనంతో సర్దుకుపొమ్మని పుట్టింటి నుంచి సలహాలు. కొన్నాళ్లు భరించినా, కఠినమైన ఆ పరిస్థితులకు తల వంచడానికి నిరాకరించి, పోరాడాలనే నిర్ణయించుకుంది. తిరిగి పుట్టింటికి వచ్చింది. కానీ, అక్కున చేర్చుకోవాల్సిన కన్నవారి నుంచి అవమానాల్ని ఎదుర్కొంది. అధైర్యపడకుండా, తన సొంత మార్గాన్ని ఎంచుకోవాలనుకుంది. స్కూల్ వయసులోనే డ్రాపౌట్ స్టూడెంట్. తెలిసినవారి ద్వారా స్పిన్నింగ్ మిల్లులో పని చేయడానికి జీవనోపాధి కోసం తమిళనాడుకు వలస వచ్చింది.

జీవనోపాధిని వెతుక్కుంటూ...

"మా అత్తింటిని విడిచిపెట్టిన నాటికే గర్భవతిని. కొన్ని రోజులకు తమిళనాడులోని స్పిన్నింగ్ మిల్లులో పనిచేసే అవకాశం వచ్చింది. అక్కడే 2012లో కూతురు పుట్టింది. మూడేళ్లు నా తోటి వారి సాయం తీసుకుంటూ, కూతురిని పెంచాను. ఆమెకు మంచి భవిష్యత్తును ఇవ్వాలని ప్రతి పైసా పొదుపు చేశాను. స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్నప్పుడు చెన్నైలో ఆటో రిక్షా నడుపుతున్న ఓ మహిళను చూశాను. 'ఆమెలా డ్రైవింగ్ చేయలేనా?' అని ఆలోచించాను. నా దగ్గర ఉన్న కొద్దిపాటి పొదుపు మొత్తం, చిన్న రుణంతో ఆటో రిక్షా కొనుక్కుని ఒడిశాలోని కియోంజర్‌కి వచ్చేశాను. నా కూతురుకి మంచి భవిష్యత్తును అందించడానికి ఆమెను హాస్టల్ వసతి ఉన్న స్కూల్లో చేర్పించాను. ఒడిశాలోని అనేక మంది ఉన్నత అధికారుల నుండి ప్రశంసలు అందుకున్నాను' అని వివరించే సంతోషి ఆశయాలు అక్కడితో ఆగలేదు.

కుదిపేసిన పరిస్థితుల నుంచి...

భారీ వాహనాలు నడపడంలో శిక్షణ పొందింది. 2021లో క్యాపిటల్ రీజియన్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ (సిఆర్‌యుటి) నిర్వహిస్తున్న సిటీ బస్ సర్వీస్ అయిన 'మో' బస్‌కు డ్రైవర్‌గా నియమితురాలైంది. ఒడిశాలో ఒంటరి మహిళా బస్సు డ్రైవర్‌గా మహిళా సాధికారతని చాటింది. అయితే ఆశ్చర్యకరంగా, ఆమె విజయగాథ అక్కడి నుంచి తొలగింపుతో ఒక్కసారిగా కుదుపుకు లోనైంది. 'తొలి మహిళా బస్సు డ్రైవర్ కావడంతో స్థానిక మీడియా నన్ను హైలైట్ చేసింది. ఒక నెల తరువాత, అధికారులు నన్ను ఉద్యోగంలో నుంచి తీసేశారు. నా తప్పు ఏమిటో అర్థం కాలేదు. కానీ, మళ్ళీ జీవితం నన్ను పరీక్షించిందని అర్థమైంది. దీంతో బతకడానికి మళ్లీ ఆటో రిక్షా డ్రైవింగ్‌కు వచ్చేశాను' అని తన జీవిత ప్రస్థానాన్ని వివరించింది సంతోషి. ఆరు నెలల క్రితం ఓ మైనింగ్ కంపెనీ సంతోషి పట్టుదల, ధైర్యాన్ని గుర్తించింది. వోల్వో ట్రక్కును నడపడానికి ఆఫర్ చేసింది. 'ఏ కల కూడా సాధించలేనంత పెద్దది కాదు. ఆరు నెలల నుంచి నెలకు రూ.22,000 జీతం పొందుతున్నాను' అని గర్వంగా చెబుతోంది ఈ పోరాట యోధురాలు.


● ఆటో నడుపుతూ...

● స్ఫూర్తి

గృహిణుల గొంతుక


● అరుణా విజయ్

'కలలు కనడం మానవద్దు. కలలను సాకారం చేసుకోవాలంటే కష్టపడాలని మరువద్దు. ఎట్టి పరిస్థితుల్లోనూ మీ ఆశలకలను త్యాగం చేయవద్దు' అంటోంది అరుణా విజయ్. తోటి గృహిణులకు ఆమె ఇస్తున్న సందేశం ఇది. గృహిణి అంటే ఏ పనీ రానివాళ్లనే అపోహతో కూడిన వెక్కిరింతకు చెంప చెళ్లుమనిపించింది అరుణ. ఏ సోషల్‌మీడియా అయితే ఆమెను తక్కువ చేసి మాట్లాడిందో అదే సోషల్ మీడియాలో ఇప్పుడామె ఒక ఇన్‌ఫ్లుయెన్సర్. మాస్టర్ షెఫ్ టాప్ 4గా నిలిచి ప్రశంసలందుకుంటోంది. ఆమె వంటలకు వ్యూస్, లైక్స్‌తో విజేతగా నిలిచింది.

అపోహ తొలగింది!

చెన్నైలో పుట్టి పెరిగిన అరుణ 22 ఏళ్లకు పెళ్లి చేసుకుని ఇంటికి పరిమితమైంది. పదిహేనేళ్ల వయసు నుంచే వంటగదిలో ప్రయోగాలు చేసిన అరుణ భార్యగా, తల్లిగా ఇంటి బాధ్యతల నిర్వహణలో విజయవంతమైన మహిళ అనే చెప్పాలి. ఆమెది ఉద్యోగం చేసి డబ్బు సంపాదించాల్సిన అవసరం లేని జీవితమే. కానీ గృహిణి అనగానే తేలిగ్గా పరిగణించే సమాజం ఆమెకు చేసిన గాయాలెన్నో. తాను ఏదో ఒకటి సాధించాలనే కోరిక రగులుతూనే ఉండేదామెలో. ఆ కోరికే ఆమెను మాస్టర్ షెఫ్ ఇండియా 2023 పోటీలకు తీసుకెళ్లింది. పోటీదారుల మీద రకరకాల కామెంట్‌లు రువ్విన సోషల్ మీడియా అరుణను 'ఈవిడా... ఈవిడ గృహిణి' అంటూ చెప్పుకోవడానికి ప్రత్యేకంగా ఏమీ లేదనే భావంతో తేలిక చేసింది. మాస్టర్ షెఫ్ కంటెస్టెంట్‌లలో అరుణకు ఎదురైన చేదు అనుభవం ఇది. దక్షిణ భారత వంటలు ఇడ్లీ, దోశెలతో ఆమె ప్రయోగాలు న్యాయనిర్ణేతల నోట్లో నీళ్లూరించాయి. పోటీదారుల్లో నాలుగవ స్థానంలో నిలిచింది. పోటీలో పాల్గొన్న నాటికి టాప్ ఫోర్‌లో నిలిచిన నాటికి మధ్య ఎదురైన అనుభవాలను గుర్తు చేసుకుంటూ "సోషల్ మీడియా కామెంట్‌లకు మనసు గాయపడి కన్నీళ్లతో ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపానని' చెప్పింది. మన సమాజంలో 'గృహిణి అంటే ఏమీ తెలియని వ్యక్తి' అనే అభిప్రాయం బలంగా ముద్రించుకు పోయి ఉంది. ఆ అపోహను తుడిచి పెట్టగలిగాను. గృహిణుల మనోభావాలకు నేను గళమయ్యాను" అంటోంది అరుణా విజయ్.

సాక్షి
గురువారం
16-1-2025

స్పోర్ట్స్



అనుభవజ్ఞురాలైన స్మృతి మంధాన ఒకవైపు... ఆరో వన్డే ఆడుతున్న ప్రతీక రావల్ మరోవైపు... ఆకాశమే హద్దుగా చెలరేగుతూ శతకాలతో అదరగొట్టారు. ఐర్లాండ్ పేలవ బౌలింగ్‌పై వీరిద్దరు చెలరేగడంతో అద్భుత రికార్డులు, అసాధారణ గణాంకాలు భారత మహిళల జట్టు ఖాతాలో చేరాయి. నిర్ణీత 50 ఓవర్లు ఆడిన భారత మహిళల జట్టు 5 వికెట్లు కోల్పోయి 435 పరుగులు చేసింది. పురుషుల, మహిళల విభాగాల్లో కలిపి వన్డేల్లో భారత జట్టుకిదే అత్యధిక స్కోరు కావడం విశేషం. 2011లో వెస్టిండీస్‌తో ఇండోర్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 5 వికెట్లు కోల్పోయి 418 పరుగులు చేసింది. ఏకంగా 48 ఫోర్లు, 9 సిక్సర్లతో భారత్ 57 బౌండరీల జోరును నిలువరించలేక ఐర్లాండ్ పూర్తిగా చేతులెత్తేసింది. మూడు వన్డేల్లోనూ ఐర్లాండ్‌ను ఓడించిన టీమిండియా సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది.


ప్రతీక రావల్
స్మృతి మంధాన

435 కొట్టారు

వన్డేల్లో తమ అత్యధిక స్కోరు నమోదు చేసిన భారత జట్టు

- ప్రతీక, స్మృతి మంధాన శతకాలు
- భారత్ తరఫున స్మృతి ఫాస్టెస్ట్ సెంచరీ
- చివరి వన్డేలో 304 పరుగులతో ఐర్లాండ్‌పై టీమిండియా జయభేరి
- పరుగుల తేడా పరంగా భారత జట్టుకిదే అతిపెద్ద విజయం
- 3-0తో వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన స్మృతి బృందం

రాజ్‌కోట్: భారత మహిళల క్రికెట్ జట్టు ఆదివారమే వన్డేల్లో తమ అత్యధిక స్కోరును నమోదు చేసింది. అదే జోరును కొనసాగిస్తూ మూడు రోజుల వ్యవధిలోనే దానిని తిరగరాసి కొత్త రికార్డును నెలకొల్పింది. ఈ క్రమంలో ఐర్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో సొంతం చేసుకుంది. బుధవారం జరిగిన చివరి వన్డేలో భారత్ 304 పరుగుల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తుగా ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 435 పరుగులు సాధించింది. ఓపెనర్లు ప్రతీక రావల్ (129 బంతుల్లో 154; 20 ఫోర్లు, 1 సిక్స్), స్మృతి మంధాన (80 బంతుల్లో 135; 12 ఫోర్లు, 7 సిక్స్‌లు) సెంచరీలతో సత్తా చాటారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 26.4 ఓవర్లలో 233 పరుగులు జోడించారు. రిచా ఘోష్ (42 బంతుల్లో 59; 10 ఫోర్లు, 1 సిక్స్) కూడా అర్ధ సెంచరీతో రాణించింది. అనంతరం ఐర్లాండ్ 31.4 ఓవర్లలో 131 పరుగులకే కుప్పకూలింది. సారా ఫోర్బ్స్ (41), ప్రెండర్‌గాస్ట్ (36) మాత్రమే కొద్దిగా పోరాడారు. దీప్తి శర్మకు 3 వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన ప్రతీక రావల్ మొత్తం 310 పరుగులతో 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డును కూడా గెలుచుకుంది.

మెరుపు బ్యాటింగ్...

గత ఐదు వన్డేల ఓపెనింగ్‌లో మూడు శతక భాగస్వామ్యాలు నెలకొల్పిన ప్రతీక, స్మృతి ఈ మ్యాచ్‌లోనూ అదే దూకుడును కొనసాగించారు. ప్రెండర్‌గాస్ట్ ఓవర్లో ప్రతీక 3 ఫోర్లు కొట్టడంతో ఈ జోరు మొదలైంది. 12 పరుగుల వద్ద కీపర్ క్రిస్టీనా క్యాచ్ వదిలేయడం స్మృతికి కలిసొచ్చింది. ఆ తర్వాత కెల్లీ ఓవర్లో రెండు వరుస సిక్స్‌లు, ఫోర్ బాదిన ఆమె 39 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా, కొద్దిసేపటికి 52 బంతుల్లో ప్రతీక కూడా హాఫ్‌సెంచరీని అందుకుంది. అనంతరం వీరిద్దరి ధాటి మరింత పెరిగింది. అర్ధ సెంచరీ తర్వాత శతకం అందుకునేందుకు స్మృతికి 31 బంతులే సరిపోయాయి. కెల్లీ ఓవర్లో రెండు పరుగులు తీయడంతో భారత్ తరఫున ఫాస్టెస్ట్ సెంచరీ నమోదైంది. కెల్లీ ఓవర్లో వరుసగా 6, 4 కొట్టిన స్మృతి... ప్రెండర్‌గాస్ట్ వేసిన తర్వాతి ఓవర్లోనూ దీనిని పునరావృతం చేసింది. అయితే ఎట్టకేలకు భారీ భాగస్వామ్యం తర్వాత స్మృతిని అవుట్ చేసి ఐర్లాండ్ ఊపిరి పీల్చుకుంది. ఆ తర్వాత మరో ఎండ్‌లో ప్రతీక తన బ్యాటింగ్‌కు పదును పెట్టింది. చక్కటి షాట్లతో అలరించిన ఆమె సరిగ్గా 100 బంతుల్లో కెరీర్‌లో తొలి శతకాన్ని అందుకుంది. మూడో స్థానంలో వచ్చిన రిచా కూడా చెలరేగిపోవడంతో ఐర్లాండ్ కష్టాలు మరింత పెరిగాయి. 37 బంతుల్లో ఆమె 8 ఫోర్లు, సిక్స్‌తో హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకుంది. ప్రతీక, రిచా రెండో వికెట్‌కు 12 ఓవర్లలోనే 104 పరుగులు జత చేయడం విశేషం. ప్రతీక 27 బంతుల్లోనే 100–150కి చేరుకోగా... 46వ ఓవర్ చివరి బంతికి భారత్ 400 పరుగుల మైలురాయిని అందుకుంది.

టపటపా...

భారత్ ఇన్నింగ్స్ ముగియగానే ఐర్లాండ్ ఓటమి ఖాయమని అర్థమైపోయింది. కానీ ఆ జట్టు ఏమాత్రం పోరాడగలదన్నదే మిగిలింది. ఫోర్బ్స్, ప్రెండర్‌గాస్ట్ మూడో వికెట్‌కు 64 పరుగులు జోడించిన తర్వాత ఐర్లాండ్ కాస్త పోటీ ఇస్తున్నట్లు కనిపించింది. కానీ వీరిద్దరు 12 పరుగుల వ్యవధిలో వెనుదిరగడంతో జట్టు కోలుకోలేకపోయింది. ఒక దశలో 100/3తో మెరుగ్గా కనిపించిన జట్టు 31 పరుగుల వ్యవధిలో చివరి 7 వికెట్లు కోల్పోయింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లు, తనూజ 2 వికెట్లు పడగొట్టారు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ప్రతీక రావల్ (సి) డెంప్సీ (బి) సార్జెంట్ 154; స్మృతి మంధాన (సి) కానింగ్ (బి) ప్రెండర్‌గాస్ట్ 135; రిచా ఘోష్ (బి) కెల్లీ 59; తేజల్ (సి) డెలానీ (బి) ప్రెండర్‌గాస్ట్ 28; హర్లీన్ (సి) ప్రెండర్‌గాస్ట్ (బి) డెంప్సీ 15; జెమీమా (నాటౌట్) 4; దీప్తి శర్మ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 29; **మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 435. వికెట్ల పతనం:** 1-233, 2-337, 3-387, 4-415, 5-419. **బౌలింగ్:** ప్రెండర్‌గాస్ట్ 8-0-71-2, కానింగ్ 8-0-64-0, కెల్లీ 7-0-66-1, సార్జెంట్ 8-0-68-1, డెంప్సీ 10-0-65-1, డాల్‌జెల్ 3-0-28-0, డెలానీ 6-0-59-0.

ఐర్లాండ్ ఇన్నింగ్స్: ఫోర్బ్స్ (రనౌట్) 41; గ్యాబీ లూయిస్ (ఎల్బీ) (బి) టిటాస్ సాధు 1; క్రిస్టీనా కూల్టర్ (బి) సయాలీ 0; ప్రెండర్‌గాస్ట్ (బి) తనూజ 36; డెలానీ (బి) దీప్తి 10; లియా పాల్ (సి అండ్ బి) దీప్తి 15; కెల్లీ (సి) సయాలీ (బి) తనూజ 2; కానింగ్ (బి) మిన్ను మణి 2; డెంప్సీ (రనౌట్) 0; డాల్‌జెల్ (నాటౌట్) 5; సార్జెంట్ (సి) మిన్ను మణి (బి) దీప్తి 1; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (31.4 ఓవర్లలో ఆలౌట్) 131. వికెట్ల పతనం:** 1-18, 2-24, 3-88, 4-100, 5-115, 6-122, 7-122, 8-122, 9-128, 10-131. **బౌలింగ్:** టిటాస్ సాధు 4-1-22-1, సయాలీ సత్‌ఘరే 4-0-24-1, తనూజ కన్వర్ 9-2-31-2, దీప్తి శర్మ 8.4-2-27-3, మిన్ను మణి 6-0-22-1.

435/5 వన్డేల్లో భారత మహిళల జట్టు అత్యధిక స్కోరు. గత వన్డేలో చేసిన 371/5 స్కోరును జట్టు సవరించింది. ఓవరాల్‌గా వన్డేల్లో ఇది నాలుగో అత్యధిక స్కోరు. టాప్-3 అత్యధిక స్కోర్లు న్యూజిలాండ్ (491/4 : 2018లో ఐర్లాండ్‌పై; 455/5 : 1997లో పాక్‌పై; 440/3: 2018లో ఐర్లాండ్‌పై) పేరిటే ఉండటం విశేషం.

304 పరుగుల తేడా పరంగా వన్డేల్లో భారత్‌కు ఇదే అతిపెద్ద విజయం. 2017లో భారత్ 249 పరుగుల తేడాతో ఐర్లాండ్‌నే ఓడించింది.

70 సెంచరీకి స్మృతి తీసుకున్న బంతుల సంఖ్య. గతంలో హర్మన్‌ప్రీత్ (87 బంతులు) పేరిట ఉన్న భారత రికార్డును స్మృతి బద్దలు కొట్టింది.

3 ప్రతీక రావల్ భారత్ తరఫున మూడో అత్యధిక వ్యక్తిగత స్కోరు (154)ను సాధించింది. దీప్తి శర్మ (188), హర్మన్‌ప్రీత్ (171 నాటౌట్) ఆమె కంటే ముందున్నారు.

3 భారత్ తరఫున ఒకే మ్యాచ్‌లో ఇద్దరు ఓపెనర్లు సెంచరీలు చేయడం ఇది మూడోసారి. గతంలో మిథాలీ రాజ్, రేష్మ గాంధీ (1999లో ఐర్లాండ్‌పై)... దీప్తి శర్మ, పూనమ్ రౌత్ (2017లో ఐర్లాండ్) ఈ ఫీట్‌ను నమోదు చేశారు.

10 స్మృతికి వన్డేల్లో ఇది 10వ సెంచరీ. అత్యధిక శతకాలు సాధించిన ప్లేయర్ల జాబితాలో మెగ్ లానింగ్ (15 : ఆస్ట్రేలియా), సుజీ బేట్స్ (13 : న్యూజిలాండ్) ఆమెకంటే ముందున్నారు.

444 కెరీర్ తొలి 6 ఇన్నింగ్స్‌లలో కలిపి ప్రతీక రావల్ చేసిన పరుగులు. గతంలో చార్లోట్ ఎడ్వర్డ్స్ (ఇంగ్లండ్) 434 పరుగులు చేసింది.

13 భారత జట్టు ప్రత్యర్థిని క్లీన్‌స్వీప్ చేయడం ఇది 13వసారి. అత్యధిక రికార్డు ఆస్ట్రేలియా (33 సార్లు) పేరిట ఉంది.

15 ఐర్లాండ్‌తో ఇప్పటి వరకు ఆడిన 15 వన్డేల్లోనూ భారత జట్టే గెలిచింది.

ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫలితాలు | ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ ఫలితాలు
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

సంక్రాంతి ప్రత్యేకం

తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతి. ఈ పండుగతో చిత్ర పరిశ్రమకు ప్రత్యేక అనుబంధం ఉంది. సంక్రాంతి సందర్భంగా తమ సినిమాలను రిలీజ్ చేసేందుకు స్టార్ హీరోలు సైతం పోటీపడుతుంటారు. ఈ సంక్రాంతికి రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్', బాలకృష్ణ 'డాకు మహారాజ్', వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బిగ్ ప్రాజెక్ట్స్ ప్రేక్షకుల ముందుకు వచ్చి అలరిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. సంక్రాంతి పండుగని పురస్కరించుకుని తమ సినిమాల నుంచి ప్రత్యేక పోస్టర్స్, లుక్స్‌ని విడుదల చేశారు పలువురు మేకర్స్. ఆ వివరాలేంటో ఓ లుక్కేద్దాం...

రాజా సాబ్ ఆగయా


ప్రభాస్

ప్రభాస్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'రాజా సాబ్'. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. రొమాంటిక్ హారర్ జానర్‌లో రూపొందుతోన్న 'రాజా సాబ్' నుంచి ప్రభాస్ సరికొత్త పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. పండుగ కళ కనిపిస్తున్న ఈ పోస్టర్‌లో ప్రభాస్ లుక్ ఆకట్టుకుంటోంది. షూటింగ్ తుదిదశలో ఉన్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

అర్థమైందా..


రజనీకాంత్

రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ డైరెక్షన్‌లో సన్ పిక్చర్స్ నిర్మించిన బ్లాక్‌బస్టర్ మూవీ 'జైలర్' (2023). ఈ మూవీకి సీక్వెల్‌గా 'జైలర్ 2' రానుంది. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్‌లోనే తెరకెక్కనున్న 'జైలర్ 2' సినిమాను సంక్రాంతి సందర్భంగా ప్రకటించారు మేకర్స్. త్వరలోనే చిత్రీకరణను ప్రారంభించనున్నట్లు 'జైలర్ 2' అనౌన్స్‌మెంట్ టీజర్‌లో వెల్లడించారు. 'టైగర్ కా హుకుమ్' సాంగ్ బ్యాగ్రౌండ్ స్కోర్‌తో పాటు వీడియో చివర్లో 'అర్థమైందా.. రాజా' అనే ఓ డైలాగ్ ఉంది. 'జైలర్ 2' కథాంశం ప్రధానంగా గోవా నేపథ్యంలో ఉంటుందని కోలీవుడ్ సమాచారం. సన్ పిక్చర్స్ నిర్మించనున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నారు.


అనిల్, 'దిల్' రాజు, మీనాక్షి, వెంకటేశ్, ఐశ్వర్య, శిరీష్

నా కెరీర్‌లో మరో బ్లాక్‌బస్టర్

- వెంకటేశ్

"నేను ఫ్యామిలీ సినిమా చేసిన ప్రతిసారి ఆడియన్స్ థియేటర్స్‌కి వచ్చి ఎంజాయ్ చేయడం, వారిలో నవ్వులు చూడటమన్నది వైవిధ్యమైన భావోద్వేగం. ఈ సంక్రాంతికి మా 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాని ఇంత బాగా ఆదరిస్తున్న ప్రేక్షకులకి, నా అభిమానులకు కృతజ్ఞతలు" అని హీరో వెంకటేశ్ చెప్పారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ నటించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేష్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా మంగళవారం విడుదలైంది. ఈ మూవీ సక్సెస్ మీట్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ– "అనిల్ 'సంక్రాంతికి వస్తున్నాం' తో నా కెరీర్‌లో మరో బిగ్ బ్లాక్ బస్టర్ ఇవ్వడం ఆనందంగా ఉంది. తన కెరీర్‌లో, అలాగే 'దిల్' రాజు, శిరీష్‌లకు కూడా ఈ మూవీ బిగ్ హిట్" అని తెలిపారు. "బెనిఫిట్ షోలకి అభిమానులు, యువత వెళుతుంటారు. కానీ మొదటి సారి 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రానికి ఉదయం నాలుగున్నర షోలకి ఫ్యామిలీ ఆడియన్స్ రావడమనేది మాకు బిగ్గెస్ట్ అచీవ్‌మెంట్" అన్నారు అనిల్ రావిపూడి. 'దిల్' రాజు మాట్లాడుతూ– "ఇలాంటి సినిమాని థియేటర్స్‌లోనే చూసి ఎంజాయ్ చేయండి. పైరసీని ప్రోత్సహించకండి" అని కోరారు. "మాకు ఇంత విజయాన్ని ఇచ్చిన తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు" అన్నారు శిరీష్.

అందమైన లైలా


విశ్వక్ సేన్

హీరో విశ్వక్ సేన్ లైలాగా మారారు. ఆయన అబ్బాయిగా, అమ్మాయిగా నటించిన చిత్రం 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో ఆకాంక్షా శర్మ హీరోయిన్. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించిన ఈ మూవీలో తొలిసారి లైలా అనే అమ్మాయి పాత్రలో కనిపించనున్నారు విశ్వక్ సేన్. ఈ సినిమా నుంచి లైలాగా విశ్వక్ సేన్ లుక్‌ని రిలీజ్ చేసింది చిత్రయూనిట్.

జాస్మిన్ వచ్చేశారు


సాక్షి సాగర్

'బబుల్ గమ్' మూవీ ఫేమ్ రోషన్ కనకాల హీరోగా నటిస్తున్న చిత్రం 'మోగ్లీ 2025'. 'కలర్ ఫోటో' మూవీతో జాతీయ అవార్డు అందుకున్న సందీప్ రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్, టీజీ కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ మూవీ ద్వారా సాక్షి సాగర్ మదోల్కర్ హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. ఈ చిత్రంలో ఆమె జాస్మిన్ పాత్రలో నటిస్తున్నట్లు పేర్కొని, పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్.


సంతాన ప్రాప్తిరస్తు


చాందిని, విక్రాంత్

విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన సినిమా 'సంతాన ప్రాప్తిరస్తు'. సంజీవ్ రెడ్డి దర్శకత్వంలో మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా నుంచి విక్రాంత్, చాందినిల స్పెషల్ పోస్టర్‌ని రిలీజ్ చేసింది యూనిట్. ఈ చిత్రం త్వరలో విడుదలకు ముస్తాబవుతోంది.

ఇది మన కథ!

'మీరు టీవీలో మిడిల్ క్లాస్ ఫ్యామిలీ డ్రామా చూశారు కదా.. ఇప్పుడు థియేటర్లో ఒక మిడిల్ క్లాస్ బాయ్ లవ్ స్టోరీ చూడండి. ఇది నా స్టోరీ.., నీ స్టోరీ.., కాదు కాదు మన స్టోరీ. మోస్ట్ రిలేటబుల్ లవ్ స్టోరీ'' అని హీరో ఆనంద్ దేవరకొండ అంటున్నారు. 'బేబీ' వంటి సక్సెస్‌ఫుల్ లవ్‌స్టోరీ తర్వాత హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవీ చైతన్యల కాంబినేషన్‌తో మరో లవ్‌స్టోరీ చిత్రం రానుంది. ఆదిత్యా హాసన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. 'యాన్ అన్‌ఫినిష్డ్ స్టోరీ' అనేది ట్యాగ్‌లైన్. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మించనున్నారు. సంక్రాంతి సందర్భంగా ఈ మూవీ అనౌన్స్‌మెంట్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. ''కామెడీ, రొమాన్స్, ఎమోషన్స్, డ్రామా వంటి అంశాలతో ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, సహ–నిర్మాతలు: వెంకట్ ఉప్పుటూరి, వీఎంఆర్.


ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య

మురారి వినోదం


సంయుక్త, శర్వానంద్, సాక్షీ వైద్య


శర్వానంద్ హీరోగా, సంయుక్త, సాక్షీ వైద్య హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రానికి 'నారీ నారీ నడుమ మురారి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'సామజవరగమన' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ పతాకాలపై రామబ్రహ్మం సుంకర ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శర్వానంద్ కెరీర్‌లోని ఈ 37వ సినిమా ఫస్ట్‌లుక్‌ను సంక్రాంతి శుభాకాంక్షలతో హీరోలు బాలకృష్ణ, రామ్‌చరణ్ కలిసి విడుదల చేశారు. ''నారీ నారీ నడుమ మురారి' చిత్రీకరణ జరుగుతోంది. జాయ్ ఫుల్ హిలేరియస్ రైడ్‌గా ఈ చిత్రం ఆడియన్స్‌ను అలరిస్తుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, సహ–నిర్మాత: అజయ్ సుంకర.

లవ్ అండ్ యాక్షన్


కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'దిల్ రూబా'. విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రుక్సార్ ధిల్లాన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శివమ్ సెల్యులాయిడ్స్, ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సారెగమ నిర్మాణ సంస్థ అయిన ఏ యూడ్లీ ఫిలిం పతాకాలపై రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించి, కిరణ్ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'దిల్ రూబా' చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: సామ్ సీఎస్.

దేశీ రాజుగా...


విక్రమ్ ప్రభు

అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా సినిమా 'ఘాటి'. 'వేదం' (2010) వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క, డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి కాంబినేషన్‌లో వస్తున్న ద్వితీయ చిత్రమిది. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో తమిళ నటుడు విక్రమ్ ప్రభు దేశీ రాజు అనే లీడ్ క్యారెక్టర్‌ని పోషిస్తున్నారు. బుధవారం(జనవరి 15) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా విక్రమ్‌కి శుభాకాంక్షలు తెలియజేస్తూ, దేశీ రాజు ఫస్ట్ లుక్, పాత్ర గ్లింప్స్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. ''అత్యధిక బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో భారీ స్థాయిలో 'ఘాటి' రూపొందుతోంది. ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీతో సహా పలు భాషల్లో ఏప్రిల్ 18న గ్రాండ్‌గా విడుదల కానుంది'' అని యూనిట్ పేర్కొంది.

సాక్షి బిజినెస్

గురువారం
16-1-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
224	37
76,724	23,213

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	19,453	▲	409
డోజోన్స్	43,164	▲	646
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,301	▲	100
డాక్స్	20,575	▲	303
షాంఘై	3,227	▼	14
నికాయ్	38,444	▼	30

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారట్)	77,910
బంగారం (22 క్యారట్)	74,200
వెండి (కేజీ)	1,01,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.12	87.14
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.30	107.10
€	యూరో	ఎస్‌బీఐ	87.92	90.53
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.21	55.5
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.53	54.72
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.95	65.62
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.13	23.69
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.62	24.41
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.91	12.73

అందానికి ఏఐ టచ్!

టెక్నాలజీతో రియల్ టైమ్ ఎక్స్‌పీరియన్స్

- చర్మ స్వభావాన్ని విశ్లేషించేందుకు ఆన్‌లైన్ టూల్స్
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ తోడు...
- తదనుగుణంగా సౌందర్య ఉత్పత్తుల సిఫార్సు
- బ్యూటీ స్టార్టప్‌లతో పాటు పెద్ద కంపెనీలదీ ఇదే రూటు...
- షుగర్ కాస్మెటిక్స్, మామాఎర్త్, ప్లమ్, పర్పుల్, నైకా జోరు



రమ్య తన పొడి చర్మానికి తగిన సౌందర్య ఉత్పత్తుల కోసం ఆన్‌లైన్‌లో వెతుకుతోంది. ఒక కంపెనీ వెబ్‌సైట్‌లోని టూల్ ఆకట్టుకుంది. రకరకాల యాంగిల్స్‌లో సెల్ఫీలను క్యాప్చర్ చేసి పంపింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో ఆమె ముఖాన్ని విశ్లేషించి తగిన ప్రోడక్టులను సిఫార్సు చేయడం.. వాటిని కొనుగోలు చేయడం క్షణాల్లో జరిగిపోయాయి. ఆ కాస్మెటిక్స్ బాగా పనిచేయడంతో చాన్నాళ్లుగా వెంటాడుతున్న తన సమస్యకు పరిష్కారం లభించింది. సౌందర్య, వ్యక్తిగత సంరక్షణ (బీపీసీ) రంగంలో టెక్నాలజీ కొత్త పుంతలకు ఇది ఓ మచ్చుతునక మాత్రమే! - సాక్షి, బిజినెస్‌డెస్క్

బ్యూటీ, పర్సనల్ కేర్ రంగంలో ఇప్పుడు హైపర్ పర్సనలైజేషన్ గేమ్ చేంజర్‌గా మారుతోంది. చర్మ స్వభావానికి అనుగుణంగా వ్యక్తిగత ప్రొడక్టుల వాడకానికి డిమాండ్ జోరందుకోవడంతో కంపెనీలు ఏఐ, మెషీన్ లెర్నింగ్ ఇతరత్రా అధునాతన టెక్నాలజీల బాట పడుతున్నాయి. ఏఐతో అందానికి వన్నెలద్దుతున్నాయి. వినియోగదారులకు కూడా ఈ రియల్ టైమ్ ఎక్స్‌పీరియన్స్ తెగ నచ్చేస్తుండటంతో పాటు మంచి ఫలితాలు కూడా ఇస్తున్నాయి. దీంతో బ్యూటీ బ్రాండ్స్‌లో స్టార్టప్‌లు మొదలు.. ఇప్పటికే బాగా పాతుకుపోయిన పెద్ద కంపెనీలు సైతం ఏఐ మంత్రాన్ని జపిస్తున్నాయి. ఎవరైనా సరే తమ సెల్ఫీలను తీసి పంపితే చాలు.. ఏఐ మోడల్ వాటిని ప్రాసెస్ చేసి, అత్యంత నిశితమైన సమస్యలను సైతం గుర్తిస్తుంది. చర్మం రకం, మొటిమలు, నలుపు మచ్చలు, రంగు మారడం, పొడిబారడం, ఎగుడుదిగుడు చర్మం, ముడతలు, గుంతలను గుర్తించి, రియల్ టైమ్‌లో వ్యక్తిగతంగా సరైన సిఫార్సులు అందిస్తుంది.

డేటా ఎనలిటిక్స్ దన్ను...

బ్యూటీ స్టార్టప్‌లు గత రెండు మూడేళ్లుగా వినియోగదారుల నుంచి పెద్ద మొత్తంలో సేకరించిన డేటా ఆధారంగా ఎప్పటికప్పుడు టెక్నాలజీని అప్‌డేట్ చేసుకోగలుగుతున్నాయి. వేలాది మంది వ్యక్తిగత డేటాలోని అంశాలను విశ్లేషించి యూజర్లను పొడి చర్మం, పిగ్మెంటెడ్ స్కిన్, మొటిమలు, జిడ్డు చర్మం వంటి వివిధ విభాగాలుగా విభజిస్తున్నాయి. ఆపై ఏఐ టెక్నాలజీ పని మొదలుపెడుతుంది. వినియోగదారులు పంపించే తాజా ఫేస్ ఇమేజ్‌లను ఇప్పటికే గుర్తించి, విభజించిన లక్షణాల ఆధారంగా సరిపోల్చడం ద్వారా వారి చర్మ స్వభావాన్ని అంచనా వేస్తుంది. ఈ ప్రక్రియతో బ్యూటీ కంపెనీలు ఒక్క చర్మాన్ని మాత్రమే కాకుండా పెదాలు, శిరోజాలను కూడా విశ్లేషించి, తదనుగుణంగా ఉత్పత్తులను సూచిస్తున్నాయి. ఉదాహరణకు, ట్రాయా, రావెల్ వంటి హెయిర్ కేర్ స్టార్టప్‌లు క్విక్ ఆన్‌లైన్ సర్వే నిర్వహించి, మెషీన్ లెర్నింగ్ ద్వారా ఎవరికి ఎలాంటి పదార్ధాలతో కూడిన ప్రొడక్టు అవసరమనేది కొద్ది నిమిషాల్లోనే సిఫార్సు చేస్తుండడం విశేషం!

34 బిలియన్ డాలర్లు
2028 నాటికి భారత బ్యూటీ, పర్సనల్ కేర్ మార్కెట్ విలువ అంచనా.

25 శాతం
ఆన్‌లైన్ ద్వారా సౌందర్య ఉత్పత్తుల అమ్మకాల వార్షిక వృద్ధి అంచనా (ఆఫ్‌లైన్ స్టోర్లలో 14 శాతమే).

స్మార్ట్ టూల్స్..

ఆన్‌లైన్ బ్యూటీ స్టోర్ పర్పుల్.. సొంతంగా పర్పుల్ స్కిన్ ఎనలైజర్ అనే ఏఐ ఇమేజ్ రికగ్నిషన్ టూల్‌ను అభివృద్ధి చేసింది. ఇది యూజర్ల చర్మాన్ని రియల్ టైమ్‌లో విశ్లేషిస్తుంది. ఆపై దీని స్మార్ట్ కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ (సీఆర్ఎం) టూల్ మెషీన్ లెర్నింగ్‌ను ఉపయోగించి హైపర్ పర్సనలైజ్డ్ ఉత్పత్తులను సిఫార్సు చేస్తుందని సంస్థ ఇంజనీరింగ్ హెడ్ వివేక్ పరిహార్ చెబుతున్నారు. ఇక లోరియల్ ప్రొడక్టులను విక్రయించే నైకా కూడా అధునాతన ఏఐ ఆధారిత వర్చువల్ టెక్నాలజీ 'మోడిఫేస్'ను ఉపయోస్తోంది. వినియోగదారులు ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్) అనుభవం ద్వారా తమకు సరిపడే ప్రొడక్టులను ఎంచుకునే అవకాశం ఇది కల్పిస్తుంది. ఈ సాఫ్ట్‌వేర్ దాదాపు 88 శాతం ఖచ్చితత్వంతో ఫేస్ ఆకారం, స్కిన్ టోన్, శిరోజాల రంగుతో సహా అనేక అంశాలను గుర్తించగలదు. అడ్వాన్స్‌డ్ డిజిటల్ ఫీచర్లు కస్టమర్లతో మరింతగా అనుసంధానమయ్యేందుకు, వారికి మరింత ప్రభావవంతమైన, ఆహ్లాదకరమైన షాపింగ్ అనుభవాన్ని అందించేందుకు దోహదం చేస్తున్నాయని బ్యూటీ స్టార్టప్ షుగర్ కాస్మెటిక్స్ సీఈఓ వినీతా సింగ్ పేర్కొన్నారు. 'యూజర్ల కొనుగోలు హిస్టరీ ఆధారంగా సిఫార్సులు చేసేందుకు మెషీన్ లెర్నింగ్ ఆల్గోరిథమ్స్ ఉపయోగపడుతున్నాయి. ఫేస్ ఫౌండేషన్ కొన్న వారు మస్కారాను కూడా కొనుగోలు చేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది' అని కంపెనీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ జాస్మిన్ గోహిల్ పేర్కొన్నారు.

ఫీడ్‌బ్యాక్, సందేహాలు, డెలివరీలోనూ...

కస్టమర్ల ఫీడ్‌బ్యాక్, సందేహాలు, లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్ వంటి అన్ని దశల్లోనూ టెక్నాలజీ అక్కరకొస్తోంది. యూజర్ల సందేహాలను మరింత సమర్ధవంతంగా విభజించి, విశ్లేషించేందుకు పెప్ బ్రాండ్స్ క్యాప్చర్ అనే ఏఐ ఆధారిత టూల్‌ను ఉపయోగిస్తోంది. అలాగే సెల్ఫ్ లెర్నింగ్ బ్యూటీ డిక్షనరీతో కూడిన సెర్చ్ ఇంజిన్‌ను పర్పుల్ అందుబాటులోకి తెచ్చింది. దీనిలోని జీపీటీ ఆధారిత టూల్ వల్ల యూజర్లు సెర్చ్ చేస్తున్నప్పుడు ఆటోమేటిక్‌గా స్పెల్లింగ్ కరెక్ట్ చేయడం వంటివి చేస్తుంది. ఇక చాలా మందికి ఇంగ్లిష్‌లో తమ సందేహాలు చెప్పడం పెద్ద సమస్య. వారికోసం పర్పుల్ స్థానిక భాషలో సెర్చ్‌ను కూడా ప్రవేశపెట్టింది. యూజర్లకు వీలైనంత త్వరగా డెలివరీ చేసేందుకు సరైన వేర్‌హౌస్, రవాణా సంస్థలను ఎంచుకోవడంలోనూ స్టార్టప్‌లకు ఏఐ, ఎంఎల్ టూల్స్ తోడ్పడుతున్నాయి.



డిసెంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం అప్..

2.37 శాతంగా నమోదు

న్యూఢిల్లీ: టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) డిసెంబర్‌లో 2.37 శాతానికి చేరింది. ఆహార ఉత్పత్తుల ధరలు నెమ్మదించినప్పటికీ.. ఆహారేతర ఉత్పత్తులు, ఇంధనం.. విద్యుత్ మొదలైన వాటి రేట్ల పెరుగుదల ఇందుకు కారణం. 2024 నవంబర్‌లో డబ్ల్యూపీఐ 1.89 శాతంగా ఉండగా.. 2023 డిసెంబర్‌లో 0.86 శాతంగా నమోదైంది. డేటా ప్రకారం ఆహారోత్పత్తుల ద్రవ్యోల్బణం నవంబర్‌లో 8.63 శాతంగా ఉండగా డిసెంబర్‌లో 8.47 శాతానికి దిగి వచ్చింది. క్రూడాయిల్, కమోడిటీల ధరలు పెరగడం, డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ పడిపోవడం వంటి పరిణామాల వల్ల జనవరిలో డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 3 శాతానికి పెరగవచ్చని అంచనా వేస్తున్నట్లు రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. గతేడాది జనవరిలో ఇది 0.3%. తాజా ద్రవ్యోల్బణ గణాంకాల నేపథ్యంలో పాలసీ రేట్ల విషయంలో రిజర్వ్ బ్యాంక్ తీసుకోబోయే నిర్ణయంపై ఆసక్తి నెలకొంది.

ఈవీకి 60% మంది సై

టీసీఎస్ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వెహికిల్స్‌కు (ఈవీ) క్రమంగా డిమాండ్ పుంజుకుంటోంది. తమ తదుపరి కొనుగోలు కోసం ఈవీని పరిగణిస్తామని 60% మంది వెల్లడించినట్టు ఐటీ దిగ్గజం టీసీఎస్ నివేదిక తెలిపింది. టీసీఎస్ ఫ్యూచర్ రెడీ ఈమొబిలిటీ స్టడీ 2025 పేరుతో నిర్వహించిన ఈ అధ్యయనం ప్రకారం.. 56% మంది ఎలక్ట్రిక్ వాహనం కోసం దాదాపు రూ.35 లక్షల వరకు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారు. బ్యాటరీ సాంకేతికతలో మెరుగుదలలు పరిధి, చార్జింగ్ వేగాన్ని పెంచుతాయని, ఇతర సాంకేతిక పురోగతితో పోలిస్తే సమీప కాలంలో ఈవీల రూపకల్పన, పనితీరును గణనీయంగా ప్రభావితం చేస్తాయని 90% మంది తయారీదారులు విశ్వసించారు. యూఎస్‌లోని 72% మంది కస్టమర్లు తమ తదుపరి వాహనంగా ఈవీని కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 200–300 మైళ్ల మైలేజీ ఆమోదయోగ్యమని 41% మంది చెప్పారు.

ముందున్న సవాళ్లు..: చార్జింగ్ మౌలిక సదుపాయాలు పెద్ద సవాలుగా 60 శాతం మంది అభిప్రాయపడ్డారు. చార్జింగ్ మౌలిక సదుపాయాల లేమి ఈవీ మార్కెట్ వృద్ధికి అతిపెద్ద అడ్డంకిగా మారిందని 74 శాతం కంపెనీలు భావిస్తున్నాయి. తయారీదారులు బ్యాటరీ టెక్నాలజీని అభివృద్ధి చేయడం, సంక్లిష్ట వాహన డిజైన్‌లు, ఉత్పత్తి వ్యయాల వంటి సవాళ్లను ఎదుర్కొంటారని టీసీఎస్ మాన్యుఫాక్చరింగ్ ప్రెసిడెంట్ అనుపమ్ సింఘాల్ తెలిపారు.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

స్వల్పంగా తగ్గిన ఎగుమతులు	సియట్ లాభం డౌన్

జోయాలుక్కాస్‌కు రెండు ప్రతిష్టాత్మక అవార్డులు

హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ రెండు అవార్డులు దక్కించుకుంది. ప్రతిష్టాత్మక 'రిటైల్ జ్యువెలర్ మ్యాగజైన్ ఎండీ–సీఈవో పురస్కారాలు 2025'లో భాగంగా బెస్ట్ స్ట్రాటజిక్–ఇంటిగ్రేటెడ్ మార్కెట్ 2025, నేషనల్ రిటైల్ చెయిన్ ఆఫ్ ద ఇయర్ 2025 అవార్డులు సొంతం చేసుకుంది. ముంబైలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ థామస్ మాథ్యూ ఈ పురస్కారాలు అందుకున్నారు. జ్యువెలరీ పరిశ్రమలో సాధించిన విజయాలు, అందించిన తోడ్పాటుకు ఈ అవార్డులు ప్రతిరూపమని జోయాలుక్కాస్ చైర్మన్ జాయ్ అలుక్కాస్ తెలిపారు.



రెండోరోజూ రికవరీ

సెన్సెక్స్ లాభం 224 పాయింట్లు



ముంబై: దేశీయ స్టాక్ సూచీలు రెండోరోజూ లాభపడ్డాయి. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్ (1%), కోటక్ బ్యాంక్ (2%), జొమాటో (4%) షేర్లు రాణించడం కలిసొచ్చింది. సెన్సెక్స్ 224 పాయింట్లు పెరిగి 76,724 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 37 పాయింట్లు బలపడి 23,213 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాల ప్రభావం ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే ఫైనాన్స్, బ్యాంకుల షేర్లకు కొనుగోళ్లకు మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 492 వద్ద బలపడి 76,991 వద్ద, నిఫ్టీ 118 పాయింట్లు పెరిగి 23,294 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. అయితే ద్వితీయార్ధంలో ఆటో, ఆయిల్‌అండ్‌గ్యాస్, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా షేర్లలో విక్రయాలు తలెత్తడంతో సూచీలు కొంత మేర లాభాలు కోల్పోయాయి.

మళ్లీ రూపాయి ప్లస్

రూపాయి రికవరీ రెండోరోజూ కొనసాగింది. డాలర్ మారకంలో బుధవారం 13 పైసలు బలపడి 86.40 వద్ద ముగిసింది. క్రూడాయిల్ ధరలు చల్లారడం, డాలర్ ఇండెక్సు రికార్డు గరిష్టాల నుంచి దిగిరావడమూ కలిసొచ్చాయని నిపుణులు తెలిపారు.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్ఐఎంసీ, డెహ్రాడూన్‌లో ఎనిమిదో తరగతిలో ప్రవేశాలు

డెహ్రాడూన్(ఉత్తరాఖండ్)లోని రాష్ట్రీయ మిలిటరీ కాలేజ్(ఆర్ఐఎంసీ)లో జనవరి–2026 టర్మ్ ఎనిమిదో తరగతి ప్రవేశాలకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2026, జనవరి 1 నాటికి ఏడో తరగతి చదువుతున్న లేదా ఏడో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు.
» **వయసు:** 01.01.2025 నాటికి పదకొండున్నర ఏళ్లకు తగ్గకుండా పదమూడేళ్లకు మించకుండా ఉండాలి. 02.01.2013 నుంచి 01.07.2014 మధ్య జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, వైవా వాయిస్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.
» **పరీక్ష విధానం:** రాతపరీక్షలో మొత్తం మూడు పేపర్లు ఉంటాయి. అవి.. మ్యాథమేటిక్స్(200 మార్కులు), జనరల్ నాలెడ్జ్(75 మార్కులు), ఇంగ్లిష్(125 మార్కులు) నుంచి ప్రశ్నలు ఉంటాయి. రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు వైవా వాయిస్(50 మార్కులు)నిర్వహిస్తారు. రాతపరీక్ష, వైవా వాయిస్‌లకు మొత్తం 450 మార్కులు కేటాయించారు. దీనిలో కనీస ఉత్తీర్ణత మార్కులు 50 శాతం ఉండాలి. ఈ రెండింటిలో అర్హత సాధించిన అభ్యర్థులకు చివరిగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును నింపి అవసరమైన సర్టిఫికేట్‌లు జతచేసి ది కమాండెంట్ ఆర్ఐఎంసీ ఫండ్, డ్రాయి బ్రాంచ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బల్లూపూర్ చౌక్, డెహ్రాడూన్(బ్యాంక్ కోడ్–1399),ఉత్తరాఖండ్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 31.03.2025.
» **పరీక్ష తేది:** 01.06.2025.
» **వెబ్‌సైట్:** https://rimc.gov.in

బెల్ చెన్నైలో 83 అప్రెంటిస్‌లు

చెన్నైలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్).. గ్రాడ్యుయేట్, డిప్లొమా, బీకాం అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 83.
» **పోస్టుల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–63, టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్–10, బీకాం అప్రెంటిస్–10.
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, సివిల్, మెకానికల్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్, బీకాం ఉత్తీర్ణులై ఉండాలి. దక్షిణ ప్రాంతీయ రాష్ట్రాలు(తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, పాండిచ్చేరి)కు చెందిన అభ్యర్థులు మాత్రమే అర్హులు.
» **వయసు:** 25 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.17,500, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.12,500, బీకాం అప్రెంటిస్‌లకు రూ.12,500.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, సీజీపీఏ స్కోరు ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఇంటర్వ్యూ తేదీలు:** 20.01.2025, 21.01.2025, 22.01.2025.
» **ఇంటర్వ్యూ వేదిక:** భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్), నందంబాక్కం,చెన్నై–600089.
» **వెబ్‌సైట్:** https://bel-india.in

ఐఐఎస్‌టీ, తిరువనంతపురంలో ఇంజనీర్ పోస్టులు

తిరువనంతపురం(కేరళ)లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ).. ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **వేతనం:** నెలకు రూ.40,000.
» **పోస్టుల వివరాలు:** ఇంజనీర్(సివిల్)–03, ఇంజనీర్(ఎలక్ట్రికల్)–01.
» **అర్హత:** సివిల్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీఈ/బీటెక్ లేదా తత్సమాన విద్యార్హత ఉండాలి. సంబంధిత రంగాలలో కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. ఆటోక్యాడ్, రీవిట్, ఎంఎస్ ప్రాజెక్ట్ తదితర సాఫ్ట్‌వేర్‌లపై అవగాహన కలిగి ఉండాలి. **వయసు:** 31.01.2025 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రాతపరీక్ష లేదా ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**31.01.2025.
» **వెబ్‌సైట్:** https://www.iist.ac.in



» ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీల్లో గేట్-2025
» ఎంటెక్, పీహెచ్‌డీతో పాటు పీఎస్‌యూ కొలువుకు మార్గం
» 750 స్కోర్ లక్ష్యంగా కృషి చేయాలంటున్న నిపుణులు

గేట్.. గెలుపు బాట!

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్.. సంక్షిప్తంగా గేట్! ఐఐటీలు, ఎన్ఐటీలు వంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో.. ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్+పీహెచ్‌డీ తదితర కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే జాతీయ స్థాయి పరీక్ష! అంతేకాకుండా ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో.. ఇంజనీర్ కొలువులు సైతం సొంతం చేసుకోవచ్చు. ఇంతటి కీలకమైన గేట్ పరీక్షకు హాజరుకానున్న అభ్యర్థులు తమ కసరత్తు ముమ్మరం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. కారణం.. గేట్-2025 పరీక్ష తేదీలు సమీపిస్తుండడమే! ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీల్లో దేశవ్యాప్తంగా ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. గేట్ పరీక్షకు లాస్ట్ మినిట్ ప్రిపరేషన్, రివిజన్, ఎగ్జామ్ డే టిప్స్..

టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్+పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యా కోర్సుల్లో చేరే అవకాశంతో పాటు ప్రభుత్వ రంగ కొలువులకు అవకాశం కల్పిస్తున్న గేట్‌కు విస్తృతమైన పోటీ నెలకొంది. దేశవ్యాప్తంగా ఏటా ఎనిమిది లక్షల మందికిపైగా అభ్యర్థులు గేట్ పరీక్షకు హాజరవుతున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 80 వేల మంది వరకూ ఈ పరీక్ష రాస్తున్నట్లు అంచనా.

వంద మార్కులకు పరీక్ష

ఆన్‌లైన్ విధానంలో జరిగే గేట్ పరీక్షలో 65 ప్రశ్నలు ఉంటాయి. వీటికి 100 మార్కులు కేటాయిస్తారు. పరీక్షకు అందుబాటులో ఉండే సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో మొత్తం మూడు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అవి.. జనరల్ ఆప్టిట్యూడ్ , ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్, సంబంధిత సబ్జెక్ట్.

రివిజన్

అభ్యర్థులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో పునశ్చరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇప్పటి వరకు చదివిన అంశాలు, వాటికి సంబంధించి ముఖ్యమైన పాయింట్లు, ఫార్ములాలతో రూపొందించుకున్న సొంత నోట్స్‌ను రివిజన్ చేయాలి. ప్రతిరోజు తాము రాస్తున్న పేపర్‌కు సంబంధించిన సిలబస్‌లోని అన్ని యూనిట్లు చదివేలా ప్రణాళిక రూపొందించుకోవాలి.

ఫార్ములాలు, కాన్సెప్ట్‌లు

గేట్ అభ్యర్థులు ఆయా సబ్జెక్ట్‌లు, టాపిక్‌లకు సంబంధించి ముఖ్యమైన ఫార్ములాలు, కాన్సెప్ట్‌లను తరచూ చదువుతుండాలి. ముఖ్యంగా మెకానికల్, సీఎస్ఈ, ఈసీఈ అభ్యర్థులకు ఇది ఎంతో కీలకం. ఈ విధానం పరీక్ష హాల్లో మెరుగైన ప్రతిభ కనబర్చేందుకు ఎంతో దోహదం చేస్తుంది. అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం సాగిస్తే.. పరీక్ష హాల్లో ఎలాంటి ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది. తద్వారా మంచి స్కోర్ సాధనలో ముందంజలో నిలిచే ఆస్కారం ఉంటుంది.

మాక్ టెస్ట్‌లకు హాజరు

మలి దశ ప్రిపరేషన్‌లో భాగంగా అభ్యర్థులు తమకు అందుబాటులో ఉన్న సమయంలో మాక్ టెస్ట్‌లకు హాజరు కావాలి. వాటి ఫలితాలను విశ్లేషించుకోవాలి. ఒకవేళ తమకు ఏదైనా టాపిక్‌లో తక్కువ మార్కులు వచ్చినా.. ఇప్పుడు కొత్తగా వాటిని చదవాలనే ఉద్దేశం ఏ మాత్రం సరికాదు. దీనికి బదులు బాగా పట్టున్న సబ్జెక్ట్‌లలో మరింత మెరుగ్గా రాణించేలా కృషిచేయాలి.

అధికారిక 'మాక్ టెస్ట్'లు

అభ్యర్థులు గేట్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న 'మాక్ టెస్ట్' సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఈ మాక్ టెస్ట్‌లు పరీక్ష విధానం, ప్రశ్నలు అడిగే తీరుపై అవగాహనను పెంచుతాయి. కాబట్టి ప్రస్తుత సమయంలో అభ్యర్థులు అధికారిక మాక్‌టెస్టులను సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేయాలి.

వర్చువల్ కాలిక్యులేటర్

అభ్యర్థులు పట్టు సాధించాల్సిన మరో అంశం.. వర్చువల్ కాలిక్యులేటర్. మొత్తం 65 ప్రశ్నలతో మూడు గంటల వ్యవధిలో జరిగే ఈ పరీక్షలో అంచెల వారీగా సాధన చేసి సమాధానం రాబట్టాల్సిన విధంగా ప్రశ్నలు ఉంటాయి. మొత్తం ప్రశ్నల్లో 80 నుంచి 90 శాతం ప్రశ్నలు కాలిక్యులేటర్‌ను వినియోగించాల్సిన విధంగా అడుగుతున్నారు. కాబట్టి వర్చువల్ కాలిక్యులేటర్‌ను వేగంగా వినియోగించే నైపుణ్యం పెంచుకోవాలి. ఫలితంగా ఆయా ప్రశ్నలకు వీలైనంత త్వరగా సమాధానం ఇచ్చే నేర్పు లభిస్తుంది.

నిబంధనలు, డాక్యుమెంట్లు

అభ్యర్థులు పరీక్ష నిబంధనలు, పరీక్ష హాల్లోకి తీసుకు వెళ్లాల్సిన డాక్యుమెంట్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. గేట్ నిర్వాహక కమిటీ నిబంధనల ప్రకారం–అప్లికేషన్ సమయంలో పేర్కొన్న వ్యక్తిగత ఫొటో ఐడెంటిటీ కార్డ్ ఒరిజినల్ కాపీని పరీక్ష హాల్లో చూపించాల్సి ఉంటుంది. వాటిని ముందుగానే సిద్ధం చేసుకోవాలి. చివరి క్షణంలో సాంకేతిక సమస్యలు,వెబ్‌సైట్ ఓపెన్ అవకపోవడం వంటి సమస్యలు ఎదురయ్యే ఆస్కారముంది. కాబట్టి అభ్యర్థులు అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం అందుబాటులోకి రాగానే డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ తీసుకోవాలి.

గేట్ స్కోర్‌తో ప్రయోజనాలు

- గేట్‌లో మంచి స్కోర్‌తో అభ్యర్థులకు అనేక ప్రయోజనాలు లభిస్తున్నాయి. ముఖ్యంగా ఐఐటీలు, ఎన్ఐటీలు, రాష్ట్రాల స్థాయిలో యూనివర్సిటీల్లో ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్+ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశించే అవకాశం లభిస్తుంది.
- రాష్ట్రాల స్థాయిలో పీజీఈసెట్ కౌన్సెలింగ్‌లో గేట్ ర్యాంకర్లకు తొలి ప్రాధాన్యం ఉంటుంది. గేట్ ర్యాంకు ఆధారంగా ఎంటెక్ సీటు ఖరారు చేసుకుంటే.. నెలకు రూ.12,400 స్టయిపండ్ అందుకోవచ్చు. ఇంటిగ్రేటెడ్ ఎంటెక్, పీహెచ్‌డీ అభ్యర్థులకు నెలకు రూ.28 వేల స్కాలర్‌షిప్ లభిస్తుంది.

పీఎస్‌యూ ఉద్యోగాలు

గేట్ స్కోర్ ఆధారంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో ఇంజనీర్లుగా కొలువులు సొంతం చేసుకోవచ్చు. పలు ప్రభుత్వ రంగ సంస్థలు(పీఎస్‌యూ) గత కొన్నేళ్లుగా గేట్ స్కోర్ ఆధారంగా నియామకాలు చేపడుతున్నాయి. ఇందుకోసం అభ్యర్థులు ఆయా సంస్థలు విడుదల చేసే నోటిఫికేషన్లకు అనుగుణంగా ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. నిర్దిష్ట కటాఫ్‌ను అనుసరించి.. ఆ జాబితాలో ఉన్న వారికి పర్సనల్ ఇంటర్వ్యూ, గ్రూప్ టాస్క్ వంటివి నిర్వహించి తుది విజేతలను నిర్ణయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని టెలికం శాఖలో సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్, కేబినెట్ సెక్రటేరియట్‌లో సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ (క్రిప్టో),సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్(ఎస్ అండ్ టీ) విభాగాల్లోని గ్రూప్–ఎ స్థాయి పోస్టుల నియామకాలకు గేట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నారు.

టార్గెట్ 750 స్కోర్

అభ్యర్థులు 750 స్కోర్‌ను టార్గెట్‌గా చేసుకుని కృషి చేయాలి. ఈ స్కోర్‌తో ఇటు కోరుకున్న ఇన్‌స్టిట్యూట్‌లో ప్రవేశం, అదేవిధంగా పీఎస్‌యూలో కొలువుకు అవకాశం ఉంటుంది. పరీక్ష హాల్లో ముందుగా జనరల్ ఆప్టిట్యూడ్,ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్ సెక్షన్లను పూర్తి చేయడం వల్ల సబ్జెక్టు సెక్షన్‌కు ఎక్కువ సమయం కేటాయించే అవకాశం లభిస్తుంది.

పరీక్ష రోజు ఇలా

- గేట్ పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుంది. సంబంధిత పోర్టల్‌లో నిర్దిష్ట స్లాట్‌కు 20 నిమిషాల ముందుగానే లాగిన్ అయ్యే అవకాశం ఉంది. అభ్యర్థులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలి. తద్వారా పరీక్షకు సంబంధించి ముఖ్యమైన నియమ నిబంధనలు పూర్తిగా తెలుసుకోవచ్చు.
- సమాధానాలకు ఉపక్రమించే ముందు ఆన్‌లైన్ విండోలో 'వ్యూ ఆల్ కొశ్చన్స్' ట్యాబ్‌పై క్లిక్ చేయడం మేలు. దీనివల్ల మొత్తం అన్ని ప్రశ్నలను చదివే అవకాశం ఉంటుంది. ఫలితంగా ఏ ప్రశ్న లేదా సెక్షన్‌ను ముందుగా ప్రారంభించాలి అనే అంశంపై స్పష్టత వస్తుంది. ముందుగా సులువైన లేదా తమకు బాగా అవగాహన ఉన్న సెక్షన్స్‌ను ఎంచుకుని.. వాటిని త్వరగా పూర్తి చేసుకోవాలి. ఆ తర్వాత క్లిష్టమైన సెక్షన్ ప్రశ్నల వైపు దృష్టి సారించొచ్చు.
- గేట్‌లో ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్, జనరల్ ఆప్టిట్యూడ్ సెక్షన్స్ కొంత సులభంగా ఉంటాయి. అభ్యర్థులు ముందుగా వీటికి సమాధానం ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇవ్వడం మేలు. దీనివల్ల ఈ సెక్షన్లను తక్కువ సమయంలో పూర్తి చేసుకుని.. ఆ తర్వాత సమయంలో సబ్జెక్ట్ ఆధారిత సెక్షన్లకు ఎక్కువ సమయం కేటాయించేందుకు వీలవుతుంది.
- మొత్తం మూడు గంటల సమయంలో మొదటి గంటన్నరలోనే తమకు బాగా సులువుగా ఉన్న ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం పూర్తి చేయాలి. ఏదైనా క్లిష్టమైన ప్రశ్న కనిపిస్తే దాన్ని వదిలేసి వేరే ప్రశ్నకు వెళ్లాలి. నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. కాబట్టి సమాధానం తెలియని ప్రశ్నలని వదిలి వేయడమే మేలు. ఆన్‌లైన్ పరీక్ష క్రమంలో అభ్యర్థులు తామిచ్చిన సమాధానాల రివ్యూకు కూడా కొంత సమయం కేటాయించుకోవాలి. అన్ని ప్రశ్నలకు సమాధానాలిచ్చాం అనే స్పష్టతకు వచ్చాక.. మరోసారి సమాధానాలను సరిచూసుకోవాలి.
- సమాధానాలిచ్చే క్రమంలో రఫ్ వర్క్ చేయడం కూడా మేలు చేస్తుంది.ముఖ్యంగా ఫార్ములా ఆధారిత ప్రశ్నల విషయంలో ఇది ఎంతో అవసరం.
- పరీక్షకు ఒక రోజు ముందుగానే తమకు కేటాయించిన సెంటర్ వివరాలు తెలుసుకోవాలి. పరీక్షకు ముందు రోజు పూర్తిగా ప్రశాంతంగా ఉండాలి. మానసికంగా ఎలాంటి ఒత్తిడికి గురవకుండా ఉండాలి.పరీక్ష సమయం వరకు చదువుదాం అనే ధోరణి వల్ల ఒత్తిడి మరింత పెరుగుతుంది.

గేట్-2025.. ముఖ్య తేదీలు

- అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: జనవరి 7 నుంచి
- గేట్–2025 ఆన్‌లైన్ పరీక్ష తేదీలు: ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీలలో
- ఫలితాల వెల్లడి: మార్చి 17, 2025
- వెబ్‌సైట్: https://gate2025.iitr.ac.in/index.html

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-కంప్యూటర్ అవేర్‌నెస్

చెట్టు చెట్టుకో కథ


రాష్ట్రంలో 9 వృక్షాలకు చారిత్రక ప్రాముఖ్యత
వీటికి వారసత్వ గుర్తింపునకు కృషి
ప్రభుత్వానికి 'వట' ఫౌండేషన్ ప్రతిపాదన
చారిత్రక ప్రాధాన్యత ఉన్న వృక్షాలను కంపెనీలు దత్తత తీసుకోవాలి: ఉదయ్ కృష్ణ

సాక్షి, హైదరాబాద్: వరదల నుంచి 150 మంది ప్రాణాలను కాపాడిన చెట్టు ఒకటి.. కొబ్బరికాయ ముడుపు కడితే వీసాలు ప్రసాదించేది మరో చెట్టు.. చేతులెత్తి మొక్కితే మొండి రోగాలను కూడా నయం చేస్తుందని భక్తులు నమ్మేది ఇంకో చెట్టు.. దోపిడీ దొంగల్ని పట్టించిన మరొక చెట్టు.. ఇలా రాష్ట్రంలో దేనికవే ప్రత్యేకమైన 9 పురాతన వృక్షాలున్నాయి. ఈ చెట్ల పరిరక్షణ కోసం పాటుపడుతున్న స్వచ్ఛంద సంస్థ 'వట' ఫౌండేషన్.. ఆయా వృక్షాలకు వారసత్వ సంపద గుర్తింపు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదించింది. దేశంలోని పురాతన చెట్ల చరిత్రను డాక్యుమెంట్ చేయాలనే లక్ష్యంతో 'వట' ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఉదయ్ కృష్ణ ఇప్పటివరకు 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో సుమారు 27 వేల కి.మీ. ప్రయాణించారు. అతి పురాతన చెట్లను గుర్తించి, వాటిని గూగుల్ ఎర్త్ ప్రో మ్యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 150 వృక్షాలను మ్యాపింగ్ చేశారు. మనుగడ కోల్పోయే దశలో ఉన్న వృక్షాలను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద సంస్థలు దత్తత తీసుకోవాలని కోరారు.

తెలంగాణలోని 9 చారిత్రక వృక్షాలివీ..

దొంగల్ని పట్టించిన బావోబాబ్..

హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో 600 ఏళ్ల నాటి పురాతన బావోబాబ్ చెట్టు ఉంది. గోల్కొండ కోట గోడను ఆనుకొని ఉన్న ఈ వృక్షపు కాండం ఒక రహస్య గది మాదిరిగా ఉంటుంది. ఇందులో 20 మంది దాక్కునేంత కుహరం ఉంది. దీంతో దొంగలు పగటి పూట ఈ రహస్య గదిలో దాక్కొని రాత్రి సమయంలో కోట పరిసర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడేవారు. ఒకరోజు దొంగలు వంట చేస్తుండగా చెట్టు వెనక నుంచి పొగలు రావడం స్థానికులు గమనించారు. ఈ విషయాన్ని సైనికులకు తెలపడంతో దొంగల గుట్టు రట్టయింది.



వరదల నుంచి కాపాడిన చింత..



ఉస్మానియా ఆసుపత్రిలో చింత చెట్టు ఉంది. 1908, సెప్టెంబర్ 28న మూసీ నది వరదలు నగరాన్ని ముంచెత్తాయి. దాదాపు 30 వేల మంది మరణించారు. ఆ సమయంలో ప్రాణాలు రక్షించుకునేందుకు 150 మంది ప్రజలు ఈ చింత చెట్టు ఎక్కి రెండు రోజుల పాటు కొమ్మలపైనే ఉన్నారు. ప్రతీ ఏడాది నవంబర్ 30న హాస్పిటల్ డేను ఈ చెట్టు కిందే ఆసుపత్రి సిబ్బంది జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

పర్యాటక పిల్లలమర్రి..



మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి సుమారు 800 ఏళ్ల నాటి భారీ వృక్షం. ఒకప్పుడు 4 ఎకరాల్లో విస్తరించి ఉండేది. కానీ, ఆక్రమణ కారణంగా ప్రస్తుతం 2.5 ఎకరాలకు పరిమితమైపోయింది. ఈ చెట్టును చూసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు వస్తుంటారు. భారీ కొమ్మలతో విశాలంగా విస్తరించి ఉండటంతో ఈ ప్రాంతానికే పిల్లల మర్రి అనే పేరు వచ్చింది. వేల కొద్ది మర్రి ఊడల కారణంగా ప్రధాన కాండం ఏదో స్పష్టంగా గుర్తించలేం.

వీసాలు ప్రసాదించే మర్రి



హిమాయత్‌సాగర్‌లోని చిలుకూరు బాలాజీ ఆలయం ఎలాగైతే వీసా గాడ్‌కు పేరు గాంచిందో.. నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌లోని మర్రి చెట్టు కూడా వీసాల చెట్టుగా గుర్తింపు పొందింది. విదేశాలకు వెళ్లే విద్యార్థులు, కార్మికులు ఎరుపు లేదా తెలుపు రంగు గుడ్డలో కొబ్బరికాయ కట్టి ఈ చెట్టుకు ముడుపు కడితే వీసా వస్తుందని స్థానికుల విశ్వాసం. అయితే వడగళ్ల వర్షం కారణంగా ఈ భారీ వృక్షం నెలకొరిగింది. చుట్టుపక్కల నివాసితులకు ముప్పుగా మారడంతో గ్రామస్తులు వృక్షంలోని ఎక్కువ భాగాన్ని నరికి వేశారు. కేవలం 15 అడుగుల వరకు విస్తరించి ఉన్న భారీ కాండం మాత్రమే ఇప్పుడు మిగిలి ఉంది.

చెట్టుకు రాఖీ..



నాగర్‌కర్నూల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని చీమ చింత చెట్టు భారీ వర్షానికి నేల కూలింది. 2017లో స్కూల్ యాజమాన్యంతో కలిసి 'వట' ఫౌండేషన్ దీనికి తిరిగి జీవం పోసింది. భారీ క్రేన్ సహాయంతో ఆ చెట్టును తిరిగి భూమిలో పాతారు. అప్పటి నుంచి ఏటా జూన్ 28న విద్యార్థులు, టీచర్లందరూ ఆ చెట్టుకు రాఖీ కడుతూ పండగ చేసుకోవడం ఆనవాయితీగా మారింది.

వేయి ఉరుల మర్రి

నిర్మల్‌లోని వేయి ఉరుల మర్రికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆదిలాబాద్ జిల్లాలో రామ్‌జీ గోండు నాయకత్వంలో స్వయంపాలన ప్రకటించుకున్న గిరిజనులను బ్రిటిష్ పాలకులు దారుణంగా అణచివేశారు. రామ్‌జీ గోండును, అతని వేయి మంది సైన్యాన్ని పట్టుకొని ఈ మర్రి చెట్టుకు 1860 ఏప్రిల్ 9న అందరినీ ఒకేసారి ఉరి తీసినట్లు జానపద కథల్లో చెబుతుంటారు. అందుకే ఈ చెట్టును 'వెయ్యి ఉరుల మర్రి'గా పిలుస్తుంటారు. అయితే కాలక్రమేణా ఈ వృక్షం నరికివేతకు గురి కావడంతో ఇక్కడ స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేశారు.

రోగాలు మాన్పించే వృక్షం..

చేవెళ్లలోని దామరిగిద్దలో ఉన్న చింత చెట్టు 600 ఏళ్ల నాటిది. ఈ పురాతన చింత చెట్టుకు ఒక బొరియ ఉంటుంది. అనారోగ్యంతో ఉన్న పిల్లలు ఈ బొరియ గుండా వెళితే రోగం నయమవుతుందని గ్రామస్తుల విశ్వాసం.



గొట్టిగారిపల్లిలోని మర్రి చెట్టు

నిజామాబాద్ జిల్లాలోని అర్గుల్ గ్రామంలో ఉన్న పురాతన చింత చెట్టు



జహీరాబాద్‌లోని గొట్టిగారిపల్లి గ్రామంలోని చెరువు పక్కన ఉన్న మర్రి చెట్టు, నిజామాబాద్‌లోని అర్గుల్ గ్రామంలోని ఒక కొండపై ఉన్న మూడు పురాతన చింత చెట్లు కూడా వందల ఏళ్ల నాటి వృక్షాలే. చారిత్రక గుర్తింపుతో ఆయా వృక్షాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.

యాదగిరిగుట్టలో ముగిసిన అధ్యయనోత్సవాలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో అధ్యయనోత్సవాలు బుధవారం ముగిశాయి. పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయంలో ఆరవ రోజు శ్రీ లక్ష్మీనరసింహస్వామిగా అలంకరించి తిరు, మాడ వీధుల్లో స్వామిని ఊరేగించారు. అనంతరం 'ఇరామానుజనుత్తందాది ఉపదేశ



రత్తినమాలై'అనే పాశురాన్ని పఠించి అధ్యయనోత్సవాలకు ముగింపు పలికారు. కాగా.. గురువారం నుంచి ఆలయంలో నిత్య, శాశ్వత కల్యాణాలు, బ్రహ్మోత్సవం, శ్రీసుదర్శన నారసింహ హోమం పూజలు పునః ప్రారంభం కానున్నాయి.



120 రకాల వంటలతో కొత్త అల్లుడికి భోజనం!

పెళ్లి అయిన తర్వాత తొలిసారి సంక్రాంతికి వచ్చిన అల్లుడికి అత్తామామలు 120 రకాల వంటకాలతో భోజనం పెట్టి సంభ్రమాశ్చర్యాలకు గురి చేశారు. ఖమ్మం జిల్లా వైరాకు చెందిన నందిగామ భాస్కరరావు – సుజాత రెండో కుమార్తె మధుశ్రీకి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం సుధాపల్లికి చెందిన కొనకళ్ల సందీప్‌తో వివాహం జరిగింది. కొత్త దంపతులు సంక్రాంతి పండుగకు వైరా వచ్చారు. ఈ సందర్భంగా భాస్కరరావు దంపతులు తమ అల్లుడు, కుమార్తెకు వివిధ రకాల పిండివంటలు, ఇతర వంటకాలు కలిపి 120 రకాలతో భోజనం వడ్డించడం విశేషం.

వైరా / ఖమ్మం జిల్లా

రెండువైపులా వేర్వేరు డిజైన్లు, రంగులతో ఇక్కత్ పట్టుచీర



భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లికి చెందిన సాయిని భరత్ అనే యువ చేనేత కళాకారుడు రెండు వైపులా వేర్వేరు డిజైన్లు, వేర్వేరు రంగులు కలిగిన ఇక్కత్‌పట్టు చీరను నేసి ఔరా అనిపించారు. కొద్ది సంవత్సరాల క్రితం ఆయన మొదటిసారిగా రెండు వేర్వేరు రంగులు, డిజైన్లు కలిగిన ఇక్కత్ దుపట్టాను మగ్గంపై తయారు చేశారు. ఎంతో కళాత్మకంగా దుపట్టాను రూపొందించినందుకు గాను 2018లో కేంద్ర ప్రభుత్వం నుంచి నేషనల్ మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఎంటెక్ చేసిన సాయిని భరత్.. అదే స్ఫూర్తితో ఇక్కత్ కీర్తిని ద్విగుణీకృతం చేయాలని రెండున్నర ఏళ్లు కష్టపడి, ఎంతో సృజనాత్మకంగా ఆలోచించి ఒక చీరకు వేర్వేరు డిజైన్లు, రంగులు వచ్చేలా అభివృద్ధి చేశారు. అనంతరం టై అండ్ డై డిజైనింగ్, మగ్గంతో పాటు వీవింగ్‌లోసైతం ప్రత్యేకమైన పరిజ్ఞానాన్ని వినియోగించి 15 రోజులు మగ్గంపైనేసి రెండు వైపులా వేర్వేరు డిజైన్లు, రంగులు కలిగిన ఉల్టా లేని పట్టు చీరను తయారు చేశారు. ప్రస్తుతం ఆయన కొత్త డిజైన్లతో మూడు శాంపిల్ ఇక్కత్ పట్టుచీరలను రూపొందించారు. వీటికి పేటెంట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

హైటెక్ బోధన.. ఆన్‌లైన్ సాధన



అమెరికాలోని ఆధునిక తరగతి గది

▶ మొదటి పేజీ తరువాయి

తీసుకెళ్తున్నాయి. మన విద్యా విధానంలోనూ ఇలాంటి సంస్కరణలు అవసరం అంటున్నారు అమెరికా విద్యా విధానాన్ని పరిశీలించిన తెలంగాణ ఉపాధ్యాయుడు సంక్రాంతి రవి కుమార్. అమెరికాలో నిర్వహించిన 'ఫుల్ బ్రైట్ టీచింగ్ ఎక్సలెన్స్ అచీవ్‌మెంట్ ప్రోగ్రాం'లో భాగంగా ఆయన అక్కడి విద్యా విధానాన్ని అధ్యయనం చేశారు. ఇందులో మొత్తం 60 దేశాల నుంచి టీచర్లను ఎంపిక చేయగా, మనదేశం నుంచి ఎంపికైన ఏడుగురిలో రవికుమార్ ఒకరు. ఒహియోలో రాష్ట్రంలోని కెంట్ నగరంలో 50 రోజుల పాటు అక్కడి విద్యా విధానంపై ఈయన అధ్యయనం చేశారు. ఖమ్మం జిల్లాలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న రవికుమార్ అమెరికా విద్యా విధానంపై తన పరిశీలనను 'సాక్షి'తో ప్రత్యేకంగా పంచుకున్నారు.

అడుగడుగునా టెక్నాలజీ..

అమెరికాలో సెకండరీ విద్య పూర్తిగా ఉచితం. ప్రైవేటు స్కూళ్లు కనిపించవు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే స్కూళ్లలో ఎక్కువ భాగం సాంకేతిక పరిజ్ఞానం కనిపిస్తోంది. పెన్, నోట్‌బుక్ ఎప్పుడో దూరమయ్యాయి. గూగుల్ క్రోం బుక్స్‌లో అసైన్‌మెంట్స్ ఇస్తారు. అందులోనే మూల్యాంకనం చేస్తారు. అయితే, విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా ప్రశ్నలకు సమాధానం తెలుసుకునే అవకాశం ఉందని టీచర్లు అంటున్నారు. ఆక్యులెస్, మెటాక్వెస్ట్ వంటి పరికరాలు, వర్చువల్ రియాలిటీ వంటి సాంకేతికత అక్కడ ప్రతీ స్కూల్‌లో కనిపిస్తున్నాయి. ప్రయోగాలను వర్చువల్ రియాలిటీ ద్వారా తెలుసుకునే విధానం ఉంది. ఆన్‌లైన్ ద్వారా నాలెడ్జ్ పొందడంలో అమెరికన్ విద్యార్థులు ముందున్నారు. ఇందుకు తగ్గ అప్లికేషన్లు కూడా అందుబాటులోకి తెచ్చారు.

9వ తరగతి నుంచే భవిష్యత్ ప్రణాళిక

విద్యార్థి భవిష్యత్ నిర్దేశం 9వ తరగతిలోనే మొదలవుతుంది. 11 రకాల వృత్తి విద్యా కోర్సులను ఈ దశలోనే అందుబాటులోకి తెచ్చారు. డాక్టర్, ఇంజనీర్, టీచర్... ఇలా ఏ రంగాన్ని ఎంచుకున్నా 9వ తరగతిలో పునాది పడుతుంది. దీంతో సబ్జెక్టుపై విద్యార్థికి పట్టు పెరుగుతుంది. అక్కడ విద్యతో పాటు సామాజిక, సాంస్కృతిక అంశాలకూ ప్రాధాన్యమిస్తున్నారు. సంగీతం, గేమ్స్, మోడ్రన్ మ్యూజిక్.. ఇలా ఏదో ఒక అంశాన్ని విద్యార్థి నేర్చుకునేలా ప్రోత్సహిస్తున్నారు.

నైపుణ్యానికి పెద్దపీట

ఇంజనీరింగ్ విద్య అమెరికాలో భిన్నంగా ఉంది. థియరీ కన్నా ప్రాక్టికల్ నాలెడ్జ్ పొందే బోధన పద్ధతులు అనుసరిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యలో ఎక్కడికో వెళ్లి ఇంటర్న్‌షిప్ చేయడం ఉండదు. ప్లానింగ్, డిజైనింగ్ ఇంజనీరింగ్ విద్యలో భాగం. ఏదో ఒక కొత్త ప్రయోగాన్ని విద్యార్థులు ఇంజనీరింగ్‌లో చేయాలి. ఈ విధానం పాఠశాల విద్యలోనూ కనిపిస్తుంది. దీనివల్ల విద్యార్థిలో నైపుణ్యం పెరుగుతుంది. అయితే, భారత విద్యార్థులకంటే గణితంలో అమెరికా విద్యార్థులు ఇప్పటికీ వెనుకబడే ఉన్నారు. ప్రతి క్లాసులోనూ 20–24 మంది విద్యార్థులనే అనుమతిస్తారు. ప్రతి సబ్జెక్టుకూ టీచర్లతోపాటు అదనపు టీచర్లనూ నియమిస్తారు. ప్రతి సబ్జెక్టును, క్లాసును విద్యా కమిటీలు పర్యవేక్షిస్తాయి. కమ్యూనిటీ పరంగా ఎక్కువ నిధులిచ్చే సంస్థల పర్యవేక్షణలోనే విద్యా కమిటీలు ఏర్పడతాయి. వీటిపై ప్రభుత్వ పెత్తనం ఉండదు. టీచర్ల నియామకం విషయంలోనూ కమిటీలు అన్ని అర్హతలు పరిశీలిస్తాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులతో ఎలాంటి సంబంధాలు కొనసాగించడం కుదరదు.

ప్రభుత్వానికి నివేదిక ఇస్తా..



విద్యా విధానంలో మార్పులపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో అమెరికా విద్యా విధానంపై సమగ్ర అధ్యయనం అవసరం. నేను అక్కడ గమనించిన ప్రతి అంశాన్ని నివేదిక రూపంలో ప్రభుత్వానికి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. త్వరలో విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి కూడా నివేదిక పంపుతా. సాంకేతికంగా అభివృద్ధి పథంలోకి రాష్ట్ర విద్యా విధానాన్ని తీసుకెళ్లడానికి అమెరికాలోని కొన్ని మంచి అంశాలను మనం స్వీకరించాల్సిందే.

\- సంక్రాంతి రవి కుమార్

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్ కీ రోల్



వివిధ రకాల వస్తువుల కొనుగోళ్లలో 82 శాతం మందిపై వీరి ప్రభావం

సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో వారు పెట్టే పోస్టులు, వారు సిఫార్సు చేసే వస్తువులకు పెరుగుతున్న డిమాండ్

సాక్షి, హైదరాబాద్ : కొత్త టెక్నాలజీ సర్వత్రా వ్యాప్తి చెందుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో 'సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు'వివిధ అంశాల్లో కీలక భూమిక పోషిస్తున్నారు. ప్రతిరోజూ ఒక కొత్త ఆవిష్కరణలు, కొత్త వస్తువులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో తమ ఉత్పత్తుల విక్రయాలు పెంచుకునేందుకు ఉత్పత్తి, మార్కెటింగ్ సంస్థలు కొత్త కొత్త మార్గాలు అన్వేషిస్తున్నాయి. కొత్త ఉత్పత్తులు కొనుగోలు చేసేలా వినియోగదారుల దృష్టిని ఆకర్షించేందుకు నూతన పంథాను అనుసరిస్తున్నాయి.

గతానికి పూర్తి భిన్నంగా ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ప్రముఖుల ద్వారా వినూత్న పద్ధతుల్లో ప్రచారానికి దిగుతున్నాయి. ప్రజాసంబంధాల వ్యవస్థకు కొత్త భాష్యం చెప్పేలా ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ అనేది వేగంగా విస్తరిస్తోంది. వివిధ బ్రాండ్లకు సంబంధించి టార్గెట్ వినియోగదారులను చేరుకునేందుకు ఇన్‌ఫ్లుయెన్సర్ల ద్వారా కంపెనీలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నాయి. డిజిటల్, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ, లక్షలాది మంది ఫాలోవర్లు కలిగిన వివిధ రంగాలకు చెందిన సెలబ్రిటీలు, ప్రముఖుల ద్వారా వివిధ కస్టమర్లను చేరుకునే ప్రయత్నాలను ఇప్పుడు తీవ్రతరం చేశాయి. సామాజిక మాధ్యమాల్లో డిజిటల్ పర్సనాలిటీలుగా పేరుగాంచిన వ్యక్తుల ద్వారా వినియోగదారులకు ఆకర్షించడం ద్వారా పబ్లిక్ రిలేషన్స్ క్యాంపెయిన్‌ను ఉధృతం చేస్తున్నాయి. వివిధ ప్రముఖ బ్రాండ్ల వస్తువులను ఈ సెలబ్రిటీలు ప్రచారం చేస్తున్నారనే భావన వారి ఫాలోవర్లలో కలగని విధంగా చాప కింద నీరులా తమ లక్ష్యాన్ని సాధించేస్తున్నాయి. వివిధ

వేగంగా విస్తరిస్తున్న ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్

రంగాల ప్రముఖులు ఇచ్చే ప్రకటనలు, ఆయా సందర్భాల్లో ఇచ్చే సందేశాల ద్వారా ఆయా వస్తువుల కొనుగోలుకు సంబంధించి 'బ్రాండ్ మేసేజ్'లను ఇచ్చేస్తున్నారు. ఈ ఇన్‌ఫ్లుయెన్సర్లు నేరుగా ఆయా ఉత్పత్తులను ఎండార్స్ చేయడం ఒక పద్ధతి కాగా, వాటి ప్రస్తావన లేకుండా ఏదైనా ఒక సామాజిక అంశం, ప్రాధాన్యం సంతరించుకున్న పరిణామం లేదా ఇతర అంశాలపై తమ అభిప్రాయాలను వెలిబుచ్చడం ద్వారా వారు తమ ఫాలోవర్లను ప్రభావితం చేస్తున్నారు. ఇలా ప్రత్యక్ష, పరోక్ష పద్ధతుల్లో ఆయా వస్తువులకు సంబంధించిన ప్రచారం చేయడం ద్వారా...వాటిని కొనుగోలు చేస్తే మంచిదని, ఫలానా వస్తువును సెలబ్రిటీ వాడుతున్నాడు కాబట్టి అది నాణ్యమైనది, మిగతా వాటి కంటే మెరుగైనదనే భావన కస్టమర్లలో ఏర్పడేలా వారి ఉవాచలు, వ్యాఖ్యలు, ప్రకటనలు వంటివి ఉపయోగపడుతున్నాయి. వివిధ రూపాల్లో ప్రచారం, ఆయా వస్తువుల గురించి ప్రస్తావన వంటి ద్వారా ప్రజాభిప్రాయం రూపుదిద్దుకునేలా ఇన్‌ఫ్లుయెన్సర్లు చేయగలుగుతున్నారు.

ఎవరెంత...?

మెగా ఇన్‌ఫ్లుయెన్సర్లు :	సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో 10 లక్షలు.. ఆపై ఫాలోవర్లు కలిగి ఉన్నవారు
మాక్రో ఇన్‌ఫ్లుయెన్సర్లు :	సామాజిక మాధ్యమాల్లో 5 లక్షలు.. ఆపై ఫాలోవర్లు కలిగిన వారు
మిడ్‌టైర్-ఇన్‌ఫ్లుయెన్సర్లు :	50 వేల నుంచి 5లక్షల దాకా ఫాలోవర్లు ఉన్నవారు
మైక్రో ఇన్‌ఫ్లుయెన్సర్లు :	10 వేల నుంచి 50 వేల వరకు ఫాలోవర్లు కలిగి ఉన్నవారు
నానో-ఇన్‌ఫ్లుయెన్సర్లు :	10 వేల వరకు ఫాలోవర్లు కలిగిన వారు

ప్రస్తుతం సోషల్, డిజిటల్ మీడియా ఇతర మాధ్యమాల ప్రభావం విపరీతంగా పెరిగిపోయింది. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ (ట్విట్టర్).. ఇలా వివిధ రకాల ప్లాట్‌ఫామ్స్‌పై యువతరంతోపాటు వివిధ వయసుల వారు అధిక సమయమే గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, వారి కొనుగోలు చేస్తున్న వస్తువులు, వివిధ కంపెనీల వస్తువులకు వారు చేస్తున్న 'ఎండార్స్‌మెంట్స్'కు ఎక్కడ లేని ప్రాధాన్యం ఏర్పడింది. కొందరైతే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్స్‌నే తమ వృత్తిగానూ ఎంచుకొని ముందుకు సాగుతున్నారు. నేటి ఆధునిక సమాజంలో మారుతున్న ప్రజల అభిరుచులకు అనుగుణంగా...కంపెనీలు కూడా మార్కెటింగ్ వ్యూహాలను మార్చేస్తున్నాయి. గతంలో ఏదైనా ఒక యాడ్ ఏజెన్సీ ద్వారానో, మరో రూపంలోనో తమ ఉత్పత్తులను ప్రచారం చేసి ప్రజల దృష్టిని ఆకర్షించే ప్రయత్నాలు చేసేవి.

భారత్‌లోనే ఎక్కువ




భారత్‌లో మధ్యతరగతి జనాభా అధికంగా ఉండడంతోపాటు ఈ తరగతి ప్రజలు ఎక్కువగా డిజిటలైజేషన్ వైపు మొగ్గు చూపుతుండడంతో ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్‌కు అవకాశాలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఇండియన్ రిటైల్ మార్కెట్ అనేది అనేక రెట్లు పెరుగుతుండడంతో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాలకు వేగంగా విస్తరించింది. ఈ పరిస్థితుల్లో ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులను చేరుకునేందుకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ అనేవి అందివచ్చిన అవకాశాలుగా కలిసొస్తున్నాయి. ఈ కస్టమర్లను చేరుకొని, ఆయా వస్తువులు కొనుగోలు చేసేలా ఆకర్షించేందుకు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతోపాటు స్థానిక మైక్రో ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా తమ వంతు పాత్రను చురుగ్గా పోషిస్తున్నారు.



వార్తలకు సంబంధించిన సమాచారాన్ని విశ్లేషించే తీరు, అందుకు అనుగుణంగా వీడియో ఫుటేజీ, సోషియో-పొలిటికల్ డేటా విశ్లేషణ వంటి వాటితో ప్రజలకు దగ్గర అయ్యారు. యువతను నేరుగా చేరుకునేలా చేసే వ్యాఖ్యానాలు, ఆయా అంశాలపై విషయ పరిజ్ఞానం ఆకట్టుకుంటోంది. తన పనితీరుతో తన మెయిన్ చానల్‌కు లక్షలాది మంది ఫాలోవర్లతోపాటు పెద్దసంఖ్యలో యూజర్లతో రికార్డు సృష్టించాడు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా 6 నెలల కాలంలోనే 60 లక్షల ఫాలోవర్లు పెరిగారు. రాఠీ వైరల్ వీడియోలను తమిళం, తెలుగు, బెంగాలి, కన్నడ, మరాఠీలోకి కూడా డబ్ చేస్తున్నారు

– ధ్రువ్ రాఠీ (యూట్యూబర్, ఎడ్యుకేటర్)



పర్యావరణం, నదులు, మన నేల వంటి వాటిపై ప్రజల్లో చైతన్యం పెంచేలా ప్రయత్నిస్తున్నారు. 'సేవ్ ద సాయిల్' పేరిట ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. ఆయన నిర్వహించే టాక్ షోలు లక్షలాది మందిని చేరుకుంటున్నాయి. సంస్కృతి పేరిట సంప్రదాయక కళలు, సంగీత రీతులను జనసామాన్యం చెంతకు చేర్చే ప్రయత్నం చేస్తున్నారు.

– సద్గురు జగ్గీవాసుదేవ్ (ఇషా హెడ్)



ఓ ప్రముఖ జాతీయ న్యూస్‌చానల్‌లో పనిచేసి బయటకు వచ్చిన ఈయనకు లెక్కకు మించి అభిమానులు న్నారు. ఆయన నిర్వహిస్తున్న యూట్యూబ్ చానళ్లు బాగా పాపులర్ అయ్యాయి. ప్రస్తుతం వాటికి 11 లక్షల సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. తన చానల్ ద్వారా నిజాలను వెల్లడించడంతోపాటు, అధికారంలో ఉన్న వారి పనితీరుపైనా విమర్శల వర్షం కురిపించడం ఫాలోవర్లను ఆకట్టుకుంటోంది.

– రవీశ్‌కుమార్ (జర్నలిస్ట్)



తాను నిర్వహిస్తున్న పాడ్‌కాస్ట్‌ల ద్వారా ఫాలోవర్లకు, ముఖ్యంగా యువతకు చేరువయ్యారు. రన్వీర్ షో అకా టీఆర్‌ఎస్ పేరిట నిర్వహించిన షోలకు ఆర్నాల్డ్ షావర్జనిగ్గర్,, ఇస్రో చైర్మన్ డా. సోమ్‌నాథ్, ఆధ్యాత్మిక గురువు గౌర్ గోపాల్‌దాస్, మహారాష్ట్ర మాజీ సీఎం ఏక్‌నాథ్ షిండే వంటి వారు హాజరయ్యారు. తాను నిర్వహిస్తున్న 9 యూట్యూబ్ చానళ్ల ద్వారా 2.2కోట్ల మందిని చేరుకుంటున్నట్టుగా ఆయనే చెబుతుంటారు. ఇన్‌ఫ్లుయెన్సర్ సంస్కృతిని బాగా ప్రచారంలోకి తెచ్చేందుకు దోహదపడుతున్నారు. మాంక్ ఎంటర్‌టైన్‌మెంట్ కోఫౌండర్‌గా ఓ కొత్త మీడియా కంపెనీని ప్రారంభించి, ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్‌ను కొత్త పుంతలు తొక్కిస్తున్నారు.

– రన్వీర్ అల్లాబాడియా అలియాస్ బీఆర్‌బైసెప్స్ (యూట్యూబర్)



భారత్‌లోనే అత్యధికంగా పేరు గాంచిన కమేడియన్లలో ఒకడిగా నిలిచారు. తన హ్యూమర్‌తో కథలు చెప్పే విధానం, కవిత్వంతో కలగలిపి వివిధ అంశాలను వివరించడం, పూర్తి ప్రామాణికంగా వ్యవహరించడం ఆయన్ను అభిమానులకు దగ్గర చేసింది. ఇప్పటిదాకా వెయ్యికి పైగా షోలు చేశారు. లండన్ రాయల్ అల్బర్ట్ హాల్‌లో షో నిర్వహించిన ఆసియాకు చెందిన కమేడియన్‌గా పేరు సాధించారు. న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లోనూ షో నిర్వహించారు. చాచా విదాయక్ హై హమారే...వెబ్ సిరీస్‌ను అమెజాన్ ప్రైమ్ కోసం రూపొందించారు.

– జకీర్‌ఖాన్ (బాద్‌షా ఆఫ్ కామెడీ):

నాటుసారా తయారీ తగ్గింది

- మరో నెలరోజుల పాటు నాటుసారా ప్రభావిత ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నాటుసారా తయారీ, విక్రయాలు భారీగా తగ్గాయని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. నాటుసారాను పూర్తి స్థాయిలో నిర్మూలించాలనే లక్ష్యంతో మరో మారు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించిందామని బుధవారం ఆయన ఒక ప్రకటనలో వివరించారు. గతంలో మూడు నెలల పాటు ప్రత్యేక దాడుల ద్వారా చాల వరకు నాటుసారా తయారీ, అమ్మకాలు తగ్గాయని పేర్కొన్నారు. కాగా, జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. 13 జిల్లాల్లోని 25 మండలాల్లో నాటుసారా తయారవుతున్నట్లు గుర్తించామని వివరించారు. నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలతో పాటు ముడిసరుకు అక్రమ రవాణా, సరఫరాదారుల సమాచారాన్ని సేకరించాలని క్షేత్రస్థాయి అధికారులను ఆయన ఆదేశించారు.

నాటుసారా ప్రభావిత ప్రాంతాలివే..

మంచిర్యాల జిల్లాలో చెన్నూర్, లక్సెట్టిపేట, బెల్లంపల్లి, వనపర్తి జిల్లాలో వనపర్తి, కొత్తకోట, నాగర్‌కర్నూల్ జిల్లాలో అచ్చంపేట, తెలకపల్లి, కల్వకుర్తి, వరంగల్ రూరల్ జిల్లాలో పరకాల, నర్సంపేట్, వర్ధనపేట, మహబూబాబాద్ జిల్లాలో తొర్రూర్, మహబూబాబాద్ గూడేరు, భూపాలపల్లిలో ములుగు, కాటారం, భూపాల్‌పల్లి, నల్లగొండ జిల్లాలో దేవరకొండ, కొత్తగూడెంలో భద్రాచలం, పెద్దపల్లి జిల్లాలో సుల్తానాబాద్, జగిత్యాల జిల్లాలో ధర్మపురి తదితర ప్రాంతాలను నాటుసారా ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు.

నాలుగు పథకాల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి: సీఎస్ శాంతికుమారి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న నాలుగు పథకాల లబ్ధిదారుల జాబితాను ఈనెల 21వ తేదీ నుంచి నిర్వహించే గ్రామసభల్లో ఆమోదం పొందిన తర్వాతే ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ఈనెల 26వ తేదీన ప్రారంభించనున్న నేపథ్యంలో కార్యాచరణపై జిల్లా కలెక్టర్లతో బుధవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ ఈ పథకాలన్నీ నిజమైన అర్హులకే దక్కేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నాలుగు పథకాల అమలుకై రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అమలయ్యేలా సంబంధిత కార్యదర్శులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ఉన్నతాధికారులు నవీన్‌మిత్తల్, డీఎస్ చౌహాన్, రఘునందన్‌రావు, బుద్ధప్రకాశ్, లోకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇందూరు ఇద్దరినీ గుర్తుంచుకుంటుంది

పసుపు బోర్డు సాధనపై ముగ్గుతో ధన్యవాదాలు

నిజామాబాద్‌కు పసుపు బోర్డు సాధించడం పట్ల ఎంపీ అర్వింద్‌కు బోర్గాం(పి) గ్రామానికి చెందిన యువతి ముగ్గేసి ధన్యవాదాలు తెలిపింది. ముగ్గులో మోదీ, అర్వింద్, కమలం పువ్వు చిత్రాలు గీసి వీరిద్దరిని ఇందూరు ప్రజలు గుర్తించుకుంటారని పేర్కొంది. సోషల్ మీడియా ద్వారా ఈ చిత్రం చూసిన నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ముగ్గేసిన యువతికి అభినందనలు తెలిపారు.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

జైపాల్‌రెడ్డికి సీఎం రేవంత్ నివాళి

సాక్షి, హైదరాబాద్: కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జైపాల్‌రెడ్డి పోషించిన పాత్ర ప్రజలెప్పుడూ మరిచిపోరని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం నిశ్శబ్ద సైనికుడిలా జైపాల్ రెడ్డి దేశంలోని అన్ని రాజకీయ పార్టీలను సమన్వయం చేసి మార్గం సుగమం చేశారని పేర్కొన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఎదిగిన జైపాల్‌రెడ్డి దేశంలో అరుదైన రాజకీయ నేత అని, రాజకీయాల్లో నిష్కళంక నేతగా, విలువలకు ప్రతీకగా నిలిచారని తెలిపారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఆ ప్రాంతానికి నీరివ్వాలని మొట్టమొదట పేర్కొన్న నేత ఆయనేనని, ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేయడానికి పునాదులు వేశారని తెలిపారు. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే హైదరాబాద్ మెట్రో రైలు మంజూరైందని గుర్తుచేశారు.

పసుపు బోర్డుతో రైతులకు మేలు

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



సాక్షి, హైదరాబాద్: నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. పదకొండేళ్ల నిరీక్షణ తర్వాత నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంపై బుధవారం ఆయన ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బోర్డును కేవలం ఎన్నికల హామీలాగా మిగల్చకుండా పసుపు పండించే రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సరఫరా చేయాలని కోరారు. అలాగే కొత్త పసుపు వంగడాలను రూపొందించాలని, పంట విక్రయానికి సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ధరల స్థిరీకరణకు చర్యలు తీసుకోవాలని, అదే విధంగా విదేశాల్లో పసుపు విక్రయానికి రైతులకు అవకాశం ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత పసుపు బోర్డుకు ఉందని అన్నారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డును ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి చిన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

కేవీ కేశవులు సేవలు చిరస్మరణీయం

కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్ : మాజీమంత్రి, స్వాతంత్య్ర సమరయోధుడు, మేరు ట్రస్ట్ వ్యవస్థాపకుడు కేవీ కేశవులు సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో కేవీ కేశవులు 101వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కేశవులు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, రజాకార్ల అరాచకాలకు ఎదురొడ్డి తన ఇంటిపై జాతీయపతాకం ఎగురవేశారని గుర్తుచేశారు. హైదరాబాద్ సంస్థానం దేశంలో విలీనం కావడానికి జరిగిన పోరాటంలో కేశవులు ప్రధాన పాత్ర పోషించాడని కొనియాడారు. మేరు సంఘం ట్రస్టును ఏర్పాటు చేసి మేరు భవన నిర్మాణానికి ముందుండి సహాయ సహకారాలు అందించిన గొప్ప నాయకుడు కేశవులు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు టి.కుమార్‌రావు, కాంగ్రెస్ నేతలు కె.వెంకటేష్, రాజేందర్‌యాదవ్, మేరు సంఘం రాష్ట్ర నాయకులు కీర్తి రాజ్‌గోపాల్, వాడపల్లి మాధవ్, ఓదెల శేఖర్, మాడి శెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు బోర్డుతో పెరగనున్న సాగు

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేశ్ రెడ్డి



అన్వేశ్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: నిజామాబాద్ కేంద్రంగా పసుపుబోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నట్లు ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రం నిర్ణయంతో రాష్ట్రంలో పసుపు సాగు పెరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని తాము ప్రధానమంత్రికి లేఖ రాసినట్లు గుర్తు చేశారు. పసుపు బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు బోర్డు చైర్మన్‌గా నిజామాబాద్‌కు చెందిన వ్యక్తినే నియమించడం మంచి పరిణామం అని అన్నారు. పసుపు బోర్డుకు ప్రత్యేక కార్యాలయం, నిధి కేటాయించాలని కేంద్రాన్ని కోరారు. మార్కెటింగ్ వ్యవస్థ, గోదాములు, కోల్డ్ స్టోరేజీ సౌకర్యాలతో పాటు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. బోధన్ చక్కెర కర్మాగారాన్ని కూడా పునఃప్రారంభించేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు.

క్వీన్స్‌ల్యాండ్‌లో తెలంగాణ ప్రతినిధి బృందం

క్రీడా సదుపాయాలపై జితేందర్‌రెడ్డి నేతృత్వంలో అధ్యయనం



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, మాజీ ఎంపీ ఏపీ జితేందర్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో పర్యటించింది. క్రీడా మౌలిక సదుపాయాలపై అధ్యయనం చేయడానికి వెళ్లిన తెలంగాణ ప్రతినిధులు అక్కడున్న శిక్షణ కేంద్రాలను సందర్శించారు. ఈ బృందం పాప్యులస్ సంస్థ కార్యాలయాలను కూడా సందర్శించింది. ఇది క్రీడా సదుపాయాలు, అరీనాలు, కన్వెన్షన్ సెంటర్ల రూపకల్పనలో ప్రత్యేకత కలిగిన గ్లోబల్ ఆర్కిటెక్చరల్ డిజైన్ సంస్థ. ఈ సంస్థ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో క్రీడా మౌలిక సదుపాయాల రూపకల్పన, నిర్వహణలో ఆధునిక ధోరణులు, ప్రమాణాలపై చర్చించారు. అనంతరం తెలంగాణ ప్రతినిధులు గ్రిఫిత్ యూనివర్సిటీ నాథన్ క్యాంపస్‌ను సందర్శించారు. క్రీడలలో ఆధునిక పరిశోధన, విద్యా కార్యక్రమాలను అందిస్తున్న ఈ యూనివర్సిటీ ఒలింపిక్ పతక విజేతలను తయారు చేయడంలో మంచి ట్రాక్ రికార్డ్ కలిగి ఉన్నట్లు అక్కడి అధికారులు వివరించారు. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్‌ల్యాండ్ సెయింట్ లూసియా క్యాంపస్‌ను సందర్శించారు. జయేశ్‌రంజన్, సోని బాలాదేవి, రవీందర్ రెడ్డి తదితరులు ఈ బృందంలో ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంచొద్దు

ముఖ్యమంత్రికి ఆర్.కృష్ణయ్య లేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయోపరిమితిని పెంచొద్దని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే మూడు సంవత్సరాల వయోపరిమితి పెంచారని, దీంతో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇప్పుడు మరోమారు పదవీ విరమణ వయసు పెంచాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని, వయోపరిమితి పెంచితే నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడం ఆలస్యమవుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా లేఖ రాశారు.

కూనంనేని పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ : సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. కూనంనేని వేసిన క్వాష్ పిటిషన్‌ను బుధవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వరసింగ్‌ల ధర్మాసనం కొట్టేసింది. కూనంనేని ఎన్నికల అఫిడవిట్ సరిగ్గా దాఖలు చేయలేదంటూ నందూలాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను క్వాష్ చేయాలంటూ సాంబశివరావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అయితే హైకోర్టు నందులాల్ పిటిషన్‌ను క్వాష్ చేయడానికి నిరాకరించింది. దీంతో కూనంనేని సుప్రీంకోర్టును ఆశ్రయించగా, పిటిషన్‌ను కొట్టేసింది.

క్లుప్తంగా...

సమాంతర మాధ్యమం పెట్టాకే జీవో 117 రద్దు చేయండి

విద్యా శాఖకు ఏపీటీఎఫ్ అమరావతి విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయుల బదిలీల చట్టం–2025 కోసం విధివిధానాలను సూచిస్తూ తాము రూపొందించిన డాక్యుమెంట్‌ను రాష్ట్ర విద్యా శాఖ అధికారులకు సమర్పించామని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సమాంతర మాధ్యమాన్ని పాఠశాలల్లో అమలు చేసిన తర్వాతే జీవో 117 ఉత్తర్వులు రద్దు చేయాలని.. మిగులు పోస్టులను సర్దుబాటు చేసేలా బదిలీల చట్టంలో పొందుపరచాలని కోరామన్నారు. పనితీరు పాయింట్ల రద్దు, పాఠశాలల కేటగిరీల్లో మార్పులు, మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహణ, విద్యా సంవత్సరాలపై స్పష్టమైన ప్రతిపాదనలు సమర్పించామని ఆయన తెలిపారు.

ముగిసిన పాలవలస అంత్యక్రియలు



పాలకొండ/వీరఘట్టం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఉణుకూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, రాజ్యసభ మాజీ సభ్యుడు పాలవలస రాజశేఖరం అంత్యక్రియలు బుధవారం అశేష ప్రజానీకం, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, వైఎస్సార్‌సీపీ నాయకుల సమక్షంలో పాలకొండ సమీపంలోని నాగావళి నదీ తీరంలో నిర్వహించారు. ఆయన కుమారుడు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, కుమార్తె, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిలు దహన సంస్కారాలు పూర్తిచేశారు. అంతిమ యాత్రలో ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మాజీ ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ సమన్వయకర్త తలే రాజేష్, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు, తదితరులు పాల్గొని రాజశేఖరానికి నివాళులర్పించారు.

కూతురి వరుస చిన్నారిపై లైంగిక దాడి!

కురిచేడు: సభ్యసమాజం తలదించుకునేలా ఒక మానవ మృగం కూతురు వరసైన ముక్కుపచ్చలారని చిన్నారిని చిదిమేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రకాశం జిల్లా కురిచేడు మండలంలోని ఒక గ్రామంలో 4వ తరగతి చదువుతున్న ఓ చిన్నారిని తన సొంత పెద్దమ్మ భర్త.. చిన్నారి తల్లిదండ్రులు ఇంట్లోలేని సమయంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. పాఠశాలలో వారం రోజుల క్రితం గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి గ్రామ పోలీసు, ఉపాధ్యాయులు అవగాహన కలిగిస్తున్న సమయంలో ఆ చిన్నారి తమ తరగతి ఉపాధ్యాయిని కి విషయం చెప్పటంతో వారు చిన్నారి తల్లిదండ్రులకు తెలియజేశారు. సొంత బంధువులు కావటంతో విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తపడ్డారు.

సామాజిక బహిష్కరణపై ఫిర్యాదు

బైరెడ్డిపల్లె: చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె మండలంలోని చిక్కనపల్లెకు చెందిన చంద్రప్ప కుటుంబీకులను గ్రామస్తులు సంక్రాంతి పండుగకు దూరం చేస్తూ సామాజిక బహిష్కరణ చేయడంతో బాధితుడు మంగళవారం బైరెడ్డిపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంక్రాంతి పండుగకు గ్రామంలో ప్రతి ఇంటి వద్ద చందాలు తీసుకుంటున్నారని, గత ఏడాది తమ కుమారుడు శ్రీకాంత్ కులాంతర వివాహం చేసుకున్నాడనే నెపంతో గ్రామంలో జరుగుతున్న సంక్రాంతి పండుగకు దూరం చేస్తూ చందాలు తీసుకోకుండా సామాజిక బహిష్కరణ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్త దాడి



సంతబొమ్మాళి: శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం గ్రామంలో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. మాజీ సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీను చించేయడమే కాకుండా వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటి పైకి కత్తులు, కర్రలతో వెళ్లి దాడికి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం..దండుగోపాలపురంలో ఏర్పాటు చేసిన జగన్ ఫ్లెక్సీని బుధవారం అదే గ్రామానికి చెందిన అనపాన అభిలాష్, కూనపు ఉపేంద్ర తదితర టీడీపీ కార్యకర్తలు చింపివేశారు. అంతటితో ఆగకుండా అభిలాష్ నేరుగా వైఎస్సార్‌సీపీ కార్యకర్త సిర్లాపు నరేష్ ఇంటికి వెళ్లి చేతితో కొట్టాడు. దుర్భాషలాడుతూ కత్తి, చెక్కతో దాడి చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో నరేష్ కుటుంబ సభ్యులు భయాందోళనకు గురై తలుపులు వేసుకున్నారు. బాధిత వైఎస్సార్‌సీపీ కార్యకర్త నరేష్‌తో పాటు మరో కార్యకర్త బసవల బాలరాజు తదితరులు సంతబొమ్మాళి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు.

మర్యాదలో తగ్గేదేలే

సంక్రాంతి పండుగకు అల్లుళ్లకు మర్యాదల్లో తాము తగ్గేదేలే అని చెబుతున్నారు ఉమ్మడి గోదావరి జిల్లా వాసులు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో వందనపు వెంకటేశ్వరరావు దంపతులు తమ అల్లుడికి 452 రకాల వంటకాలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. అలాగే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరం గ్రామానికి చెందిన కుక్కల వెంకటేశ్వరరావు దంపతులు తమ అల్లుడికి 270 రకాల పిండి వంటలతో మెగా విందు ఏర్పాటు చేశారు.

– మామిడికుదురు/జంగారెడ్డిగూడెం




జంగారెడ్డిగూడెంలో 452 రకాల వంటలతో ఇలా...



కోనసీమ జిల్లా నగరంలో 270 రకాలతో ఇలా..

ఫలరాజుపై మంచు పంజా!





ఇక్కడ కనిపిస్తున్న మామిడితోట కర్నూలు మండలం శివరామపురం గ్రామం రైతుది. ఎలాగైనా ఈసారి మంచి దిగుబడులు సాధించాలని పైరు చీడపీడల బారిన పడకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చాడు. వేలాది రూపాయలు పెట్టి ఎప్పటికప్పుడు మందులు పిచికారీ చేశాడు. చివరకు చలి తీవ్రత, పొగమంచు ఆశలపై నీళ్లు చల్లాయి. ఇప్పటి వరకు చెట్లకు పూత పూయలేదు.

ఇక్కడ పూత రాలిపోయి కనిపిస్తున్న మామడి పంట బనగానపల్లెకు చెందిన సజాద్‌హుస్సేన్‌ది. ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలు, తుఫాన్ల ప్రభావంతో పెరిగిన మంచుతో బూడిద తెగులు సోకింది. నివారణకు పలు రకాల మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. చెట్టుపై అక్కడక్కడ కొంత పూత కనిపిస్తున్నా చివరి వరకు నిలవదని, నిలిచినా కాయ సరిగ్గా ఉండదని రైతు వాపోతున్నాడు.



మామిడి రైతుకు దిగుబడి దిగులు పట్టుకుంది. వాతావరణంలో మార్పుల కారణంగా ఈ ఏడాది మామిడి పూత ఆలస్యమవుతోంది. జనవరి మాసం ప్రారంభమై పక్షం రోజులైనా ఆశించిన మేర పూత రాలేదు. ఏటా డిసెంబర్ చివరికల్లా మామిడిచెట్లు పూతతో నిండి కళకళలాడేవి. ఈసారి చలి తీవ్రత, పొగమంచు ప్రభావంతో ఆ పరిస్థితి కనిపించకపోవడంతో ఎన్నో ఆశలతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

- నీరుగారుతున్న మామిడి రైతుల ఆశలు
- వాతావరణ మార్పులతో విరబూయని పూత
- చలి వల్ల ఆలస్యమవుతున్న వైనం
- దిగుబడిపై పడనున్న ప్రభావం
- ఆందోళనలో రైతన్నలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 వేలకు పైగా ఎకరాల్లో మామిడి తోటలు

కర్నూలు(అగ్రికల్చర్): ఈసారి వ్యవసాయం రైతులకు కలిసి రాలేదు. తొలుత అధిక వర్షాలు, తర్వాత వర్షాభావంతో ఖరీఫ్ నిరాశకు గురి చేస్తే, వరుస తుఫానులు రబీ ఆశలను దెబ్బతీశాయి. ఈ క్రమంలో కొందరు రైతులు మామిడి తోటలపై నమ్మకం పెంచుకుంటే ప్రస్తుతం నెలకొన్న చలి తీవ్రత ప్రతికూలంగా మారింది. మామిడి తోటలు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా కూడా ఒకటి. ఈ జిల్లాలో మామడి తోటలు భారీగానే ఉన్నాయి. మామిడితోటలకు పెట్టింది పేరు బనగానపల్లె ప్రాంతం. బనగానపల్లె, అవుకు, సంజామల, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, పాణ్యం, వెల్దుర్తి, బేతంచెర్ల తదితర మండలాల్లో భారీగా మామడి తోటలున్నాయి. దీనికి తోడు గత ప్రభుత్వ ప్రోత్సాహంతో 2019 నుంచి 2024 వరకు ఉమ్మడి జిల్లాలో మామిడి తోటలు విస్తారంగా అభివృద్ధి చెందాయి. ఒకవైపు ఉపాధి నిధులతో 100 శాతం సబ్సిడీ ఇస్తుండటం, మరోవైపు ఉద్యాన శాఖ ఆకర్షనీయమైన రాయితీల వల్ల మామిడితోటలు పెరిగాయి.

కర్నూలు జిల్లాలో విభిన్న పరిస్థితి

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో మామిడి పూత కొంత కనిపిస్తుండగా..తూర్పు ప్రాంతంలో ఇంకా పట్టే దశలోనే ఉంది. ఈభిన్న పరిస్థితికి వాతావరణంలో మార్పే కారణంగా కనిపిస్తోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా జిల్లాలో చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు 10–11 డిగ్రీలకు పడిపోయాయి. ఈ వాతావరణం మామిడికి ఇబ్బందికరంగా మారింది. చల్లని వాతావరణం ఉంటే తోటల్లో కొత్త చిగుళ్లు వస్తాయి. నేడు పలు ప్రాంతాల్లో చలి ఎక్కువగా ఉంది. ఈ కారణంగా మామిడిలో కొత్త చిగుళ్లు కనిపిస్తున్నాయి. పత్తికొండ, దేవనకొండ. తుగ్గలి, గూడూరు, సి.బెళగల్ ప్రాంతాల్లో 50 శాతం వరకు మామిడి పూత వచ్చింది. వెల్దుర్తి, ఓర్వకల్లు, బేతంచెర్ల, అవుకు, బనగానపల్లి, కృష్ణగిరి, కల్లూరు, కోవెలకుంట్ల తదితర ప్రాంతాల్లో 30 నుంచి 40 శాతం వరకే పూత వచ్చింది. మామూలుగా అయితే జనవరి మొదటి పక్షంలోపు అన్ని ప్రాంతాల్లోని మామిడిలో 80 శాతం పైగా పూత రావాలి. వాతావరణం చల్లగా ఉండటం, పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉండటం ద్వారా పలు ప్రాంతాల్లో పూత ఆలస్యమవుతోంది. ఒకతోటలో 100 చెట్లు ఉంటే ఇందులో 35–40 శాతం చెట్లు పూతకు వచ్చాయి. మిగిలిన చెట్లలో పూత ఆలస్యమవుతోంది. జనవరి మొదటి పక్షం గడుస్తున్నా ఆశించిన మేర పూత పట్టకపోవడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. మరోవైపు చలి తీవ్రత వల్ల తేనెమంచు, పురుగుల బెడద పెరుగుతోంది. ఇది మామిడి రైతులను నిరాశకు గురి చేస్తోంది.

వచ్చిన పూత నిలిచేనా...

కొన్ని ప్రాంతాల్లో పూత ఆశాజనకంగా వచ్చినప్పటికీ నిలిస్తేనే కాపు బాగుంటుంది. సంక్రాంతి తర్వాత ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు పూత పిందె రాలిపోతుంది. 2022–23, 2023–24 సంవత్సరాల్లో ఆరంభంలో పూత బాగానే వచ్చినప్పటికీ తర్వాత ఎండల ప్రభావంతో 60 శాతం పైగా రాలిపోయింది. ఈ సారి కొన్ని ప్రాంతాల్లో పూత విశేషంగా వచ్చినప్పటికీ ఎంత వరకు నిలిచి కాపుగా మారుతుందనేది ప్రశ్నార్థకం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 16000 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి.ఇందులో కర్నూలు జిల్లాలో 4848 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 10,167 ఎకరాల్లో మామిడి తోటలు అభివృద్ధి చెందాయి. ఇప్పటి వరకు 40 శాతం తోటల్లో 50 శాతంపైగా పూత వచ్చింది. 50 శాతం తోటల్లో 30 శాతం వరకే పూత వచ్చింది. 10 శాతం తోటల్లో ఇంకా పూత రాలేదు. పూత రావడంలో హెచ్చు తగ్గులుండటానికి వాతావరణ పరిస్థితులే కారణమని ఉద్యాన అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి చెందిన మామిడిలో 70 నుంచి 80 శాతం వరకు బేనిసా ఉంటోంది. బేనిసా చెట్లు ఒక ఏడాది బాగా కాపు ఇస్తే... మరుసటి ఏడాది కాపునకు రావు. మామిడిలో చాల వరకు పూత రాకపోవడానికి ఇది కూడా ఒక కారణమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉంటే పూతను బట్టి మామడి కొనుగోలు యత్నాలు జరుగుతాయి. పూత బాగా నిలిస్తే ఎకరాకు 7–8 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ సారి వాతావరణం ప్రతికూలతతో దిగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



గతేడాది పూత బాగుండేది



నాకు రెండు ఎకరాల్లో మామిడి తోట ఉంది. గతంలో ఈ సమయానికి మామిడి చెట్లకు పూత బాగా ఉండేది. ఇప్పటి వరకు ఆశించిన మేర పూత లేదు. తేమశాత ఎక్కువ కవడామో లేక వాతావరణ ప్రభావమో తెలియదు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టాను. పంట రాకపోతే ప్రభుత్వం ఆదుకోవాలి.

– కురువ శంకర్,
మామిడి రైతు, పూడురు గ్రామం

దిగుబడిపై ప్రభావం



నేను బనగానపల్లె, పాణ్యం, బేతంచర్ల మండలాల్లో సుమారు 14 ఎకరాల తోటలను రూ.3 లక్షల కౌలు ఇచ్చి తీసుకున్నాను. దీనికితోడు మందుల పిచికారీ తదితర వాటి కోసం లక్షకు పైగా ఖర్చు చేశాను. సాధారణంగా ఈ సమయానికి పూత వచ్చి ఉండాలి. ఆలస్యం కావడంతో దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంది.

– పాంషా,
మామిడి తోటల కౌలు రైతు, బనగానపల్లె

మామిడిలో పూతరాకపోతే ఇలా చేయాలి



పలు ప్రాంతాల్లో మామిడిలో పూత రావడం ఆలస్యమవుతోంది. పూత రాని పక్షంలో 13–0–45 రసాయన ఎరువు 10 గ్రాములు, 3 గ్రాముల సల్ఫర్, 1.6 ఎంఎల్ మోనోక్రోటోపాస్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. దీంతో పాటు పూత రానితోటల్లో పొగపెట్టాలి. ఇలా చేయడం ద్వారా పూత వచ్చే అవకాశం ఉంది. మరో 10–15 రోజుల్లో అన్ని ప్రాంతాల్లోని అన్ని తోటల్లో పూత వచ్చే అవకాశం ఉంది. పూత వచ్చిన తర్వాత చెట్లకు ఎరువులు వేసి తేలికపాటి నీటి తడులు ఇవ్వాలి. పూత వచ్చిన తోటల్లో చీడపీడల యాజమాన్యంలో భాగంగా సాఫ్–2 జీఎం, క్లోరోఫైరిఫాస్ 2 ఎంఎల్, బోరాన్ ఒక గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పచ్చి పూత ఉన్నట్లైతే ఇమిడాక్లోఫ్రిడ్ 0.3 గ్రాములు, హెక్సాకొనెజోల్ 1 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాల్సి ఉంది.

– పి.రామాంజనేయులు,
జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

ప్రైవేటు చేతికి హార్సిలీహిల్స్?

- అభివృద్ధి పనులు చేయనివ్వకుండా..
- ఆదాయం తగ్గిందని చూపి అప్పగించే వ్యూహం



యాత్రీనివాస్ సముదాయంలోని స్నానాల గదిలో అసంపూర్తిగా పనులు

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్ జిల్లాలో ఏకైక పర్యాటక కేంద్రం. రాష్ట్రంలో ఏకైక పర్వత నివాస ప్రాంతం కూడా ఇదే. తిరుపతి డివిజన్ పరిధిలోని హార్సిలీహిల్స్ టూరిజం యూనిట్‌ను ప్రైవేటుకు అప్పగించే యత్నాలు మొదలయ్యాయని ఉద్యోగ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తుండగా ప్రైవేట్ ప్రతినిధులు హార్సిలీహిల్స్‌పైనున్న టూరిజం ఆస్తులపై పరిశీలన పూర్తి చేసినట్టు ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ఈ విషయమై ఇటీవల సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన సందర్భంగా యూనియన్ నేతలు వినతిపత్రం అందించారు.

రూ.9.13 కోట్లతో పనులు

హార్సిలీహిల్స్ అభివృద్ధి, అతిథి గృహాల ఆధునికీకరణపై టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పర్యాటక రంగానికి ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధికి రూ.9.13 కోట్ల నిధులు కేటాయించింది. అతిథిగృహాల ఆధునికీకరణ, కొత్త నిర్మాణాల కోసం పనులను టెండర్ల ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగించారు. 54 అతిథి గృహాలుండగా గవర్నర్ బంగ్లాను మినహాయించి మిగిలిన గదులకు రంగులు, కొత్తగా రెస్టారెంట్ భవనం నిర్మాణ పనులను హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నారు. పర్యాటకశాఖ 2024 ఏప్రిల్ నుంచి డిసెంబర్‌లోపు 9 నెలల్లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకుంది. వైల్డ్ విండ్స్ భవనంలోని 8, విండ్ విస్టిల్ భవనంలోని 6, విండ్‌ఫాల్ భవనంలోని 4 అతిథి గృహాలను కాంట్రాక్టర్‌కు అప్పగించింది. 18 అతిథిగృహాలను ఏప్రిల్ నుంచి పర్యాటకులకు కేటాయించడం లేదు.

9నెలల్లో రూ.55 లక్షల నష్టం

ఏప్రిల్ నుంచి 18 అతిథి గృహాలను పనుల కోసం కాంట్రాక్టర్‌కు అప్పగించడం, వాటిని పర్యాటకులకు అద్దెకు ఇవ్వకపోవడంతో పర్యాటకశాఖకు గడచిన 9 నెలల్లో రూ.55 లక్షల నష్టం వాటిల్లినట్టు ఉన్నతాధికారులకు సమాచారం. పనులు పూర్తి కాకపోవడంతో నెలకు రూ.6లక్షల నష్టం వస్తుంది. డిసెంబర్‌లో పనులు పూర్తి చేసి పర్యాటకశాఖకు భవనాలను అప్పగించాలి. ఇంతవరకు ఒక్క గది పనీ పూర్తి చేయలేదు. పనుల కోసం గదుల్లోని వాష్ రూమ్‌ల గోడలను పడగొట్టి అలా ఉంచేశారు.

ఆదాయం లేదని చూపే యత్నం

హార్సిలీహిల్స్ యూనిట్‌ను ప్రైవేటుకు అప్పగించాలన్న యత్నాల్లో భాగంగానే ప్రభుత్వంలోని ఓ అధికారి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు చెబుతున్నారు. ఏటా రూ.3.50 నుంచి రూ.4.50 కోట్ల వరకు హార్సిలీహిల్స్ ఆదాయం ఉంటుంది. అలాంటిది గదుల పనులు పూర్తి చేయకుండా ఆదాయం తగ్గిపోయేలా చేస్తే దాన్ని ప్రైవేటుకు అప్పగించవచ్చన్న ఆలోచనతో ఇలా చేస్తున్నారని టూరిజం ఉద్యోగ సంఘాల నేతలు అంటున్నారు

మటన్ డబ్బులు అడిగారని..

దంపతులపై హత్యాయత్నం

- తిరుపతి జిల్లాలో ఘటన



రాడ్‌తో దాడి చేయడంతో రక్తగాయాలతో చికిత్స పొందుతున్న కేశవులు

తిరుపతి రూరల్: మూడు నెలలు అయినా మటన్ తీసుకెళ్లిన డబ్బులు ఇవ్వకపోవడంతో అడగడానికి వెళ్లిన దంపతులపై అప్పు తీసుకున్న వ్యక్తి కుటుంబ సభ్యులు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం తిరుపతి రూరల్ మండలం మల్లంగుంటలో చోటుచేసుకుంది. రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన వివరాల మేరకు...మల్లంగుంట పంచాయతీ వినాయకనగర్‌కు చెందిన కేశవులు, హేమలత దంపతులు మటన్ అమ్ముకుంటు జీవనం సాగిస్తుంటారు. మూడు నెలల క్రితం అదే గ్రామానికి చెందిన వినాయక మటన్ తీసుకెళ్లి, తర్వాత రూ.1200 ఇస్తా అంటాడు. మూడు నెలలు అయినా ఇవ్వకపోవడంతో సోమవారం కేశవులు, హేమలత దంపతులు వినాయక ఇంటికి వెళ్లి మటన్ డబ్బులు ఇవ్వాలని అడుగుతారు. వాగ్వివాదం జరగటంతో వినాయక కుమారులు ప్రదీప్, సందీప్, మరో వ్యక్తి కేశవులు, హేమలతపై దాడికి తెగబడతారు. ఇనుపరాడ్‌తో కేశవుల తలపై గట్టిగా కొడతారు. హేమలత మెడలోని 32 గ్రాముల బంగారు చైన్లు లాక్కుంటారు. ఇష్టారాజ్యంగా దంపతులపై దాడి చేస్తారు. రక్తగాయాలతో ఉన్న వారిని స్థానికులు చికిత్స నిమిత్తం రుయాకు తరలించారు. మంగళవారం బాధితుడు కేశవులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ చిన్నగోవిందు తెలిపారు. నిందితులు పరార్‌లో ఉన్నారని, త్వరలోనే అరెస్ట్ చేస్తామని చెప్పారు.

క్యారమ్స్‌లో కాసుల వర్షం

- ఐపీఎల్ తరహాలో డీపీసీఎల్
- దేశంలోని అత్యుత్తమ ప్లేయర్స్ సమరం..
- రేపటి నుంచి విశాఖలో టోర్నీ



గుంటూరు వెస్ట్: తమిళనాడుకు చెందిన మరియ ఇరుదయంకు క్యారమ్స్‌లో అర్జున అవార్డు (1996) లభించింది. గతేడాది అమెరికాలో జరిగిన 6వ ప్రపంచ కప్ క్యారమ్స్ చాంపియన్‌షిప్‌లో తమిళనాడుకు చెందిన 17 ఏళ్ల ఖాజీమా మహిళా విభాగంలో ప్రపంచ విజేతగా నిలిచింది. దీంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు రూ.కోటి నగదు బహుమతి ఇచ్చి ప్రోత్సహించింది. పై రెండు సంఘటనలు క్యారమ్స్ ప్రత్యేకతను తెలియజేస్తాయి.

డీపీసీఎల్ సిద్ధం..

దేశంలోని అత్యుత్తమ ప్లేయర్స్‌ను ఒకే వేదికపైకి తెచ్చి వారి ప్రతిభకు చక్కని నజరానా అందించే డెక్కన్ ప్రీమియర్ క్యారమ్స్ లీగ్ సీజన్–3 (డీపీసీఎల్)ను విశాఖలో వజ్రా స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహించనుంది. ప్రముఖ క్యారమ్స్ క్రీడాకారులను వేలంలో కొనుగోలు చేసి వారిని బృందాలుగా విభజించి పోటీలు నిర్వహిస్తుంది. టోర్నమెంట్‌లో రూ.12 లక్షలకు పైగానే విజేతలకు బహుమతులు కింద అందించనున్నారు. వీరికి ఆంధ్రా క్యారమ్స్ అసోసియేషన్ అన్ని విధాలుగా సహకరిస్తుంది. మొత్తం దేశంలోని ప్రఖ్యాత క్యారమ్స్ ప్లేయర్స్ పాల్గొనే ఈ సమరంలో మొత్తం 8 జట్లు పాల్గొంటాయి. గ్రీన్ కలర్ క్యారమ్ బోర్డుపై మిల్క్ వైట్ కాయిన్స్‌తో క్రీడాకారులు తలపడతారు. జట్టు ఎంట్రీ ఫీజు రూ.3 లక్షలు. రౌండ్ రాబిన్ లీగ్‌తో ప్రారంభమయ్యే టాప్ 4 జట్లు నాకౌట్ దశకు చేరుకుంటాయి. అక్కడి నుంచి ఓటమి పొందే జట్లు టోర్నీ నుంచి తప్పుకుంటాయి. చివరకు విజేతను నిర్ణయిస్తారు.

డాక్టర్ అవతారమెత్తి.. చోరీ

రుయాలో యువతి హల్‌చల్



తిరుపతి తుడా: తెల్ల కోటుతో వచ్చి రోగులను బురిడీ కొట్టించి 5 సవర్ల బంగారు చైను చోరీ చేసిన యువతిని తిరుపతిలోని రుయా ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించిన ఘటన మంగళవారం జరిగింది. వైఎస్సార్ జిల్లా వల్లూరుకు చెందిన శ్రీవాణి అనే యువతి తెల్ల కోటు ధరించి అనస్థీషియా టెక్నీషియన్ అని రోగులకు చెప్పుకుంటూ అత్యవసర విభాగంలో హల్‌చల్ చేయసాగింది. అప్పుడే రేణిగుంట నుంచి గాయాలతో వైద్యం కోసం వచ్చిన వెస్లీ అనే మహిళను గుర్తించి ఆమెతో పరిచయం చేసుకొని ఆమెను స్కానింగ్ కోసం తీసుకెళ్లి అక్కడ ఒంటిపై నగలు తీసేయాలని సూచించింది. వెస్లీ తన ఒంటిపై ఉన్న రెండు బంగారు చైన్లు, బంగారు గాజులను తీసి ఆ యువతి చేతికి ఇచ్చి బయట తన భర్త చేతికి ఇవ్వాలని చెప్పింది. ఆ నగల్లో ఐదు సవర్ల బంగారు గొలుసును తన బ్యాగులో వేసుకొని మిగిలిన వస్తువులను వెస్లీ భర్త చేతికి ఇచ్చింది. ఇందులో మరో చైన్ ఉండాలని వెస్లీ భర్త విక్టరీ అడగటంతో మాకేం తెలుసు అంటూ ఆ యువతి అక్కడినుంచి వెళ్లిపోయింది. స్కానింగ్ నుంచి బయటికి వచ్చిన వెస్లీ నగలు చూసి అందులో ఒక చైన్ లేకపోవడాన్ని గుర్తించి ఆ విషయాన్ని సెక్యూరిటీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లింది. వారు వెతకగా అక్కడే ఉన్న యువతిని గుర్తించి ఆమె బ్యాగులో బంగారు చైన్‌ను గుర్తించారు. వెంటనే యువతిని పోలీసులకు అప్పగించారు.



● నారసింహ క్షేత్రం

● కథానీతి

లోకహితం కోసం ప్రాణాలర్పించిన అసురుడు



గయాసురుడు... పేరుకే అసురుడు కానీ ఎంతో మంచి మనసున్న దైవభక్తి పరాయణుడు. అతడొకసారి విష్ణువును గురించి గొప్ప తపస్సు చేసి, తనను తాకిన వారికి మోక్షం లభించే విధంగా వరం పొందాడు. తన శక్తితో శరీరాన్ని కొన్ని యోజనాల పొడవు, వెడల్పు విస్తరించి, జీవించ సాగాడు. దాంతో ప్రతివారూ గయుణ్ణి తాకి మోక్షం పొందసాగారు. ఫలితంగా స్వర్గానికి, నరకానికి వచ్చేవారే లేకుండా పోవడంతో ఇంద్రుడికి, యమధర్మరాజుకు పని లేకుండా పోయింది. దాంతో వారిద్దరూ కలిసి బ్రహ్మవద్దకు వెళ్లి, ఈ విషయాన్ని గురించి మొరపెట్టుకున్నారు. సృష్టికి విరుద్ధంగా జరుగుతున్న ఈ వైచిత్రి గురించి త్రిమూర్తులు పరిపరివిధాలుగా ఆలోచించి చివరకు ఒక నిర్ణయం తీసుకున్నారు. దాని ప్రకారం ఇంద్రుడు గయాసురుడి వద్దకెళ్లాడు.

> "నేను మిమ్మల్ని కోరేది ఒకటే! నా తలపై ఉంచిన శిలమీద మీ పాదాలను శాశ్వతంగా ఉంచే భాగ్యాన్ని ప్రసాదించండి. మీ పాదాలను దర్శించుకున్న వారికీ, ఈ క్షేత్రంలో కానీ, మరెక్కడైనా కానీ, నన్ను తలచుకుంటూ పిండప్రదానాలు, పితదేవతల పూజలూ చేస్తే వారి పితరులు తరించేటట్లు, వారి వంశం అభివృద్ధి చెందేటట్లు వరాన్ని ప్రసాదించండి"

''గయాసురా! లోకకల్యాణం కోసం మేమంతా కలసి ఒక యజ్ఞం చేయదలచుకున్నాము. ఆ యజ్ఞాన్ని చేసేందుకు అనువైన ప్రదేశం కోసం అన్వేషించగా పరమ పవిత్రమైన నీ శరీరమే అందుకు తగినదనిపించింది. కనుక నీవు అనుమతిస్తే, నీ శరీరాన్ని యజ్ఞకుండంగా మార్చుకుని ఈ యజ్ఞాన్ని నిర్వహిస్తాము'' అని అడిగాడు ఇంద్రుడు.

గయాసురుడు అందుకు ఆనందంగా అంగీకరించి, తన శరీరాన్ని పెంచి ఉత్తరదిశగా తలను ఉంచి పడుకున్నాడు. సకల దేవతలు, రుషులు అందరూ ఈ ప్రాంతానికి చేరుకోగా, బ్రహ్మదేవుడు యజ్ఞం ఆరంభించాడు. అయితే, యజ్ఞంలో ప్రజ్వరిల్లుతున్న అగ్నితాపాన్ని తట్టుకోలేక గయుడి తల కదలడం ప్రారంభించింది. బ్రహ్మ సూచన మేరకు 'దేవవ్రత' అనే శిలను గయుడి తల మీద ఉంచి, ఆ శిలమీద విష్ణువు నిల్చున్నాడు. ఫలితంగా గయాసురుడి శరీరం కదలడం ఆగిపోయింది. బ్రహ్మదేవుడు చేస్తున్న యజ్ఞవేడిమిని, తన భారాన్ని మౌనంగా భరిస్తున్న గయాసురుడిని చూసి హృదయం ద్రవించిపోయిన విష్ణువు ''వత్సా! ఏదైనా వరాన్ని కోరుకో'' అని అడిగాడు. అందుకు గయాసురుడు ''దేవా! ఈ పవిత్రమైన యజ్ఞం వల్ల, అంతకన్నా పరమ పవిత్రమైన నీ పాదధూళి సోకడం వల్ల నా జన్మ ధన్యమైంది. నేను ఇంతకుముందు నేను కోరుకున్న వరం ఎంతో అనుచితమైనదైనప్పటికీ, మీ భక్తుడినైన నన్ను సంహరించలేక, ఈ విధంగా చేశారని నాకు అర్థమైంది. అందుకు క్షమాపణలు కోరుకుంటున్నాను. నేను మిమ్మల్ని కోరేది ఒకటే! నా తలపై ఉంచిన శిలమీద మీ పాదాలను శాశ్వతంగా ఉంచే భాగ్యాన్ని ప్రసాదించండి. మీ పాదాలను దర్శించుకున్న వారికీ, ఈ క్షేత్రంలో కానీ, మరెక్కడైనా కానీ, నన్ను తలచుకుంటూ పిండప్రదానాలు, పితృదేవతల పూజలూ చేస్తే వారి పితరులు తరించేటట్లు, వారి వంశం అభివృద్ధి చెందేటట్లు వరాన్ని ప్రసాదించండి'' అని కోరుకున్నాడు.

నిష్కల్మషమైన హృదయంతో గయాసురుడు కోరుకున్న వరాన్ని విష్ణువు అనుగ్రహించాడు. గయుడి శరీరాన్ని ఉంచిన ప్రదేశమే గయ. పాదాలను ఉంచిన ప్రదేశం పాద గయ. రాక్షసుడైనప్పటికీ, లోకహితం కోరుకున్న గయుడు ధన్యుడైనాడు.

– డి.వి.ఆర్

హిరణ్య కశిపుడి ఆగడాలను అంతమొందించడానికి భక్త ప్రహ్లాదుడికి ముక్తిని ప్రసాదించడానికి శ్రీహరి ఎత్తిన అవతారమే నరసింహావతారం. ఆ నృసింహ దేవుడు తన ఉనికిని చాటుకోవడానికి అనేక క్షేత్రాలలో అవతరించాడు. అలాంటి పుణ్య క్షేత్రాలు తెలుగు రాష్ట్రాలలో తొమ్మిది ఉన్నాయి. వాటినే మనం నవ నరసింహ క్షేత్రాలని పిలుస్తున్నాం.. ఆ నవ నరసింహ క్షేత్రాలలో మొట్టమొదటి క్షేత్రంగా మల్లూరు హేమాచల లక్ష్మి నరసింహ క్షేత్రం ప్రసిద్ధి చెందింది. వరంగల్ జిల్లా మంగ పేట మండలంలో ఉన్న ఈ క్షేత్రంలో స్వామి హేమాచల లక్ష్మి నరసింహస్వామిగా పూజాదికాలు అందుకుంటున్నాడు. సంతాన, ఆరోగ్య ప్రదాతగా విశేష ఖ్యాతిగడించాడు స్వామి.

ఆరోగ్య.. సంతాన ప్రదాత

మల్లూరు నరసింహ స్వామి



వరంగల్ పట్టణానికి 135 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ అటవీ వనాలు కొండలు మధ్య, ఆహ్లాదకరమైన వాతావరణంలో అలరారుతోంది. మల్లూరు గ్రామానికి ఎనిమిది కిలోమీటర్లు దూరంలో ఉన్న ఈ ఆలయం హేమాచలం అనే కొండ మీద అలరారుతోంది. హేమాచల నరసింహ స్వామిని దర్శించుకోవడం వల్ల సమస్త శత్రు బాధలు తీరుతాయంటారు.

ఇక్కడి స్వామి వారి మూర్తి అయిదు వేల సంవత్సరాల నాటిదని ఇక్కడి ఆధారాల ద్వార తెలుస్తోంది. సాక్షాత్తు దేవతలే ఇక్కడ స్వామివారిని ప్రతిష్ఠించినట్లు చెబుతారు. గర్భాలయంలో స్వామి వారి మూర్తి మానవ శరీరంలా మెత్తగా దర్శనమిస్తుంది . స్వామి వారి ఛాతీ మీద రోమాలు దర్శనమిస్తాయి. అలాగే స్వామి వారి శరీరాన్ని ఎక్కడ తాకినా మెత్తగా ఉంటుంది. ఉదర భాగం కూడా మానవ శరీరంలా మెత్తగా ఉండి.. మనుషులకు వచ్చినట్టే చెమట కూడా వస్తుంది. స్వామి వారి నాభి భాగంలో ఓ రంధ్రం దర్శనమిస్తుంది. దీనినుంచి నిరంతరం ఓ ద్రవం కారుతుంటుంది. దీనిని అదుపు చేయడానికి ఆ భాగంలో గంధాన్ని పూస్తారు. పూర్వకాలంలో స్వామి వారి విగ్రహాన్ని తరలించినపుడు, బొడ్డు దగ్గర ఇలా రంధ్రం పడిందంటారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆ బొడ్డు భాగంలో ఉంచిన గంధాన్నే ప్రసాదంగా ఇస్తారు.

ఎలా చేరుకోవాలి?


ములుగు జిల్లాలోని మల్లూరు గ్రామానికి 4 కిలోమీటర్ల దూరంలో హేమాచల నరసింహస్వామి ఆలయం ఉంది. మల్లూరు క్షేత్రానికి వరంగల్ నుంచి నేరుగా చేరుకోవచ్చు. అలాగే ఖమ్మం జిల్లా మణుగూరు పట్టణానికి కూడా ఇది సమీపంలో ఉండడం వల్ల మణుగూరు నుంచి కూడా ఈ క్షేత్రానికి చేరుకోవచ్చు.


ఆరోగ్యామృతం ఆ నీరు

ఇక స్వామివారి పాదాల చెంత నుంచి నిత్యం ఒక జలధార ప్రవహిస్తూ ఉంటుంది. దానినే చింతామణి జలధారగా పిలుస్తారు. ఈ నీరు కొద్ది కొద్దిగా కొన్ని రోజుల పాటు తాగితే అన్ని రోగాలూ తగ్గిపోతాయనీ ఆ జలం సర్వ రోగ నివారిణి అనీ, భక్తులు విశ్వసిస్తారు స్వామి పాదాల నుంచి వచ్చే ఆ నీరు చింతామణి జలపాతాన్ని సమీపించే లోపు అనేక ఔషధ విలువలు గల చెట్ల క్రింది నుండి రావడం వల్ల ఆ నీటికి అంతటి శక్తి పెంపొందిందని అంటారు. రాణి రుద్రమదేవి అనారోగ్యానికి గురైన సమయంలో ఈ జలపాతంలోని నీటిని తాగడంతో ఆమె అనారోగ్యం నుంచి కోలుకుందని, ఆ తర్వాత అక్కడి నీటి విశిష్టత తెలుసుకున్న రుద్రమదేవి ఆ జలపాతానికి చింతామణి అనే పేరు పెట్టింది. చింతామణి జలధార నీటిని ఇప్పుడు కూడా విదేశాలలో ఉన్న తమ వారికి కూడా పంపిస్తూ ఉంటారు స్థానికులు, క్షేత్రాన్ని సందర్శించిన వారు. ఈ జలపాతానికి సమీపంలో మహా లక్ష్మి అమ్మవారి పురాతన మందిరం ఉంది. చింతామణి జలపాతానికి సమీపంలో మరో చిన్ని జలపాతం ఉంది.

– భాస్కర్











● పరిహారం

ప్రత్యర్థుల వల్ల సమస్యలా?

వృత్తి ఉద్యోగాల్లో శ్రమదమాదులకోర్చి పురోగతి సాధించినంత మాత్రాన జీవితం ప్రశాంతంగా గడిచిపోతుందని అనుకోలేం. జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకున్న వారి పురోగతికి ఓర్వలేని జనం ఉండనే ఉంటారు. ఈర్ష్యాపరులైన ప్రత్యర్థుల వల్ల అనుకోని అవరోధాలు తలెత్తడమే కాదు, మనశ్శాంతి కూడా లోపిస్తుంది.



ప్రత్యర్థుల వల్ల తలెత్తే సమస్యలను కట్టడి చేయాలంటే...

- తెల్లకాగితాల పుస్తకాన్ని, ఎర్ర సిరా కలాన్ని తెచ్చుకోండి. ఎర్ర సిరా కలంతో పుస్తకంలో శ్రీరాముని కీర్తిస్తూ 'శ్రీరామ జయం' అనే మాటను 12,500 సార్లు రాయండి. ఇలా రాయడం పూర్తయిన తర్వాత ఏదైనా ఒక మంగళవారం హనుమాన్ ఆలయానికి వెళ్లి, ఆ పుస్తకాన్ని, శనగపిండితో తయారు చేసిన లడ్డూలను సమర్పించండి.
- అమ్మవారి ఆలయంలో ఏదైనా శుక్రవారం రోజున పదకొండు నేతి దీపాలను వెలిగించండి. ప్రతిరోజూ ఉదయం నిత్యపూజలో భాగంగా దేవీ ఖడ్గమాల స్తోత్రాన్ని పారాయణం చేయండి.
- ప్రతి మంగళవారం ఉదయం నిత్యపూజ చేసే సమయంలో హనుమాన్ చాలీసాను పదకొండుసార్లు పఠించండి. ఆంజనేయ ఆలయాన్ని దర్శించుకుని నేతి దీపాన్ని వెలిగించి, బెల్లం నైవేద్యంగా సమర్పించండి.
- ఏదైనా శనివారం గోధుమ రొట్టెలను తయారు చేసి, వాటిపై ఒక పుల్లతో మీ ప్రత్యర్థుల పేరు లేదా పేర్లు రాయండి. ఆ రొట్టెను పెనం మీద కాల్చి, చల్లార్చిన తర్వాత వీధికుక్కకు తినిపించండి.

– సాంఖ్యాయన

ధర్మ సందేహం

పెళ్లిలో ఖర్చు ఆడపిల్ల తండ్రి ఎందుకు పెట్టుకుంటాడు?



ఎవరైన సరే ఒక దానం నిర్వహించాలనుకుంటే వారే ఆ దానానికి వేదికను ఏర్పాటు చేయాలి. ఆడపిల్ల కన్యాదానం చేస్తున్నాడు కాబట్టి ఆ వేదిక ఆయనది. కనుక ఆ వేదిక పై అధికారం ఆరోజు ఆయనదని శాస్త్రం చెప్తుంది. కన్యాదాత తండ్రి దానం ఇస్తే పుచ్చుకోవడానికి వచ్చినవాళ్ళు మగపిల్లాడు, అతని తల్లిదండ్రులు. మీ పిల్లవాడిని వంశోద్ధారకుడనే మీరు భావించవచ్చు. కానీ వంశాన్ని నిలబెట్టడానికి వాడు గర్భం దాల్చలేడు. మరి వాడు వంశోద్ధారకుడు లేదా వంశాన్ని నిలబెట్టేవాడు ఎలా అయ్యాడు? ఇలాంటి నిస్సహాయ స్థితి లో ఉన్న మీ కొడుకుకి ఆయన తన కుమార్తెనే దానం ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. వరుని ఇంటికి ఇరవై ఏళ్ళ పాటు ఎంతో జాగ్రత్తగా పెంచుకున్న లక్ష్మిని పంపిస్తున్నారు. అంతకన్నా ఇంకేం కావాలి? 'సీతారాములలా ఉండండి!' అని వధూవరులను ఆశీర్వదించేయడం కాదు. అసలు వివాహ నిశ్చితార్థంలో తాంబూలాల కార్యక్రమం అంతా అయిపోయాక ఇరు వర్గాల వారూ కూర్చుని సీతారామకళ్యాణ సర్గ చదవాలి. ఎంత అందంగా అవుతాయో ఆ ఇంట్లో పెళ్ళిళ్ళు! అసలు ఒక ఇంటి మర్యాద ఏమిటో వాళ్ళ ఇంట్లో పెళ్ళి చేసే రోజున తెలిసిపోతుంది.

తన కూతురి పెళ్ళి వైభవంగా జరిపించాలి అని కన్యాదాతకు తెలియదా? 'పెళ్ళి బాగా గొప్పగా జరిపించండీ!' అని మగపెళ్ళివారు ప్రత్యేకంగా చెప్పాలా? కన్యాదాత తనకి ఉన్నదాంట్లో వేదికను ఏర్పాటు చేసి మీకు కన్యాదానం చేస్తాడు. దానం పుచ్చుకోవడానికి వచ్చినవానికి ఏర్పాట్లు ఎలా చెయ్యాలో చెప్పడానికి అధికారం ఉండదు.

సువార్త

'శ్రమ' శిక్ష కాదు... దేవుడిచ్చే 'శిక్షణ' !!



రేవులో నౌక పూర్తిగా సురక్షితం. అదక్కడ మునిగే ప్రమాదమే లేదు. కాని రేవు కోసం కాదు, మహా సముద్రాల లోతుల్లో ప్రయాణించడానికి నౌక తయారయ్యింది. సముద్ర మహా జలాల్లో, భీకరమైన తుఫానుల్లో ప్రయాణించే నౌకకే గుర్తింపు, ఘనత, జీవనసాఫల్యం. యేసుప్రభువు ఆరోహణమై వెళ్తూ, 'యెరూషలేములో, యూదయ, సమరయలోనే కాదు, భూదిగంతాలదాకా నాకు సాక్షులై ఉండండి' అని తన శిష్యులకు చెప్పాడు (అపో.కా.1:8). 'సాక్షులై ఉండండి' అంటే దేవుని ప్రేమను అందరికీ తెలపండి అని అర్థం. 'యేసు పునరుత్థానం చెందలేదు, యేసు దేహాన్ని శిష్యులు రాత్రివేళ దొంగిలించి ఎక్కడో మరో చోట ఖననం చేశారు' అన్న అబద్ధప్రచారాన్ని యూదులు లేవదీసిన యెరూషలేములోనే ప్రభువు శిష్యులు దేవుని ప్రేమను గొప్పగా, ధైర్యంగా ప్రకటించారు. ఆ కారణంగా యెరూషలేము చర్చి అచిరకాలంలో ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది. కాకపోతే, అక్కడి నుండి యూదయ, సమరయ, భూదిగంతాలకు వెళ్లే ఆవశ్యకత మాత్రం కొంత మరుగున పడింది. యెరూషలేము చర్చి భద్రంగా ఉంది, బాగా విస్తరిస్తోంది అన్న భావనలో పడ్డ శిష్యులు అసలు విషయాన్ని మర్చిపోతున్న దశలో, ప్రభువే కల్పించుకొని అక్కడి చర్చికి గొప్ప శ్రమ కలిగేలా చేశాడు(అపో.కా.8:1). ఆ శ్రమ కారణంగా చర్చి, శిష్యులంతా చెల్లాచెదురయ్యారు. ఆ తర్వాత వారక్కడి నుండి మధ్య ప్రాచ్య దేశాలకు చెదిరిపోయి అక్కడంతటా సేవ చేశారు.

పక్షిరాజైన గద్ద గూట్లో తన పిల్లల్ని కొంత కాలం ఎంతో భద్రంగా కాపాడుతుంది. కాని గూట్లో భద్రతకు అలవాటుపడ్డ తన పిల్లల్ని తానే బలవంతంగా చెదరగొట్టి, బయటికి పంపి, అవి ఆకాశంలో స్వేచ్ఛగా విహరిస్తూ తమ ఆహారాన్ని తామే సంపాదించుకునేలా శిక్షణనిస్తుంది. చర్చి అయినా, విశ్వాసి అయినా, భద్రతకు అలవాటు పడ్డ మరుక్షణం తమ ఉనికిని కోల్పోతారు, దర్శనానికి దూరమవుతారు. అందువల్ల విశ్వాసికి శ్రమ శిక్ష కాదు, అది దేవుడిచ్చే శిక్షణ. అందుకే ఆదిమ చర్చి శ్రమల్లోనే బహుగొప్పగా విస్తరించింది. దేవుని పరిచర్య తాపీగా, నింపాదిగా, తీరిక సమయాల్లో చేసేది కాదు, పరిగెత్తుకొంటూ, తొందరపడుతూ చేసే 'అత్యవసర సేవ' అది. అపోస్తలుడైన యూదా తన పత్రికలో ఆ విషయాన్నే అద్భుతంగా ఒకే ఒక వాక్యంలో చెబుతాడు. అగ్నిలో కాలుతున్న వారిని బయటికి లాగేయడం దేవుని పరిచర్య అంటాడాయన (22). అంటే పరిచర్య ఒక నిముషం ఆలస్యమైతే ఒక మనిషి బూడిదయ్యే పరిస్థితుల్లో పరిచారకులు పనిచేస్తున్నారని బైబిల్ గుర్తు చేస్తోంది. శ్రమల్లో విశ్వాసి, చర్చి కంగిపోకూడదు, ఉవ్వెత్తున ఎగిరేందుకు నింగి వైపు చూడాలి. ఎక్కడ భద్రంగా ఉంటాము? అని కాదు, ఎక్కడ నా అవసరత ఉంది? ఎక్కడ మనుషులు మంటల్లో కాలిపోతున్నారు? అన్న దృష్టితో సేవకులు తమ పరిచర్య రంగాన్ని, స్థలాన్ని ఎన్నుకోవాలి. భద్రత, విభేదాలు, సిద్ధాంతాలు, చర్చలు, వాదనలకిక ఏ మాత్రం సమయం లేదంటాడు యూదా. ఆది కాండము నుండి ప్రకటన గ్రంథం వరకున్న 66 పుస్తకాల సారాంశాన్ని కేవలం 24 వచనాలున్న ఒకే ఒక అధ్యాయం కలిగిన యూదాపత్రికలో పరిశుద్ధాత్మ దేవుడు నింపాడు.

– డాక్టర్ సుభక్త

● ఇస్లాం వెలుగు

సత్సంకల్పం సదాచరణ

ముహమ్మద్ ప్రవక్త (స) వారి ఒక ప్రవచనం ఇలా ఉంది– ప్రళయ దినాన మొట్టమొదట ముగ్గురు వ్యక్తుల విషయంలో అల్లాహ్ న్యాయస్థానం తన తీర్పును వెలువరిస్తుంది. దైవమార్గంలో, ధర్మం కోసం పోరాడి ప్రాణాలర్పించిన షహీదును, అంటే అమరవీరుడిని అందరికంటే ముందు న్యాయస్థానంలో హాజరు పరచడం జరుగుతుంది. మొదటగా దైవం అతడికి తన అనుగ్రహాలన్నిటినీ వివరించి,అన్నీ గుర్తుచేస్తాడు. అతడికవన్నీ గుర్తుకొస్తాయి. అన్నిటినీ అతడు అంగీకరిస్తాడు. అప్పుడు దైవం 'మరి ఈ వరాలన్నిటినీ పొందిన నీవు, వాటి హక్కును ఎంతవరకు నెరవేర్చావు? ఎటువంటి కర్మలు ఆచరించావు?' అని ప్రశ్నిస్తాడు.

అప్పుడతను, 'ప్రభూ! నేను నీ మార్గంలో పోరాడాను. కేవలం నీ ప్రసన్నతకోసం నాప్రాణాలను ధారపోశాను' అని సమాధానం చెబుతాడు.

'కాదు, కాదు. నువ్వు పచ్చి అబద్ధం చెబుతున్నావు. నువ్వు కేవలం గొప్ప ధీశాలి, వీరుడవనిపించు కోవాలని జిహాద్ లో పాల్గొన్నావు. ప్రపంచంలో ప్రజలంతా నిన్ను వీరుడవని, శూరుడవని పొగిడారుకదా! ఆ మేరకు దానికి తగిన ప్రతిఫలం నీకు అక్కడే లభించింది. ఇక్కడేమీ లేదు' అంటాడు దైవం.

తరువాత అతణ్ణి దైవాదేశం మేరకు బోర్లాపడేసి, ఈడ్చుకుంటూ తీసుకెళ్ళి నరకంలో పడవేస్తారు.

అదేవిధంగా, ఒక ధార్మిక విద్వాంసుడిని న్యాయస్థానంలో ప్రవేశపెట్టడం జరుగుతుంది. అతనికి కూడా దైవం తన అనుగ్రహాలను గుర్తుచేస్తాడు. అతనూ వాటన్నిటినీ అంగీకరిస్తాడు. అప్పుడు దైవం, ఇన్ని అనుగ్రహాలు పొంది, ధార్మిక పండితుడవైన నువ్వు ఏ మేరకు వాటిని ఆచరించావు, ప్రజలకు బోధించావు?'అని ప్రశ్నిస్తాడు.

అప్పుడతను,'ప్రభూ! నేను నువ్వుపంపిన గ్రంథాన్ని అధ్యయనం చేశాను. ఆచరించాను. దాన్ని ఇతరులకు బోధించాను. కేవలం నీకోసమే,నీ ప్రసన్నత కోసమే ఇలా చేశాను' అని సమాధానం చెబుతాడు.

అప్పుడు దైవం, 'నువ్వు చెప్పేదంతా శుద్ధ అబద్ధం. నువ్వు కేవలం ప్రజల మెప్పు పొందడానికి, ప్రజల చేత గొప్పపండితుడిగా, విద్వాంసుడిగా కీర్తించబడాలనే ఉద్దేశ్యంతోనే అలాచేశావు. నువ్వు ఆశించిన పేరు ప్రతిష్ఠలు నీకు అక్కడే లభించాయి.' అంటాడు.

తరువాత, దైవాదేశం మేరకు అతణ్ణి కూడా నరకంలో పడవేయడం జరుగుతుంది.

దాని తరువాత, ఒక గొప్ప ధనవంతుణ్ణి ప్రవేశపెట్టడం జరుగుతుంది. అతనికి కూడా దైవం తన అనుగ్రహాలను గుర్తు చేసి, ఇంత సంపద, ఇన్ని వరాలను పొందిన నువ్వు ఎలాంటి కర్మలు ఆచరించావు? సంపదను ఏ పనుల్లో వినియోగించావు?' అని ప్రశ్నిస్తాడు.

అప్పుడా ధనవంతుడు, 'దేవా! నీ ప్రసన్నత ఇమిడి ఉన్న ఏ సత్కార్యాన్నీ నేను విడిచిపెట్టలేదు. నీ సంతోషం కోసం, నీ మెప్పుకోసం నాసంపదను నీ మార్గంలో ఖర్చుపెట్టాను' అని సమాధానమిస్తాడు.

అప్పుడు దైవం, 'నువ్వు కేవలం ప్రజల మెప్పు కోసం, ప్రజలంతా నిన్నొక గొప్పదాత అనుకోవాలని, త్యాగమయుడవని కీర్తించాలని, పొగడాలని నీ ధనాన్ని ఖర్చుపెట్టావు. నువ్వు ఆశించినట్లుగా ప్రజలంతా నిన్నొక గొప్పదాతగా, సత్కార్యాలు చేసేవాడిగా, పేదలను ఆదుకొనేవాడిగా గుర్తించి కొనియాడారు కూడా! ఇక్కడ నీకెలాంటి ప్రతిఫలమూలేదు.' అంటాడు దైవం.

తరువాత అతణ్ణి కూడా ఈడ్చుకెళ్ళి నరకంలో పడవేయడం జరుగుతుంది.

అంటే, అల్లాహ్ దృష్టిలో, కేవలం దైవప్రసన్నత కోసం, సత్సంకల్పంతో చేసిన కర్మలు మాత్రమే పరిగణనలోకొస్తాయి. సంకల్పశుద్ధి లేని ఆచరణలను దైవం స్వీకరించదు. ఇలాంటి సదాచరణనే ధార్మిక పరిభాషలో 'ఇఖ్ లాస్' అంటారు. దైవం మనందరినీ ప్రదర్శనా బుద్ధి నుండి కాపాడి, తనప్రసన్నతను పొందే భాగ్యం ప్రసాదించాలని కోరుకుందాం.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

సాక్షి ప్లస్
గురువారం । 16-1-2025

బిజినెస్ రీల్

మరో 2 నెలలు రష్యా చమురుకు సమస్య ఉండదు



న్యూఢిల్లీ: అమెరికా కొత్తగా ఆంక్షలు విధించినప్పటికీ మరో రెండు నెలల పాటు రష్యా నుంచి చమురు సరఫరాకి సమస్యేమీ ఉండదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మార్చి 12 వరకు అమలయ్యే కాంట్రాక్టులకు వచ్చిన ఇబ్బందేమీ లేదని తెలిపాయి. ఆ తర్వాత నుండి వర్తించే కాంట్రాక్టులపైన కూడా ప్రభావం పడకుండా రష్యా ఈలోగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునే అవకాశం ఉందని వివరించాయి. భారత్ తదితర దేశాలకు చమురును చేరవేస్తున్న రెండు రష్యా సంస్థలపై అమెరికా కొత్తగా ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఈ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. ఆంక్షలు ఎదుర్కొంటున్న రెండు సంస్థల్లో ఒకటి మాత్రమే కాస్త చెప్పుకోతగ్గ స్థాయిలో సరఫరా చేస్తుండగా రెండో దాన్నుంచి నామమాత్రంగానే ఉంటోందని సీనియర్ ప్రభుత్వాధికారి ఒకరు తెలిపారు. భారత్‌కు సరఫరా చేసే ఇతర రష్యన్ సంస్థలు, ట్రేడర్లపై ఆంక్షలు లేవని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం నేపథ్యంలో ఆ దేశాన్ని ఆర్థికంగా కట్టడి చేసేందుకు పాశ్చాత్య దేశాలు చమురు సరఫరాలపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. కానీ, ప్రత్యామ్నాయ పద్ధతుల్లో భారత్ తదితర దేశాలకు రష్యా చమురు సరఫరా చేస్తోంది.

స్విగ్గీ స్పోర్ట్స్‌కి గ్రీన్ సిగ్నల్



న్యూఢిల్లీ: ఆహార, నిత్యావసరాల డెలివరీ సంస్థ స్విగ్గీకి చెందిన స్విగ్గీ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటుకు కార్పొరేట్ వ్యవహారాల శాఖ అనుమతులు ఇచ్చింది. ఈ సంస్థ క్రీడలు, అమ్యూజ్‌మెంట్, రిక్రియేషన్ కార్యకలాపాలు సాగిస్తుందని స్విగ్గీ తెలిపింది. అలాగే, స్పోర్ట్స్ ఈవెంట్ల నిర్వహణ, కెరియర్‌పరమైన సర్వీసులు అందించడం, ప్రసార హక్కులు కొనుగోలు చేయడం మొదలైనవి కూడా చేపడుతుందని పేర్కొంది.

బోర్డు సమావేశాలు

రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, ఎల్‌టీఐమైండ్‌ట్రీ, హావెల్స్ ఇండియా, డీబీ కార్ప్, హాట్సన్ ఆగ్రో, కేశోరాం ఇండస్ట్రీస్, వారీ రెన్యూవబుల్ టెక్నాలజీస్, మాస్టేక్, స్టెర్లింగ్ అండ్ విల్సన్ రెన్యూవబుల్ ఎనర్జీ, టీటీఐ ఎంటర్ ప్రైజెస్, అలోక్ ఇండస్ట్రీస్, ఖైతన్ కెమికల్స్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-1-2025

విశాఖ	520-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	515-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	490-00
వరంగల్	492-00
రిటైల్ ధర	5.50

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
NTPC	322.85	4.01
TRENT	6,399.00	3.86
POWERGRID	298.6	2.88
KOTAKBANK	1,788.00	2.14
MARUTI	11,964.95	1.91

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
M&M	2,961.00	-2.9
AXISBANK	1,025.00	-2.53
BAJAJFINSV	1,674.80	-2.26
BAJFINANCE	7,172.95	-2.21
SHRIRAMFIN	534.45	-1.77

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	5,722
ఎన్‌ఎస్‌ఈ	92,453
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,55,782
ఎఫ్‌ఐఐ	- 4,533
డీఐఐ	+ 3,682

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	78.09 రాత్రి 11.30కు	$ 76.37 క్రితం ముగింపు
బ్రెంట్	81.42 రాత్రి 11.30కు	$ 79.92 క్రితం ముగింపు

స్వల్పంగా తగ్గిన ఎగుమతులు

- డిసెంబర్‌లో 38 బిలియన్ డాలర్లు
- దిగుమతులు 5% అప్; 59.95 బిలియన్ డాలర్లు
- 22 బిలియన్ డాలర్లకు వాణిజ్య లోటు పరిమితం



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ఎగుమతులు వరుసగా రెండో నెలా క్షీణించాయి. 2023 డిసెంబర్‌తో పోలిస్తే గతేడాది డిసెంబర్‌లో స్వల్పంగా ఒక్క శాతం తగ్గి 38.01 బిలియన్ డాలర్లకు పరిమితం కాగా దిగుమతులు 5 శాతం పెరిగి 59.95 బిలియన్ డాలర్లకు చేరాయి. వాణిజ్య లోటు 21.94 బిలియన్ డాలర్లుగా నమోదైంది. బుధవారం కేంద్రం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. డిసెంబర్‌లో పెట్రోలియం, రత్నాభరణాలు, రసాయనాల ఎగుమతుల వృద్ధి నెమ్మదించింది. అయితే, జౌళి, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్, బియ్యం, మెరైన్ ఉత్పత్తుల ఎగుమతులు మెరుగ్గా నమోదయ్యాయి. మిగతా దేశాలతో పోలిస్తే భారత్ ఎగుమతుల గణాంకాలు మెరుగ్గా ఉన్నట్లు వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్‌వాల్ తెలిపారు. వాణిజ్య గణాంకాలను సమగ్రంగా విశ్లేషించే విధంగా కృత్రిమ మేథ (ఏఐ) ఆధారిత డేటా అనలిటిక్స్ ప్లాట్‌ఫాంను రూపొందించడంపై కసరత్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇందుకోసం ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కరెన్సీ హెచ్చుతగ్గులు, అంతర్జాతీయంగా వాణిజ్యానికి సవాళ్లతోపాటు కమోడిటీలు, లోహాల ధరల్లో హెచ్చుతగ్గులే ఎగుమతుల క్షీణతకు దారితీసినట్లు ఎగుమతి సంస్థల సమాఖ్య ఎఫ్ఐఈవో ప్రెసిడెంట్ అశ్వనీ కుమార్ తెలిపారు.

ఇక ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలో ఎగుమతులు 1.6 శాతం పెరిగి 321.71 బిలియన్ డాలర్లకు, దిగుమతులు 5.15 శాతం పెరిగి 532.48 బిలియన్ డాలర్లకు చేరాయి. వాణిజ్య లోటు 189.74 బిలియన్ డాలర్ల నుంచి 210.77 బిలియన్ డాలర్లకు చేరింది.

ఇతర వివరాల్లోకి వెళ్తే..

- డిసెంబర్‌లో పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 29 శాతం క్షీణించి 4.91 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు ఏకంగా 35.11 శాతం పెరిగి 3.58 బిలియన్ డాలర్లకు చేరాయి. 24 నెలల్లో ఇది గరిష్ట స్థాయి.
- బంగారం దిగుమతులు 55 శాతం పెరిగి 4.7 బిలియన్ డాలర్లకు చేరాయి. వెండి దిగుమతులు 211 శాతం పెరిగి 421.91 మిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- సేవల రంగం ఎగుమతులు 31.63 బిలియన్ డాలర్ల నుంచి 32.66 బిలియన్ డాలర్లకు పెరిగాయి.
- సవరించిన గణాంకాల ప్రకారం 2024 నవంబర్‌లో ఎగుమతులు 5 శాతం తగ్గి 32.03 బిలియన్ డాలర్లకు క్షీణించగా, దిగుమతులు 16 శాతం పెరిగి 63.86 బిలియన్ డాలర్లకు చేరాయి. వాణిజ్య లోటు 31.83 బిలియన్ డాలర్లుగా నమోదైంది. నవంబర్‌లో పసిడి దిగుమతులను 9.84 బిలియన్ డాలర్లకు సవరించారు.
- డిసెంబర్‌లో అమెరికా, సౌదీ, ఫ్రాన్స్, బంగ్లాదేశ్, శ్రీలంకకు భారత్ అత్యధికంగా ఎగుమతులు చేయగా .. చైనా స్విట్జర్లాండ్, థాయ్‌ల్యాండ్, జర్మనీ, అమెరికా నుంచి దిగుమతి చేసుకుంది.

లగ్జరీ ఇళ్ల మెరుపులు



- 2024లో 53 శాతం పెరిగిన విక్రయాలు; 19,700 యూనిట్లు అమ్మకం
- హైదరాబాద్‌లో 70 గృహాల విక్రయం

న్యూఢిల్లీ: విశాలమైన ఇళ్లు, ప్రీమియం సదుపాయాలు కోరుకునే సంపన్నుల సంఖ్య పెరుగుతుండటంతో దానికి అనుగుణంగా లగ్జరీ ఇళ్లకు డిమాండ్ కూడా గణనీయంగా పెరుగుతోంది. 2024లో హైదరాబాద్ సహా ఏడు ప్రధాన నగరాల్లో రూ. 4 కోట్లకు పైగా ఖరీదు చేసే లగ్జరీ ఇళ్ల అమ్మకాలు 53 శాతం ఎగిసినట్లు రియల్ ఎస్టేట్ సంస్థ సీబీఆర్ఈ తెలిపింది. మొత్తం 19,700 యూనిట్లు అమ్ముడైనట్లు వివరించింది. హైదరాబాద్‌లో లగ్జరీ ఇళ్ల అమ్మకాలు 2,030 యూనిట్ల నుంచి 70 పెరిగి 2,100 యూనిట్లకు చేరాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో (నేషనల్ క్యాపిటల్ రీజియన్) అత్యధికంగా 10,500 యూనిట్లను రియల్టీ సంస్థలు విక్రయించాయి. 2023 క్యాలెండర్ సంవత్సరంలో రూ. 4 కోట్ల ఖరీదు చేసే లగ్జరీ ఇళ్లు 12,895 అమ్ముడయ్యాయి. కొనుగోళ్లకు నెలకొన్న డిమాండ్‌తో రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్ మార్కెట్ పటిష్టంగా ఉందని, రాబోయే క్వార్టర్లలోనూ ఇదే ధోరణి కొనసాగవచ్చని సీబీఆర్ఈ చైర్మన్ అన్షుమన్ మ్యాగజైన్ తెలిపారు. మధ్య స్థాయి ప్రాజెక్టుల ఉండే పుణె, చెన్నై తదితర నగరాలు కూడా హై-ఎండ్ ప్రాజెక్టుల వైపు మళ్లుతున్నాయని పేర్కొన్నారు. ప్రీమియం ప్రాంతాల్లో ఆధునిక సదుపాయాలు, అసమానమైన సౌకర్యాన్ని అందించే హై-ఎండ్ ఇళ్లకు డిమాండ్ భారీగా ఉంటోందని క్రిసుమి కార్పొరేషన్ ప్రెసిడెంట్ ఆకాశ్ ఖురానా వివరించారు.

సీబీఆర్ఈ డేటా ప్రకారం..

- రూ. 4 కోట్ల పైబడి ఖరీదు చేసే ఇళ్ల అమ్మకాలు ముంబైలో 4,200 యూనిట్ల నుంచి 5,500 యూనిట్లకు పెరిగాయి.
- పుణెలో 400 నుంచి 825 పెరగ్గా, బెంగళూరులో 265 యూనిట్ల నుంచి 50కి పడిపోయాయి.
- కోల్‌కతాలో అమ్మకాలు 310 నుంచి 530కి, చెన్నైలో 165 యూనిట్ల నుంచి 275 యూనిట్లకు పెరిగాయి.

రెండేళ్లలో ఈవీల వినియోగం వేగవంతం..

హ్యుందాయ్ సీవోవో తరుణ్ గార్గ్

చెన్నై: దేశీయంగా ఈ రెండేళ్లలో (2025, 2026) విద్యుత్ ప్యాసింజర్ వాహనాల వినియోగం మరింత వేగవంతమవుతుందని హ్యుందాయ్ మోటర్ ఇండియా (హెచ్ఎంఐఎల్) సీవోవో తరుణ్ గార్గ్ తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో విద్యుత్ వాహనాల వినియోగం ప్రారంభ స్థాయిలో 2.4 శాతం స్థాయిలో ఉందని, 2030 నాటికి ఇది 17 శాతానికి చేరవచ్చనే అంచనాలు ఉన్నాయని ఆయన చెప్పారు. పెద్ద బ్రాండ్లు మరిన్ని ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టనుండటం ఇందుకు దోహదపడగలదని తెలిపారు. విద్యుత్ వాహనాల వినియోగ వృద్ధికి తమ క్రెటా ఎలక్ట్రిక్ వెర్షన్ కూడా తోడ్పడగలదన్నారు. హ్యుందాయ్ సంస్థ భవిష్యత్తులో నాలుగు ఈవీలను కూడా ప్రవేశపెట్టే యోచనలో ఉంది. దీని ధర రూ. 15-25 లక్షల శ్రేణిలో ఉండొచ్చని అంచనా. అటు మారుతీ సుజుకీ ఇండియా తమ తొలి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ 'ఈ-విటారా'ను ఆవిష్కరించనుంది. మరోవైపు, చార్జింగ్ సదుపాయాలకు సంబంధించి 10,000 చార్జింగ్ పాయింట్ల వివరాలతో ప్రత్యేక యాప్‌ను రూపొందించామని, దీన్ని ఇతర వాహనదారులు కూడా వినియోగించుకోవచ్చని గార్గ్ చెప్పారు. వీటిలో 7,500 పాయింట్లలో యాప్ ద్వారా నేరుగా చెల్లింపులు జరిపే సదుపాయం ఉందన్నారు. ఫాస్ట్ చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. హైదరాబాద్-విజయవాడ, ముంబై-పుణె తదితర హైవేల్లోని 30 చార్జింగ్ స్టేషన్లలో 80 ఫాస్ట్ చార్జర్లను ఇన్‌స్టాల్ చేసినట్లు గార్గ్ వివరించారు.



క్యూ3 ఫలితాలు

సియట్ లాభం డౌన్



న్యూఢిల్లీ: టైర్ల తయారీ దిగ్గజం సియట్ లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 46 శాతంపైగా క్షీణించి రూ. 97 కోట్లకు పరిమితమైంది. పెరిగిన ముడిసరుకుల వ్యయాలు లాభాలను దెబ్బతీశాయి. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 181 కోట్లుపైగా ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 2,963 కోట్ల నుంచి రూ. 3,300 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 2,739 కోట్ల నుంచి రూ. 3,176 కోట్లకు పెరిగాయి. ముడిసరుకుల వినియోగ వ్యయాలు రూ. 1,695 కోట్ల నుంచి రూ. 2,117 కోట్లకు ఎగశాయి. అన్ని విభాగాలలోనూ పటిష్ట ఆర్డర్ బుక్‌ను కలిగి ఉన్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో అర్నాబ్ బెనర్జీ పేర్కొన్నారు. స్థిరమైన డిమాండ్ కారణంగా ఆదాయంలో వృద్ధి కొనసాగే వీలున్నట్లు అంచనా వేశారు.

బీఎస్ఈలో సియట్ షేరు 0.5 శాతం బలపడి రూ. 3,058 వద్ద ముగిసింది.

నెట్‌వర్క్ 18కు భారీ నష్టాలు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ నెట్‌వర్క్18 మీడియా అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో భారీ నష్టాలు చవిచూసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో రూ. 1,400 కోట్ల నష్టం ప్రకటించింది. అయితే అనుకోని పద్దులకు ముందు దాదాపు రూ. 26 కోట్ల నికర లాభం ఆర్జించినట్లు కంపెనీ పేర్కొంది. అనుబంధ సంస్థల గుర్తింపురద్దుతో రూ. 1,426 కోట్ల నష్టం నమోదైనట్లు వెల్లడించింది. వీటిని ప్రొవిజనల్‌గా మదింపు చేసినట్లు తెలియజేసింది. స్టార్ ఇండియాతో అనుబంధ కంపెనీ వయాకామ్18 విలీనం కారణంగా గతేడాది(2023-24) ఫలితాలను పోల్చతగదని పేర్కొంది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 1,361 కోట్లకు చేరింది. స్టాండెలోన్ ఆదాయం రూ. 476 కోట్లను అధిగమించగా.. అనుకోని ఆర్జనతో రూ. 3,432 కోట్ల లాభం ఆర్జించింది.

నెట్‌వర్క్ 18 మీడియా షేరు బీఎస్ఈలో 2.7 శాతం ఎగసి రూ. 61.5 వద్ద ముగిసింది.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర లాభం అప్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 36 శాతం జంప్‌చేసి రూ. 1,406 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 1,036 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 5,851 కోట్ల నుంచి రూ. 7,112 కోట్లకు ఎగసింది. వడ్డీ ఆదాయం రూ. 5,171 కోట్ల నుంచి రూ. 6,325 కోట్లకు జంప్ చేసింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.04 శాతం నుంచి 1.8 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు 0.22 శాతం నుంచి 0.2 శాతానికి తగ్గాయి. ఈ కాలంలో క్విప్ ద్వారా రూ. 3,500 కోట్లు సమీకరించింది. దీంతో 2024 డిసెంబర్31కల్లా కేంద్ర ప్రభుత్వ వాటా 79.6 శాతానికి చేరింది.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర షేరు ఎన్ఎస్ఈలో 3 శాతం పతనమై రూ. 51 వద్ద ముగిసింది.

ఎల్‌టీటీఎస్ లాభం నేలచూపు



న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ ఎల్అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్(ఎల్‌టీటీఎస్) ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 4 శాతం క్షీణించి రూ. 322 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 336 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 10 శాతం ఎగసి రూ. 2,653 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 2,422 కోట్ల టర్నోవర్ ప్రకటించింది. నిర్వహణ లాభ మార్జిన్లు 17.2% నుంచి 15.2 శాతానికి క్షీణించాయి. వేతనాల పెంపు, ఇతర కంపెనీ కొనుగోలు ప్రభావం చూపినట్లు కంపెనీ సీఈవో, ఎండీ అమిత్ చద్దా పేర్కొన్నారు. మధ్యకాలానికి ఆదాయంలో 17-18% వృద్ధిని అంచనా వేశారు. కాగా.. 2024 డిసెంబర్31కల్లా మొత్తం సిబ్బంది సంఖ్యలో 200 మంది తగ్గడంతో 23,465కు చేరింది.

ఎల్‌టీటీఎస్ షేరు బీఎస్ఈలో 3 శాతం ఎగసి రూ. 4,853 వద్ద ముగిసింది.

హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ లాభం జూమ్



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఏఎంసీ) ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 31 శాతం జంప్‌చేసి రూ. 642 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 490 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 39 శాతం ఎగసి రూ. 934 కోట్లను అధిగమించింది. గత క్యూ3లో రూ. 671 కోట్ల టర్నోవర్ ప్రకటించింది. 2024 డిసెంబర్31కల్లా కంపెనీ ఆస్తుల విలువ రూ. 7.87 లక్షల కోట్లుగా నమోదైంది.

హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ షేరు బీఎస్ఈలో 0.7 శాతం ఎగసి రూ. 3,864 వద్ద ముగిసింది.

మార్చి తర్వాత వడ్డీరేటు తగ్గింపు!

- వృద్ధి, ధరల్లో స్థిరత్వం నేపథ్యం
- రుణ వృద్ధికి తోడ్పాటు
- ఫిచ్ అంచనా



న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఏప్రిల్‌తో ప్రారంభమయ్యే వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2025-2026) రెపో రేటును తగ్గించే అవకాశం ఉందని రేటింగ్ దిగ్గజం- ఫిచ్ విశ్లేషించింది. స్థిర వృద్ధి, ధరల పెరుగుదల్లో కట్టడి వంటి అంశాలు దీనికి దోహదపడతాయన్నది ఫిచ్ విశ్లేషణ. రెపో రేటు కోత 2025-26లో కార్పొరేట్ల రుణ లభ్యత పెరుగుదలకు దారితీసే అంశంగా పేర్కొంది. అధిక మూలధన వ్యయాలు నమోదయినప్పటికీ, వచ్చే ఆర్థిక సంవత్సరం భారత్ కార్పొరేట్ల మార్జిన్లు మెరుగుపడతాయన్న విశ్వాసాన్ని ఫిచ్ వెలిబుచ్చింది. ''ఇండియా కార్పొరేట్ల క్రెడిట్ ట్రెండ్స్'' పేరుతో ఫిచ్ రూపొందించిన తాజా నివేదికలో కొన్ని ముఖ్యాంశాలు...

వృద్ధి 6.5 శాతం

2025-26లో సిమెంట్, విద్యుత్, పెట్రోలియం ఉత్పత్తులు, ఉక్కు, ఇంజినీరింగ్, నిర్మాణ (ఈఅండ్‌సీ) కంపెనీల ఉత్పత్తులకు మంచి డిమాండ్ అవకాశాలు ఉన్నాయి. దీనితో ఎకానమీ 6.5 శాతం పురోగమించే వీలుంది. మౌలిక సదుపాయాల వ్యయం పెరగవచ్చు. ఎకానమీ స్థిరవృద్ధికి ఈ అంశం దోహదపడుతుంది.

మరికొన్ని అంశాలు...


- దేశీయ, అంతర్జాతీయ అమ్మకాలు నెమ్మదించడం వల్ల ఆటో రంగంలో వృద్ధి మధ్యస్థంగా ఉండే వీలుంది.
- రవాణా, పర్యాటక పరిశ్రమలో డిమాండ్ రికవరీ ఒక మోస్తరు వేగంతో కొనసాగుతుంది.
- అంతర్జాతీయంగా అధిక సరఫరాల ప్రభావం రసాయన కంపెనీల ధరలపై ప్రభావం చూపుతుంది.
- టెలికం కంపెనీల ఆదాయ వృద్ధికి టారిఫ్‌ల పెంపు మద్దతు లభిస్తుంది.
- ఔషధ రంగంలో మెరుగైన ఫలితాలు నమోదు కావచ్చు.

ఐటీ మందగమనం..



కీలకమైన విదేశీ మార్కెట్లలోని వినియోగదారులు ఆర్థిక వృద్ధి మందగించే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని వ్యయాల విషయంలో విచక్షణతో వ్యవహరించవచ్చు. దీనితో ఐటీ, సేవా కంపెనీల అమ్మకాల్లో కేవలం ఒక అంకె వృద్ధి మాత్రమే నమోదయ్యే వీలుంది. ఆయిల్ అండ్ గ్యాస్ ఉత్పత్తి విక్రయాల్లో వృద్ధి ఒక అంకెకు పరిమితం కావచ్చు.

రూపాయిపై ఒత్తిడి



కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఇంధన ధరలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఇదే జరిగితే భారత రూపాయి మరింత క్షీణించవచ్చు. అమెరికాసహా కొన్ని దేశాలు తీసుకునే వాణిజ్య రక్షణాత్మక చర్యల వల్ల దిగుమతులు తగ్గి, రూపాయిపై ఆ ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.

ఫిబ్రవరిలో రేటు తగ్గదు



నవంబర్ 2024లో 5.5 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబర్‌లో 5.2 శాతానికి దిగివచ్చింది. ఇది మా అంచనాలకన్నా తక్కువ. ఈ పరిస్థితుల్లో ఫిబ్రవరి పాలసీ సమీక్షలో రెపో రేటు తగ్గింపు కష్టమే. అయితే కూరగాయల వంటి నిత్యావసర వస్తువుల్లో ధరలలో గణనీయమైన క్షీణత వల్ల వృద్ధే లక్ష్యంగా ద్రవ్యపరపతి విధాన కమిటీ సభ్యుల్లో కొందరు కోతకు మొగ్గుచూపే వీలుంది.

– అదితి నాయర్, ఇక్రా చీఫ్ ఎకనామిస్ట్

రేటు తగ్గింపు ప్రక్రియ షురూ!



రిటైల్ ద్రవ్యోల్బణం మరింత తగ్గి, 5 శాతం లోపనకు పడిపోయే అవకాశం ఉంది. ఆర్‌బీఐ ద్రవ్యోల్బణం నుండి వృద్ధి వైపు దృష్టి సారిస్తుందని మేము నమ్ముతున్నాము. కరెన్సీ అస్థిరత కొంత అనిశ్చితిని సృష్టిస్తున్నప్పటికీ, ఆర్‌బీఐ సరళతర ఆర్థిక విధానంవైపు అడుగులు వేయవచ్చని భావిస్తున్నాము.

– అఖిల్ మిట్టల్, సీనియర్ ఫండ్ మేనేజర్ (టాటా అసెట్ మేనేజ్‌మెంట్)

ఏప్రిల్ పాలసీలో కోత



కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో ఫిబ్రవరి పాలసీ సమీక్ష జరుగుతుంది. ఫిబ్రవరి 1వ తేదీన ఆర్థిక మంత్రి పార్లమెంటులో ప్రవేశపెట్టే బడ్జెట్‌లోని పలు అంశాలు ప్రస్తుత ఆర్‌బీఐ పాలసీని ప్రాతిపదికగా తీసుకునే అవకాశం ఉంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని (డిసెంబర్ రిటైల్ ద్రవ్యోల్బణం డేటా రేటు తగ్గింపునకు కొంత సానుకూలంగా ఉన్నప్పటికీ) రేటు తగ్గింపునకు మరొక పాలసీ వరకూ ఆర్‌బీఐ వేచిచూసే వీలుంది.

– పరాస్ జస్రాయ్, ఇండ్-రా ఎకనమిస్ట్

ఫైనల్లో కర్ణాటక

సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ హరియాణాపై విజయం

దేవ్‌దత్ పడిక్కల్, స్మరణ్ మెరుపులు



వడోదర: టీమిండియా ఆటగాడు దేవ్‌దత్ పడిక్కల్ (113 బంతుల్లో 86; 8 ఫోర్లు, 1 సిక్స్), రవిచంద్రన్ స్మరణ్ (94 బంతుల్లో 76; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ శతకాలతో రాణించారు. దాంతో నాలుగుసార్లు చాంపియన్ కర్ణాటక జట్టు విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో ఐదోసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో కర్ణాటక జట్టు 5 వికెట్ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ హరియాణాను ఓడించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన హరియాణా 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసింది. కెప్టెన్ అంకిత్ కుమార్ (52 బంతుల్లో 48; 7 ఫోర్లు), హిమాన్షు రాణా (44; 4 ఫోర్లు) మెరుగైన ప్రదర్శన చేశారు. రాహుల్ తెవాటియా (22), దినేశ్ (20), సుమిత్ (21), అర్ష్ రంగా (10), నిశాంత్ (10) విఫలమయ్యారు. కర్ణాటక బౌలర్లలో అభిలాశ్ శెట్టి 4 వికెట్లు పడగొట్టగా... ప్రసిధ్ కృష్ణ, శ్రేయస్ గోపాల్ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం కర్ణాటక జట్టు 47.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసి గెలిచింది. పడిక్కల్, స్మరణ్ మూడో వికెట్‌కు 128 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌లో స్థిరత్వం తెచ్చారు. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (0) డకౌట్ కాగా... అనీశ్ (47 బంతుల్లో 22; 1 ఫోర్, 1 సిక్స్) నెమ్మదిగా ఆడాడు. ఈ దశలో పడిక్కల్, స్మరణ్ కలిసి ప్రత్యర్థి బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. ఒక్కో పరుగు జతచేస్తూ లక్ష్యాన్ని కరిగించారు. హరియాణా బౌలర్లలో నిశాంత్ 2 వికెట్లు పడగొట్టాడు. పడిక్కల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. గురువారం జరిగే రెండో సెమీఫైనల్లో విదర్భతో మహారాష్ట్ర తలపడనుంది.

తొలి రౌండ్‌లో రష్మిక పరాజయం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ50 మహిళల టోర్నమెంట్‌లో భారత క్రీడాకారిణులకు నిరాశ ఎదురైంది. సింగిల్స్ విభాగంలో భారత్ నుంచి ఏడుగురు బరిలోకి దిగగా... రియా భాటియా మినహా మిగతా ఆరుగురు భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, అంకితా రైనా, కర్మన్ కౌర్, ఆకాంక్ష, వైదేహి, వైష్ణవి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో హైదరాబాద్ ప్లేయర్ రష్మిక 1-6, 3-6తో మరియా కొజిరెవా (రష్యా) చేతిలో, అంకిత రైనా 1-6, 3-6తో లౌరా సామ్సన్ (చెక్ రిపబ్లిక్) చేతిలో, కర్మన్ కౌర్ 4-6, 1-6తో పన్నా ఉద్వార్డి (హంగేరి) చేతిలో, వైదేహి 4-6, 4-6తో తాతియానా ప్రొజోరోవా (రష్యా) చేతిలో, వైష్ణవి 6-7 (3/7), 2-6తో డాలియా జకుపోవిచ్ (స్లొవేనియా) చేతిలో, ఆకాంక్ష 0-6, 1-6తో ఫాన్‌గ్రాన్ టియాన్ (చైనా) చేతిలో ఓటమి చవిచూశారు. రియా భాటియా 7-6 (7/3), 2-6, 7-5తో ఎరి షిమిజు (జపాన్)పై విజయం సాధించింది.



జొకోవిచ్ 430

అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా సెర్బియా దిగ్గజం రికార్డు

429 మ్యాచ్‌లతో ఫెడరర్ పేరిట ఉన్న రికార్డు బద్దలు

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడో రౌండ్‌లోకి ప్రవేశించిన మాజీ విజేత



మెల్‌బోర్న్: తనకెంతో కలిసొచ్చిన గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్ వేదికపై సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మరో రికార్డు బద్దలు కొట్టాడు. ఓపెన్ శకంలో (1968 నుంచి) అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా జొకోవిచ్ అవతరించాడు. 429 మ్యాచ్‌లతో స్విట్జర్లాండ్ లెజెండ్ రోజర్ ఫెడరర్ పేరిట ఉన్న రికార్డును 430వ మ్యాచ్‌తో జొకోవిచ్ అధిగమించాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో 10 సార్లు చాంపియన్ జొకోవిచ్ 6-1, 6-7 (4/7), 6-3, 6-2తో కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ మ్యాచ్ ఆడిన జైమీ ఫారియా (పోర్చుగల్)పై గెలుపొందాడు. 3 గంటలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్‌కు రెండో సెట్‌లో మాత్రమే ప్రతిఘటన ఎదురైంది. 14 ఏస్‌లు సంధించిన ఈ సెర్బియా స్టార్ కేవలం రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. 33 విన్నర్స్ కొట్టడంతోపాటు 33 అనవసర తప్పిదాలు చేసిన జొకోవిచ్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసి తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయాడు. నెట్ వద్దకు 12 సార్లు దూసుకొచ్చి 9 సార్లు పాయింట్లు నెగ్గిన ఈ మాజీ చాంపియన్‌కు మూడో రౌండ్‌లో 26వ సీడ్ టొమాస్ మఖచ్ (చెక్ రిపబ్లిక్) రూపంలో గట్టి పోటీ ఎదురుకానుంది. కెరీర్‌లో 77వ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడుతోన్న జొకోవిచ్ ఇప్పటి వరకు 379 గ్రాండ్‌స్లామ్ మ్యాచ్‌ల్లో గెలిచాడు. ఇది కూడా ఒక రికార్డే. 369 'గ్రాండ్' విజయాలతో ఫెడరర్ పేరిట ఉన్న రికార్డును గత ఏడాదే జొకోవిచ్ సవరించాడు. అత్యధిక గ్రాండ్‌స్లామ్ మ్యాచ్‌లు ఆడిన జాబితాలో జొకోవిచ్, ఫెడరర్ తర్వాత సెరెనా విలియమ్స్ (423), రాఫెల్ నాదల్ (358), వీనస్ విలియమ్స్ (356) ఉన్నారు.

జ్వెరెవ్, అల్‌కరాజ్ ముందంజ

మరోవైపు రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), మూడో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్) మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టగా... ఆరో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే) రెండో రౌండ్‌లోనే వెనుదిరిగాడు. జ్వెరెవ్ 6-1, 6-4, 6-1తో మార్టినెజ్ (స్పెయిన్)పై, అల్‌కరాజ్ 6-0, 6-1, 6-4తో నిషియోకా (జపాన్)పై అలవోకగా గెలిచారు. రూడ్ 2 గంటల 44 నిమిషాల్లో 2-6, 6-3, 1-6, 4-6తో జాకుబ్ మెన్సిక్ (చెక్ రిపబ్లిక్) చేతిలో ఓడిపోయాడు. ఆరోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడిన రూడ్ ఇప్పటి వరకు ప్రిక్వార్టర్ ఫైనల్ దాటి ముందుకెళ్లలేకపోయాడు.

బోపన్న జోడీకి షాక్



పురుషుల డబుల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్, భారత వెటరన్ స్టార్ రోహన్ బోపన్నకు చుక్కెదురైంది. గత ఏడాది మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)తో ఈ టోర్నీలో డబుల్స్ టైటిల్ నెగ్గిన బోపన్న ఈసారి కొత్త భాగస్వామి బారింటోస్ (కొలంబియా)తో కలిసి బరిలోకి దిగాడు. తొలి రౌండ్‌లో 14వ సీడ్ బోపన్న-బారింటోస్ ద్వయం 5-7, 6-7 (5/7)తో పెడ్రో మార్టినెజ్-జామి మునార్ (స్పెయిన్) జోడీ చేతిలో ఓడిపోయింది. యూకీ బాంబ్రీ (భారత్)-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జంట కూడా తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. యూకీ-ఒలివెట్టి ద్వయం 2-6, 6-7 (3/7)తో ట్రిస్టన్ స్కూల్‌కేట్-ఆడమ్ వాల్టన్ (ఆస్ట్రేలియా) జంట చేతిలో పరాజయం పాలైంది.

కిన్‌వెన్ జెంగ్ అవుట్



మహిళల సింగిల్స్ విభాగంలో సంచలనం నమోదైంది. గత ఏడాది రన్నరప్, ఐదో సీడ్ కిన్‌వెన్ జెంగ్ (చైనా) పోరాటం రెండో రౌండ్‌లోనే ముగిసింది. 2 గంటల 16 నిమిషాలపాటు జరిగిన రెండో రౌండ్‌లో 36 ఏళ్ల లౌరా సిగెమండ్ (జర్మనీ) 7-6 (7/3), 6-3తో కిన్‌వెన్ జెంగ్‌ను బోల్తా కొట్టించి మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్, టాప్ సీడ్ సబలెంకా (బెలారస్), మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా), ఏడో సీడ్ జెస్సికా పెగులా (అమెరికా) మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు. సబలెంకా 6-3, 7-5తో బుజాస్ మనీరో (స్పెయిన్)పై, కోకో గాఫ్ 6-3, 7-5తో జోడీ బురాజ్ (బ్రిటన్)పై, పెగులా 6-4, 6-2తో ఎలీజ్ మెర్టెన్స్ (బెల్జియం)పై గెలుపొందారు. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో మాజీ చాంపియన్ నయోమి ఒసాకా (జపాన్) 1-6, 6-1, 6-3తో 20వ సీడ్ కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్)పై, 14వ సీడ్ మిరా ఆంద్రీవా (రష్యా) 6-4, 3-6, 7-6 (10/8)తో మొయూక ఉచిజిమా (జపాన్)పై, 11వ సీడ్ పౌలా బదోసా (స్పెయిన్) 6-1, 6-0తో తాలియా గిబ్సన్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించారు.

సింధు బోణీ

ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత స్టార్ షట్లర్

తొలి రౌండ్‌లోనే ఓడిన లక్ష్య సేన్, ప్రణయ్, ప్రియాన్షు



న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో మాజీ చాంపియన్ సింధు 21-12, 22-20తో షువో యున్ సుంగ్ (చైనీస్ తైపీ)పై గెలిచింది. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో మనామి షిజు (జపాన్)తో సింధు ఆడుతుంది. భారత్‌కే చెందిన అనుపమ ఉపాధ్యాయ్ ముందంజ వేయగా... మాళవిక బన్సోద్, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. అనుపమ 21-17, 21-18తో రక్షిత శ్రీ (భారత్)పై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరగా... మాళవిక 22-20, 16-21, 11-21తో హాన్ యువె (చైనా) చేతిలో, ఆకర్షి 17-21, 13-21తో పోర్న్‌పవీ చోచువోంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి చవిచూశారు. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్స్ లక్ష్య సేన్, హెచ్ఎస్ ప్రణయ్, ప్రియాన్షు రజావత్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా... కిరణ్ జార్జి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో లక్ష్య సేన్ 15-21, 10-21తో చున్ యి లిన్ (చైనీస్ తైపీ) చేతిలో, ప్రణయ్ 21-16, 18-21, 12-21తో లీ యాంగ్ సు (చైనీస్ తైపీ) చేతిలో, ప్రియాన్షు 16-21, 22-20, 13-21తో కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో పరాజయం పాలయ్యారు. కిరణ్ జార్జి 21-19, 14-21, 27-25తో యుషీ తనాకా (జపాన్)పై గెలిచాడు.

పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. తొలి రౌండ్‌లో సాత్విక్-చిరాగ్ 23-21, 19-21, 21-16తో వె చోంగ్ మాన్-కాయ్ వున్ తీ (మలేసియా)లపై నెగ్గారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో ఐదో సీడ్ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ 21-23, 19-21తో అరీసా ఇగారషి-అయాకో సకురామోటో (జపాన్) ద్వయం చేతిలో ఓడిపోయింది.

'నార్వే చెస్' బరిలో హంపి

స్టావంగర్ (నార్వే): భారత గ్రాండ్‌మాస్టర్, వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్ కోనేరు హంపి ప్రతిష్టాత్మక నార్వే చెస్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగనుంది. క్లాసికల్ విభాగంలో ప్రస్తుతం ఆరో ర్యాంక్‌లో ఉన్న హంపి ఈ ఏడాది మే 26 నుంచి జూన్ 6 వరకు జరిగే ఈ టోర్నీలో తాను పాల్గొంటున్న విషయాన్ని వెల్లడించింది. ఇటీవలే న్యూయార్క్‌లో జరిగిన వరల్డ్ ర్యాపిడ్ టోర్నీలో విజేతగా నిలిచిన తర్వాత హంపి బ్లిట్జ్ విభాగంలో టాప్-3లో నిలిచే అవకాశాన్ని త్రుటిలో కోల్పోయింది. ఇప్పుడు నార్వే టోర్నీతో క్లాసికల్ విభాగంలో మళ్లీ తన సత్తాను చాటేందుకు ఆమె సిద్ధమైంది. హంపితోపాటు ఈ టోర్నీలో భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేశ్‌బాబు, మాజీ ప్రపంచ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా), అనా ముజిచుక్ (ఉక్రెయిన్), సరానదత్ (స్పెయిన్) పాల్గొంటారు.



ముంబై రంజీ జట్టుతో రోహిత్ శర్మ, యశస్వి ప్రాక్టీస్

ముంబై: భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్... ముంబై రంజీ జట్టుతో కలిసి ప్రాక్టీస్ చేశారు. ఇటీవల ఆస్ట్రేలియాతో 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో రోహిత్ పేలవ ప్రదర్శన కనబర్చగా... యశస్వి టీమిండియా తరఫున అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా నిలిచాడు. ఆసీస్‌తో ప్రతిష్టాత్మక సిరీస్‌లో భారత జట్టు పరాజయం పాలవగా... ప్లేయర్లందరూ దేశవాళీ టోర్నీల్లో ఆడాలనే డిమాండ్ పెరిగింది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కూడా 'అందుబాటులో ఉన్నవాళ్లందరూ రంజీ ట్రోఫీలో ఆడాలి' అని ఆటగాళ్లకు చురకలు అంటించాడు. ఈ నేపథ్యంలో రోహిత్, యశస్వి ముంబై రంజీ జట్టుతో కలిసి ప్రాక్టీస్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. మంగళవారం ముంబై రంజీ కెప్టెన్ రహానేతో కలిసి రోహిత్ సుదీర్ఘ సమయం నెట్స్‌లో గడపగా... బుధవారం జైస్వాల్ ప్రాక్టీస్ చేశాడు. రంజీ ట్రోఫీ రెండో దశ మ్యాచ్‌లు ఈ నెల 23 నుంచి ప్రారంభం కానుండగా... జమ్మూకశ్మీర్‌తో ముంబై తలపడనుంది. ఈ మ్యాచ్‌లో వీరిద్దరూ ఆడటంపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ నెల 20 వరకు జట్టును ప్రకటించే అవకాశం ఉందని... ఆ సమయంలో ఆటగాళ్లందరినీ అందుబాటులో ఉంటారా లేదా అని అడిగి ఎంపిక చేస్తామని ముంబై క్రికెట్ బోర్డు అధికారి తెలిపారు. 'రోహిత్‌ను కూడా అడుగుతాం. అతడు అందుబాటులో ఉంటానంటే జట్టులోకి ఎంపిక చేస్తాం' అని అన్నారు.



జుగ్‌రాజ్ డబుల్ ధమాకా

యూపీ రుద్రాస్‌పై బెంగాల్ టైగర్స్ గెలుపు

హాకీ ఇండియా లీగ్



రూర్కెలా: హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) పురుషుల విభాగంలో ష్రాచి రార్ బెంగాల్ టైగర్స్ జట్టు నాలుగో విజయం నమోదు చేసింది. బుధవారం జరిగిన పోరులో బెంగాల్ టైగర్స్ 5-3 గోల్స్ తేడాతో యూపీ రుద్రాస్‌పై గెలుపొందింది. బెంగాల్ టైగర్స్ తరఫున జుగ్‌రాజ్ సింగ్ (10వ, 33వ నిమిషాల్లో) రెండు గోల్స్‌తో విజృంభించగా... గౌథియర్ బొకార్డ్ (8వ నిమిషంలో), సుఖ్‌జీత్ సింగ్ (14వ నిమిషంలో), అభిషేక్ (46వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. యూపీ రుద్రాస్ తరఫున స్యామ్ వర్డ్ (51వ, 59వ నిమిషాల్లో) రెండు గోల్స్ కొట్టగా... హార్దిక్ సింగ్ (47వ నిమిషంలో) ఒక గోల్ సాధించాడు. మ్యాచ్ ఆరంభమైన తొలి క్వార్టర్‌లోనే బెంగాల్ టైగర్స్ మూడు గోల్స్ కొట్టి ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత మరో రెండు గోల్స్‌తో ఆధిక్యాన్ని మరింత పెంచుకోగా... చివరి క్వార్టర్‌లో యూపీ రుద్రాస్ మూడు గోల్స్‌తో పోరాడినా ఫలితం లేకపోయింది. 'హ్యాట్రిక్' విజయాలతో లీగ్‌ను ప్రారంభించిన బెంగాల్ టైగర్స్... గత రెండు మ్యాచ్‌ల్లో ఓడినా... తాజా పోరులో తిరిగి పుంజుకొని సత్తా చాటింది. మరోవైపు రాంచీ వేదికగా జరుగుతున్న మహిళల హాకీ ఇండియా లీగ్‌లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో సూర్మా హాకీ క్లబ్ 2-1గోల్స్ తేడాతో ఒడిశా వారియర్స్‌పై గెలుపొందింది.

చాంపియన్స్ ట్రోఫీకి నోర్జే దూరం

- గాయంతో తప్పుకున్న దక్షిణాఫ్రికా పేసర్



జొహన్నెస్‌బర్గ్: చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే దక్షిణాఫ్రికా జట్టులో చోటు దక్కించుకున్న రెండు రోజులకే పేసర్ ఆన్రిక్ నోర్జే కథ మారింది! వెన్ను నొప్పి గాయంతో అతను ఈ టోర్నీకి దూరమవుతున్నట్లు దక్షిణాఫ్రికా బోర్డు ప్రకటించింది. సోమవారం ప్రకటించిన టీమ్‌లో నోర్జే పేరు కూడా ఉంది. ఫిట్‌గా ఉన్నాడని సెలక్టర్లు నోర్జేను ఎంపిక చేయగా... స్కానింగ్‌తో అతని గాయం తీవ్రత తగ్గలేదని తేలింది. టోర్నీ ప్రారంభమయ్యే లోగా అతను కోలుకునే అవకాశం లేదని తేలింది. గత ఆరు ఐసీసీ టోర్నీల్లో మూడు సార్లు అతను గాయం కారణంగా చివరి నిమిషంలో టోర్నీ నుంచి తప్పుకున్నాడు. 2019, 2023 వన్డే వరల్డ్ కప్‌లతో పాటు ఇప్పుడు మరో వన్డే టోర్నీకి దూరమయ్యాడు. ఈ మధ్య కాలంలో జరిగిన మూడు టి20 వరల్డ్ కప్‌లు (2021, 2022, 2024)లలో అతను జట్టులో భాగంగా ఉన్నాడు. నోర్జే స్థానంలో మరో ఆటగాడి పేరును దక్షిణాఫ్రికా ఇంకా ప్రకటించలేదు.

క్వార్టర్స్‌లో భారత జట్లు

న్యూఢిల్లీ: తొలిసారి నిర్వహిస్తున్న ఖోఖో ప్రపంచకప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు సంపూర్ణ ఆధిపత్యం కనబరుస్తూ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాయి. పురుషుల గ్రూప్ 'ఎ'లో భాగంగా బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో భారత్ 70-38తో పెరూ జట్టును ఓడించింది. మహిళల గ్రూప్ 'ఎ' మొదటి మ్యాచ్‌లో 175-18 పాయింట్ల తేడాతో దక్షిణ కొరియాను చిత్తుచేసిన భారత అమ్మాయిలు... మరో పోరులో 100-16 పాయింట్ల తేడాతో ఇరాన్‌పై విజయం సాధించారు. ఫలితంగా గ్రూప్ దశలో మరో మ్యాచ్ మిగిలుండగానే రెండు విభాగాల్లో భారత జట్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాయి.





ప్రయాగ్‌రాజ్‌లోని కుంభ్‌నగర్‌లో సాధువు చెంత కూర్చున్న ఓ విదేశీ భక్తురాలు. అశ్వారూఢుడై చేతిలో కత్తితో పవిత్రస్నానానికి వస్తున్న నాగా సాధువు. పవిత్రస్నానం అనంతరం అర్ఘ్యమిస్తున్న విదేశీ భక్తురాలు. మహాకుంభమేళా సందర్భంగా త్రివేణి సంగమ స్థలంలో ఇలాంటి దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి.

ఇంటి బయట పోలీసులు ఇంట్లో మర్డర్

- ఇష్టంలేని పెళ్లి చేసుకోనన్న కూతురు
- కాల్చిచంపిన తండ్రి, బంధువు

గ్వాలియర్(ఎంపీ): గొడవలు వద్దు, కూర్చుని మాట్లాడుకోండని సర్దిచెప్పేందుకు వచ్చిన పోలీసులు ఇంటిబయట ఉండగానే కూతురిని కన్న తండ్రి చంపేసిన ఘటన మధ్యప్రదేశ్‌లో జరిగింది. అమ్మాయి బంధువు సైతం కాల్పులు జరిపినట్లు ఆరోపణలున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్వాలియర్‌లోని గోలా కా మందిర్ ప్రాంతంలో 45 ఏళ్ల మహేశ్ సింగ్ గుర్జార్‌కు 20 ఏళ్ల కూతురు ఉంది. జనవరి 18వ తేదీన ఆమె పెళ్లి జరగాల్సి ఉంది. అయితే తనకిప్పుడు ఈ పెళ్లి ఇష్టంలేదని కుమార్తె చెప్పడంతో మహేశ్ తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. ఎలాగైనా పెళ్లి జరగాల్సిందేనని మహేశ్ మేనల్లుడు రాహుల్ సైతం పట్టుబట్టి ఆమెను ఒప్పించే ప్రయత్నంచేశాడు. ముగ్గురి మధ్య వాగ్వాదం విషయం తెల్సి స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో వాళ్లు హుటాహుటిన పెళ్లింటికి వచ్చేశారు. పెళ్లి ఏర్పాట్లతో ఇళ్లంతా ముస్తాబు చేసిఉండటంతో లోపలికి వెళ్లకుండా మగ, ఆడ కానిస్టేబుల్స్ ఇంటి బయటే వేచి చూస్తున్నారు. ఎంతచెప్పినా పెళ్లికి ఒప్పుకోకపోవడంతో మహేశ్, రాహుల్ ఒక నాటు తుపాకీ, పిస్టల్‌తో అమ్మాయిని కాల్చి చంపారు. నాలుగు బుల్లెట్లను కాల్చారు. బుల్లెట్ల మోతతో హుతాశులైన స్థానికులు, పోలీసులు ఇంట్లోకి పరుగులుతీశారు. అప్పటికే రాహుల్ అక్కడి నుంచి తప్పించుకోగా తండ్రి అక్కడే ఉన్నాడు. రక్తమోడుతున్న అమ్మాయిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించినా అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పారిపోయిన బంధువు రాహుల్‌ను పోలీసులు బుధవారం అరెస్ట్‌చేశారు.

పెట్రోల్ పోయవా? అయితే కరెంట్ కట్

- హెల్మెట్ నిబంధనను అమలుచేసిన పెట్రోల్‌బంక్‌పై లైన్‌మెన్ ఆగ్రహం

లక్నో: రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్రవాహనదారుల మరణాలను నివారించే ఉద్దేశంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెచ్చిన ఒక నిబంధన రాష్ట్రంలోని విద్యుత్ శాఖ లైన్‌మెన్‌కు ఆగ్రహం తెప్పించింది. దీంతో అతను పెట్రోల్‌బంక్‌కు విద్యుత్ సరఫరాను నిలిపేసిన ఘటన హాపూర్ జిల్లా లోని పార్ధాపూర్ రోడ్డులో జరిగింది. హెల్మెట్ ధరిస్తేనే ద్విచక్ర వాహనదారులకు పెట్రోల్‌ను విక్రయించాలనే నిబంధనను అమలుచేయాలని యూపీ సర్కార్ ఆదేశించింది. దీంతో పార్ధాపూర్ రోడ్డులోని ఒక పెట్రోల్‌బంక్ సైతం ఇదే నియమాన్ని పాటిస్తోంది. మంగళవారం ఈ పెట్రోల్‌బంక్‌కు వచ్చిన కరెంట్ డిపార్ట్‌మెంట్ లైన్‌మెన్ పెట్రోల్ అడగ్గా బంక్ సిబ్బంది నిరాకరించారు. హెల్మెట్ ధరించి వస్తేనే బైక్‌కు పెట్రోల్ కొడతామని కరాఖండీగా చెప్పారు. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన లైన్‌మెన్ అక్కడి నుంచి కొంతదూరం వెళ్లి బంక్‌కు విద్యుత్‌సరఫరా అందిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న కరెంట్‌స్తంభం ఎక్కి వైర్‌ను కత్తిరించాడు. దీంతో బంక్‌లో విద్యుత్‌సరఫరా ఆగిపోయింది. దీంతో ఇంధన వినియోగదారుల చాంతడంత క్యూలైన్ ఏర్పడింది. వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అయితే లైన్‌మెన్ కరెంట్ లైన్‌ను కత్తిరించిన విషయం అక్కడి సీసీటీవీలో రికార్డ్‌కావడంతో అది లైన్‌మెన్ పని అని తర్వాత తెలిసింది. వెంటనే స్థానికులు ఫిర్యాదుచేయడంతో విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు.

సేవా తత్పరతే భారతీయ ఆధ్యాత్మిక పరంపర

ఇస్కాన్ ఆలయ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ వ్యాఖ్య

నవీ ముంబై: సేవాగుణంలోనే భారతీయ ఆధ్యాత్మికత మూలాలు దాగున్నాయని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బుధవారం నవీ ముంబై నగరంలోని ఖార్‌ఘర్‌లోని ఇస్కాన్ ఆలయం ప్రారంభోత్సవంలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ''సేవా స్ఫూర్తి లౌకికవాదానికి ప్రతిరూపం. ప్రాచీనకాలం నుంచి మన భారతీయుల్లో ఉన్న సేవా తత్పరతే ఇప్పుడు మన భారతీయ ఆధ్యాత్మిక పరంపరగా కొనసాగుతోంది. భారత్ అంటే భౌగోళిక సరిహద్దుల మధ్య బంధింపబడిన భూభాగంకాదు. ఇది సజీవ సంస్కృతితో ప్రభవిల్లే సజీవ భూమి. జ్ఞానం అ అంటే కూడా ఆధ్యాత్మికతే. భారత్‌ను అవగతం చేసుకోవాలంటే మొదట మనం ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి. కృష్ణుడిని భక్తితో ఆరాధిస్తూ అన్ని దేశాల ప్రజల మధ్య అనుబంధాన్ని పెంపొందిస్తూ భగవద్గీత విశేషాలను ప్రబోధిస్తూ అంతర్జాతీయంగా భక్తి ఉద్యమాన్ని నడిపిస్తున్న ఇస్కాన్‌ను నేను ఆచరిస్తా. భారతీయులకు సాంత్వన చేకూర్చడంతోపాటు వారి యోగక్షేమాల గురించీ ఇస్కాన్ పట్టించుకుంటోంది. నిస్వార్థంగా మానవాళి కోసం పాటుపడటమే నిజమైన సేవ''అని మోదీ అన్నారు.

ఓటర్లకు చెప్పుల పంపిణీ...

బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మపై చర్యలు

న్యూఢిల్లీ: వాల్మీకి ఆలయంలో ఓటర్లకు చెప్పులు పంపిణీ చేసి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మపై చర్యలకు న్యూఢిల్లీ అసెంబ్లీ సెగ్మెంట్ రిటర్నింగ్ అధికారి ఆదేశించారు. అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు అందడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత పోలీసులను ఆదేశించారు. మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్ సమీపంలోని వాల్మీకి ఆలయంలో న్యూఢిల్లీ బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మ ఓటర్లకు చెప్పులు పంపిణీ చేస్తున్నారని న్యాయవాది రజనీష్ భాస్కర్ వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. రెండు వీడియోలను కూడా ఫిర్యాదుదారు కోర్టుకు సమర్పించారు.

హర్యానా బీజేపీ చీఫ్‌పై గ్యాంగ్ రేప్ కేసు

సిమ్లా/చండీగఢ్: సామూహిక అత్యాచారం చేశారంటూ ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో హర్యానా బీజేపీ చీఫ్ మోహన్‌లాల్ బదోలీపై కేసు నమోదైంది. ప్రభుత్వ ఉద్యోగం, మ్యూజిక్ వీడియోలో నటించే అవకాశం కల్పించే విషయమై మాట్లాడతామని చెప్పడంతో 2023 జూలై 3న తన యజమానితోపాటు వెళ్లాలని బాధితురాలు పేర్కొన్నారు. అక్కడ గాయకుడు రాకీతోపాటు ఉన్న బదోలీ తనతో బలవంతంగా మద్యం తాగించే ప్రయత్నం చేశారని, నిరాకరించడంతో అత్యాచారానికి పాల్పడ్డారని ఆమె ఫిర్యాదు చేశారు. ఘటనను వీడియో తీసి ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారని బాధితురాలు పేర్కొన్నారు. రెండు నెలల క్రితం తనను పంచకులలోని రాకీ ఇంటికి పిలిపించారని, అక్కడ తనను తప్పుడు కేసులో ఇరికిస్తామని నిందితులు మరోసారి బెదిరించారని బాధితురాలు ఆరోపించారు. ఫిర్యాదు మేరకు వీరిద్దరిపై సోలన్ జిల్లాలోని కసౌలిలో 2024 డిసెంబర్ 13న ఎఫ్ఐఆర్ నమోదైందని అధికారులు మంగళవారం తెలిపారు. ఎఫ్ఐఆర్ కాపీ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

ఆతిశీపై మరోసారి నోరుపారేసుకున్న బిధూరీ

న్యూఢిల్లీ: ఢిల్లీ బీజేపీ నేత రమేశ్ బిధూరీ.. ఢిల్లీ ముఖ్యమంత్రి, తన ప్రత్యర్థి ఆతిశీపై మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఏళ్ల తరబడి ప్రజలకు ఏమీ చేయని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఇప్పుడు కల్కాజీ నియోజకవర్గం వీధుల్లో లేడిపిల్లలా తిరుగుతున్నారని బుధవారం విమర్శించారు. గతంలోనూ బిధూరీ ఆతిశీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తన ఇంటి పేరును మార్లెనా నుంచి సింగ్‌గా మార్చుకున్నారని, ఆమె తన తండ్రినే మార్చారని వ్యాఖ్యానించారు. ఇక ఈ నెల ప్రారంభంలో కాంగ్రెస్ నాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రాపైనా అనుచితంగా మాట్లాడారు. కల్కాజీలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా బుగ్గల వంటి రోడ్లు నిర్మిస్తానంటూ ఈ నెల ప్రారంభంలో ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. మహిళా నేతలపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయకుండా ప్రచారంపై దృష్టి పెట్టాలని పార్టీ బిధూరీకి సూచించింది. బుధవారం కల్కాజీ అసెంబ్లీ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నీటి కొరత, రోడ్ల దుస్థితికి ముఖ్యమంత్రి, ఆప్ కారణమని ఆరోపించారు. కుంభమేళాలో విడిపోయిన సోదరిని కలుసుకున్నట్లు.. వీధుల్లో కనిపించిన ప్రతి మహిళనూ ఆతిశీ అంటిపెట్టుకుంటోందని వ్యాఖ్యానించారు.

బీఎస్పీ అధినేత్రి మాయావతికి ఉపశమనం

2009 విగ్రహాల కేసును కొట్టేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: బీఎస్పీ అధినేత్రి మాయావతికి సుప్రీంకోర్టు ఉపశమనం కలిగించింది. ఆమె ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఏనుగుల విగ్రహాల ఏర్పాటు, వ్యక్తిగత కీర్తి కోసం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ బడ్జెట్ నుంచి రూ.2,000 కోట్లకు పైగా ఖర్చు చేశారన్న ఆరోపణలపై రవికాంత్, సుకుమార్ అనే ఇద్దరు న్యాయవాదులు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ప్రజాధనాన్ని వృథా చేయడమే కాకుండా ఈసీ జారీ చేసిన సర్క్యులర్లకు విరుద్ధమని న్యాయవాదులు పేర్కొన్నారు. 2019లో అత్యున్నత న్యాయస్థానం నోటీసు జారీ చేసింది. తన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ మాయావతి అఫిడవిట్ దాఖలు చేశారు. గత ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన నేతల విగ్రహాలను, అందుకు చేసిన ఖర్చులను ఆమె ప్రస్తావించారు. స్మారక చిహ్నాల నిర్మాణం, విగ్రహాల ఏర్పాటు భారత్‌కు కొత్తేమీ కాదని ఆమె పేర్కొన్నారు. బుధవారం విచారణ జరిపిన జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ అంశంపై ఎన్నికల సంఘం (ఈసీ) ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసిందని, విగ్రహాలను ఇప్పటికే ఏర్పాటు చేసినందున వాటి ఏర్పాటుపై స్టే ఇవ్వలేమని పేర్కొంది.

ఈఫిల్ టవర్‌పైకి విమానం!

బెడిసికొట్టిన పాక్ ఎయిర్‌లైన్స్ సోషల్ మీడియా యాడ్

- ఇంటర్నెట్లో తీవ్ర విమర్శలు, మీమ్‌లు
- మూర్ఖత్వమంటూ మండిపడ్డ ప్రధాని
- పార్లమెంటులోనూ తీవ్ర చర్చ
- సమగ్ర విచారణకు ప్రధాని ఆదేశం



ఈ ఫొటో చూస్తే ఏం గుర్తొస్తోంది? న్యూయార్క్ జంట టవర్లను విమానాలతో కూల్చేసిన 9/11 ఉగ్ర దాడే కదూ! కానీ నిజానికిది పాకిస్తాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ (పీఐఏ) రూపొందించిన ప్రకటన! భద్రతా ఆందోళనలతో పీఐఏపై విధించిన నిషేధాన్ని నాలుగేళ్ల అనంతరం ఇటీవలే యూరోపియన్ యూనియన్ తొలగించింది. దాంతో పాక్ నుంచి యూరప్‌కు విమాన సర్వీసులు తిరిగి మొదలయ్యాయి. దీనికి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం కల్పించే ప్రయత్నాల్లో భాగంగా పీఐఏ చేసిన ప్రయత్నమిది! కాకపోతే ప్రకటనలో పీఐఏ విమానం నేరుగా పారిస్‌లోని ప్రఖ్యాత ఈఫిల్ టవర్‌పైకి దూసుకెళ్తున్నట్టుగా కనిపిస్తోంది. పైగా, 'పారిస్! ఈ రోజే మేమొచ్చేస్తున్నాం!'అంటూ క్యాప్షన్ కూడా జోడించారు!! అలా అచ్చం అమెరికాపై ఉగ్ర దాడిని గుర్తుకు తెస్తుండటంతో పీఏఐ ప్రకటన పూర్తిగా బెడిసికొట్టింది. యాడ్‌ను 9/11 ఉగ్ర దాడితో పోలుస్తూ నెటిజన్లంతా తీవ్రంగా ఎద్దేవా చేస్తున్నారు. దీనిపై పుట్టుకొచ్చిన మీమ్‌లు సోషల్ మీడియాలో రోజంతా వైరలయ్యాయి. సరదా కామెంట్లు, వ్యంగ్యాస్త్రాలు వెల్లువెత్తుతున్నాయి. పీఐఏకు కొత్త గ్రాఫిక్ డిజైనర్ చాలా అవసరమంటూ రాజకీయ విశ్లేషకుడు ఇయాన్ బ్రెమర్ చెణుకులు విసిరారు.

పార్లమెంటులోనూ ప్రస్తావన!

యాడ్ ఉదంతం అంతర్జాతీయంగా పరువు తీయడంతో తలపట్టుకోవడం పాక్ ప్రభుత్వం వంతయింది. ఇది మూర్ఖత్వానికి పరాకాష్ట అంటూ ప్రధాని షహబాజ్ షరీఫ్ తీవ్రంగా మండిపడ్డారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తుకు కూడా ఆదేశించారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని స్పష్టం చేశారు. పాక్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇసాక్ దార్ అయితే ఈ అంశాన్ని ఏకంగా పార్లమెంటులోనే ప్రస్తావించారు. 'ఫొటోయే చాలా అభ్యంతరకరం మొర్రో అంటే, క్యాప్షన్ మరింత దారుణంగా ఉంది'అంటూ వాపోయారు. ''ప్రధాని కూడా దీనిపై చాల ఆగ్రహంగా ఉన్నారు. ఈ ప్రకటనను ఎవరు అనుమతించారో విచారణలో తేలుతుంది. వారిపై కఠిన చర్యలు తప్పవు''అని చెప్పుకొచ్చారు. న్యూయార్క్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై 2001లో జరిగిన ఉగ్ర దాడిలో 3,000 మందికి పైగా మరణించడం తెలిసిందే. విమానాలను హైజాక్ చేసిన ఉగ్రవాదులు జంట టవర్లను వాటితో ఢీకొట్టారు. దాంతో టవర్లు నేలమట్టమయ్యాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

తొలిసారేమీ కాదు

అర్థంపర్థం లేని ప్రకటనతో అభాసుపాలు కావడం పీఐఏకు కొత్తేమీ కాదు. 2016లో ఇస్లామాబాద్ విమానాశ్రయంలోనే గ్రౌండ్ స్టాఫ్ మేకను బలివ్వడం అంతర్జాతీయంగా పతాక శీర్షికలకెక్కింది. అంతకుముందు 1979లో ఏకంగా పాక్‌కు చెందిన బోయింగ్ 747 విమానం నేరుగా న్యూయార్క్ జంట టవర్లపైకి దూసుకెళ్తున్నట్టుగా పీఐఏ యాడ్ రూపొందించింది. అది తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ గతానుభవాల నుంచి పీఐఏ ఏమీ నేర్చుకోలేదని తాజాగా రుజువైందని నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు. పీఐఏ గ్రాఫిక్స్ హెడ్‌కు చరిత్రకు సంబంధించి క్రాష్ కోర్స్ చేయిస్తే మేలంటూ సలహాలిస్తున్నారు.

వాహనాలకు హోలోగ్రామ్ 'రంగుల' స్టిక్కర్లు ఉండాలి


కాలుష్య నివారణ చర్యలపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కాలుష్య నియంత్రణకు లోబడిన (పీయూసీ) సర్టిఫికెట్ నిబంధనలను మరింత ప్రభావవంతంగా అమలుచేసే చర్యల్లో భాగంగా దేశంలోని అన్ని వాహనాలకు హోలోగ్రామ్ స్టిక్కర్లను అతికించే పద్ధతిని అమలుచేస్తే సబబుగా ఉంటుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ఇలా వేర్వేరు ఇంధనాల వాహనాలకు వేర్వేరు రంగుల హోలోగ్రామ్ స్టిక్కర్లను అతికించాలని సూచించింది. కాలుష్యం ఎక్కువైన సందర్భాల్లో అతికాలుష్యాన్ని వెదజల్లే వాహనాలను గుర్తించడానికి ఈ రంగుల స్టిక్కర్లు అక్కరకొస్తాయని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం అభిప్రాయపడింది.


కోర్టుల ప్రాంగణాల్లో వేర్వేరు టాయిలెట్లు

- మహిళలు, పురుషులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు విడిగా నిర్మించాలి
- రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కోర్టుల ప్రాంగణాల్లో ప్రజా మరుగుదొడ్ల వసతి రాష్ట్ర ప్రభుత్వాల విధి అని సుప్రీంకోర్టు బుధవారం వ్యాఖ్యానించింది. మహిళలు, పురుషులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు విడిగా టాయిలెట్ల సదుపాయం కల్పించేలా రాష్ట్రాలను ఆదేశించాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ధర్మాసనం విచారించింది. ''టాయిలెట్లు కూడా ఏర్పాటుచేయలేని రాష్ట్రాలు తామే సంక్షేమ రాష్ట్రాలమని ప్రకటించుకోవడం సబబు కాదు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బందికి సైతం ఈ టాయిలెట్లు అందుబాటులో ఉన్నాయో లేదో అనే విషయాన్ని హైకోర్టులు పరిశీలిస్తాయి. ఈ అంశంపై సమగ్ర పరిశీలన నిమిత్తం ప్రతి హైకోర్టు పరిధిలో హైకోర్టు చీఫ్ జస్టిస్ సారథ్యంలో మరో జడ్జి, హైకోర్టు రిజిస్ట్రార్/రిజిస్ట్రార్ జనరల్, ప్రజాపనుల శాఖ కార్యదర్శి, రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి, బార్ అసోసియేషన్ ప్రతినిధి సభ్యులుగా ఒక కమిటీని ఆరు వారాల్లోపు ఏర్పాటుచేస్తాం''అని ధర్మాసనం తెలిపింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న టాయిలెట్లు, వారి ప్రస్తుత స్థితి, నిర్వాహణ లోపాలపై కమిటీ సర్వే చేసి నివేదిస్తుంది. కోర్టుల పరిధిలో నూతన టాయిలెట్ల నిర్మాణం, నిర్వహణ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల విధి. నిర్మాణ వ్యయాలనూ అవే భరిస్తాయి. నాలుగు నెలల్లోపు సంబంధిత నివేదికలను రాష్ట్రాలు/యూటీల హైకోర్టులకు అందించాలి''అని సుప్రీంకోర్టు ఆదేశించింది.







ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఇందిరాభవన్‌ను పార్టీ అగ్ర నేత సోనియాగాంధీ బుధవారం ఢిల్లీలో ప్రారంభించారు. భవనం, హాలు, లోపలి ప్రాంగణం, సమావేశ మందిరం, కార్యాలయ గదులు అత్యాధునిక శైలిలో ఇలా అలరిస్తున్నాయి.

కేన్సర్ నుంచి బయటపడ్డాను: కేట్ మిడిల్టన్

చికిత్స అందించిన ఆస్పత్రిని సందర్శించిన బ్రిటన్ యువరాణి

లండన్: తాను కేన్సర్‌ను జయించానని బ్రిటన్ యువరాణి కేట్ మిడిల్టన్ ప్రకటించారు. తనకు కేన్సర్ చికిత్స అందించిన లండన్‌లోని రాయల్ మార్స్‌డెన్ ఆసుపత్రిని మంగళవారం ఆమె సందర్శించారు. గత ఏడాది కాలంగా తనను సేవలందించిన నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్హెచ్ఎస్) సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ''ఈ ఏడాది కాలంగా విలియం, నాతో కలిసి నిశ్శబ్దంగా నడిచిన వారందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఒక రోగిగా ఈ కాలంలో నేను అసాధారణమైన సంరక్షణ, సలహాలు పొందాను. ఎంతో ఉపశమనం పొందాను. కేన్సర్‌ను అనుభవించినవారికే ఇది తులుస్తుంది. ఇప్పుడు కోలుకోవడంపై దృష్టి పెట్టాను. ఈ సంవత్సరం గొప్పగా ఉంటుందని ఆశిస్తున్నా''అని కేట్ ప్రకటించారు. మార్చిలో తాను కేన్సర్‌కు కీమో థెరపీ చికిత్స చేయించుకున్నట్లు కేట్ వెల్లడించారు. గత గురువారం 43వ పుట్టిన రోజు జరుపుకొన్న కేట్.. ''అద్భుతమైన భార్య, తల్లి. గత ఏడాది కాలంగా మీరు చూపించిన బలం అమోఘం''అని ప్రిన్స్ విలియం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రపంచంలోనే మొట్టమొదటి కేన్సర్ ఆసుపత్రిగా రాయల్ మార్స్‌డెన్‌ను 1851లో ప్రారంభించారు. దీనికి బ్రిటన్ రాజవంశీయులు దాతలుగా ఉన్నారు. దీనికి 2007 నుంచి ప్రిన్స్ విలియం అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. గతంలో వేల్స్ యువరాణి అయిన అతని తల్లి డయానా ఈ పాత్రను నిర్వహించారు.

గర్భస్రావం సహా రాజ్యాంగ హక్కుల సవరణలకు వర్జీనియా ఆమోదం

రిచ్‌మండ్: అబార్షన్, ఓటింగ్, వివాహ సమానత్వం వంటి హక్కుల రాజ్యాంగ సవరణలను ప్రతిపాదిస్తూ రూపొందించిన తీర్మానాలను వర్జీనియా ప్రతినిధుల సభ మంగళవారం ఆమోదించింది. డెమొక్రాట్లకు 51-49 మెజారిటీ ఉన్న ఛాంబర్ ప్రతిపాదిత మూడు రాజ్యాంగ సవరణలను ప్రతిపాదించగా.. సభ ఆమోదించింది. 2022 నుంచి ఇప్పటివరకు అమెరికా వ్యాప్తంగా 18 మార్లు సంబంధిత ప్రశ్నలు ఓటర్ల ముందుకు రాగా, 14 సార్లు అబార్షన్ హక్కుల న్యాయవాదుల పక్షాన నిలిచాయి. అబార్షన్ హక్కు కల్పించే రాజ్యాంగ సవరణలను అరిజోనా, కాలిఫోర్నియా, కొలరాడో, మేరీల్యాండ్, మిషిగాన్, మిస్సోరి, మోంటానా, ఓహియో, వెర్మాంట్ రాష్ట్రాల్లోని ఓటర్లు ఆమోదించారు. 2024లో నెవాడాలో అబార్షన్ హక్కు చట్టాన్ని కూడా ఓటర్లు ఆమోదించారు. అయితే రాజ్యాంగంలో చేర్చడానికి దీనిని 2026లో మళ్లీ ఆమోదించాలి. దీంతో నేరాలకు శిక్షలు అనుభవించిన వారికి ఓటు హక్కును పునరుద్ధరించడానికి వర్జీనియా చట్టసభ సభ్యులు ఓటు వేశారు. నేరం రుజువైన వారిని ఓటు వేయకుండా శాశ్వతంగా నిషేధించిన ఏకైక రాష్ట్రం వర్జీనియా. దీనిని డెమోక్రాట్లు అవశేషంగా అభివర్ణించారు. సభ ఆమోదం పొందిన తీర్మానం వివాహ సమానత్వ సవరణ. ఈ తీర్మానం అభివృద్ధి చెందుతున్న వర్జీనియాను ప్రతిబింబిస్తుందని డెమొక్రాట్లు వ్యాఖ్యానించారు. బరాక్ ఒబామా ఒకప్పుడు స్వలింగ వివాహాలను వ్యతిరేకించారని, ఆ తర్వాత ఆయనా మారారని, ప్రతి ఒక్కరిలో మార్పు వచ్చే అవకాశం ఉందన్నారు.

గ్రీస్ అధ్యక్షుడిగా కాన్‌స్టాంటిన్ టాసొలాస్

ప్రతిపాదించిన ప్రధాని కిరియాకోస్

ఏథెన్స్: గ్రీస్ తదుపరి అధ్యక్షుడిగా ప్రస్తుత పార్లమెంట్ స్పీకర్ కాన్‌స్టాంటిన్ టౌసొలాస్‌ను ప్రధాని కిరియాకోస్ మిట్సోటాకిస్ ప్రతిపాదించారు. సెంట్రల్-రైట్ న్యూ డెమొక్రసీ పార్టీకి చెందిన టాసొలాస్ 2019 నుంచి గ్రీస్ పార్లమెంట్ స్పీకర్‌గా పనిచేస్తున్నారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన గతంలో సాంస్కృతిక, క్రీడల మంత్రిగా, ఉప రక్షణ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. గ్రీస్ దేశాధ్యక్షుడిని 300 మంది చట్టసభ సభ్యులు ఎన్నుకుంటారు. ఐదు రౌండ్లలో జరగనున్న ఎన్నికల ప్రక్రియ జనవరి 25న ప్రారంభం కానుంది. మొదటి లేదా రెండవ రౌండ్‌లో గెలవడానికి ఒక అభ్యర్థికి 200 ఓట్లు అవసరం, మూడవ రౌండ్‌లో 180, నాల్గవ రౌండ్‌లో 151 పార్లమెంటరీ మెజారిటీ ఉంటే సరిపోతుంది. ప్రస్తుతం అధికార న్యూడెమొక్రసీ పార్టీకి 156 స్థానాలు ఉండగా, సెంట్రల్ లెఫ్ట్ పీఏఎస్ఓకేకు 31, లెఫ్ట్ వింగ్ సిరిజాకు 26 స్థానాలు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే ఐదేళ్లపాటు పదవిలో ఉంటారు.

రష్యా క్షిపణి దాడులు..

ఉక్రెయిన్‌లో విద్యుత్ కోతలు

కీవ్: ఉక్రెయిన్ మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని రష్యా దాడులకు పాల్పడుతోంది. రష్యా భారీ వైమానిక దాడులతో ఉక్రెయిన్ తీవ్రమైన విద్యుత్ కోతలను ఎదుర్కొంటోంది. విద్యుత్ మౌలిక సదుపాయాలపై రష్యా భారీ దాడుల నేపథ్యంలో నివారణ చర్యలుగా విద్యుత్ కోతలను అమలు చేయాల్సి వస్తోందని ఉక్రెయిన్ విద్యాశాఖ మంత్రి హెర్మన్ హలుష్చెంకో తెలిపారు. శత్రువులు ఉక్రేనియన్లను భయభ్రాంతులకు గురి చేస్తూనే ఉన్నారని, ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలు షెల్టర్లలో ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పశ్చిమ లీవ్ ప్రాంతంలోని విద్యుత్ మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని రష్యా దళాలు బుధవారం తెల్లవారుజామున క్రూయిజ్ క్షిపణి దాడులను ప్రారంభించాయని నగర మేయర్ ఆండ్రి సడోవి తెలిపారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు.

సముద్రగర్భ కేబుల్స్ రక్షించడానికి నాటో కొత్త మిషన్

బ్రస్సెల్స్: బాల్టిక్ సముద్ర ప్రాంతంలో సముద్రగర్భ కేబుల్స్‌ను రక్షించడానికి కొత్త మిషన్‌ను ప్రారంభిస్తున్నట్లు నాటో తెలిపింది. వ్యూహాత్మక ప్రాంతంలో రష్యా విధ్వంసం, గూఢచర్యం భయాల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంటున్నట్టు సెక్రటరీ జనరల్ మార్క్ రూటే తెలిపారు. బాల్టిక్ సముద్రంలో సముద్రగర్భ కేబుల్స్ విధ్వంసంతో సహా సైబర్ దాడులు, హత్యా ప్రయత్నాలు, విధ్వంసం ద్వారా నాటో దేశాల్లో అస్థిరపరిచే ప్రయత్నం జరుగుతోందన్నారు. రష్యా షాడో ఫ్లీట్‌కు చెందిన ఒక నౌక నార్వే నుంచి పోలాండ్ వరకు ఉన్న సహజ వాయువు పైప్‌లైన్ చుట్టూ తిరుగుతున్నట్లు వార్తలొచ్చిన నేపథ్యంలో మిషన్‌ను రూపొందించారు. అనుమానాస్పద నౌకలపై నిఘా, ట్రాకింగ్ కోసం కొత్త సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి, సముద్రగర్భ పర్యవేక్షణ ప్రారంభించడానికి బాల్టిక్ దేశాల నేతలతో ఆయన సమావేశమయ్యారు. తమ భద్రత, మౌలిక సదుపాయాలు, పర్యావరణానికి ముప్పు కలిగించే అనుమానాస్పద నౌకలపై అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఫిన్లాండ్, జర్మనీ, పోలాండ్, డెన్మార్క్, స్వీడన్, లాట్వియా, లిథువేనియా, ఎస్టోనియా దేశాధినేతలు పాల్గొన్నారు. బాల్టిక్ సముద్రగర్భంలో కీలకమైన ఇంటర్నెట్ ట్రాఫిక్ వ్యవస్థ ఉంది. 1.3 మిలియన్ కిలోమీటర్ల కేబుళ్ల ద్వారా విస్తరించింది. ప్రతిరోజూ ట్రిలియన్ డాలర్ల విలువైన ఆర్థిక లావాదేవీలు ఈ వ్యవస్థ ద్వారా జరుగుతాయి.

భారత సైన్యానికి రాష్ట్రపతి, ప్రధాని శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: భారత సైనిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సైనికులకు, వారి కుటుంబాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోదీ బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. మాతృభూమి కోసం వారు చేసిన త్యాగాలను దేశం కృతజ్ఞతతో స్మరించుకుంటుందని వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ''ఆర్మీ డే సందర్భంగా భారత ఆర్మీ సిబ్బందికి, వారి కుటుంబాలకు శుభాకాంక్షలు. దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించడంలో, జాతీయ భద్రతను నిర్ధారించడంలో మీ అచంచల నిబద్ధత అందరికీ స్ఫూర్తిదాయకం. మీ అసాధారణ ధైర్య సాహసాలు రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటున్నా''అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. భారత సైన్యం సంకల్పం, అంకితభావాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. సాయుధ దళాలు, వారి కుటుంబాల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని నొక్కిచెప్పారు. ''ఈ రోజు ఆర్మీ డే సందర్భంగా దేశ భద్రతకు కాపలాదారుగా నిలిచే భారత సైన్యం అచంచల ధైర్యసాహసాలకు సెల్యూట్ చేస్తున్నాం. ప్రతిరోజూ కోట్లాది మంది భారతీయుల భద్రతకు భరోసా ఇచ్చే ధైర్యవంతుల త్యాగాలను కూడా స్మరించుకుంటున్నాం. భారత సైన్యం దృఢ సంకల్పానికి, ప్రొఫెషనలిజానికి, అంకితభావానికి ప్రతీక. సరిహద్దులను కాపాడుకోవడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల సమయంలో మానవతా సహాయం అందించడంలో తనదైన ముద్ర వేసింది''అని ఎక్స్ వేదికగా ఆయన కొనియాడారు.

వర్తకం కోసం వచ్చి పెత్తనం సాగించిన వలసవాదులు

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

ఆధునిక భారతదేశ చరిత్ర

వాస్కోడిగామా చూపిన మార్గంలో అనేక మంది పోర్చుగీసు వర్తకులు భారతదేశానికి వచ్చారు. 1503లో ఫ్రాన్సిస్-డి-అల్మీడా భారతదేశంలోని పోర్చుగీస్ స్థావరాలకు మొదటి గవర్నర్‌గా నియామకమయ్యాడు. ఇతడు నీలి నీటి విధానం (Blue Water Policy)ను విస్తరింపజేశాడు. ఆల్ఫెన్సో-డి-ఆల్బుకర్క్ 1509 నుంచి 1515 వరకు భారత్‌లో రెండో పోర్చుగీసు గవర్నర్‌గా పని చేశాడు. ఇతడు పోర్చుగీస్ సామ్రాజ్యానికి పునాదులు వేశాడు. గోవాను, పర్షియా సింధుశాఖలోని హార్మోజ్‌ను 1510లో ఆక్రమించాడు.

ఆంగ్లేయుల రాక..

భారతదేశంలో మొదటిసారి అడుగుపెట్టిన ఆంగ్లేయుడు ఫాదర్ థామస్ స్టీవెన్స్. ఇతడు 1579లో గోవా చేరాడు. 1600లో ఎలిజబెత్ రాణి (లండన్) అనుమతితో భారతదేశంలో వాణిజ్యం చేయడానికి 'ఈస్టిండియా కంపెనీ'ని స్థాపించాడు. 1611లో కెప్టెన్ జేమ్స్ హాకిన్స్ భారతదేశం వచ్చి మొదటి జేమ్స్ ఉత్తరంతో మొగలు పాదుషా జహంగీర్‌ను కలుసుకున్నాడు. జహంగీర్ అనుమతితో



ఇతడు 1612లో సూరత్‌లో మొదటి కర్మాగారం స్థాపించాడు. తర్వాత అహ్మదాబాద్, ఆగ్రా, హుబ్లీ, కాశింబజార్, ఢాకాలో కర్మాగారాలు ఏర్పాటు చేశాడు. ఆంగ్లేయులు భారతదేశంలో ప్రధానంగా దుస్తులు, నల్లమందు వ్యాపారం చేసేవారు.

పోర్చుగీసువారితో బ్రిటిషర్లకు ఆధిపత్య పోరు మొదలైంది. 1614లో ఈస్టిండియా కంపెనీవారు పోర్చుగీసువారిని 'సూరత్' సమీపంలో ఓడించారు. 1618లో మొదటి జేమ్స్ రాయబారిగా సర్ థామస్ (1615-19) జహంగీర్ ఆస్థానానికి వచ్చి రెండు 'ఫర్మానా'లు పొందాడు. వీటిలో మొదటిది భారతదేశంలో వాణిజ్యం చేసుకోవడానికి అనుమతించడం. రెండోది స్వదేశీ వాణిజ్యంపై సుంకాలు తగ్గించడం.

దక్షిణ భారతదేశంలో మొదటి కర్మాగారాన్ని మచిలీపట్నంలో స్థాపించారు. 1641లో సెయింట్-జార్జికోట (మద్రాసు) ను నిర్మించారు. 1654లో ఇంగ్లిష్ కంపెనీ వాణిజ్య ఆధిపత్యాన్ని పోర్చుగీస్ గుర్తించింది. 1661లో పోర్చుగీస్ వారు బ్రిటిష్ రాజైన రెండో చార్లెస్‌కు బొంబాయిని కట్నంగా ఇచ్చారు. 1698లో ఈస్టిండియా కంపెనీ సత్నాటి, కాలికట, గోవిందపూర్ ప్రెసిడెన్సీల్లో జమీందారీ హక్కులు పొందింది.

ఆ తర్వాత ఈ మూడు ప్రెసిడెన్సీలను కలిపి 'కలకత్తా' నగరాన్ని ఏర్పాటు చేశారు. 1690లో జాబ్ చార్నాక్ కలకత్తాకు శంకుస్థాపన చేశాడు. 1696లో ఇక్కడ జార్జి విలియం కోట నిర్మాణం మొదలైంది. 1746 నుంచి 1763 వరకు బ్రిటిషర్లు, ఫ్రెంచివారి మధ్య ఆధిపత్యం కోసం మూడు కర్ణాటక యుద్ధాలు జరిగాయి. ఇందులో మూడో కర్ణాటక యుద్ధం (1758-63) ముఖ్యమైంది. 1760లో వాండివాష్ యుద్ధంలో ఇంగ్లిషువారు, ఫ్రెంచివారిని ఓడించి పూర్తి ఆధిపత్యం సాధించారు. 1756లో బెంగాల్ నవాబైన సిరాజుద్దౌలా కలకత్తా పోర్టును ఆక్రమించి చీకటి గది ఉదంతానికి కారకుడయ్యాడు. 1757లో ప్లాసీ యుద్ధంలో సిరాజుద్దౌలాను ఓడించి ఇంగ్లిషువారు కలకత్తాను తిరిగి ఆక్రమించుకున్నారు. 1759లో ఇంగ్లిష్ కంపెనీవారు డచ్‌వారిని బెదరా యుద్ధంలో ఓడించారు. 1764 బక్సార్ యుద్ధం విజయంతో ఉత్తర భారతంలో బ్రిటిషర్ల ఆధిపత్యానికి తిరుగులేకుండా పోయింది. ఈ విజయం కారణంగా 1767లో బెంగాల్‌లో ద్వంద్వ ప్రభుత్వం ఏర్పాటైంది.


1664లో ఫ్రెంచ్ ఈస్టిండియా కంపెనీని 14వ లూయీ మంత్రి కోల్బర్ట్ స్థాపించాడు. 1667లో ఫ్రాంకోయిస్ కరన్ 'సూరత్' ఫ్యాక్టరీని స్థాపించాడు. ఫ్రాన్సిస్కో మార్టిన్ 1673లో ముస్లిం గవర్నర్ నుంచి అనుమతి పొంది పాండిచ్చేరికి పునాదులు వేశాడు. ఇతడు 1764లో గవర్నర్‌గా నియమితుడయ్యాడు. ఫ్రెంచ్‌వారు 1674లో షాయిస్థాఖాన్ నుంచి అనుమతి పొంది బాలాసోర్, కాశిం బజార్, చంద్రనాగూర్ వద్ద ఫ్యాక్టరీలు నిర్మించుకున్నారు. 1674లో డూప్లే పాండిచ్చేరి గవర్నర్‌గా నియమితుడయ్యాడు. ఇతడు రెండు ఆస్ట్రియా వారసత్వ యుద్ధాలు చేశాడు.

డచ్ కంపెనీ

డచ్చివారు యూరప్‌లోని హాలెండ్ (నెదర్లాండ్స్) దేశానికి చెందినవారు. వీరు 1602లో డచ్ ఈస్టిండియా కంపెనీ స్థాపించారు. వీరు తూర్పు ఇండియా సుగంధ దీవులపై దృష్టి కేంద్రీకరించారు. 1604లో గోల్కొండ నవాబు అనుమతితో మచిలీపట్నంలో మొదటి డచ్చి వర్తక స్థావరం ఏర్పాటు చేశారు. 1610లో పులికాట్ వద్ద స్థావరాన్ని నిర్మించుకున్నారు.


గవర్నర్ జనరల్స్

వారన్ హేస్టింగ్స్ (1772-85)




వారన్ హేస్టింగ్స్ 1772లో బెంగాల్ గవర్నర్‌గా నియమితులయ్యాడు. ఇతడు 1773 నుంచి 1785 వరకు గవర్నర్ జనరల్‌గా పనిచేశాడు. 1773లో ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దు చేశాడు. 1773లో రెగ్యులేటింగ్ చట్టం చేశారు. దీంతో కంపెనీకి తూర్పుదేశ వర్తకంపై గుత్తాధిపత్యం లభించింది. వారన్ హేస్టింగ్స్ రాజధానిని ముర్షిదాబాద్ నుంచి కలకత్తాకు మార్చాడు. సివిల్ న్యాయస్థానానికి కలెక్టరును, క్రిమినల్ న్యాయస్థానానికి భారతీయుడిని న్యాయాధిపతిగా నియమించాడు. న్యాయ సంస్కరణలలో భాగంగా ముఖ్యంగా జిల్లాల్లో 'దివానీ', 'ఫౌజ్‌దారీ' అదాలత్‌లను ప్రవేశపెట్టాడు. ప్రెసిడెన్సీ (కలకత్తా)లలో సాదర్, దివానీ సాదర్, నిజామత్ అదాలత్‌లను ఏర్పాటు చేసి హిందూ, ముస్లిం చట్టాలు అమలు చేశాడు. 1784లో బ్రిటిషర్లు పిట్స్ ఇండియా చట్టం చేశారు.

కారన్ వాలిస్ (1786-93)



ఇతడు సివిల్ సర్వీసులను ప్రవేశపెట్టాడు. ప్రభుత్వ యంత్రాంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టాడు. వివిధ స్థాయిల్లో కోర్టులను ఏర్పాటు చేశాడు. న్యాయ శాఖ నుంచి పరిపాలన శాఖను వేరుపరిచాడు. 1793లో శాశ్వత శిస్తు విధానం ప్రవేశపెట్టాడు. న్యాయ విచారణ పద్ధతిని రాయించాడు. న్యాయ పద్ధతిపై కారన్ వాలీస్ కోడ్‌ను పొందుపరిచాడు. మూడో మైసూర్ యుద్ధంలో టిప్పుసుల్తాన్‌ను ఓడించి రాజ్యంలో సగభాగాన్ని తీసుకున్నాడు.

సర్ జాన్‌షోర్ (1793-98)



శాశ్వత శిస్తు విధానంలో ఇతడి పాత్ర ప్రధానమైంది. జాన్‌షోర్ కాలంలో బ్రిటిష్ పార్లమెంట్ 1793లో చార్టర్ చట్టం చేసింది.

లార్డ్ వెల్లస్లీ (1798-1805)

ఇతడు ఉద్యోగుల శిక్షణ కోసం 1800లో పోర్ట్ విలియం కళాశాల స్థాపించాడు. సంస్థానాధీశులను సామంతులుగా చేసుకున్నాడు. నాలుగో మైసూర్ యుద్ధంలో టిప్పుసుల్తాన్‌ను ఓడించాడు. 1798లో సైన్య సహకార పద్ధతిని ప్రవేశపెట్టాడు. దీనికి మొదటగా హైదరాబాద్ నిజాం అంగీకరించి ఒప్పందం చేసుకున్నాడు. వెల్లస్లీ రెండో మరాఠా యుద్ధం చేశాడు. ఇతడి కాలంలో మద్రాస్ ప్రెసిడెన్సీ ఏర్పడింది.

- 1805 నుంచి 1807 వరకు జార్జ్‌బార్లో గవర్నర్ జనరల్‌గా పని చేశాడు. ఇతడి కాలంలో వెల్లూరు తిరుగుబాటు జరిగింది.

మొదటి లార్డ్ మింటో (1807-1813)

ఇతడి కాలంలో 1813లో చార్టర్ చట్టం చేశారు. రంజిత్ సింగ్‌తో అమృత్‌సర్ ఒప్పందం చేసుకున్నాడు.

లార్డ్ హేస్టింగ్స్ (1813-1823)

ఇతడు నేపాల్ యుద్ధం, మూడో మరాఠా యుద్ధం చేశాడు. పీష్వా పదవి రద్దు చేశాడు. బొంబాయి ప్రెసిడెన్సీ ఏర్పాటు చేశాడు. పిండారులు అనే దారి దోపిడీదారులను అదుపులోకి తెచ్చాడు. బొంబాయి, మద్రాసులో రైత్వారీ పద్ధతి అమలుపరిచాడు. దీనికి సర్ థామస్ మన్రో, ఎల్ఫిన్‌స్టోన్ సహకరించారు. 1817లో కలకత్తాలో ఆంగ్ల మాధ్యమంలో బోధించే హిందూ కళాశాలను స్థాపించాడు. 1813 చట్టంతో ఇంగ్లిష్ ఈస్టిండియా కంపెనీకి చైనాతో పూర్తి స్వేచ్ఛా వాణిజ్యం చేసుకునే వెసులుబాటు కలిగింది. హేస్టింగ్స్ 1799లో పత్రికలపై ఆంక్షలు రద్దు చేశాడు.

లార్డ్ అమ్హెర్స్ట్ (1823-1828)

ఇతడి కాలంలో మొదటి బర్మా యుద్ధం జరిగింది. భరత్‌పూర్‌ను ఆక్రమించాడు.

విలియం బెంటింక్ (1828-1835)

ఇతడు గవర్నర్ జనరల్లలో గుర్తింపు పొందిన వాడు. విలియం బెంటింక్ 'థగ్గులు' అనే దారి దోపిడీ దొంగలను అణచివేశాడు. మైసూర్ రాజును పదవి నుంచి తొలగించాడు. కాచర్, జైంషియా, కూర్గ్‌ను ఆక్రమించాడు. 1828లో బెంగాల్ రాష్ట్రానికే కాకుండా భారతదేశమంతటికీ గవర్నర్ జనరల్‌గా నియమితుడయ్యాడు. 1829లో సతీసహగమనాన్ని నిషేధించాడు. పురిటిలో ఆడ పిల్లలను చంపడం లాంటి దురాచారాలను అదుపు చేశాడు. భారతీయులు ఉన్నత ఉద్యోగాలకు అర్హులని ప్రకటించాడు. బెంటింక్ కలకత్తాలో వైద్య కళాశాలను స్థాపించాడు. 1835లో మెకాలే అధ్యక్షతన న్యాయ సంఘాన్ని నియమించాడు. దీనికి సంబంధించి ఇంగ్లిష్ భాషలో విద్యా బోధన ప్రవేశపెట్టాడు. 1833లో చార్టర్ చట్టంతో స్వేచ్ఛా వాణిజ్యాన్ని ఎత్తేశారు.

- 1835 నుంచి 1836 వరకు సర్ చార్లెస్ మెట్‌కాఫ్ గవర్నర్ జనరల్‌గా పని చేశాడు.
- 1836-42 మధ్య లార్డ్ ఆక్లాండ్ గవర్నర్ జనరల్‌గా ఉన్నాడు. ఇతడు అఫ్గానిస్తాన్‌లో బ్రిటిషర్ల పరాజయం ఫలితంగా పదవి కోల్పోయాడు.

లార్డ్ ఎలెన్‌బరో (1842-44)

ఇతడు సింధ్‌ను బ్రిటిష్ ఇండియాలో విలీనం చేశాడు. ఇతడి కాలంలో మొదటి అఫ్గాన్ యుద్ధం ముగిసింది. ఇతడు గ్వాలియర్ యుద్ధం చేశాడు.

మొదటి లార్డ్ హార్డింజ్ (1844-48)

ఇతడి కాలంలో మొదటి సిక్కు యుద్ధం జరిగింది. ఆంగ్ల మాధ్యమంలో చదివిన భారతీయులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాడు. ఇతడు నరమేథాన్ని అణచివేశాడు.

లార్డ్ డల్హౌసి (1848-56)

ఇతడు రెండో సిక్కు యుద్ధం తర్వాత పంజాబ్‌ను ఆక్రమించాడు. రెండో బర్మా యుద్ధం తర్వాత బర్మా దిగువ ప్రాంతాన్ని ఆక్రమించాడు. రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి సతారా, సంబల్‌పూర్, ఝాన్సీ, నాగ్‌పూర్‌ను ఆక్రమించాడు. అయోధ్యను ఆక్రమించాడు. ఇతడి హయాంలో వితంతు పునర్వివాహ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఇతడి కాలంలో సంతాలులు తిరుగుబాటు చేశారు. ప్రతి రాష్ట్రంలో పబ్లిక్ వర్క్స్ శాఖను ప్రవేశపెట్టారు. 1854లో చార్లెస్ ఉడ్స్ అధ్యక్షుడిగా విద్యకు సంబంధించిన అంశాలపై కమిటీ ఏర్పాటు చేశాడు. ఈ కమిటీ సూచనలతో విద్యాలయం నుంచి విశ్వవిద్యాలయాల వరకు కీలక సంస్కరణలు ప్రవేశపెట్టాడు. 1853లో రైళ్లు, తంతితపాలా, రోడ్డు రవాణా సౌకర్యాలు ప్రవేశపెట్టాడు. బొంబాయి నుంచి థానే వరకు మొదటి రైల్వే లైన్ వేశారు. కలకత్తా నుంచి పెషావర్ వరకు మొదటి తంతి నిర్మించాడు. 1854లో మొదటిసారిగా తపాలా బిళ్లలను ప్రవేశపెట్టాడు. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేశాడు. 1853లో చార్టర్ చట్టంతో పోటీ పరీక్షలను ప్రవేశపెట్టారు. ఈ చట్టం వ్యాపార సంస్థలకు.. వ్యాపారంలో తప్ప మిగతా విషయాలతో సంబంధం లేకుండా చేసింది. 1854లో బొంబాయిలో మొదటి నూలు మిల్లు, కలకత్తాలో జనపనార మిల్లును స్థాపించారు.

లార్డ్ కానింగ్ (1856-62)

1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత బ్రిటిష్ పార్లమెంట్ 1858లో ఒక చట్టం చేసింది. దీని ప్రకారం బ్రిటిష్ ఇండియాలో 'వైస్రాయ్' పదవిని ఏర్పాటు చేశారు. లార్డ్ కానింగ్ 1858 చట్టం ప్రకారం తొలి రాజప్రతినిధిగా నియమితులయ్యాడు. 1861లో ఇండియా కౌన్సిళ్ల చట్టం ప్రవేశపెట్టారు. 1859లో రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని రద్దు చేశారు. 1858లో భారత శిక్షాస్మృతి, 1861లో హైకోర్టు చట్టాన్ని ప్రవేశపెట్టారు. 1865లో లారెన్స్ మూడు హైకోర్టులను స్థాపించాడు. 1857లో కానింగ్ కలకత్తా, బొంబాయి, మద్రాసులో విశ్వవిద్యాలయాలు స్థాపించాడు. ఇతడి కాలంలో 1859లో శ్వేత సైనికుల విప్లవం, 1860లో నీలి మందు రైతుల తిరుగుబాటు, 1863లో పాబ్నా రైతుల తిరుగుబాటు చెలరేగాయి.

మానవ శరీరంలో అతి కఠిన భాగం?

అస్థిపంజర వ్యవస్థ

అస్థిపంజరం.. ఎముకలతో నిర్మితమైన చట్రం. దీనిలో కొన్ని మృదులాస్థి నిర్మాణాలు కూడా ఉంటాయి. దేహభాగాలకు నిర్దిష్టమైన ఆకృతి, దృఢత్వాన్ని, మెదడు, గుండె, ఊపిరితిత్తులకు రక్షణనిస్తూ శరీర కదలికల్లో అస్థిపంజర వ్యవస్థ ప్రధాన పాత్ర పోషిస్తుంది. మానవుడి దేహంలోని మొత్తం ఎముకలన్నింటినీ కలిపి అస్థిపంజరం అంటారు. అస్థిపంజరం అధ్యయనాన్ని ఆస్టియాలజీ అంటారు. ఎముకల్లో ఉండే ప్రొటీన్ ఆస్టిన్. మానవుడి అస్థిపంజరంలో 206 ఎముకలు ఉంటాయి.

ఎముకలను ఏర్పర్చే కణాలు ఆస్టియోసైట్స్. ఎముకల్లో ఉండే మూలకాలు కాల్షియం, ఫాస్పరస్. ఎముకల్లో కాల్షియం ఫాస్ఫేట్ ఎక్కువగా, కాల్షియం కార్బొనేట్ తక్కువగా ఉంటుంది. కాల్షియం ఎముకకు దృఢత్వాన్నిస్తుంది. మానవ శరీరంలో అత్యధికంగా ఉండే మూలకం కాల్షియం. పాలు, గుడ్లు, ఆకుకూరల్లో కాల్షియం అధికంగా లభిస్తుంది. విటమిన్-డి కూడా చర్మం, ఎముకల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. ఎముకల మధ్య భాగంలో అస్థిమజ్జ ఉంటుంది. ఎరుపు రంగు అస్థిమజ్జ ఎర్ర రక్తకణాల (ఆర్‌బీసీ)ను ఉత్పత్తి చేస్తుంది.

పక్షుల ఎముకల్లో అస్థిమజ్జ ఉండదు. వీటిలో గాలి ఉంటుంది. వీటిని వాతులాస్థులు (న్యూమాటిక్ బోన్స్) అంటారు. పక్షుల్లో ఆర్‌బీసీలను ఉత్పత్తి చేసే అవయవం బర్సా.

అస్థిపంజరం - రకాలు

1) బాహ్యాస్థిపంజరం
2) అంతరాస్థిపంజరం.

బాహ్యాస్థిపంజరం

బాహ్యాస్థిపంజరం జీవి దేహం బయట ఉంటుంది. **వివిధ జీవుల్లోని బాహ్యాస్థిపంజరం..**

1) చేపలు - పొలుసులు
2) పక్షులు - ఈకలు
3) కోడిగుడ్లు - పెంకు
4) నత్తలు, ఆల్చిప్పలు, ప్రవాళాలు (కోరల్స్)- కర్పరం
5) కీటకాలు - క్యూటికల్
6) సకశేరుకాలు - రోమాలు, నఖాలు, కొమ్ములు, గిట్టలు మొదలైనవి. వీటిలో ఉండే ప్రొటీన్ ఆల్ఫాకెరాటిన్.

నోట్: క్యారెట్‌లోని విటమిన్-ఏను బీటా కెరోటిన్ అంటారు. గోర్లను కత్తిరించినప్పుడు నొప్పి, బాధ అనిపించకపోవడానికి కారణం అవి మృతకణజాలంతో తయారైన కొమ్ము వంటి పదార్థంతో ఏర్పడటం.

అంతరాస్థిపంజరం

అంతరాస్థిపంజరం దేహం లోపల ఉంటుంది. అస్థిపంజరంలోని ఎముకలు రెండు రకాలు. ఎ) మృదులాస్థి బి) అస్థి

మృదులాస్థి

మెత్తగా ఉండే ఎముకలను మృదులాస్థి ఎముకలు అంటారు. పిండదశలో ఎముకలన్నీ మృదులాస్థి నిర్మితాలు. శిశువు ఎదిగిన తర్వాత ఈ మృదులాస్థులు అస్థులుగా రూపొందుతాయి. మృదులాస్థిలో ఉండే ప్రొటీన్ 'కాండ్రిన్'. మృదులాస్థి అధ్యయనాన్ని కాండ్రాలజీ అంటారు.

మృదులాస్థి ఉండే భాగాలు..

1) ముక్కుకొన (నాసికాగ్రం)
2) వెలుపలి చెవి
3) వాయునాళంలోని 'సి' ఆకారపు ఉంగరాలు
4) కొండనాలుక
5) అంగిలి (ఇది నాసికాకుహారం, ఆస్యకుహారాన్ని వేరు చేస్తుంది)
6) సొరచేప అస్థిపంజరం

షార్క్ చేప కాలేయ నూనెలో విటమిన్ - ఎ, డిలు లభిస్తాయి.

అస్థి (బోన్)

అస్థి అంటే దృఢంగా ఉండే ఎముక.
చిన్నపిల్లల్లో 300 పైగా ఎముకలు ఉంటాయి.

	శరీర భాగం	ఎముకల సంఖ్య
1.	తల హయాయిడ్	29 (పుర్రె-22 ఎముక-1, రెండు చెవులు-6)
2.	వెన్నుపూసలు	26 (చిన్నపిల్లల్లో- 33)
3.	పక్కటెముకలు/రిబ్స్	24
4.	రెండు చేతులు	60
5.	రెండు కాళ్లు	60

మొత్తం ఎముకల సంఖ్య (పెద్ద వారిలో) 206


గమనిక: ఉరి వేసుకున్న వారిలో హయాయిడ్ ఎముక విరుగుతుంది.

శైశవ దశలో 33 వెన్నుపూసలుంటాయి. తర్వాత వాటిలో చివరి 9 వెన్నుపూసలు (ఐదు కలిసి ఒక త్రికంగా, 4 కలిసి అనుమత్రికంగా) 2 వెన్నుపూసలుగా ఏర్పడతాయి.

కాబట్టి పెద్ద వారిలో ఉండే మొత్తం వెన్నుపూసల సంఖ్య 26

తలలోని ఎముకల గూడును పుర్రె అంటారు. పుర్రెలో మెదడు ఉండే పెట్టెవంటి నిర్మాణం కపాలం (క్రేనియం). కపాలం అధ్యయనాన్ని క్రేనియాలజీ అంటారు.

- కపాలంలోని ఎముకలు- 8
- ముఖంలోని ఎముకలు -14
- పుర్రెలో కదిలే ఎముక - 1
- కింది దవడ కదులుతుంది
- పుర్రెలో కదలని ఎముకలు- 21



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

- అతిపెద్ద ఎముక - ఫీమర్ (తొడ ఎముక)
- అతిచిన్న ఎముక - స్టెపిస్ (కర్ణాంతరాస్థి)
- పుర్రెలో అతిదృఢమైన ఎముక - కింది దవడ (మాండిబ్యూల్)
- అతి మెత్తని ఎముక - మృదులాస్థి

చేతి ఎముకలు:
ప్రతి చేయిలో 30 ఎముకలుంటాయి.
చేయిలో మూడు భాగాలు ఉంటాయి.
1) పై చేయి (భుజాస్థి ఎముక - హ్యూమరస్ 1)
2) ముంజేయి (రత్ని, అరత్ని ఎముకలు -2)
3) హస్తం
ఎ) మణిబంధాస్థులు -8
బి) కరభాస్థులు - 5
సి) చేతివేళ్లు - 14

గమనిక: రాస్తున్నప్పుడు పెన్నుకు ఆధారాన్నిచ్చే చేతి వేళ్ల ఎముకలను ఫాలింజెస్ అంటారు.

కాలు ఎముకలు: ప్రతికాలులో 30 ఎముకలుంటాయి. కాలులో మూడు భాగాలున్నాయి.
1) తొడ: ఫీమర్ - 1
2) మోకాలు: టిబియా, ఫిబులా (అంతర్‌జంగిక, బహిర్జంగిక- 2)
3) పాదం
ఎ) చీలమండలం (టార్సల్స్)-7
బి) ప్రపాదాస్థులు-మెటాటార్సల్స్-5
సి) కాలివేళ్లు - ఫాలింజస్-14
డి) మోకాలి చిప్ప - పటెల్లా - 1

ఉరోమేఖల (పెక్టోరల్ గిర్డిల్): ఇది చేతులను అంటిపెట్టుకుని ఉంటుంది. ఉరోమేఖల / భుజ వలయంలో రెండు ఎముకలుంటాయి. అవి..
ఎ) జత్రుక (కాలర్ బోన్)
బి) అంస ఫలకం (స్కాపులా)
(ఇది త్రిభుజాకారంలో ఉంటుంది)

ఉరఃపంజరం: ఉరోస్థి ముందువైపు (రొమ్ము ఎముక), పక్కటెముకల ఇరువైపులా, వెన్నెముక వెనుకవైపు ఉండి గుండె, ఊపిరితిత్తులను రక్షిస్తుంది

శ్రోణిమేఖల (ఫెల్విస్ గిర్డిల్): ఇది కాలి ఎముకలను అంటుకుని ఉదరం కింది భాగంలో ఉంటుంది.కూర్చోవడానికి ఉపయోగపడుతుంది.


కీళ్లు (జాయింట్స్)

రెండు ఎముకలు కలిసే ప్రాంతాన్ని కీలు అంటారు. రెండు ఎముకలను బంధించే కొల్లాజెన్ పోగులను లిగ్మెంట్ (స్నాయువు) అంటారు. ఎముకను కండరంతో బంధించే కొల్లాజెన్ పోగును టెండాన్ (స్నాయుబంధనం) అంటారు. కీళ్ల మధ్యలో సైనోవియల్ కుహరం ఉంటుంది. దీనిలో సైనోవియల్ ద్రవం ఉంటుంది.

సైనోవియల్ ద్రవం కీళ్ల కదలికలో కందెనలా ఉపయోగపడుతుంది. ఎముకలు, దేహం కదలడానికి కీళ్లు తోడ్పడతాయి. కీళ్ల అధ్యయనాన్ని ఆర్థాలజీ అంటారు. శరీరంలోమొత్తం 230 కీళ్లుంటాయి. కీళ్ల, ఎముకల వైద్య నిపుణుడ్ని ఆర్థోపెడిక్ డాక్టర్ అంటారు.

ఎముకలు, కీళ్ల వ్యాధులు- వ్యాధి లక్షణాలు

- ఆర్థరైటిస్: కీళ్లవాపు, దీని నివారణకు తేనెటీగల విషాన్ని ఔషధంగా వాడుతారు.
- సర్వైకల్ స్పాండలైటిస్: మెడనొప్పి
- స్పాండలైటిస్: వెన్నునొప్పి
- ఆస్టియోఆర్థరైటిస్ : కీళ్లనొప్పి
- రుమటాయిడ్ ఆర్థరైటిస్: సైనోవియల్ ద్రవం లోపంతో వచ్చే కీళ్ల నొప్పి.
- ఆస్టియోపోరోసిస్: ఎముకలు పెలుసుగా మారడం.



- గౌట్ వ్యాధి: కీళ్లవాపు
- రికెట్స్ వ్యాధి: విటమిన్ డి లోపం వల్ల చిన్న పిల్లల్లో ఎముకలు వంగిపోవడం
- ఆస్టియోమలేషియా: విటమిన్ డి లోపంతో పెద్దవారిలో ఎముకలు పెలుసుగా మారడం
- ఫ్లోరోసిస్: ఫ్లోరిన్ నీటితో దంతాలు పసుపు రంగులోకి, ఎముకలు వికృత రూపంలోకి మారడం
- సైనోవిటిస్: చికెన్ గున్యా వ్యాధి వల్ల కీళ్లవాపు. ఇది వైరస్ వల్ల కలిగే వ్యాధి.

కీళ్లు - రకాలు

కీళ్లు రెండు రకాలు.

1) కదలని (స్థిరమైన) కీళ్లు

పుర్రెలో పైదవడ, కపాలానికి మధ్య ఉండే వి కదలని కీళ్లు

2) కదిలే కీళ్లు

పుర్రెలో కింది దవడ కదిలే కీలు.
ఇవి నాలుగు రకాలు. అవి..

బొంగరపు కీలు: ఇది మెడలో పుర్రె, వెన్నెముక కలిసే ప్రాంతంలో ఉంటుంది. మెడలో 7 ఎముకలు ఉంటాయి. బొంగరపు కీలు చేసే కోణం 180 డిగ్రీలు

నోట్: భరతనాట్యం చేసే వారిలో ఈ కీలు ఎక్కువగా ఉపయోగపడుతుంది.

బంతిగిన్నె కీలు: ఇది భుజం-దండచేయి, తొడ-కటివలయం ప్రాంతంలో ఉంటుంది. ఈ కీలు చేసే కోణం 360 డిగ్రీలు

నోట్: చేతులు, కాళ్లను ఈ కీలు వృత్తాకారంగా (గుండ్రంగా) తిప్పుతుంది.

మడతబందు కీలు: ఇది మోచేయి, మోకాలు, కాలు, చేతి వేళ్లకు మధ్య ఉంటుంది. ఈ కీలు చేసే కోణం - 90 డిగ్రీలు

నోట్: ఈ కీలు మోచేయి, మోకాలును ఒకేవైపు వంచుతుంది. తలుపులు, కిటికీలకు బంధించే నిర్మాణాలు మడతబందులు.

జారుడు కీలు: ఇది వెన్నెముకలోని వెన్నుపూసల మధ్య పక్కటెముకలు, మణికట్టులో ఉంటుంది.

నోట్: తాళం వేసేటప్పుడు, తీసేటప్పుడు, ఉచ్ఛ్వాస, నిచ్ఛ్వాస సమయంలో అవసరమయ్యే కీలు జారుడు కీలు. నేలమీది ఉన్న వస్తువును వంగి తీసుకునేటప్పుడు (వెన్నుపూసలు) ఉపయోగపడేది జారుడు కీలు. ఎముకలను నిర్వాత స్వేదనం చేసి ఎముకల బొగ్గును తయారుచేస్తారు. ఎముకల బొగ్గును చక్కెర పరిశ్రమలో విరంజనకారి (డీకలరింగ్ ఏజెంట్)గా ఉపయోగిస్తారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. మానవుడి శరీరంలో(పెద్దవారిలో) ఎముకల సంఖ్య?
   1) 330 2) 260
   3) 206 4) 220
2. మానవ శరీరంలోని అతి కఠిన భాగం?
   1) దంతాలు 2) గోర్లు
   3) ఎముకలు 4) ఎనామిల్
3. జంతువులలోని అస్థిమజ్జ నిర్వహించే క్రియ?
   1) మూత్రపిండాలకు సహాయం
   2) రక్తకణోత్పత్తి
   3) కాలేయానికి సహాయం
   4) రక్తపీడన నియంత్రణ
4. గోర్లను కత్తిరించినప్పుడు ఎందుకు నొప్పి కలగదు?
   1) మృతకణజాలంతో తయారైన కొమ్మువంటి పదార్థం ఉండటం
   2) శరీరంలో అనవసర భాగం
   3) బహిష్కృత భాగంగా రూపాంతరం చెందడం
   4) కాల్షియం ఫాస్ఫేట్‌తో తయారు కావడం
5. మనం చేతితో రాస్తున్నప్పుడు పెన్నుకు ఆధారాన్నిచ్చే చేతి వేళ్లలోని ఎముకలు?
   1) కార్పెల్స్
   2) మెటాకార్పెల్స్
   3) టార్సల్స్
   4) ఫాలింజెస్
6. ఎముకల అధ్యయన శాస్త్రం?
   1) ఓటాలజీ 2) ఆస్టియాలజీ
   3) ఆర్నిథాలజీ 4) అంకాలజీ
7. అప్పుడే పుట్టిన శిశువులో ఉండే ఎముకల సంఖ్య?
   1) 300 2) 320
   3) 330 4) 340
8. కింది వాటిలో మానవుడి వెన్నెముకకు సంబంధించిన వ్యాధి?
   1) హైపోథార్మియా
   2) కాటరాక్ట్
   3) హెర్నియా
   4) సర్వైకల్ స్పాండలైటిస్
9. మానవ శరీరంలో అతిపెద్ద ఎముక?
   1) ఫిబులా 2) టిబియా
   3) స్టెపిస్ 4) ఫీమర్
10. నీటిలో ఏ పదార్థం ఎక్కువ ఉండటంతో ఎముకల్లో వంకర్లు వస్తాయి?
    1) ఫ్లోరిన్ 2) క్లోరైడ్
    3) లెడ్ 4) ఏదీకాదు
11. చెవులలోని మొత్తం ఎముకల సంఖ్య?
    1) 2 2) 4
    3) 6 4) 8
12. మానవుడి పుర్రెలోని మొత్తం ఎముకల సంఖ్య ?
    1) 24 2) 22
    3) 20 4) 21

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 1;
5) 4; 6) 2; 7) 1; 8) 4;
9) 4; 10) 1; 11) 3; 12) 2.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
గురువారం । 16-1-2025

చౌమొహల్లా ప్యాలెస్ నిర్మాణాన్ని పూర్తి చేసిందెవరు?

అసఫ్ జాహీల నిర్మాణంలో ముఖ్యమైన, అద్భుతమైన నిర్మాణం ఫలక్‌నుమా ప్యాలెస్. దీన్ని హైదరాబాద్ ప్రధానమంత్రి, ఆరో నిజాం బావమరిది వికార్-ఉల్-ఉమ్రా పాయెగా నిర్మించాడు. ఫలక్‌నుమా అంటే ఉర్దూలో 'ఆకాశంలోని అద్దం' అని అర్థం. 1884లో ఈ భవన నిర్మాణం ప్రారంభమైంది. సముద్ర మట్టం నుంచి 2000 అడుగుల ఎత్తులో 32 ఎకరాల విస్తీర్ణంలో తేలు ఆకారంలో ఫలక్‌నుమా ప్యాలెస్‌ను నిర్మించారు. ఈ ప్యాలెస్‌లో ఇటాలియన్, ట్యూడర్ వాస్తు కళలను చూడవచ్చు. ఈ ప్యాలెస్ ముఖ్య భాగంలో గోల్ బంగ్లా, జనానామహల్, అంతఃపుర రాణివాసాన్ని నిర్మించారు. దీని నిర్మాణానికి రూ.40 లక్షల వ్యయమైంది. వికార్-ఉల్-ఉమ్రా ఈ ప్యాలెస్‌ను మీర్ మహబూబ్ అలీఖాన్‌కు బహుమతిగా ఇచ్చాడు. మహబూబ్ అలీఖాన్ చనిపోయే వరకూ ఈ ప్యాలెస్‌లోనే నివసించారు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర

మాన్యుమెంట్స్ ఆఫ్ అసఫ్ జాహీ పీరియడ్

అసఫ్ జాహీలు 17వ శతాబ్దంలో మధ్యాసియా ప్రాంతం నుంచి భారతదేశానికి వచ్చి మొగల్ సామ్రాజ్యంలో ఉన్నత పదవులు అలంకరించారు. కుతుబ్‌షాహీల పతనం తర్వాత 1687-1724 వరకు హైదరాబాద్ నగరం మొగలుల ఆధీనంలో ఉంది. మొగల్ గవర్నర్ ఔరంగబాద్ నుంచి పరిపాలన చేపట్టాడు. చార్మినార్ వద్ద కుతుబ్‌షాహీలు నిర్మించిన అనేక కట్టడాలను మొగల్ సైన్యం నాశనం చేసింది. మరాఠాల దాడుల నుంచి హైదరాబాద్‌ను రక్షించేందుకు మొగలులు 1724లో నగరం చుట్టూ గోడల నిర్మాణాన్ని ప్రారంభించారు.

మొగల్ గవర్నరైన మీర్ ఖమ్రుద్దీన్ నిజాం ఉల్ ముల్క్ 1724లో హైదరాబాద్‌లో 'అసఫ్‌జా' వంశాన్ని స్థాపించాడు. అసఫ్‌జాల నిర్మాణాలు హైదరాబాద్ నగర రక్షణ గోడలతోనే ప్రారంభమయ్యాయి. మీర్ ఖమ్రుద్దీన్ నిజాం-ఉల్-ముల్క్ ఔరంగాబాద్ నుంచి హైదరాబాద్ రాజ్యాన్ని పరిపాలించాడు. 1740 నాటికి హైదరాబాద్ చుట్టూ రక్షణ గోడల నిర్మాణం పూర్తైంది. 1908లో మూసీ నదికి వచ్చిన వరదల వల్ల మొదటిసారిగా రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం కొన్ని ద్వారాలు మాత్రమే ఉండగా, అవి కూడా అవసాన దశలో ఉన్నాయి.

డాబీర్‌పుర ద్వారం

హైదరాబాద్ చుట్టూ 17 ద్వారాలను నిర్మించారు. అందులో ముఖ్యమైన డాబీర్‌పుర ద్వారాన్ని 1724-40 మధ్య కాలంలో నిర్మించారు. హైదరాబాద్ రాజ్యంలోని పండితుల్లో ఒకరైన అబుస్ సమద్ డాబీర్-ఉల్-ముల్క్ పేరును ఈ ద్వారానికి పెట్టారు. 1750 నాటికి హైదరాబాద్ నగరం 2.25 లక్షల జనాభాతో దేశంలోనే ఎక్కువ జనాభా ఉన్న నగరంగా ఆవిర్భవించింది.

1763 తర్వాత అసఫ్ జాహీల కట్టడాల నిర్మాణం ఊపందుకుంది. అసఫ్ జాహీల కాలంలో నిర్మించిన కట్టడాల్లో పాయెగా సమాధులు, సైదానిమా సమాధి, చౌమొహల్లా ప్యాలెస్, పురానా హవేలి, బేగం బజార్, రేమండ్ సమాధి, గన్‌ఫౌండ్రి, బ్రిటిష్ రాజప్రతినిధి కోట, హైకోర్టు భవనం, ఆర్ట్స్ కాలేజీ భవనం, దివాన్ దేవిడీ, ఉస్మానియా జనరల్ ఆసుపత్రి భవనం ముఖ్యమైనవి.

1748లో మీర్ ఖమ్రుద్దీన్ అసఫ్‌జా లాడ్ బజార్‌లో షాహీ జీలుఖానా ద్వారాన్ని నిర్మించాడు. ఈ నిర్మాణంలో రాజస్థానీ శైలిని వాడి పందిళ్లు, కిటికీలను నిర్మించారు. మరి మొగలుల శైలిలో తోరణాలు,ముఖద్వారాన్ని నిర్మించారు. 1724-40 మధ్య కాలంలో నిర్మించిన హైదరాబాద్ నగర కోటల్లో భాగంగా అలియాబాద్ సరాయిని మొదటి అసఫ్‌జా నిర్మించాడు. పాత నగర రక్షణ కోట భాగాలను ఇప్పటికీ అలియాబాద్ పరిసర ప్రాంతాల్లో చూడవచ్చు.

రెండో అసఫ్‌జా కాలంలోని నిర్మాణాలు

1795లో మస్సీ రేమండ్ సహాయంతో ఫిరంగుల తయారీ పరిశ్రమను గన్‌ఫౌండ్రి పేరుతో అబిడ్స్ వద్ద నిజాం అలీఖాన్ నిర్మించాడు. గన్‌ఫౌండ్రి నిర్మాణంలో ఇటుకలు, మోర్టార్‌ను వాడారు.

మస్సీ రేమండ్ సమాధి

రెండో నిజాం రాజు నిజాం అలీఖాన్ సైన్యంలో ముఖ్యమైన ఫ్రెంచ్ అధికారి మస్సీ రేమండ్. ప్రజలు ఇతణ్ని ముసారాముడని పిలిచేవారు. ఇతడి పేరు మీద ముసారాంబాగ్ నిర్మాణం జరిగింది. 1798లో మస్సీ రేమండ్ మరణించాడు. ఇతడి సమాధిని యురోపియన్ శైలిలో 28 పిల్లర్లతో ముసారాంబాగ్ వద్ద నిర్మించారు. ఈ నిర్మాణంలో ఊదారంగు గ్రానైట్ రాయిని వాడారు.

పాయెగా (పాయిగా) సమాధులు

వీటి నిర్మాణాన్ని 1786లో ప్రారంభించారు. పాయిగా సమాధులను షమ్స్-ఉల్-ఉమ్రా సమాధులని కూడా అంటారు. హైదరాబాద్ రాజ్యంలో అత్యంత శక్తివంతమైన వ్యక్తులు పాయెగాలు. నిజాం అలీఖాన్ కాలంలో 1760 నుంచి 1803 వరకు షమ్స్-ఉల్-ఉమ్రా సర్వసైన్యాధ్యక్షుడిగా పనిచేశాడు. పాయెగా సమాధుల నిర్మాణంలో మొగల్, మూరిష్ శైలులను వాడారు. ఈ సమాధుల నిర్మాణంలో సున్నం, మోర్టార్‌ను ఉపయోగించారు. ఈ సమాధుల్లో రేఖాగణిత చిత్రాలు, పూలమొక్కల డిజైన్లు, పందిరి నిర్మాణాలు చూడవచ్చు.

పురానా హవేలి

రెండో నిజాం కాలంలో పురానా హవేలి నిర్మాణం ప్రారంభమైంది. పురానా హవేలి ప్రాంతాన్ని రుకును-ఉద్-దౌలా నుంచి నిజాం అలీ తీసుకొని తన కుమారుడైన సికిందర్ జా కోసం హవేలి (అంతఃపురం)ని నిర్మించాడు. ఈ హవేలిలోని ప్రధాన భవనాన్ని 18వ శతాబ్దం నాటి యురోపియన్ శైలిలో నిర్మించారు. పురానా హవేలి U ఆకారంలో ఉంటుంది. ప్రధాన భవనానికి రెండు వైపులా దీర్ఘచతురస్రాకారంలో ఒకదానికొకటి సమాంతరంగా ఈ భవనాలను నిర్మించారు. ఈ హవేలిలో ప్రపంచంలోనే అతిపెద్ద దుస్తుల అల్మారాను ఏర్పాటు చేశారు. సికిందర్ జా కొన్ని రోజులు ఇక్కడ నివసించి తర్వాత కిల్వత్ మహల్‌కు మారాడు. సికందర్ జా ఈ హవేలిని వదిలి పెట్టడం వల్ల పురానా హవేలి అని పేరొచ్చింది. మీర్ ఉస్మాన్ అలీఖాన్ పురానా హవేలిలో మ్యూజియంను ఏర్పాటు చేశాడు. పురానా హవేలిలోని అద్దాల భవనం చీని ఖానా(చైనా నుంచి తెచ్చిన అద్దాలతో నిర్మించిన భవనం)చెప్పుకోదగింది.

సికిందర్ జా (1803-1829) కాలంలోని నిర్మాణాలు

నిజాం రాజు సైన్య సహకార సంధిపై సంతకం చేసిన తర్వాత బ్రిటిషర్లు హైదరాబాద్‌లో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకున్నారు. బ్రిటిష్ రాజప్రతినిధి అధికార నివాసాన్ని సుల్తాన్ బజార్‌లో నిర్మించారు. 1803లో జాన్ శామ్యూల్స్ రస్సెల్ రెసిడెన్సీ భవన డిజైన్ (ప్రణాళిక)ను రూపొందించాడు. 1803-04లో రెసిడెన్సీ భవన నిర్మాణం పూర్తైంది. ఆ సమయంలో హైదరాబాద్‌లో బ్రిటిష్ రాజప్రతినిధిగా జేమ్స్ అకిలీస్ కిర్క్‌పాట్రిక్ ఉన్నాడు. ఈ నిర్మాణంలో యురోపియన్ శైలి కన్పిస్తుంది. ఈ భవనంలోని ప్రధాన కేంద్ర బ్లాక్‌ను జార్జియన్ శైలిలో నిర్మించారు. ఈ శైలిని అమెరికా అధ్యక్ష భవనమైన శ్వేతభవనంలో చూడవచ్చు. బ్రిటిష్ రాజప్రతినిధి నివసించే కోట ప్రాంతం వల్ల దానికి కోఠి అనే పేరొచ్చింది. ప్రస్తుతం ఈ భవనంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉమెన్స్ కాలేజీని నిర్వహిస్తున్నారు. 1803-29 మధ్య కాలంలో సికిందర్ జా వద్ద మిలటరీ అధికారిగా పనిచేసిన జామ్ సింగ్ కార్వాన్‌లో రాజస్థానీ శైలిలో ఒక దేవాలయాన్ని నిర్మించాడు.

నాసిరుద్దౌలా (1829-57) కాలంలో నిర్మాణాలు

1839లో చాదర్‌ఘాట్ వద్ద మూసీనదిపై వంతెన నిర్మించారు. 1840-50 మధ్య కాలంలో సికింద్రాబాద్‌లో సెయింట్ మేరీ క్యాథడల్‌ను డేనియల్ మర్ఫి నిర్మించాడు. 1845లో హైదరాబాద్ రాజ్య పేష్కర్ రాజా చందులాల్ ఆల్వాల్ ప్రాంతంలో ఒక దేవాలయాన్ని నిర్మించాడు.

భగవాన్ దాస్ గార్డెన్

భగవాన్ దాస్ గుజరాత్‌కు చెందిన వైశ్యుడు. ఇతడు కార్వాన్ వద్ద భగవాన్ దాస్ గార్డెన్ పెవిలియన్ నిర్మించాడు. రెండు అంతస్తుల ఈ భవనంలో ఆర్కేడ్ వరండాలు, బాల్కనీలను టిప్పు ప్యాలెస్ తరహాలో నిర్మించారు. ఈ గార్డెన్‌లో మొగల్, గుజరాతీ శైలిలో మేలు రకం టేకుతో చెక్క స్తంభాలు, పందిళ్లు, కిటికీలను నిర్మించారు.

అఫ్జల్-ఉద్-దౌలా కాలంలో నిర్మాణాలు (1857-69)

1857-61 మధ్య నయాపూల్ వద్ద మూసీ నదిపై వంతెన నిర్మించారు.

చౌమొహల్లా ప్యాలెస్

పర్షియా భాషలో చౌ అంటే నాలుగు అని అర్థం. అరబిక్ భాషలో మొహల్లా అంటే మహల్. చౌమొహల్లా అంటే నాలుగు మహల్‌లు ఉన్న ప్రాంతమని అర్థం. 1750లో సలాబత్‌జంగ్ చౌమొహల్లా ప్యాలెస్‌కు పునాది వేశాడు. 1869లో అఫ్జల్‌ద్దౌలా బహదూర్ చౌమొహల్లా నిర్మాణాన్ని పూర్తి చేశాడు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని షా మహల్ తరహాలో చౌమొహల్లా ప్యాలెస్‌ను నిర్మించారు. ఈ ప్యాలెస్‌లో రెండు ప్రాంగణాలు ఉన్నాయి. ఉత్తర, దక్షిణ ప్రాంగణాల్లో సొగసైన రాజభవనాలు, గొప్ప రాజదర్బారు హాలు, ఫౌంటెన్లు, తోటలు ఉన్నాయి. ఉత్తర ప్రాంగణంలో బారా ఇమామ్ ఉంది. ఇందులో తూర్పువైపు పొడవైన కారిడార్, దాని పక్కనే విశాలమైన గదులు ఉన్నాయి. గతంలో పరిపాలన కోసం ఈ గదులను ఉపయోగించారు.

దక్షిణ ప్రాంగణంలో నాలుగు మహల్‌లు ఉన్నాయి. అవి అఫ్జల్ మహల్, మహతబ్ మహల్, తన్నియత్ మహల్, అఫ్తాబ్ మహల్. వీటిలో అఫ్తాబ్ మహల్ అందమైంది. ఈ మహల్ ఉన్న గడియారాన్ని కిల్వత్ గడియారం అంటారు. చౌమొహల్లాలోని దర్బారు హాల్లో అతి ముఖ్యమైన అధికారులను నిజాం రాజులు కలుసుకునేవారు. ఈ దర్బారులో పురాతన రాత ప్రతులు, పుస్తకాలను ఉంచారు. ఆరో నిజాం గౌరవార్థం రోషన్ మహల్‌ను ఉత్తర ప్రాంగణంలో నిర్మించారు. కిల్వత్ మహల్‌లోని అతిగొప్ప నిర్మాణం గ్రాండ్ దర్బారు హాలు. ఇందులో మొగల్ శైలిలో గుమ్మటాలు (డోమ్‌లు), తోరణాలు నిర్మించారు. గోడలను పర్షియన్ శైలిలో అలంకరించారు. గ్రాండ్ దర్బారులో నిజాం రాజు సింహాసనం తక్త్-ఇ-నిషాన్‌ను ఉంచారు. దర్బారు హాలు ఫ్లోర్ అంతటినీ స్వచ్ఛమైన పాలరాయితో నిర్మించారు. 19 బెల్జియన్ క్రిస్టల్ షాండ్లియర్‌లను గ్రాండ్ దర్బారులో ఏర్పాటు చేశారు. నిజాం రాజులు తమ రాజకీయ, మత సమావేశాలు, పండుగలను గ్రాండ్ దర్బారులో నిర్వహించేవారు. 1906లో వేల్స్ రాకుమారుడు భారత్ వచ్చినప్పుడు అతడి గౌరవార్థం గ్రాండ్ దర్బారులో విందు ఏర్పాటు చేశారు.

మీర్ మహబూబ్ అలీఖాన్ (1869-1911) కాలంలో నిర్మాణాలు

1874లో తొలి రైల్వేలైన్‌ను హైదరాబాద్ నుంచి వాడి వరకు బ్రాడ్‌గేజ్ నిర్మించారు. 1886లో బ్రిటిషర్లు చార్మినార్‌ను రక్షించాల్సిన కట్టడాల జాబితాలో చేర్చారు.

హజ్రత్ సైదానిమా సాహెబా సమాధి

మీర్ మహబూబ్ అలీఖాన్ ప్రభుత్వంలో ఉన్నతాధికారి అబ్దుల్ హక్ దిలేర్ జంగ్ తన తల్లి సైదానిమా సాహెబా మరణానంతరం హుస్సేన్ సాగర్ వద్ద ఆమె సమాధి నిర్మించారు. ఈ సమాధిని రెండు అంతస్తులుగా నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని తోరణాలు, అలంకరణలు మొగల్ శైలిలో ఉన్నాయి. మొదటి అంతస్తు, గుమ్మటాన్ని కుతుబ్ షాహీల వాస్తుకళ లేదా శైలిలో నిర్మించారు.

ఛాత్తాబజార్‌లో సాలార్‌జంగ్-1 పేరు మీద దివాన్ దేవిడిని నిర్మించారు. ఇందులో మొగల్ శైలిలో రెండు ముఖద్వారాలు, అర్ధచంద్రాకార తోరణాలను నిర్మించారు.

అసెంబ్లీ భవనం

మీర్ మహబూబ్ అలీఖాన్ 40వ జన్మదినాన్ని పురస్కరించుకొని 1905లో టౌన్‌హాల్ నిర్మాణాన్ని ప్రారంభించి 1923లో పూర్తి చేశారు. దీన్ని పర్షియన్, రాజస్థానీ శైలిలో నిర్మించారు. తర్వాతి కాలంలో నిజాం ప్రభుత్వం ఈ హాలును శాసనసభగా మార్చింది.

మీర్ ఉస్మాన్ అలీఖాన్ (1911-1948) కాలంలో నిర్మాణాలు

1866లో రాజ కుటుంబీకులు, భూస్వాముల కోసం అఫ్జల్‌గంజ్‌లో 30 పడకల ఆసుపత్రిని నిర్మించారు. 1908లో మూసీనదికి వచ్చిన వరదల వల్ల ఈ ఆసుపత్రి ధ్వంసమైంది. మీర్ ఉస్మాన్ అలీఖాన్ రూ. 20 లక్షల వ్యయంతో నూతన ఆసుపత్రి భవనాన్ని అఫ్జల్‌గంజ్‌లో నిర్మించాడు. ఆయన పేరుమీద ఈ ఆస్పత్రికి ఉస్మానియా జనరల్ ఆసుపత్రిగా నామకరణం చేశారు. ఉస్మానియా ఆసుపత్రిని ఇండో-సార్సనిక్ శైలిలో నిర్మించారు. ఈ భవన నిర్మాణానికి విన్సెంట్ జెరొమ్ ఏస్చ్ చీఫ్ ఇంజనీర్‌గా పనిచేశాడు. ఇతడు నగర ఉన్నత పాఠశాల, హైదరాబాద్ రైల్వేస్టేషన్, హైకోర్టు భవనాలను కూడా రూపొందించాడు.

కింగ్ కోఠి ప్యాలెస్

1911లో కమల్ ఖాన్ తన సొంత అవసరాల కోసం సుల్తాన్‌బజార్ ప్రాంతంలో నూతన ప్యాలెస్‌ను నిర్మించాడు. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌కు ఈ ప్యాలెస్ నచ్చింది. దాంతో కమాల్ ఖాన్ వద్ద నుంచి ప్యాలెస్‌ను పొందాడు. ఉస్మాన్ అలీఖాన్ ఒక ఫర్మానా ద్వారా ఆ ప్రాంతానికి కింగ్ కోఠి అని నామకరణం చేశాడు. ఈ ప్యాలెస్‌లో మూడు ప్రధాన భవనాలు ఉన్నాయి. పశ్చిమ భాగంలో ఉన్న భవనాన్ని నజరిబాగ్ అని పిలుస్తారు. ప్రస్తుతం ప్యాలెస్ తూర్పు భాగంలో ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు.

బషీర్‌బాగ్ ప్యాలెస్

పాయెగా వంశానికి చెందిన ఆస్మాన్ జా బషీర్-ఉద్-దౌలా ఫతేమైదాన్ వద్ద బషీర్‌బాగ్ ప్యాలెస్‌ను నిర్మించాడు.

సిటీ కాలేజీ

1895లో మీర్ మహబూబ్ అలీఖాన్, మదరసా దార్-ఉల్-ఉలూమ్ అనే మొదటి సిటీ స్కూల్‌ను ప్రారంభించాడు. తర్వాతి కాలంలో మీర్ ఉస్మాన్ అలీఖాన్ దాన్ని విస్తరించాడు. ప్రస్తుతం ఉన్న సిటీ కాలేజీ భవనానికి ఈ స్కూల్‌ను 1921లో మార్చారు. మీర్ ఉస్మాన్ అలీఖాన్ 16 ఎకరాల స్థలంలో ఇండో-సార్సనిక్ శైలిలో సిటీ కాలేజీని రెండు అంతస్తులుగా నిర్మించాడు.

మొజంజాహీ మార్కెట్

1935లో మీర్ ఉస్మాన్ అలీఖాన్ తన రెండో కుమారుడైన మొజంజా పేరు మీద మొజంజాహీ మార్కెట్‌ను నిర్మించాడు. దీన్ని పూర్తిగా రాళ్లతో నిర్మించారు. దీనికి ఒక మూలన మినార్‌ను నిర్మించి, అందులో ఒక గడియారాన్ని పొందుపర్చారు.

What is the full form of SDRM?



BANK EXAMS
COMPUTER AWARENESS

COMPUTER NETWORK

A computer network consists of two or more autonomous computers that are connected together in order to share resources(files, printers, modem etc), share application, allow electronic communication etc.

A computer network includes the network operating system in the client and server machines, the cables, which connect different computers and all supporting hardware in between such as bridges, routers & switches. In wireless system, antennas and towers are also part of the network.

Types of Computer Network: Computer network are generally classified according to their structure and the area.

Local Area Network (LAN)

In LAN, computers are connected locally within a room, building or in a small area. LAN can range from simple (two computers) to complex (hundred of computers and peripherals). LANs connect workstations and personal computers. User can share data as well as devices like printers, fax etc and can use LAN to communicate with each other, by sending e-mail or chatting.

Examples of LAN Technology: Ethernet, Token Ring, and Fiber Distributed Data Interconnect (FDDI).

Characteristics of LAN are:

- Configured to small area i.e. it connects several devices over a distance of 5 to 10 KM.
- High Speed• Low error rates
- Data and hardware sharing between users.
- Operates at speed ranging from 10 Mbps to 100 Mbps. Now a day's 1000 Mbps are available.

Network Topology

Topology is physical arrangement of computer system in a network. Or refers to the shape of networks. Some of the most common network topologies are

Bus topology

In bus topology, all devices are connected to a central cable, called the bus or backbone. The bus topology connects workstations using a single cable. Each workstation is connected to the next workstation in a point to point fashion. All workstation connect to the same cable. An extension to the bus topology is tree topology.

Advantage of Bus topology: Installation is easy and cheap. Connections are simple and easy to use. Data can be transmitted from the both sides.

Disadvantage of Bus topology: A single fault in the cable stops all transmission. Fault identification is difficult.

Ring topology

In ring topology, all devices are connected to one another in the shape of a closed loop; so that each device is connected directly to two others i.e. the ring topology connects workstations in a closed loop. Data is transmitted around the ring in one direction only. Each station passing on the data to the next station till it reaches its destination. The common implementation of this topology is token ring.

Advantage of Ring topology: Easy to install and modify the network and fault isolation is simplified.

Disadvantage of Ring Topology: Adding or removing computer disrupts the entire network. A break in the ring can stop the transmission in the entire network. Finding fault is difficult.

Star Topology

Star topology uses a central hub through which, all components are connected. A central hub is the host computer and at the end of each connection is a terminal. Communication on the connecting links between the stations and the central station of star topology can be bi-directional and are point to point.

Advantage of Star Topology: Expansion or modification is easy. Single computer failure does not affect the network.

Disadvantage of Star Topology: Failure in the central hub brings the entire network to halt.

Tree topology

Tree topology is LAN topology in which only one route exists between any two nodes on the network. It is similar to the star topology but the nodes are connected to the secondary hub, which in turn is connected to the central hub.

Advantage of Tree Topology: Installation and configuration of tree network is easy. Less expensive when compared to mesh topology.

Disadvantage of tree Topology: Failure in central hub brings the entire network to a halt. More cabling is required when compared to bus topology.

Mesh topology

Devices are connected with many redundant interconnections between network nodes. In a well connected topology, every node has a connection to every other node in the network. Mesh topology are used in critical connection of host computers [typically telephone exchange]. Alternate path allow each computer to balance the load to other computer systems in the network by using more than one connection path available.

Advantage of Mesh topology: Failure in one of the computers does not affect the entire network. Privacy between computers is maintained as messages travel along dedicated path.

Disadvantage of Mesh Topology: Amount of caballing required is high. A large number of I/O ports are required

MODEL BITS

1. The property that, when classes are arranged in a hierarchy, each class assumes the attributes and methods of its ancestors is ____.
   1) Generalization
   2) Inheritance
   3) Encapsulation
   4) Information hiding
   5) None of these
2. An E-R diagram is a graphic method of presenting ____.
   1) Primary keys and their relationships
   2) Primary keys and their relationships to instances
   3) Entity classes and their relationships
   4) Entity classes and their relationships to primary keys
   5) None of these
3. ____ is a primary key of one file that also appears in another file.
   1) Physical key 2) Primary key
   3) Foreign key 4) Logical key
   5) None of these
4. SMTP, FTP and DNS are applications of the ____ layer.
   1) Data link 2) Network
   3) Transport 4) Application
   5) None of these
5. Which of the following is the smallest and fastest computer imitating human brain working?
   1) Supercomputer
   2) Quantum Computer
   3) Param-10,000 4) IBM chips
   5) None of these
6. Which of the following statement is wrong?
   1) Windows XP is an operating system
   2) Linux is owned and sold by Microsoft
   3) Photoshop is a graphical design tool by Adobe
   4) Linux is free and open source software
   5) None of these
7. What is the full form of SDRM?
   1) Shift Dynamic random access memory
   2) Synchronous Dynamics random access memory
   3) System Dynamic random access memory
   4) Serial Dynamic random access memory
   5) Synchronous Dynamic random access memory
8. First microprocessor was used in which of the following?
   1) Computer 2) Calculator
   3) Telephones 4) Printers
   5) None of these
9. Which of the following transforms input data into output data?
   1) Peripherals 2) RAM 3) ROM
   4) CPU 5) None of these
10. BSNL, Reliance, Shaw cable, AOL, Tata Indicom all can be kept in which one of the following groups?
    1) ISDN 2) IRC 3) ISP
    4) ICONS 5) None of these
11. In windows XP, which shortcut is used you lock the computer?
    1) Ctrl + L 2) Windows Key + k
    3) Ctrl + K 4) Scroll Lock key
    5) Windows Key + L
12. What is a 'tuple'?
    1) Another name for a table in an RDBMS.
    2) Another name for the key linking different tables in a database.
    3) Initial seed value of field.
    4) A row or record in a database table.
    5) An attribute attached to a record
13. A spooler is a (n):
    1) Location in memory that maintains the contents of a document until it prints out
    2) Print job
    3) Program that coordinates the print jobs that are waiting to print
    4) Message sent from the printer to the operating system when a print job is completed
    5) None of these
14. A scientific institution performing intensive mathematical operations for a complex model that required extremely powerful computing capabilities will most likely use a (n):
    1) Supercomputer
    2) PC 3) Mainframe
    4) ISP 5) None of these
15. The process ___ involves automated study of consumer buying patterns in order to support marketing, inventory replenishment and pricing decisions.
    1) Transaction processing
    2) Data mining
    3) Simulation
    4) Information processing
    5) None of these
16. Press the ___ button to have the window fill the entire screen.
    1) Close 2) Maximize
    3) Minimize 4) All of the above
    5) None of these
17. What is the code name for 'WINDOWS 95'?
    1) Snowball 2) Chicago
    3) Win ball 4) Sparta
    5) None of these
18. Which is not a language processor?
    1) Compiler 2) Interpreter
    3) Processor
    4) Assembler
    5) None of these
19. The first part of a complete URL is the needed to access the web resource.
    1) Address 2) Name
    3) Location 4) Protocol
    5) None of these
20. ____ is known as POS scanner.
    1) Bar code reader
    2) Magnetic stripe reader
    3) MICR 4) OCR
    5) None of these

KEY

1) 2	2) 3	3) 3	4) 4	5) 2
6) 2	7) 5	8) 2	9) 4	10) 3
11) 5	12) 4	13) 3	14) 1	15) 2
16) 2	17) 2	18) 3	19) 4	20) 1